9-6Pg1exHMNWJQE.qxd:9-6Pg1exHMNWJQE.qxd 1/1/02 6:55 AM Page 1

సాహిత్య గత వారం తెలుగు సాహిత్యంపై విశ్లేషణ
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

విశాఖపట్నం

: fb.com/vaartha Digital

Published from Visakhapatnam, Vijayawada, Hyderabad,Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

9-6-2026 మంగళవారం సంపుటి: 32 సంచిక: 129 పేజీలు: 16 వెల: 6.50

హార్ముజ్‌ను తెరుస్తాం.. కానీ ఫీజు తప్పదు: ఇరాన్

కాల్పులు ఆపండి.. ఇజ్రాయెల్‌కు ట్రంప్ హెచ్చరిక

5లో



సోమవారం విశాఖ స్టీల్ కర్మాగారంలోని ఎస్ఎంఎస్1లో లిక్విడ్ స్టీల్ దూసుకొచ్చి భగ్గుమన్న ప్లాంట్

# స్టీల్ ప్లాంట్‌లో ఘోరకలి

## లిక్విడ్ స్టీల్ తరలిస్తుండగా భారీ పేలుడు

## మరుగుతున్న స్టీల్ పడడంతో 9మంది సజీవ దహనం

విశాఖ కర్మాగారంలో అంతా హృదయ విదారక దృశ్యాలు

దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ప్రధాని మోడీ, సిఎం చంద్రబాబు

డి.సిఎం పవన్, మంత్రి లోకేష్ ప్రగాఢ సానుభూతి

మృతుల కుటుంబాలకు రూ.2లక్షల సాయం ప్రకటించిన ప్రధాని

**విశాఖపట్నం(గాజువాక),జూన్ 8,ప్రభాతవార్త:** విశాఖ ఉక్కు కర్మాగారంలో సోమవారం మధ్యాహ్నం ఘోర ప్రమాదం సంభవించింది. స్టీల్ మెల్ట్ షాప్ (ఎస్ఎంఎస్1) విభాగంలో జరిగిన భారీ పేలుడు కారణంగా తొమ్మిది మంది కార్మికులు ప్రాణాలు కోల్పోగా, మరో ఐదుగురు తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. క్షతగాత్రుల పరిస్థితి విషమంగా ఉండడంతో మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశముందని తెలుస్తోంది.సోమవారం మధ్యాహ్నం సుమారు 3 గంటల సమయంలో ఎస్ఎం ఎస్1లోని సీసీడీ2 వద్ద కార్మికులు విధుల్లో ఉన్నారు. ఎల్ అండ్ డి మీద లాడిల్ ఉంచి, స్లైడ్ గేట్ ఓపెన్ చేసిన వెంటనే సాంకేతిక లోపంతో 1600 డిగ్రీల వేడితో కూడిన ద్రవరూప ఉక్కు (లిక్విడ్ స్టీల్) ఒక్కసారిగా బయటకు దూసుకొచ్చింది. దీంతో అక్కడ భారీ పేలుడు సంభవించి, మంటలు వ్యాపించాయి. అక్కడ పనిచేస్తున్న 14 మంది కార్మికులపై ఆ వేడి ద్రవం పడిపోవడంతో ఎనిమిది మంది అక్కడికక్కడే గుర్తుపట్టలేనంతగా కాలిపోయి మరణించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరొకరు కన్నుమూశారు. **మృతుల వివరాలు: ఉక్కు ఉద్యోగులు:** గోల్డ్ కుమార్ (మేనేజర్ మెషిన్2 ఇంచార్జ్), గొంతిన భానుకుమార్ (టెక్నీషియన్), జి.వి. అప్పారావు (టెక్నీషియన్), ఎం.కృష్ణ నాగు (టెక్నీషియన్), కే.ప్రభాకర్ (జనరల్ ఫైర్ మెన్). **కాంట్రాక్ట్ కార్మికులు:** రమణ, త్రినాథ్, ఎం.అప్పలరాజు, (మరొకరి వివరాలు తెలియాల్సి ఉంది). పమాదం జరిగిన వెంటనే ఉక్కు రక్షణ సిబ్బంది రంగంలోకి దిగి మృతదేహాలను వెలికితీశారు. తీవ్రంగా గాయపడిన మిగతా వారిని అత్యవసరంగా నగరంలోని వివిధ ప్రైవేట్ >>2



ప్లాంట్‌లో మంటలను ఆర్పుతున్న సిబ్బంది



క్షతగాత్రులను తరలిస్తున్న సిబ్బంది



సోమవారం ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఆర్.వనిత రాణికి రాజ్యసభ నామినేషన్లు దాఖలు చేస్తున్న చింతకాయల విజయ్, భాష్యం రామకృష్ణ, సానా సతీష్

# టిడిపి అభ్యర్థుల నామినేషన్లు

## చింతకాయల విజయ్, భాష్యం రామకృష్ణ, సానా సతీష్‌లు రాజ్యసభకు ఏకగ్రీవమయ్యే అవకాశం

**విజయవాడ,జూన్8,ప్రభాతవార్తప్రతినిధి:** రాజ్యసభ ఎంపీ అభ్యర్థులుగా తెలుగుదేశం పార్టీ తరుపున సానా సతీష్, బాష్యం రామకృష్ణ, చింతకాయల విజయ్‌లు నామినేషన్‌లు దాఖలు చేశారు. సోమవారం అమరావతి అసెంబ్లీ భవనంలో సానా సతీష్, బాష్యం రామకృష్ణ, చింతకాయల విజయ్ లు తమ నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్‌అధికారి ఆర్.వనితా రాణికి అందచేశారు. ఈ నామినేషన్ల దాఖలు ప్రక్రియలో కూటమి పార్టీ నేతలు పాల్గొని ప్రతిపాదకులుగా సంతకాలు చేశారు. రాజ్యసభ ఎంపీ అభ్యర్థిగా సానా సతీష్ రెండు సెట్‌ల నామినేషన్‌లను సమర్పించారు. ప్రతిపాదకులుగా చీఫ్‌విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, ఎమ్మెల్యేలు కన్నా లక్ష్మీ నారాయణ, పంతం వెంకటేశ్వరరావు(నానాజి), తంగిరాల సౌమ్య సంతకాలు చేశారు. రాజ్యసభ ఎంపీ అభ్యర్థిగా బాష్యం రామకృష్ణ రెండు సెట్‌ల నామినేషన్‌లను సమర్పించారు. ప్రతిపాదకులుగా మంత్రి అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యేలు బి.రామాంజనేయులు,కొలిశెట్టి శ్రీనివాస్, శ్రీరాం తాతయ్యలు సంతకాలుచేశారు. రాజ్యసభ ఎంపీ అభ్యర్థిగా చింతకాయల విజయ్ రెండు >>2

# 2027కు భూ రికార్డులు క్లీన్

**ఆచంట, జూన్ 8 ప్రభాతవార్త:** 2027 నాటికి రాష్ట్రంలో భూ రికార్డులను ప్రక్షాళన చేసి ప్రజలకు అందుబాటులో ఉంచుతామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. గత పాలకులు పశ్చిమగోదావరిజిల్లా లాంటి పచ్చని ప్రాంతంలోనూ భూ చిచ్చు పెట్టారని ముఖ్యమంత్రి ఆక్షేపించారు. గజం భూమిని కూడా సద్వినియోగం చేసుకునే రైతులనూ గత ప్రభుత్వం వదిలి పెట్టలేదని తీవ్రస్థాయిలో ఆరోపించారు. పశ్చిమ గోదావరి జిల్లా సిద్ధాంతంలో 'మీ భూమి మీ హక్కు' పేరిట రాజ ముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. దుర్మార్గమైన గత పాలకుల నిర్వాకంతో రికార్డులన్నీ గందరగోళంగా తయారయ్యాయని ప్రజలకు చెందిన భూముల విషయంలో సమస్యలు సృష్టించారని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆధీనంలో ఉండాల్సిన భూ రికార్డులను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించే ప్రయత్నం చేశారని అన్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ లాంటి దుర్మార్గపు చట్టాన్ని రద్దు చేసి యాజమాన్య హక్కుల్ని రక్షి ంచామని వివరించారు. క్యూ ఆర్ కోడ్ సహా కరెన్సీ నోట్ల తరహా లోనే అత్యంత పటిష్టమైన భద్రతా ఫీచర్లతో రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను జారీ చేస్తున్నామని తెలిపారు. గత పాలకులు చేసిన అవకతవకల కారణంగా భూమి రికార్డుల ప్రక్షాళ నకు 3ఏళ్ల సమయం పడుతుందని సిఎం అన్నారు. దేశం లోనే తొలిసారి బ్లాక్ చైన్ ఆధారిత భూ రికార్డుల వ్యవస్థను అమలు చేస్తు న్నామని వెల్లడించారు. ప్రతీ యూనిట్‌కు శాశ్వతమైన బ్లాక్ చైన్ ఐడిలు ఇస్తున్నామని,దీని ద్వారా రికార్డులను ట్యాంపరింగ్ చేసేం దుకు అవకాశం ఉండదని తెలిపారు. ప్రజల ఆస్తి పత్రాలపై ఫొటో లు ముద్రించుకున్నారని, పొలం సరిహద్దు రాళ్లపై బొమ్మల కోసం రూ.800 కోట్లు ఖర్చు పెట్టారని అన్నారు. ప్రస్తుతం భూ ముల రీసర్వేప్రక్రియలో రైతులను కూడా భాగస్వాములను చేస్తు న్నామని, ఇకెవైసీ చేశాకే పట్టాదారు పాస్ పుస్తకాలను ముద్రించి రైతులకు అందిస్తున్నామని అన్నారు. ఇప్పటికే 6688 గ్రామాల్లో రీసర్వే పూర్తి చేసి భూమి రికార్డులను అప్డేట్ చేశామని అన్నారు. 26.46 లక్షల మందికి పట్టాదారు పాస్ పుస్తకాలు జారీ చేశామన్నారు. వచ్చే 9 నెలల్లో మరో 10,357 గ్రామాల్లో సర్వే పూర్తి చేసి 67.32 లక్షల పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేస్తామన్నారు. 2027 నాటికి రాష్ట్రంలో ప్రతీ రైతు వద్దా తప్పుల్లేని పాస్ >>2



సోమవారం సిద్ధాంతం సభలో పాస్ పుస్తకాలు అందచేస్తున్న సిఎం చంద్రబాబు

పూర్తి ప్రక్షాళనకు మూడేళ్ల సమయం

కరెన్సీ నోట్ల తరహాలో పాస్ పుస్తకాలకు భద్రతా ఫీచర్లు

రాష్ట్రంలో రాజకీయం చేసే అర్హత గొడ్డలి పార్టీకి ఎక్కడిది?

ప్రజలకు, నిరుద్యోగులకు ఆ పార్టీ క్షమాపణలు చెప్పాలి

సిద్ధాంతంలో 'మీ భూమి మీ హక్కు' సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు

స్వచ్ఛ గోదావరి -పవిత్ర పుష్కరాలు లక్ష్యంగా

# సమగ్ర కార్యాచరణ



## గోదావరిలో కాలుష్యాన్ని వదులుతున్న ఆంధ్రా పేపర్ మిల్స్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేయాలి: డి.సిఎం పవన్ ఆదేశం

## రాజమహేంద్రవరం కార్పొరేషన్‌కు సైతం నోటీసులు ఇవ్వాలి

**విజయవాడ,జూన్ 8,ప్రభాతవార్తప్రతినిధి:** గోదావరిలో కాలుష్యాన్ని వదులుతున్న ఆంధ్రా పేపర్ మిల్స్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కాలుష్య నియంత్రణ మండలి అధికారులను ఆదేశించారు.గోదావరి ఇంత బహిరంగంగా కాలుష్యానికి గురవుతుంటే అధికారులు ఏం చేస్తున్నారు,మీన మీసాలు లెక్కిస్తున్నారా అంటూ మండిపడ్డారు.నదీ కాలుష్యానికి కారకులేవ్వరైనా కఠినంగా వ్యవహరించాలన్నారు. గోదావరి జలాల పవిత్రను కాపాడుతూ పుష్కరాలు నిర్వహిద్దామన్నారు. స్వచ్ఛ గోదావరి-పవిత్ర పుష్కరాలు లక్ష్యంగా ఒక సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందించామన్నారు.గోదావరి పరివాహక ప్రాంతంలోని 6 జిల్లాల్లో గల 262 పుష్కర పంచాయతీలను గుర్తించి, వాటిని మురుగు రహిత పంచాయతీలుగా మార్చాలని స్పష్టం చేశారు. మురుగు నీరు నేరుగా జీవనదిలో కలవకుండా మున్సిపాలిటీల సామర్థ్యానికి అనుగుణంగా మురుగు శుద్ధి ప్లాంట్ల (ఎస్‌టీపీ) నిర్మాణం చేపట్టాలని సూచించారు. ఈ కాలుష్య నివారణ పనుల కోసం పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ (పీసీబీ) మంజూరు చేసిన రూ.100 కోట్ల నిధులను వినియోగించాలని ఆదేశించారు. ఇటీవల రాజమహేంద్రవరంలో గోదావరి నది కాలుష్యాన్ని ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నాడు సేకరించిన నమూనాలను ప్రయోగశాలలో పరీక్షించిన అనంతరం వచ్చిన నివేదికలన పవన్ పరిశీలించారు. ఈ నివేదికలలో పొందుపర్చిన అంశాల ఆధారంగా సోమవారం డీసీఎం పవన్ కల్యాణ్ తన కార్యాలయం నుంచి రాజమహేంద్రవరం జిల్లా అధికారులతో వర్చువల్‌గా సమీక్ష నిర్వహించారు. నిర్దేశిత పరిమాణం కంటే భారీ స్థాయిలో ప్రమాదకర రసాయనాలు గోదావరిలో కలుస్తున్నట్లు నివేదికలో తేలిందన్నారు. ఇంత జరుగుతుంటే అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. నెలకు ఒకసారి నమూనాలు సేకరిస్తున్నట్లు అధికారులు బదులు ఇచ్చారు. >>2

ఎపి బస్సుకు బీహార్‌లో

# ఘోర ప్రమాదం



## ముగ్గురు దుర్మరణం

మరో 15మందికి తీవ్రగాయాలు

మృతుల కుటుంబాలకు రూ.5లక్షలు, గాయపడిన వారికి రూ.2లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించిన సిఎం చంద్రబాబు

**విజయవాడ/సంగం జూన్8, ప్రభాతవార్తప్రతినిధి:** బీహార్ రాష్ట్రంలో నెల్లూరు జిల్లా యాత్రికులతో ప్రయాణిస్తున్న ప్రైవేటు బస్సు ప్రమాదానికి గురైన ఘటనపై రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు, గాయపడిన బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఎక్స్రేషియా ప్రకటించారు. ఈ ప్రమాదంలో మృతి చెందిన ముగ్గురు యాత్రికుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.5లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందజేయనున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. అదేవిధంగా తీవ్రంగా గాయపడిన వారికి ఒక్కొక్కరికి రూ.2లక్షలు, స్వల్ప గాయాలపాలైన వారికి ఒక్కొక్కరికి రూ.1లక్ష చొప్పున సహాయం అందించనున్నట్లు తెలిపారు. ఈ నెల 1వ తేదీన నెల్లూరు జిల్లా >>2



## బ్రిడ్జిని ఢీకొని ప్రైవేట్ బస్సు బోల్తా

ఖమ్మం జిల్లా సత్తుపల్లి వద్ద దుర్ఘటన

ఏలూరు జిల్లా నుంచి వెళ్తున్న బస్సు

12 మందికి తీవ్ర గాయాలు

**సత్తుపల్లి జూన్ 8 ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఏలూరు జిల్లా ధర్మాజీ గూడెం నుంచి హైదరాబాద్ వెళుతున్న కె.వి.ఆర్ ప్రైవేట్ ట్రావెల్ బస్సు ఖమ్మం జిల్లా సత్తుపల్లి సమీప కొత్తలంకపల్లి రైల్వే బ్రిడ్జి సమీపానికి చేరగానే ముందుగా వెళుతున్న వాహనాన్ని ఓవర్టేక్ చేయబోయి రైల్వే బ్రిడ్జిని ఢీకొట్టి బోల్తా కొట్టిన సంఘటన ఆదివారం రాత్రి 12గంటల సమయంలో జరిగింది. బస్సులో దాదాపు 36 మంది ప్రయాణికులు ఉండగా ఈ ప్రమాదంలో 12మందికి గాయాలవుగా అందులో నలుగురికి కాళ్ల చేతులు విరిగి తీవ్ర గాయాలు అవటంతో సత్తుపల్లిలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రధమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మిగతా ఎనిమిది మంది స్వల్పగాయాలు అవటంతో సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స చేసి అనంతరం పంపించారు. వీరంతా >>2




# ఎన్డీయేపై 'ఇండియా' ఐక్యపోరు

## సర్, ఎన్నికల అక్రమాలపై సిజెఐకి లేఖ

విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు డిమాండ్

ధరల పెరుగుదలపై అఖిలపక్షం ఏర్పాటు చేయాలి

ఇండియా కూటమి భేటీలో 5 కీలక నిర్ణయాలు

మీడియాకు వెల్లడించిన కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే

**న్యూఢిల్లీ, జూన్ 8:** బిజెపి నేతృత్వంలోని ఎన్‌డియే ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఐక్యంగా పోరాటం చేయాలని ఇండియా కూటమి పక్షాలు నిర్ణయించాయి. అలాగే ఎన్నికల, రాజకీయ వ్యూహాలను పునఃరూపకల్పన చేయడంపై విస్తృత ఏకాభిప్రాయం కుదిరింది. ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్), పేపర్ లీక్‌లు, నిరుద్యోగం, దేశంలో నెలకొన్న ఆందోళనకరమైన ఆర్థిక పరిస్థితులతో సహా అనేక కీలకఅంశాలపై ఎన్‌డియే ప్రభుత్వాన్ని ఎదుర్కోవడానికి తమ ప్రచారాన్ని, వ్యూహాన్ని పదును పెట్టేందుకు కూటమి మిత్రపక్షాలు ఐదు కీలక నిర్ణయాలను ఖరారు చేశాయి. కీలక నిర్ణయాలలో భాగంగా, ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్), ఓటర్ల జాబితాల సవరణలో ఆరోపించబడుతున్న అవకతవకలు, ఎన్నికల నిష్పాక్షికతపై ఉన్న తీవ్ర ఆందోళనల గురించి భారత ప్రధాన >>2

9-6pg2exHMNWJQE.qxd:9-6pg2exHMNWJQE.qxd 1/1/02 6:56 AM Page 1





సోమవారం సిద్ధాంతం సభలో పాస్‌పుస్తకాలు అందుకున్న రైతులు

# 2027కు భూ రికార్డులు క్లీన్

>> పుస్తకం ఉంటుందని అన్నారు.

**రెవెన్యూ శాఖలో సమూల మార్పులు:** రెవెన్యూ శాఖలో సమూల మార్పులు తీసుకువస్తున్నామని, రీసర్వే 2.0 కింద ఇప్పటికే 1,836 గ్రామాల్లో తుది రికార్డ్ ఆఫ్ రైట్స్ పూర్తి చేశామని ముఖ్యమంత్రి చంద్రబాబు వివరించారు. విక్రయం, బహుమతి, విభజన వంటి 9 లక్షల లావాదేవీలకు 100 శాతం ఆటో మ్యుటేషన్ తెచ్చామని తెలిపారు. వారసత్వ హక్కుల బదిలీని సులభతరం చేశామని, రూ.10 లక్షల లోపు ఆస్తులకు రూ.100తో బదిలీ చేస్తున్నామని స్పష్టం చేశారు. 1బీ, అడంగల్, డికెటి, ఇనాం, సీలింగ్ వంటి పాత రికార్డుల డిజిటలైజేషన్ ప్రక్రియ చేపట్టామని అన్నారు. 80శాతం ఈకెవైసి పూర్తయిన తర్వాతే గ్రామాలను వెబ్ ల్యాండ్ 2.0లోకి తీసుకుంటున్నామని అన్నారు. వాట్సాప్ ద్వారా మ్యుటేషన్ దరఖాస్తు, ట్రాకింగ్ సౌకర్యం కల్పించామన్నారు. రాష్ట్రంలోని 1.37 లక్షల ఎకరాల అటవీ సర్వేను ఇనామ్ భూములను 22 ఏ నుంచి తప్పించామని తెలిపారు. తిరుపతి జిల్లాలో దశాబ్దాలుగా వివాదంలో ఉన్న శెట్టిపల్లి గ్రామ భూములను పరిష్కరించి వారికి అప్పగించామన్నారు. ఆక్వా రైతులకు అండగా నిలబడామని సిఎం చంద్రబాబు స్పష్టం చేశారు. గోదావరి జిల్లాల్లో ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలతో పాటు, ఆక్వా రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని వివరించారు. ఆక్వా ఫీడ్ పరిధిలోని చెరువులకు రూ.1.50కే యూనిట్ విద్యుత్ అందిస్తున్నామని స్పష్టం చేశారు. ఆక్వా ఫీడ్ రేట్లు పెరగడంతో రైతులు ఇబ్బంది పడు తున్నారని రాయితీలు ఇవ్వాలని సోయాబీన్ మీల్ దిగుమతులపై సుంకాలు తగ్గించాలని కేంద్రాన్ని కోరామన్నారు. పశ్చిమ గోదావరి లాంటి జిల్లాల్లో ఫుడ్ ప్రాసెసింగ్ రంగంపై దృష్టి పెట్టామని సిఎం వివరించారు. ఆక్వా పరిశ్రమ నుంచి వచ్చే వ్యర్థాలు కాలుష్య సమస్యగా మారకుండా న్యూట్రాసిటికల్ ఔషధాల తయారు చేసుకునే అవకాశం ఉందన్నారు.

**రెండేళ్లుగా సమపాళ్లలో సంక్షేమం అభివృద్ధి**

కూటమి ప్రజా ప్రభుత్వం రెండేళ్ల పాలనను విజయవంతంగా పూర్తి చేసుకున్నామని, సంక్షేమం-అభివృద్ధి- సుపరిపాలన అందిస్తున్నామని సిఎం చంద్రబాబు వివరించారు. ఈ అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లేలా తిరుపతి, అమరావతి, విశాఖలో మూడు ప్రాంతాల్లో మూడు సభలు నిర్వహిస్తున్నామని సిఎం తెలిపారు. అభివృద్ధిని ట్రాక్‌లో పెట్టామని, పెట్టుబడుల ఉద్యోగాల కల్పన జరుగుతోందని అన్నారు. సంక్షేమంలో దేశంలో ఎవరూ చేయలేని విధంగా ప్రజలకు మేలు చేస్తున్నాం అని వివరించారు. సూపర్ సిక్స్‌లో చెప్పినవాటికంటే అదనంగా ఇస్తున్నామని తెలిపారు. పెన్షన్, తల్లికి వందనం, స్త్రీశక్తి, అన్నదాత సుఖీభవ, ఆటోడ్రైవర్లు, మత్స్యకారులు ఇలా అందరికీ సంక్షేమం అందిస్తున్నామని చంద్రబాబు వివరించారు.

**గొడ్డలి పార్టీని ఓడ్చలేనంతగా**

డిఎస్సీ ద్వారా దాదాపుగా 16 వేల మందికి టీచర్ ఉద్యోగాలు ఇచ్చామని, పరీక్షలు అంటే తెలీని వ్యక్తులు, రిజర్వేషన్ల గురించి అవగాహన లేని వాళ్లు బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని సిఎం చంద్రబాబు ఆరోపించారు. గత పాలకులు జాబ్ క్యాలెండర్ ఇస్తామని దగా చేశారని.. కూటమి ప్రభుత్వం వచ్చాక ఉద్యోగాలు ఇచ్చి జాబ్ కేలెండర్ విడుదల చేశామన్నారు. దీన్ని చూసి ఓర్వలేక నేరాలు ఘోరాలు చేసి ఎదుటివారిపై దుష్ప్రచారం చేస్తోందని అన్నారు. గొడ్డలి పార్టీ చరిత్ర రాష్ట్రంలో అందరికీ తెలుసని, నేరాలు చేసి ఎదుటి వాళ్లపై నెట్టేస్తుందని ఆక్షేపించారు. చేసిన ప్రతీ ఆరోపణకు మంత్రులు అధికారులు పూర్తిగా వివరణ ఇచ్చారని.. దీనికి ఆ వైపు నుంచి సమాధానం లేదని అన్నారు. అసలు రాష్ట్రంలో రాజకీయాలు చేసే అర్హత ఆ పార్టీకే లేదన్నారు. రాష్ట్ర ప్రజలకు, నిరుద్యోగులను గొడ్డలి పార్టీ నేతలు క్షమాపణలు కోరాలన్నారు. ప్రజల్ని క్షమాపణ కోరకుండా రాష్ట్రంలో రాజకీయాలు చేసేందుకు గొడ్డలి పార్టీకి అర్హత లేదన్నారు. ప్రజలకు రాజ ముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలు ఇస్తున్నందుకు తాను సంతోషిస్తున్నానని, కానీ వైసిపి నేతలు రాష్ట్రంలో భూ కబ్జాలు చేశారని రికార్డులు తారుమారు చేశారన్నారు. తెలంగాణ రాష్ట్రానికి వెళ్లి అక్కడి ఎమ్మార్వో, జెసి సంతకాలు ఫోర్జరీ చేసి రికార్డులు తారుమారు చేశారన్నారు. ఈ నేరంలో రూ.1500 కోట్ల అక్రమాలు జరిగాయన్నారు. ఇంత నేరం జరిగితే గొడ్డలి పార్టీ అధ్యక్షుడు.. వినుకొండ మాజీ ఎమ్మెల్యేను ఎందుకు సస్పెండ్ చేయలేదని సిఎం చంద్రబాబు ప్రశ్నించారు. గొడ్డలి పట్టుకునే చేతులకు నాగలి పట్టే రైతులు గుర్తుకు రారని, కోడి కత్తి డ్రామాలు ఆడేవారికి పరిశోధనలు ఎలా తెలుస్తాయని సిఎం వ్యాఖ్యానించారు. గంజాయి బ్యాచ్‌లను ఓడ్చేవారికి పండు సాగు ఎలా తెలుస్తుందని అన్నారు. రాష్ట్రం అభివృద్ధి దిశగా ముందుకు వెళ్లాలంటే గొడ్డలి పార్టీ వ్యక్తులను దూరంగా పెట్టాలని సిఎం వ్యాఖ్యానించారు.

**అందరి ఆరోగ్యం కోసం యోగాంధ్ర**

అనంతరం పాజిటివ్ పబ్లిక్ పర్సెప్షన్ పై జిల్లా నివేదికను ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజలకు వివరించారు. ప్రభుత్వం అందించే వివిధ పౌరసేవలను మెరుగ్గా అందించేలా కృషి చేస్తున్న అధికారులను అభినందించారు. ఆగస్టు 15 లోగా రాష్ట్రవ్యాప్తంగా సంజీవని డిజిటల్ హెల్త్ రికార్డు కార్యక్రమాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకు రానున్నట్లు వివరించారు. ప్రివెంటివ్, ప్రెడిక్టివ్, క్యూరేటివ్ విధానంలో ప్రజలకు వైద్య సేవలు అందించాలన్నది మా ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. త్వరలో రాష్ట్రంలో ఎలక్ట్రిక్ ఆర్టీసీ బస్సులను ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తున్నామని తెలిపారు. ప్రతీ ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలన్నదే కూటమి ప్రజా ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. మృగశిర కార్తెను పురస్కరించుకుని చేపలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. జూన్ 21 తేదీన రాష్ట్రంలో కోటి మందితో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. 2047 సంపన్నమైన, ఆనందకరమైన ఆరోగ్యకరమైన ఆంధ్రప్రదేశ్‌ను తయారు చేయడమే లక్ష్యమని వివరించారు. అనంతరం సభా వేదిక వద్ద ఏర్పాటు చేసిన స్టాళ్లను సిఎం సందర్శించారు. పశ్చిమ గోదావరి జిల్లాలో ఉత్పత్తి అవుతున్న కోకో తయారైన చాక్లెట్లను, కొబ్బరి, పామాయిల్ ఉత్పత్తుల ప్రదర్శనల్ని పరిశీలించారు. వరి ఊక, గడ్డి ద్వారా తయారైన వివిధ ఉత్పత్తులు, గుర్రపు డెక్క ద్వారా తయారైన వస్తు ఉత్పత్తులను సిఎం పరిశీలించారు. ఆక్వా వ్యర్థాల ద్వారా తయారైన ఉప ఉత్పత్తులను పరిశీలించి తయారీ దారులను ముఖ్యమంత్రి అభినందించారు. ఈ కార్యక్రమానికి మంత్రులు గొట్టిపాటి రవికుమార్, అనగాని సత్యప్రసాద్, నిమ్మల రామానాయుడు, ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ తదితరులు హాజరయ్యారు.

# స్టీల్ ప్లాంట్‌లో ఘోరకలి

>> ఆసుపత్రులకు స్టీల్ ప్లాంట్ జనరల్ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘోర ప్రమాదానికి గల కారణాలపై ఉక్కు యాజమాన్యం ఉన్నత స్థాయి విచారణకు ఆదేశించింది. సాంకేతిక లోపమా లేక నిర్వహణలో నిర్లక్ష్యమా అనే కోణంలో అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాద వార్తతో ఉక్కునగరంలో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి.

**ప్రధాని సాయం**

విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో ప్రమాదంపై ప్రధాని మోదీ సంతాపం తెలియజేశారు. మృతుల కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపిన ప్రధాని మోదీ మృతుల కుటుంబాలకు రూ.2లక్షలు, క్షతగాత్రులకు రూ.50 వేలు పరిహారాన్ని ప్రకటించారు. అదే విధంగా క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

**పవన్ కళ్యాణ్ దిగ్భ్రాంతి**

విజయవాడ,జూన్ 8,ప్రభాతవార్తప్రతినిధి: విశాఖ స్టీల్ ప్లాంట్ లో పోటు చేసుకున్న ప్రమాదంలో తొమ్మిది మంది కార్మికులు మృతి చెందిన ఘటనపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దిగ్భ్రాంతికి లోనయ్యారు. ప్రమాదం గురించి తెలిసిన వెంటనే విశాఖ జిల్లా కలెక్టర్, నగర పోలీస్ కమిషనర్ ద్వారా వివరాలు తెలుసుకున్నారు. స్టీల్ ప్లాంట్ లో చేపట్టిన సహాయ చర్యలపై ఆరా తీశారు. ఈ క్రమంలో విశాఖలో ఘటనా స్థలానికి డీసీఎం పవన్ కళ్యాణ్ మంగళవారం బయలుదేరి వెళ్తున్నారు.

**తీరని విషాదం: మంత్రి లోకేష్**

విశాఖ స్టీల్ ప్లాంటు ప్రమాదంలో కార్మికులు మృతిచెందటం తీరని విషాదమని విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేష్ వ్యాఖ్యానించారుజ మృతుల కుటుంబాలకు నా ప్రగాఢ సంతాపం తెలియజేస్తున్నాను. గాయపడినవారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నాను. ప్రభుత్వ యంత్రాంగం క్షతగాత్రులకు వైద్యం, ప్రమాద స్థలంలో సహాయకచర్యలను పర్యవేక్షిస్తోందని నారా లోకేష్ తెలిపారు.

**మాజీ సీఎం జగన్ దిగ్భ్రాంతి**

విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌లో జరిగిన భారీ అగ్నిప్రమాదం పట్ల వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాద ఘటనపై స్పందించిన ఆయన, కార్మికుల మృతికి సంతాపం ప్రకటించారు. కార్మికుల ప్రాణాలకు అత్యున్నత ప్రాధాన్యత ఇవ్వాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**నిర్లక్ష్యమే కారణం: షర్మిల**

విశాఖ స్టీల్ ప్లాంట్‌లో జరిగిన ఘోర ప్రమాదం తీవ్ర దిగ్భ్రాంతి గురిచేసిందని. ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల వ్యాఖ్యానించారు.విషాదపు ఘటన గుండెను కలిచివేసింది. ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ పక్షాన మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తున్నాం. ప్లాంట్‌లో ప్రమాదానికి ఖచ్చితంగా కేంద్ర ప్రభుత్వ నిరక్ష్యమే ప్రధాన కారణం. ఈ ఘటనకు పూర్తి భాధ్యత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ప్రధాని మోడీ వహించాలని డిమాండ్ చేశారు.



సోమవారం విశాఖలో ప్రమాద స్థలిని సందర్శించిన ఎంపి భరత్, హోంమంత్రి అనిత తదితరులు

# టిడిపి అభ్యర్థుల నామినేషన్లు

>>సెట్ల నామినేషన్లు సమర్పించారు. ప్రతిపాదకులుగా మంత్రి కొలుసు పార్థసారథి, ఎమ్మెల్యేలు కామినేని శ్రీనివాస్, సుందరపు విజయ్ కుమార్, బోడే ప్రసాద్‌లు సంతకాలు చేశారు. ఈరోజు ఉదయం వెంకటపాలెం వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో టీడీపీ రాజ్యసభ అభ్యర్థులు సాన సతీశ్, భాష్యం రామకృష్ణ, చింతకాయల విజయ్ ప్రత్యేక పూజలు చేశారు. వీరికి వెంకటపాలెం టీటీడీ దేవస్థానం పండితులు సాదర స్వాగతం పలికారు. టీడీపీ అభ్యర్థులు ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొని వేద పండితులు ఆశీర్వచనం తీసుకున్నారు. అనంతరం ఏపీ అసెంబ్లీ వరకు టీడీపీ అభ్యర్థులు సైకిళ్లపై వెళ్లి, ఆపై నామినేషన్ దాఖలు చేశారు. ఈకార్యక్రమంలో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు ఎం.అఖిల్ కుమార్, పి.విజయ కుమారి తోపాటు కూటమి నేతలు జ్యోతుల వెంకట అప్పారావు (నెహ్రూ), వనమాడి వెంకటేశ్వరరావు(కొండబాబు) వరుపుల సత్య ప్రభ,బండారు సత్యానంద రావు పాల్గొన్నారు. ఇంకా 20 సూత్రాల కార్యక్రమం అమలు చైర్మన్ లంకా దినకర్ తదతర నేతలు పాల్గొన్నారు.

**ఏకగ్రీవం దిశగా కూటమి రాజ్యసభ సభ్యులు**

ఆంధ్రప్రదేశ్ నుండి ఖాళీ అవుతున్న నాలుగు రాజ్యసభ స్థానాల ఎన్నికల ప్రక్రియ కీలక ఘట్టానికి చేరుకుంది. శాసనసభలో కూటమికి ఉన్న ఏకపక్ష బలాబలాల దృష్ట్యా, ఈ నాలుగు స్థానాలు ఏకగ్రీవం కాబోతుండటం దాదాపు ఖరారైంది. కూటమి ఒప్పందంలో భాగంగా టిడిపి మూడు స్థానాల్లో, జనసేన పార్టీ ఒక స్థానంలో తమ అభ్యర్థులను రంగంలోకి దించాయి. టిడిపి తరపున సానా సతీశ్, విద్యాసంస్థల అధినేత భాష్యం రామకృష్ణ, పార్టీ సోషల్ మీడియా వింగ్ ఇన్‌ఛార్జ్ చింతకాయల విజయ్‌లు సోమవారం తమ నామినేషన్ పత్రాలను అధికారికంగా దాఖలు చేశారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వీరికి బిఫారాలను అందజేసి, నామినేషన్ల ప్రక్రియను పూర్తి చేయించారు. జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ప్రముఖ పారిశ్రామికవేత్త లింగమనేని రమేశ్‌ను తమ అభ్యర్థిగా ప్రకటించారు. పార్టీకి ఆయన అందించిన సేవలు, నిబద్ధతను గుర్తిస్తూ ఈ అవకాశం కల్పించినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. లింగమనేని రమేశ్ కూడా అసెంబ్లీలో రిటర్నింగ్ అధికారికి శనివారమే తన నామినేషన్ పత్రాలను సమర్పించారు. ప్రతిపక్ష వైసిపి సంఖ్యాబలం లేకపోవడంతో ఈ ఎన్నికల్లో అభ్యర్థులను పోటీకి దించలేదు. దీంతో నామినేషన్ల ఉపసంహారణ గడువు ముగిసిన తర్వాత కూటమికి చెందిన ఈ నలుగురు అభ్యర్థుల ఎన్నిక ఏకగ్రీవమైనట్లు అధికారులు అధికారికంగా ప్రకటించనున్నారు.

# సమగ్ర కార్యాచరణ

>> మరి అలాంటప్పుడు ఇంత కలుషితమవుతుంటే చర్యలు ఎందుకు తీసుకోలేదని పవన్ అధికారులను అడిగారు. అధికారులు తాము నిర్వర్తించాల్సిన విధులను క్రమం తప్పకుండా చేసి తీరాలి అన్నారు.నిర్దేశిత పరిమాణం కంటే భారీ స్థాయిలో ప్రమాదకర రసాయనాలు గోదావరిలో కలుస్తున్నట్లు నివేదికలో తేలిందన్నారు. ఇంత జరుగుతుంటే అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. మొత్తం రోజువారీ మురుగు నీరు 104 మిలియన్ లీటర్లు గోదావరిలో కలుస్తుందని నివేదికలు చెబుతున్నాయి.ఆంధ్ర పేపర్స్ పారిశ్రామిక వ్యర్థాలు32 మిలియన్ లీటర్లు కలుస్తున్నాయి.ఆక్వా సాగు వ్యర్థాలు 13.24 మిలియన్ లీటర్లు, గ్రామీణ ప్రాంతాల మురుగు నీరు8.38 మిలియన్ లీటర్లు గోదావరిలో కలుస్తున్నారు.దీనిపై మీరు దీనిపై చర్యలు తీసుకోవాలన్నారు.ఈ విషయంలో అలసత్వం లేదన్న అధికారులపై ఆయన మండిపడుతూ మరి అలాంటప్పుడు ఇంత కలుషితమవుతుంటే చర్యలు ఎందుకు తీసుకోలేదని ప్రశ్నించారు. వీటిపై చర్యలు తీసుకోవడం మీ కర్తవ్యమని స్పష్టం చేసారు.ఆంధ్ర పేపర్ మిల్స్ యాజమాన్యానికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలి అన్నారు. రాజమహేంద్రవరం కార్పొరేషన్‌కు సైతం నోటీసులు ఇవ్వాలి అన్నారు. గోదావరి పుష్కరాలు పరిశుభ్రమైన వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలన్నారు.అంతేకాకుండా వెంటనే ఆంధ్ర పేపర్ మిల్స్ యాజమాన్యానికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని డిప్యూటీ సీఎం పవన్ ఆదేశించారు. పర్యవేక్షణ సరిగా చేయని రాజమహేంద్రవరం కార్పొరేషన్‌కు సైతం నోటీసులు ఇవ్వాలని కాలుష్య నియంత్రణ మండలి అధికారులను పవన్ ఆదేశించారు. గోదావరి పుష్కరాలు పరిశుభ్రమైన వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా అధికారులకు పవన్ స్పష్టమైన సూచనలతో దిశానిర్దేశం చేశారు.రాబోయే గోదావరి పుష్కరాలను పురస్కరించుకుని నదిని కాలుష్యరహితంగా తీర్చిదిద్దేందుకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అధికారులకు గతంలోనూ కీలక ఆదేశాలు జారీ చేశారు.

# ఎన్డీయేపై 'ఇండియా' ఐక్యపోరు

>> న్యాయమూర్తి (సిజెఐ)కి లేఖ రాయాలని ఇండియా కూటమి పార్టీలు నిర్ణయించాయి. త్వరలోనే సిజెఐకి నిరసన లేఖను రాసి అందజేయడంపై పార్టీలు ఏకాభిప్రాయాన్ని వ్యక్తం చేశాయి. ఇండియా కూటమి సమావేశం అనంతరం మీడియా సమావేశంలో ఖర్గే, మమత, అఖిలేష్ తదితరులు వివరాలు వెల్లడించారు. ఇటీవలి నీట్ పేపర్ లీక్‌ల కారణంగా విద్యార్థులు ఎదుర్కొంటున్న వేదన, నిరాశల అంశంపై రెండవ నిర్ణయం తీసుకున్నారు.

ప్రస్తుత విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ హయాంలో విద్యా వ్య వస్థ నిర్వహణలో జరిగిన లోపాలపై పలువురు నాయకులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే ఆయన రాజీనామా డిమాండ్ చేయాలని ఉద్యమాన్ని ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. ధర్మేంద్ర ప్రధాన్ హయాంలో నీట్, సిబిఎస్ఇ పరీక్షలకు హాజరైన లక్షలాది మంది యువతకు అన్యాయం జరిగిందని, వారిని గాలికి వదిలే శారని వారు పేర్కొన్నారు. కాబట్టి బాధ్యతా యుత పదవిలో ఉన్నవారిని దీనికి జవాబుదారీని చేయాలని అన్నారు. దేశంలో నెలకొన్న ఆర్థిక పరిస్థితులపై ఆందోళన వ్యక్తం చేస్తూ, ప్రస్తుత తీవ్ర ఆర్థిక పరిస్థితి, పెరుగుతున్న నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, రైతుల సమస్యలు, ఇతర ప్రజా ప్రయోజన అంశాలపై చర్చించేందుకు కేంద్ర ప్రభుత్వం వెంటనే అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలని ఇండియా కూటమి నాయకులు డిమాండ్ చేశారు.

ఈ ఇండియా బ్లాక్ సమావేశానికి కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్, తృణమూల్ కాంగ్రెస్ అధ్యక్షురాలు మమతా బెనర్జీ, సీనియర్ నేషనల్ కాన్ఫరెన్స్ నాయకుడు ఒమర్ అబ్దుల్లా, ఎన్‌సిపి ఎస్‌పి నాయకురాలు సుప్రియా సూలే హాజరయ్యారు. కాంగ్రెస్ పార్టీతో ఉన్న విభేదాల కారణంగా ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్), ద్రవిడ మున్నేట్ర కజగం (డిఎంకె) సహా పలు ప్రతిపక్ష పార్టీలు ఈ సమావేశానికి దూరంగా ఉన్నాయి.

## రెవెన్యూ శాఖలో సమూల మార్పులు: సిఎం చంద్రబాబు

**పశ్చిమ గోదావరి జిల్లా బ్యూరో, జూన్ 8:** వివాదాలు లేకుండా రెవెన్యూ శాఖలో సమూల మార్పులు తీసుకు వస్తున్నట్లు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్నారు. పెనుగొండ మండలం సిద్ధాంతంలో ఏర్పాటు చేసిన మీ భూమి మీ హక్కు గ్రామసభలో ఆయన మాట్లాడుతూ రీసర్వే 2.0 కింద ఇప్పటికే 1,836 గ్రామాల్లో తుది రికార్డ్ ఆఫ్ రైట్స్ పూర్తి చేశామన్నారు. అమ్మకం, బహుమతి, విభజన వంటి 9 లక్షల లావాదేవీలకు 100 శాతం ఆటో మ్యుటేషన్ తెచ్చామన్నారు. వారసత్వ హక్కుల బదిలీని సులభతరం చేశాం. రూ.10 లక్షల లోపు ఆస్తులకు రూ.100తో బదిలీ చేస్తున్నామన్నారు. అంతకంటే ఎక్కువ విలువైన ఆస్తులకు రూ.1,000 స్టాంప్ డ్యూటీ చెల్లిస్తే చాలన్నారు. 1బీ, అడంగల్, డీకేటీ, ఇనాం, సీలింగ్ వంటి పాత రికార్డుల డిజిటలైజేషన్ ప్రారంభించామన్నారు. 9 (2) నోటీసుల జారీ సమయంలో కూడా ఈకేవైసీ అమలు చేస్తున్నామన్నారు. 80 శాతం ఈకేవైసీ పూర్తయిన తర్వాతనే గ్రామాలను వెబ్‌ల్యాండ్ 2.0లోకి తీసుకుంటున్నామన్నారు.


# బ్రిడ్జిని ఢీకొని ప్రైవేట్ బస్సు బోల్తా

>> ఆదివారం రాత్రి ఏంసూరు మండలం కందుకూరు గ్రామానికి చెందిన కె.వి.ఆర్ ట్రావెల్ బస్సులోని ఏలూరు జిల్లా ధర్మాజీ గూడెం, చింతలపూడి, ముసునూరు, తదితర గ్రామాల నుంచి హైదరాబాద్ వెళ్లడానికి బస్సులో ఎక్కారు. బస్సు బయలుదేరిన అర్ధగంటలోనే సత్తుపల్లి సమీప కొత్తలంక పల్లి రైల్వే బ్రిడ్జికి రాగానే రైల్వే బ్రిడ్జిని ఢీకొని బోల్తా కొట్టడంతో బస్సు ముందు భాగం పూర్తిగా నుజ్జయింది. ప్రమాద తీవ్రతకు బస్సు ముందు భాగం పూర్తిగా ధ్వంసమవగా, ముందు చక్రాలు కూడా ఊడిపోయాయి.సమాచారం అందుకున్న వి.ఎం. బంజర్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని స్థానికుల సహాయంతో బస్సులోఉన్న ప్రయాణికులను బయటికి తీసి సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌ల ద్వారా సత్తుపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రమాద సమయంలో బస్సులో సుమారు 36 మంది ప్రయాణికులు ఉండగా, మిగతా వారు సురక్షితంగా బయటపడటం ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో స్థానికులు, ప్రయాణికులు ఊపిరిపీల్చుకున్నారు.అయితే బస్సు డ్రైవర్ మద్యం మత్తులో అతి వేగంతో ముందు వెళ్తున్నా వాహనాన్ని ఓవర్ టేక్ చేస్తూ బస్సు నడపడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని బస్సులోని ప్రయాణికులు తెలిపారు. గాయాలైన వారు శ్రావణ శశి, మల్లిక, బాలాజీ, గణేష్, రామకృష్ణ, శిరీష, ప్రణీత, నరసింహ, స్వప్న, సీతరత్నం, సుస్మిత, తదితరులు చింతలపూడి ధర్మాజీగూడెం ముసునూరు తదితర గ్రామాల నుంచిబస్సులో హైదరాబాద్ బయలుదేరిన ప్రయాణికులు. బస్సు ప్రమాదంపై సత్తుపల్లి రూరల్ సీఐ ముత్తు లింగం, విఎం బంజర్ ఎస్సై వెంకటేష్, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# పారదర్శక పాలనే లక్ష్యం

## సాంకేతిక సంస్కరణలతో ఆదర్శంగా పౌరసరఫరాలశాఖ: మంత్రి నాదెండ్ల

**విజయవాడ,జూన్8,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో రైతు సంక్షేమాన్ని కేంద్ర బిందువుగా తీసుకుని, పారదర్శకత, సాంకేతికత, వేగవంతమైన సేవల సమన్వయంతో వ్యవహరిస్తుందని రాష్ట్ర ఆహార పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు.తద్వారా సివిల్ సప్లైస్ శాఖ గత రెండు సంవత్సరాల్లో చారిత్రాత్మక సంస్కరణలను అమలు చేసి దేశవ్యాప్తంగా ఆదర్శంగా నిలిచిందన్నారు. రైతు ఎక్కడా ఇబ్బందులు పడకుండా, ధాన్యం కొనుగోళ్లలో సంపూర్ణ పారదర్శకత, తక్షణ చెల్లింపులు, మధ్యవర్తుల నిర్మూలన, వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించడం ప్రభుత్వ ప్రధాన ఆశయంగా పేర్కొన్నారు. సోమవారం రాష్ట్ర సచివాలయం ప్రచార విభాగంలో ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నాయకత్వంలో, ఉప ముఖ్యమంత్రి మార్గదర్శకత్వంలో, ప్రజాప్రతినిధులు, జిల్లా యంత్రాంగం, కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, సివిల్ సప్లైస్ కార్పొరేషన్ అధికారులు, రైతు సహాయక కేంద్రాల సిబ్బంది, వ్యవసాయ శాఖ, పౌర సరఫరాల శాఖ మరియు అనుబంధ శాఖల సమన్వయంతో ఈ విజయాలు సాధ్యమయ్యాయని తెలిపారు.



**రైతుకు ప్రథమ ప్రాధాన్యత:** రైతు కష్టపడి పండించిన ప్రతి గింజకు గౌరవం దక్కేలా, ధాన్యం విక్రయంలో ఎటువంటి అవాంతరాలు లేకుండా ప్రభుత్వం సమగ్ర చర్యలు చేపట్టిందన్నారు. రైతు సంక్షేమాన్ని కేంద్రబిందువుగా తీసుకుని, పారదర్శకత, వేగవంతమైన చెల్లింపులు, సాంకేతిక ఆధారిత సేవలతో దేశంలోనే ఆదర్శవంతమైన ధాన్యం కొనుగోలు విధానాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ ఖరీఫ్, రబీ సీజన్లలో కలిపి రాష్ట్రవ్యాప్తంగా 17.97 లక్షల మంది రైతుల నుండి 1.29 కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించడం జరిగిందని తెలిపారు. గత రెండు సంవత్సరాల్లో సుమారు రూ.30,361 కోట్ల విలువైన ధాన్యం కొనుగోళ్లు నిర్వహించి, రైతులకు సకాలంలో చెల్లింపులు చేయడం జరిగిందన్నారు.రైతులకు చెల్లింపుల విషయంలో అత్యంత వేగవంతమైన విధానాన్ని అమలు చేస్తూ, 90 శాతం చెల్లింపులు 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లో జమ చేయగా, మిగిలిన చెల్లింపులు కూడా 48 గంటలు దాటకుండా పూర్తిచేసినట్లు పేర్కొన్నారు. రైతులు ఎక్కడా ఇబ్బందులు పడకుండా, చెల్లింపుల్లో జాప్యం లేకుండా, పూర్తి పారదర్శకతతో ప్రభుత్వం పనిచేస్తోందని ఆయన స్పష్టం చేశారు...

**సాంకేతిక సంస్కరణలు - దేశంలోనే తొలిసారి వాట్సాప్ ద్వారా ధాన్యం విక్రయం**

..రైతులకు మరింత సులభమైన, పారదర్శకమైన సేవలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం సాంకేతికతను సమర్థవంతంగా వినియోగిస్తూ దేశంలోనే తొలిసారిగా వాట్సాప్ ఆధారిత ధాన్యం నమోదు మరియు విక్రయ విధానాన్ని అమలు చేసినట్లు తెలిపారు. ఈ వినూత్న వ్యవస్థ ద్వారా రైతులు ఎటువంటి మధ్యవర్తుల అవసరం లేకుండా నేరుగా తమ ధాన్యాన్ని నమోదు చేసి విక్రయించే అవకాశం పొందుతున్నారన్నారు. ఇప్పటికే 40 వేల మందికి పైగా రైతులు ఈ విధానాన్ని వినియోగించుకుని సుమారు 3.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని నేరుగా సివిల్ సప్లైస్ కార్పొరేషన్‌కు విక్రయించినట్లు ఆయన తెలిపారు. ఈ సంస్కరణ ద్వారా మధ్యవర్తుల జోక్యం గణనీయంగా తగ్గడమే కాకుండా, రైతులకు పారదర్శక వ్యవస్థలో నేరుగా లాభం చేకూరిందని ఆయన పేర్కొన్నారు.

**వర్షాలు - తుఫానుల సమయంలో రైతులకు రక్షణ:** వర్షాకాలంలో ధాన్యం తడవకుండా కాపాడేందుకు దేశంలోనే తొలిసారిగా చిన్న, సన్నకారు రైతులకు రూ.50 కోట్లు విలువైన టార్పాలిన్లు ఉచిత పంపిణీ చేసినట్లు మంత్రి తెలిపారు. తుఫానులకు గురయ్యే ప్రాంతాలను ముందుగానే గుర్తించి రైతు సహాయక కేంద్రాల ద్వారా ఈ సేవలు అందించామని పేర్కొన్నారు.

**దీపం-2" పథకం - కోట్లాది కుటుంబాలకు ఉచిత గ్యాస్ సిలిండర్ల లబ్ధి:** "దీపం-2" పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం రాజకీయాలకు అతీతంగా అర్హులైన కుటుంబాలకు సంవత్సరానికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు అందిస్తూ ప్రజలకు ఇచ్చిన హామీని సమర్థవంతంగా అమలు చేస్తోందన్నారు. రాష్ట్రంలోని 1.08 కోట్ల గ్యాస్ కనెక్షన్లను లక్ష్యంగా తీసుకుని అమలు చేస్తున్న ఈ కార్యక్రమం ద్వారా కుటుంబాలపై గ్యాస్ వ్యయభారం తగ్గించి, సాధారణ ప్రజలకు ఆర్థిక ఊరటనందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ పథకం కింద ఇప్పటివరకు పలు విడతల్లో భారీ స్థాయిలో సబ్సిడీని నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసినట్లు వెల్లడించారు. మొదటి విడతలో 97.36 లక్షల సిలిండర్లకు రూ.764 కోట్ల సబ్సిడీ, రెండో విడతలో 93.83 లక్షల సిలిండర్లకు రూ.777కోట్లు, మూడో విడతలో 94.81 లక్షల సిలిండర్లకు రూ.791 కోట్లు, నాలుగో విడతలో 92.28 లక్షల సిలిండర్లకు రూ.760 కోట్ల రాయితీ నేరుగా ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు.

# ఎపి బస్సుకు బీహార్‌లో ఘోర ప్రమాదం

>> నుంచి కాశీ యాత్రకు బయలుదేరిన ప్రైవేటు బస్సు బీహార్‌లో ప్రమాదానికి గురైంది. ఎదురుగా వచ్చిన లారీ బస్సును ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో సంగం ప్రాంతానికి చెందిన ఇద్దరు, ఆత్మకూరుకు చెందిన ఒక మహిళ మృతి చెందినట్లు సమాచారం. మరో 15 మంది యాత్రికులు గాయపడగా, వారిలో పలువురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. ఘటనపై వెంటనే స్పందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బాధితులకు అత్యవసర వైద్యసాయం అందించాలని అధికారులను ఆదేశించారు.

అవసరమైతే ప్రత్యేక సహాయక బృందాలను ఏర్పాటుచేసి సమ న్వయం చేయాలని అధికారులను ఆదేశించారు. మృతుల కుటుంబాలకు ముఖ్యమంత్రి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, వారి ఆత్మలకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. సంగం, దుత్తలూరు, ఆత్మకూరుకు చెందిన యాత్రికులతో బస్సు జూన్ 1వ తేది కాశీయాత్రకు బయలుదేరింది. గయా,వారణాసి పుణ్యక్షేత్రాల దర్శనానికి బయలుదేరిన ఈ యాత్ర బస్సు బీహార్ రాష్ట్రం గయావద్ద ఘోర రోడ్డు ప్రమాదానికి గురైంది. ఎదురుగా వస్తున్న లారీ అతి వేగంతో బచ్చి బస్సును ఢీకొనగా సంగంకి చెందిన ఇద్దరు వ్యక్తు లు అక్కడిక్కడే మృతిచెందారు. విషయం తెలిసిన వెంటనే దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు.





క్షతగాత్రులకు చికిత్స అందిస్తున్న దృశ్యం

**ప్రత్యేక విమానంలో మృతదేహాలు :** మృతదేహాలను రోడ్డు మార్గన తీసుకొని రావాలంటే 38 గంటలు పైగా సమయం పడుతుందని మృతి చెందిన ముగ్గురు యాత్రికుల మృతదేహాలను సోమవారం ఉదయం ప్రత్యేక విమానంలో గయా నుండి రేణుగుంట విమానాశ్రయానికి తీసుకొని వస్తున్నట్లు మంత్రి ఆనం వెల్లడించారు. ప్రత్యేక వాహనాల ద్వారా వారి స్వగ్రామాలకు తరలించే ఏర్పాట్లు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు.

## వారం - వర్జ్యం

09-06-2026, మంగళవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
అధిక జ్యేష్ఠమాసం, ఉత్తరాయణం
గ్రీష్మ ఋతువు, కృష్ణపక్షం, మృగశిర కార్తె
నవమి రా.2.32,
పూర్వాభాద్ర ఉ.9.36
వర్జ్యం : రా.7.05-రా.8.39
దు.ఉ.8.10-ఉ.9.02,
(2) రా.11.53-రా.12.45
రాహుకాలం – మ.3.00-4.30

## వార్తాఫలం

- **మేషం:** జీవిత భాగస్వామి సలహాతో నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. వివాహయత్నాలు జరుగుతాయి.
- **వృషభం:** అప్రయత్నంగా కార్యసిద్ధి. పలుకుబడి హోదాలో ఉన్న వ్యక్తులతో పరిచయాలు ఏర్పడుతాయి. బంధువుల కలయిక.
- **మిథునం:** సన్నిహితుల నుండి ముఖ్యమైన సమాచారం అందుకుంటారు. తండ్రి నుండి ఆస్తి లాభం పొందుతారు. వాహనసౌఖ్యం.
- **కర్కాటకం:** నూతన పెట్టుబడులకు అనుకూల కాలం. బంధువులకు కలసి ఆనందంగా గడుపుతారు.
- **సింహం:** ఉద్యోగాలలో ప్రోత్సాహకరంగా ఉంటుంది. పారిశ్రామిక రంగాలలోని వారికి ప్రభుత్వం నుండి ఆహ్వానాలు అందుతాయి.
- **కన్య :** పదే పదే మీ సహాయాన్ని అర్థించే కొందరినీ దూరంగా ఉంచుతారు. క్రీడల యందు ఆసక్తి చూపుతారు. వస్త్రలాభం.
- **తుల :** శ్రమకు తగిన ఫలితం దక్కుతుంది. ఆరోగ్య విషయంలో మెలకువ అవసరం. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉంటుంది.
- **వృశ్చికం:** ఎన్ని సమస్యలు ఎదురైనా పట్టుదలతో ముందుకు సాగి అనుకున్న కార్యాన్ని విజయవంతంగా పూర్తి చేస్తారు.
- **ధనుస్సు:** నూతన తరహా ఆలోచనలు చేసి ఆ దిశగా ప్రయత్నాలు సాగిస్తారు. ఇంటా బయటా మీదేపై చేయిగా వుంటుంది.
- **మకరం:** సాంకేతిక విద్యావకాశాలు లాభిస్తాయి. రెండు, మూడు విధాలుగా ధనలాభం పొందుతారు. వస్త్రలాభం.
- **కుంభం:** కీలక విషయాలలో స్వంత ఆలోచనలు తీసుకుంటారు. వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయి. వాహనసౌఖ్యం.
- **మీనం:** శత్రువులు సైతం మిత్రులుగా మారుతారు. పెద్దల నుండి సాయం అందుకుంటారు. శుభవార్తలు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

9-6Pg3fVRS.qxd:9-6Pg3fVRS.qxd 1/1/02 6:39 AM Page 1



# హెచ్‌పివి టీకా పంపిణీ గడువు మరో 3నెలలు పొడిగింపు

## విద్యాసంస్థల పునఃప్రారంభం దృష్ట్యా పెంచినట్లు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ వెల్లడి

**సచివాలయం, జూన్ 8 ప్రభాతవార్త:** గర్భాశయ ముఖద్వారం (సర్వైకల్ క్యాన్సర్ కేసుల నిరోధానికి చేపట్టిన హ్యూమన్ పాపిలోమా వైరస్ (హెచ్‌పివి) వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని మూడు నెలలపాటు (ఆగస్టు వరకు) పొడిగించినట్లు రాష్ట్ర వైద్య,ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందినట్లు వెల్లడించారు. రాష్ట్రంలో ఇప్పటివరకు 2,71,071మంది బాలికల (78.57శాతం) కు హెచ్‌పివి టీకాలు వేసినట్లు వెల్లడించారు. 14ఏళ్ల (14వ పుట్టినరోజు పూర్తిచేసుకొని 15వ పుట్టినరోజు లోనికి ఇంకా అడుగుపెట్టని) బాలికలకు కేంద్రప్రభుత్వ మార్గదర్శకాలు అనుసరించి హెచ్‌పివి టీకా వేస్తున్నామని తెలిపారు. ఈ కేటగిరిలో రాష్ట్రంలో 3.45లక్షల మంది బాలికలు ఉండగా సోమవారం నాటికి 78.57శాతం మందికి టీకా వేసినట్లు మంత్రి వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి రెండు విడతలుగా కలిపి రాష్ట్రానికి 3,81,780డోసుల వ్యాక్సిన్ వచ్చిందని తెలిపారు. త్వరలోనే విద్యాసంస్థలు పునః ప్రారంభం కానున్నందున మిగిలిన బాలికలకు త్వరగా టీకా పంపిణీ పూర్తి చేయాలని ఉన్నతాధికారులకు మంత్రి ఆదేశించారు. టీకా వేయించుకునేందుకు సందిగ్ధంలో ఉన్న వారికి అవగాహన కల్పించాలని స్పష్టంచేశారు. తక్కువగా టీకాల నమోదు ఉన్న జిల్లాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు మంత్రి సత్యకుమార్ ఆదేశించారు.



# జోజిలా టన్నెల్ రెడీ

- నేడు కేంద్రమంత్రి గడ్కరీ చేతుల మీదుగా బ్రేక్ త్రూ కార్యక్రమం
- ప్రపంచంలోనే అత్యంత ఎత్తులో నిర్మితమవుతున్న టన్నెల్ ఇదే
- అత్యంత పొడవైన సింగిల్‌ట్యూబ్ ద్విముఖ రహదారి సొరంగం

## జోజిలా రోడ్ టన్నెల్ ప్రాజెక్ట్

**అనంతపురం, జూన్ 8 ప్రభాతవార్త బ్యూరో:** దేశ సరిహద్దుల్లో అత్యంత ప్రతిష్టాత్మక జమ్మూ కాశ్మీర్-లడఖ్ కేంద్ర పాలిత ప్రాంతాలను నిత్యం అనుసంధానించే అత్యంత ప్రతిష్ఠాత్మకమైన జోజిలా టన్నెల్ ప్రాజెక్ట్ మరో చారిత్రాత్మక మైలురాయిని అధిగమించిన నేపథ్యంలో నేడు (మంగళవారం) కేంద్ర రవాణా శాఖ మంత్రి లాంచనంగా ప్రారంభించనున్నారు. 13.153 కిలోమీటర్ల పొడవైన జోజిలా టన్నెల్, ప్రపంచంలోనే అత్యంత ఎత్తులో నిర్మితమవుతున్న అత్యంత పొడవైన సింగిల్‌ట్యూబ్ ద్విముఖ రహదారి సొరంగంగా గుర్తింపు పొందింది. జమ్ముకాశ్మీర్‌లో సోనమార్గ్ సమీపంలోని బాల్తాల్ పశ్చిమ పోర్టల్ నుంచి ద్రాస్ కార్గిల్ ప్రాంతంలోని సోనామార్గ్ తూర్పు పోర్టల్ వరకు విస్తరించిన జోజిలా టన్నెల్ ప్రాజెక్టు, భారీ మంచు, హిమపాతాలు, తీవ్ర వాతావరణ పరిస్థితుల కారణంగా సంవత్సరంలో సగం కాలం మూసి ఉంచే జోజిలా పాస్‌కు శాశ్వత పరిష్కారం చూపుతుంది. సముద్ర మట్టానికి సుమారు 11,578 అడుగుల ఎత్తులో నిర్మితమవుతున్న ఈ టన్నెల్, భారతదేశ పర్వత ప్రాంత మౌలిక సదుపాయాల అభివృద్ధిలో అత్యంత కీలకమైన మైలురాయిగా నిలుస్తుంది. పశ్చిమ హిమాలయాల్లోని అత్యంత క్లిష్టమైన భౌగోళిక పరిస్థితులు, హిమపాతాల ముప్పు, తీవ్రమైన శీతాకాలం వంటి ఎన్నో సవాళ్లను అధిగమిస్తూ ముందుకు సాగుతున్న జోజిలా టన్నెల్ తుది బ్రేక్‌త్రూ వల్ల భారతదేశం అత్యంత క్లిష్టమైన పర్వత ప్రాంత రవాణా మౌలిక సదుపాయాల నిర్మాణంలో సాధించిన అసాధారణ విజయానికి నిదర్శనం. జోజిలా టన్నెల్ పూర్తి ఐన తరువాత కాశ్మీర్-లడఖ్ మధ్య అన్ని కాలాల్లో నిరంతర అనుసంధానం కల్పించడంతో పాటు, ప్రాంతీయ అభివృద్ధి, ఆర్థిక సమగ్రత, జాతీయ భద్రతా సామర్థ్యాలను మరింత బలోపేతం చేయనుంది.



**ప్రాజెక్టు విశేషాలు**

జోజిలా ప్రాజెక్ట్ మొత్తం పొడవు రోడ్లు, వంతెనలతో కలిపి 30.894 కి.మీ.
ఇందులో జోజిలా ప్రధాన టన్నెల్ పొడవు 13.153 కి.మీ.
నిల్‌గ్రార్ టన్నెల్ టి1 పొడవు 457.35 మీటర్లు.
నిల్‌గ్రార్ టన్నెల్ టి2 పొడవు 1,953.63 మీటర్లు (సుమారు రెండు కిలోమీటర్లు).



ఎన్‌డియే బహిరంగ సభ ఏర్పాట్లు పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యే పులివర్తి నాని

# నేడు తిరుపతిలో ఎన్‌డియే సభ

- హాజరుకానున్న సిఎం చంద్రబాబు, డి.సిఎం పవన్, కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ

**తిరుపతి, జూన్ 8 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో టిడిపి కూటమి ప్రభుత్వం ఏర్పాటై రెండేళ్ళు పూర్తిచేసుకున్న సందర్భంగా ఎన్నికల్లో ఇచ్చిన హామీలు, సంక్షేమ పథకాలు అమలుతీరు, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన సాగించామని విస్తృతంగా ప్రచారం చేసుకోవడానికి తిరుపతిలో మంగళవారం ఎన్‌డియే పార్టీల నేతలు బహిరంగ సభ జరగనుంది. తిరుపతి రూరల్ తిరుపతి-నాయుడుపేట జాతీయ రహదారి పక్కన ఈ సభకు అవసరమైన అన్ని ఏర్పాట్లు జిల్లా యంత్రాంగం పూర్తిచేసింది.

సోమవారం రాత్రి వరకు తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ సలిజామల వెంకటేశ్వర్, తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, సంయుక్త కలెక్టర్ ఆర్.గోవిందరావు, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని ఇతర జిల్లా యంత్రాంగం స్వయంగా ఏర్పాట్లు పర్యవేక్షించి పూర్తిచేశారు. సుమారు లక్షమందికి పైగా పాల్గొనే ఈ సభలో జనానికి సిఎం చంద్రబాబు నాయుడు, డిసిఎం పవన్‌కల్యాణ్, బిజెపి చీఫ్ మాధవ్, కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ, రాష్ట్ర మంత్రులు లోకేశ్, అనగాని సత్యప్రసాద్, సవిత పాల్గొంటున్నారు.

పూర్తిఏర్పాట్లులో అధికారులు తలమునకలయ్యారు. మంగళవారం ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా దామినేడు వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభకు విచ్చేసే ప్రజలకు సకల సౌకర్యాలు కల్పించారు. పర్యటన సందర్భంగా ఎటువంటి ఇబ్బందులు కలగకుండా త్రాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, వైద్య సేవలు, అత్యవసర సదుపాయాలు, భద్రతా చర్యలు, ట్రాఫిక్ నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారు. ముఖ్యమంత్రి మంగళవారం ఉదయం 10.40 గంటలకు రేణిగుంట విమానాశ్రయం చేరుకుంటారు. అక్కడ నుండి రోడ్డుమార్గంలో దామినేడు సమీపంలో ఏర్పాటు చేసిన ఎన్ డి ఏ బహిరంగ సభలో పాల్గొంటారు. కార్యక్రమం ముగించుకుని మధ్యాహ్నాం 2 గంటలకు రేణిగుంట విమానాశ్రయం చేరుకుని హెలికాప్టర్‌లో ఉండవల్లి చేరుకుంటారు.

# 12న పాఠశాలలు పునఃప్రారంభం

- ఎలాంటి మార్పు లేదని ప్రభుత్వం స్పష్టీకరణ

**విజయవాడ, జూన్ 8 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పాఠశాల విద్యార్థులకు వేసవి సెలవులు పొడిగింపు అంశంపై ప్రభుత్వం స్పష్టతను ఇచ్చింది, రాష్ట్రంలో పాఠశాలల పునఃప్రారంభం తేదిల్లో మార్పులేదని తెల్చిచెప్పింది. వేసవి సెలవులను పొడిగించే ప్రతిపాదన ఏపీ లేదని విద్యాశాఖ అధికారులు వెల్లడించారు. ముందుగా ప్రకటించినట్లే అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు ఈ నెల 12వ తేదీన పునఃప్రారంభం కానున్నట్లు స్పష్టం చేశారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, టీచర్లు సోషల్ మీడియాలో జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని నమ్మకూడదని కీలక సూచనలు చేశారు. ఇదిలా ఉండగా తెలంగాణలో స్కూళ్ల రీఓపెనింగ్‌ను ఈ నెల 15వ తేదీకి వాయిదా వేశారు. ఈ నెల 13న రెండో శనివారం, 14న ఆదివారం కావడంతో వేసవి సెలవులను పొడిగిస్తూ నిర్ణయం తీసుకున్నారు. అయితే 12న హాలిడే ఇచ్చినందకు, మరో కిటుకు పెట్టింది సర్కార్. విద్యా సంవత్సరం నష్టపోకుండా జులై 11వ తేదీన రెండో శనివారం తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపింది.

# పెళ్లికి ముందు లైంగిక సంబంధం నేరం కాదు

- కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికైన గాజుల తిరుపతి కేసులో సుప్రీం తీర్పు
- ఉద్యోగంలోకి తీసుకోవాలని తెలంగాణ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డుకు ఆదేశం

**హైదరాబాద్, జూన్ 8 ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి:** మేజర్ల విషయంలో సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. పెళ్లి కాని ఇద్దరు వయోజనులు పరస్పర అంగీకారంతో శారీరక సంబంధాన్ని కలిగి ఉండడాన్ని చెడు ప్రవర్తనగా భావించకూడదని స్పష్టం చేసింది. ప్రేమ విషయంలో నమోదైన ఒక క్రిమినల్ కేసును విచారించిన జస్టిస్ మన్మోహన్, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం ఈ మేరకు తీర్పు వెలువరించింది. అలాగే కేసులో తెలంగాణ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డుకు కీలక ఆదేశాలు జారీ చేసింది. నియామక ప్రక్రియలో పరిగణించి ఉద్యోగం ఇవ్వాలని ఆదేశించింది. కేసు వివరాల ప్రకారం, పిటిషన్ దారుడు (తెలంగాణలో గాజుల తిరుపతి అనే వ్యక్తి ట్రైనీ పోలీస్ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యారు. బోర్డు పోస్టింగ్ ఇవ్వలేదు) తన పొరుగింటి యువతితో కొన్నేళ్ల పాటు ప్రేమ సంబంధం కొనసాగించాడు. ఇద్దరి మధ్య ఉన్న ఆ సంబంధం తర్వాత వివాహ సంబంధంగా మారలేదు. దీంతో 2014లో వివాహం చేసుకుంటానని హామీ ఇచ్చి మోసం చేశాడంటూ అతడిపై కేసు నమోదైంది.

అయితే తర్వాత ఇరువురు పరస్పర అంగీకారంతో రాజీకి వచ్చారు. 2015లో లోక్ అదాలత్‌లో ఆ వివాదం పరిష్కారమైంది. కేసును కొనసాగించేందుకు యువతి ఆసక్తి చూపలేదు. దీంతో వ్యవహారం అక్కడితో ముగిసింది. అయినప్పటికీ, ఆ కేసు నేపథ్యంలో అతడిపై నైతిక అపరాధం (మోరల్ టర్పిట్యూడ్) ముద్ర పడిందని భావించిన తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీసు నియామక బోర్డు నియామకాన్ని రద్దు చేసింది. దీనిని సవాలు చేస్తూ అభ్యర్థి న్యాయస్థానాన్ని ఆశ్రయించాడు. తెలంగాణ హైకోర్టు సింగిల్ జడ్జి అతడి వాదనను సమర్థిస్తూ నియామకాన్ని మరోసారి పరిశీలించాలని ఆదేశించారు. ఆ తీర్పును సవాలు చేస్తూ అధికారులు అప్పీల్‌కు వెళ్లగా, చివరకు సుప్రీంకోర్టు కూడా అభ్యర్థికి అనుకూలంగా తీర్పు ఇచ్చింది. ఈ సందర్భంగా ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది.

ప్రతి ప్రేమ సంబంధం వివాహంతోనే ముగియాలనే నియమం లేదని పేర్కొంది. కేవలం వివాహం జరగలేదనే కారణంతో ఒక వ్యక్తి మరొకరిని మోసం చేశాడని తేల్చేయడం సరికాదని స్పష్టం చేసింది. సంబంధం విఫలమైందంటే అది తప్పనిసరిగా మోసమే అని భావించలేమని పేర్కొంది. అదేవిధంగా, సంబంధంలో బెదిరింపులు లేదా ఒత్తిడి ఉన్నట్లు ఆధారాలు ఉంటే నియామక సంస్థలు అభ్యర్థి అర్హతపై సందేహాలు వ్యక్తం చేయవచ్చని ధర్మాసనం తెలిపింది. అయితే ప్రస్తుత కేసులో అలాంటి పరిస్థితులు ఏవీ కనిపించలేదని పేర్కొంది. యువతితో బలవంతంగా రాజీ ఒప్పందం చేసుకున్నట్లు ఎలాంటి ఆధారాలు లేవని స్పష్టం చేసింది. ఇద్దరి మధ్య సంబంధం ఏర్పడిన సమయంలో వివాహం చేసుకునే నిజమైన ఉద్దేశం ఉందా?, లేదా? అనే అంశాన్ని ఆయా కేసుల వారీగా పరిశీలించాల్సి ఉంటుందని న్యాయస్థానం సూచించింది. ఇద్దరి పరస్పర సమ్మతితో ఏర్పడిన సంబంధాలు, మోసపూరితంగా వివాహ వాగ్దానం చేసి ఏర్పడిన సంబంధాల మధ్య స్పష్టమైన తేడాను గుర్తించాల్సిన అవసరం ఉందని న్యాయస్థానం తెలిపింది. కేవలం సంబంధం వివాహానికి దారితీయలేదనే కారణంతో ఒకరిపై మరొకరు మోసపూరిత ఆరోపణలు చేయడం సరైన విధానం కాదని కోర్టు అభిప్రాయపడింది.

ఈ తీర్పు వ్యక్తిగత స్వేచ్ఛ, పరస్పర అంగీకారం, ఆధునిక సామాజిక సంబంధాలపై న్యాయవ్యవస్థ దృక్పథాన్ని ప్రతిబింబిస్తోందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

## తిరుమల సమాచారం



### సింహవాహనంపై వేణుగోపాలస్వామి

**తిరుమల, జూన్ 8 ప్రభాతవార్త ప్రతినిధి:** టిటిడి అనుబంధంగా ఉన్న చిత్తూరు జిల్లా కార్వేటినగరంలోని రుక్మిణి- సత్యభామ సమేత వేణుగోపాలస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో సోమవారం ఉదయం స్వామివారు యోగనారాయణుడి అలంకారంలో సింహవాహనంపై భక్తులకు దివ్యదర్శనమిచ్చి అనుగ్రహించారు. యోగశాస్త్రంలో సింహం వాహనశక్తికి, ధైర్యానికి, శీఘ్రగమనానికి ప్రతీకగా భావిస్తారు. భక్తుడు సింహబలం వంటి అచంచలమైన భక్తిశ్రద్ధలను కలిగి ఉన్నప్పుడే భగవంతుని అనుగ్రహానికి పాత్రుడవుతాడని ఆధ్యాత్మిక గ్రంథాలు పేర్కొంటున్నాయి. ఈ వాహనసేవలో సూపరింటెండెంట్ శ్రీనివాసులు రెడ్డి, ఆలయ ఇన్‌స్పెక్టర్ చెంగల్రాయులు, ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొని స్వామివారి దివ్య మంగళరూపాన్ని దర్శించి పరవశించారు.



### ఎస్వీ అన్నప్రసాదం ట్రస్ట్‌కు రూ.10 లక్షలు విరాళం

**తిరుమల, జూన్ 8 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమలకు వచ్చిన భక్తులకు ఆకలి అనేది తెలియకుండా నిరంతరాయంగా రుచిగా శుచిగా అందిస్తున్న ఎస్వీ అన్నప్రసాదం ట్రస్ట్‌కు హైదరాబాద్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ భూరం తిరుమల దీక్షిత్ సోమవారం హైదరాబాద్‌లో టిటిడి చైర్మన్ బిఆర్‌నాయుడును కలసి రూ.10 లక్షలు విరాళంగా అందించారు. ఈ కార్యక్రమంలో దాత తండ్రి విశ్రాంత ఇంజినీర్ బి.జగదీశ్వర్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# వైకుంఠమ్ క్యూకాంప్లెక్స్‌లో తనిఖీల డొల్లతనం

- వెంటనే గమనించి పట్టుకున్న భద్రత సిబ్బంది

**తిరుమల, జూన్ 8 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమలకొండపై చీమచిటుక్కుమన్నా వెంటనే కనిపెట్టి పట్టుకునే అత్యాధునిక ఎఐ వ్యవస్థతోబాటు ఆధునిక నిఘా నేత్రాలు పనిచేస్తున్నా ఓ భక్తుడు ఏకంగా తన సెల్‌ఫోన్‌ను తీసుకుని ఏకంగా వైకుంఠమ్ క్యూలైన్లలోని తనిఖీ వరకు వచ్చేవాడు. అంతేగాక ఆ భక్తుడు తనచేతిలోని సెల్‌ఫోన్‌తో వైకుంఠమ్ 2 క్యూకాంప్లెక్స్‌లోని కంపార్టుమెంట్లు, పరిసరాలు పూర్తిగా చిత్రీకరించాడు. ఆ దృశ్యాలను వెంటనే తనవారికి పంపి సామాజిక మాధ్యమంలో హల్‌చల్ చేయించాడు. ఇదీ కాస్త సోమవారం ఉదయం దుమారం రేగడంతో వెంటనే అప్రమత్తమైన టిటిడి భద్రత సిబ్బంది జరిగిన తప్పిదాలను కప్పిపుచ్చుకోవడానికి వివరణ ఇచ్చుకొనే ధోరణి వచ్చింది. అయితే తిరుమలలో భద్రత వ్యవస్థ పటిష్టంగా ఉందని, అప్రమత్తంగానే వ్యవహరిస్తోందని టిటిడి పిఆర్‌ఒ విభాగం సవివరాణత్మక ప్రకటన ఇవ్వడం మరీ విశేషం. సామాన్యభక్తుడు ఏకంగా సెల్‌ఫోన్‌తో వైకుంఠమ్‌లోకి రావడం చిన్నవిషయం కాదు. ఆపై కంపార్టుమెంట్‌లలో పరిస్థితి చిత్రీకరించడం మరీ కలవరం. ఈ నేపథ్యంలో తిరుమలలో భక్తుల భద్రతకు అత్యున్నత ప్రాధాన్యతనిస్తూ టిటిడి పటిష్టమైన మూడంచెల భద్రతా వ్యవస్థను నిరంతరాయంగా అమలు చేస్తోందని వివరణ ఇవ్వడం కొసమెరుపు. ప్రతి షిఫ్టులో వందలాది మంది భద్రతా సిబ్బంది చెకింగ్, స్కానింగ్ విధుల్లో అప్రమత్తంగా విధులు నిర్వహిస్తున్నారు. ఏదైనా కారణాల వల్ల ఒక భద్రతా అంచె వద్ద గుర్తించబడని మొబైల్ ఫోన్ వంటి నిషేధిత వస్తువులు తదుపరి అంచెలలో గుర్తించి, నిర్దేశిత డిపాజిట్ విధానాన్ని అమలు చేయడం జరుగుతోంది. విధుల్లో నిరక్ష్యం వహించిన సిబ్బందిని గుర్తించి, వారిపై అవసరమైన శాఖాపరమైన చర్యలు కూడా



తీసుకుంటున్నారు. సోమవారం సోషల్ మీడియాలో ఒక భక్తుడు సెల్‌ఫోన్‌తో వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోకి ప్రవేశించి, అక్కడి కంపార్ట్‌మెంట్ల దృశ్యాలను చిత్రీకరించి పోస్ట్ చేసినట్లు టిటిడి దృష్టికి వచ్చింది. అయితే, వాస్తవానికి సదరు భక్తుడు ఆదివారం వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌కు మొబైల్ ఫోన్‌తో వచ్చినప్పటికీ, వివిధ దశల్లో నిర్వహించిన భద్రతా తనిఖీల్లో భాగంగా డౌన్ స్కానింగ్ పాయింట్ వద్ద అతడిని గుర్తించి, భద్రతా సిబ్బంది మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన తిరుమలలో అమలవుతున్న మూడంచెల భద్రతా వ్యవస్థ సమర్థవంతంగా పనిచేస్తోందనడానికి నిదర్శనం. తిరుమలలో భద్రత విభాగం పూర్తిగా ప్రోటోకాల్ విధులకు, తమ దర్శనాలకు, తమ వారికి దర్శనాలకే పరిమితమైపోయిందనడానికి ఇదో నిదర్శనం,

# తిరుమలలో నీటి పొదుపు మంత్రం!

- గోగర్భమ్ డ్యామ్ నుండి ప్రధాన ఫిల్టర్ హౌస్ వరకు అదనపు పైప్‌లైన్

**తిరుమల, జూన్ 8 ప్రభాతవార్త ప్రతినిధి:** రోజురోజుకూ ఏడుకొండల వేంకటేశ్వరస్వామి దర్శనార్థం తిరుమలకు వస్తున్న లక్షమంది భక్తులతో కొండపై నీటి వినియోగం కూడా పెరిగింది. రోజుకు సరాసరి 50లక్షల గ్యాలన్ల నీరు అవసరమవుతోంది. ఇందులో తిరుమలలోని ఐదు ప్రధాన జలాశయాలు గోగర్భమ్ డ్యామ్, పాపవినాశనం, ఆకాశగంగ, కుమారధార, పసుపుధార తీర్థాల ప్రాజెక్టుల నుండి రోజుకు 25లక్షల గ్యాలన్ల వరకు నీరు వినియోగిస్తున్నారు. మిగిలిన మరో 25-30 లక్షల గ్యాలన్ల నీరు చంద్రగిరి సమీపంలోని కళ్యాణిడ్యామ్ నుండి తిరుమలకు పంపింగ్ చేసుకుంటున్నారు. దీనివల్ల టిటిడికి భారం కూడా పెరిగింది. అయితే కల్యాణిడ్యామ్ నుండి నీటి పంపింగ్‌ను తగ్గించుకునే దిశగా టిటిడి అడుగులేస్తోంది. దీనివల్ల అదనపు భారం కూడా తగ్గుతుందని భావిస్తున్నారు. ఇందుకోసం తిరుమలలోనే ఐదు ప్రధాన జలాశయాల నుండి రోజుకు అవసరమైన 50లక్షల గ్యాలన్ల నీటిని సాఫీగా సరఫరా చేసుకునేందుకు గోగర్భమ్ డ్యామ్ నుండి తిరుమలలోని ప్రధాన ఫిల్టర్ హౌస్ వరకు నీరు వృధాకాకుండా పూర్తిస్థాయిలో అదనపు పైప్‌లైన్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు. ఇందుకోసం ఇప్పటికే గత టిటిడి బోర్డు సమావేశంలోనే సుమారు ఆరుకోట్ల రూపాయల అంచనాతో పనులు చేపట్టేందుకు ఆమోదించారు. ఈ పనుల కోసం త్వరలోనే ఇ టెండర్లను పిలిచి పనులు ప్రారంభించేందుకు టిటిడి ఇఇ ముద్దాడ రవిచంద్ర, అదనపు ఇఇ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి





కార్యాచరణ సిద్ధం చేశారు.

తిరుమలలో తాగునీటి జలాశయాలైన గోగర్భం డ్యామ్ పూర్తిస్థాయి నీటిమట్టం 2,894 అడుగులు, పాపవినాశనం 697.14 అడుగులు, ఆకాశగంగ జలాశయం 685లక్షల గ్యాలన్లు నీటి సామర్థ్యం. రెండు ప్రధాన పెద్దజలాశయాలు కుమారధార, పసుపుధార తీర్థాలు. ఈ రెండు జలాశయాల్లో పసుపుధార 2,833లక్షల గ్యాలన్లనీటి సామర్థ్యం, కుమారధారతీర్థం 4,258లక్షల గ్యాలన్లు నీటిసామర్థ్యం కలిగి ఉన్నాయి. వీటిల్లోని నీటిని పొదుపుగా వాడుకునేందుకు టిటిడి చర్యలు ఉపక్రమించింది. ప్రస్తుతం తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఎదువతుండటంతో నీటిని మరింత పొదుపుగా వాడుకోవాలని యోచిస్తున్నారు. 2025 అక్టోబర్‌లో తుఫాన్ ప్రభావంతో భారీ వరదలు వచ్చాయి. అప్పట్లో కొండపై ఐదు జలాశయాలు నీటితో నిండుకున్నాయి. ఆ తరువాత మళ్ళీ అడపాదడపా వర్షాలు కురిసినా నీరు మాత్రం చేరలేదు, దీంతో ఇప్పుడు పాపవినాశనం, గోగర్భమ్ డ్యామ్ నుండి దిగువకు విడుదలవుతున్న మిగులు నీటిని పంపింగ్ చేసుకునేందుకు అవసరమైన అదనపు పైప్‌లైన్ ఏర్పాటుపై ఆలోచన చేశారు. అదనపు పైప్‌లైన్ ఏర్పాటుతో నీటిని మరింత పొదుపుగా వాడుకోవచ్చని అధికారుల ఆలోచన. 500 ఎంఎం డయాపైప్‌లైన్ ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. అదనపు పైప్‌లైన్ నిర్మాణం జరిగితే వర్షాకాలంలో నీరు వృధాపోకుండా నీటిని పొదుపు చేసుకునేందుకు అవకాశం కలుగుతుంది. తిరుమలలోని జలాశయాల్లో 14,304 లక్షల గ్యాలన్లు నీటి సామర్థ్యం కాగా ప్రస్తుతం నాలుగు వేల లక్షల గ్యాలన్ల నీరు పైగా మాత్రమే అందుబాటులో ఉంది. ఈ నీరు కేవలం 90 రోజులు మాత్రమే అవసరాలకు సరిపోతుందనేది టిటిడి వర్గాల సమాచారం. వరుణదేవుడు దయతో సకాలంలో ఏదో ఒకరూపంలో నైరుతి రుతుపవనాలు, అల్పపీడనాలతో వర్షాలు కురవకపోతే తాగునీటికి ప్రత్యామ్నాయ పరిస్థితులపై ఆలోచన చేస్తున్నారు.

# వివేకా హత్య కేసుపై సిబిఐ కోర్టులో విచారణ

**హైదరాబాద్ జూన్ 8, ప్రభాతవార్త:** మాజీమంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసుకు సంబంధించి సోమవారం నాడు హైదరాబాద్ సిబిఐ కోర్టులో విచారణ జరిగింది. ఈ కేసును మరింత సమగ్రంగా విచారించాలని వివేకానంద రెడ్డి తనయ డాక్టర్ సునీతా రెడ్డి దాఖలు చేసిన పిటి షన్‌పై కోర్టు ఈ విచారణ చేబట్టింది. దీనిపై కౌంటర్ దాఖలు చేయాలని నిందితుల తరపు న్యాయ వాదులు కౌంటర్ దాఖలు చేశారు.


ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
అటవీ శాఖ

RC.NO.1090/2026/TO, టెండరు ప్రకటన నం. 01/2026-27/TO తేది: 01.06.2026

ఐటమ్: 2026-27 సంవత్సరంలో ఇందిరాగాంధీ జూలాజికల్ పార్క్ విశాఖపట్నం సింహాల ఆవరణానికి క్రాల్ హోల్డింగ్ ఏర్పాటు. అంచనా ధర: రూ.17.00 లక్షలు. బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ముగింపు తేది: 24.06.2026 మ.12.00గం. వరకు. తదుపరి వివరాలు క్రింది సంతకందారుని నుండి పొందవచ్చును. ఫోన్: 9440168997.

సం/-. క్యూరేటర్, ఇందిరాగాంధీ జూలాజికల్ పార్క్, విశాఖపట్నం.

DIPR.NO. 20569/CL/ADVT/1/1/2022-23 తేదీ: 08.06.2026



రి.క.నెం. 1331/2025/ఎ/ తే:08.06.2026

రెవిన్యూ డివిజనల్ అధికారి వారి కార్యాలయము అనకాపల్లి

పత్రిక ప్రకటన

ఫారమ్-1 షెడ్యూల్-2

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, మెట్రోపాలిటన్ రీజియన్ మరియు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చట్టం, 2016 (ఆంధ్రప్రదేశ్ చట్టం నెం.5/2016) యొక్క సెక్షన్ 116(2)(ఇ) క్రింద ఇచ్చిన అధికారాలను వినియోగించుకొని, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్మెంట్ (ఎం) శాఖ జి.ఓ.ఎం.ఎస్.నెం.146, తేదీ 30-07-2025 ద్వారా విశాఖపట్నం మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (VMRDA) కమిషనర్‌కు సంబంధిత భూములపై వుడా ల్యాండ్ పూలింగ్ స్కీం (రూల్స్, 2016) ప్రకారం భూసమీకరణ (ల్యాండ్ పూలింగ్) కార్యక్రమాన్ని చేపట్టడానికి అనుమతి ఇవ్వబడింది.

ఈ పథకాన్ని అమలు చేయుటకు అనకాపల్లి, రెవిన్యూ డివిజనల్ అధికారి వారిని కాంపిటెంట్ అథారిటీగా నియమించడమైనది. అనకాపల్లి జిల్లా, అనకాపల్లి రెవిన్యూ డివిజన్ పరిధిలో ప్రతిపాదిత గ్రామాలు మరియు భూసమీకరణకు లభ్యమయ్యే భూముల వివరాలు క్రింద ఇవ్వబడ్డాయి.

| క్రమ సంఖ్య | గ్రామం పేరు | మండలం | సర్వే నెం. | ప్రతిపాదిత విస్తీర్ణం (ఎకరాలు-సెంట్లు) | లభ్యమయ్యే విస్తీర్ణం (ఎకరాలు-సెంట్లు) |
|---|---|---|---|---|---|
| 1. | అంతకపల్లి | సబ్బవరం | 109, 110, 114, 117, 120, 121, 123, 661-680 | 166.669 | 166.669 |

అందువలన, ఫారమ్-1 షెడ్యూల్-2 సబ్బవరం మండలంలో, అంతకపల్లి గ్రామమునకు సంబంధించిన లబ్దిదారులు జాబితా సిద్ధం చేసి తేది.09.06.2026దిన సదరు ప్రకటనను ఈక్రింద తెలుపబడిన ప్రభుత్వ కార్యాలయములలో ప్రజలకు సమాచారము నిమిత్తం ప్రచురించడమైనది.

1) కలెక్టర్ వారి కార్యాలయము, అనకాపల్లి
2) మెట్రోపాలిటన్ కమీషనర్ వారి కార్యాలయము, VMRDA విశాఖపట్నం
3. రెవిన్యూ డివిజనల్ అధికారి వారి కార్యాలయము, అనకాపల్లి
4) తహసిల్దారు వారి కార్యాలయము, సబ్బవరం
5) మండల పరిషత్ డెవలప్మెంట్ అధికారి వారి కార్యాలయము, సబ్బవరం
6) స్టేషన్ హౌస్ ఆఫీసర్ వారి కార్యాలయము, సబ్బవరం
7) సబ్ రిజిస్ట్రార్ వారి కార్యాలయము, సబ్బవరం
8) గ్రామసచివాలయం, అంతకపల్లి
9) గ్రామ పంచాయతీ కార్యాలయము, అంతకపల్లి

ఈ నోటిఫికేషన్ (ప్రకటన) వెలువడిన 60 రోజులలోగా అనగా తేది:09.06.2026 నుండి తేది: 08.08.2026ది లోపు సంబంధిత వ్యక్తులు వారి యొక్క అభ్యంతరములను / సలహాలను ఫారము-2 లోను మరియు అంగీకార పత్రములను ఫారం-3 ద్వారా అధీకృత అధికారి వారికి అనగా రెవిన్యూ డివిజనల్ అధికారి, అనకాపల్లి వారికి సమర్పించవచ్చును.

భూసమీకరణ పథకము క్రింద ప్రతిపాదించిన భూమి ప్లాను అతుకబడి రైతులు మరియు అనభ్యంతర ప్రభుత్వ భూముల ఆక్రమణదారులు గాని లేదా ఇతరులు గాని కార్యాలయ పని వేళలలో అధీకృత అధికారి వారి కార్యాలయములో తనిఖీ చేసుకొను నిమిత్తము లభ్యముగా వుండును. సదరు నకలును అథారిటీ అనగా విశాఖపట్నం మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ వారి వెబ్‌సైట్‌లో కూడా పొందు పరచబడినది.

గడువు తీరిన పిదప వచ్చిన అభ్యంతరములు మరియు గడువులోపు వచ్చిన అభ్యంతరములలో ఆక్షేపించే వ్యక్తి అతనికి సంభందించిన ఆక్షేపణ స్వభావము నందు స్పష్టత లేనిచో అవి తిరస్కరించబడును.

నిర్దిష్ట గడువులోగా వచ్చిన అభ్యంతరములు మరియు సలహాలు తేదీ:09.08.2026దిన ఉదయము 11:00 గంటలకు తహసీల్దార్ వారి కార్యాలయం, సబ్బవరంవారి వద్ద విచారించబడును. సంబంధిత ఆక్షేపణదారులు స్వయముగా గాని లేదా వారి న్యాయవాది ద్వారా గాని హాజరై మౌఖిక లేదా డాక్యుమెంటరీ వివరణ తెలియజేయవచ్చును.

సం/- అధీకృత అధికారి (ల్యాండ్ పూలింగ్ స్కీము) మరియు రెవిన్యూ డివిజనల్ అధికారి, అనకాపల్లి

9-6pg4.qxd:9-6pg4.qxd 1/1/02 5:44 AM Page 1



వార్త

కేవలం ఆలోచించడం కాదు, ఆచరణ ముఖ్యం. అదీ ఇప్పుడే ప్రారంభించాలి తప్ప రేపటికి వాయిదా వేయకూడదు.

- న-ఇ. గిబ్బన్

# ఈ పంథా ఏ 'మార్పు' కోసం!

'మా వ్యూహాలకు మేమే రాజులం. వ్యూహం చేశామంటే అవి పండి తీరాలంతే! అని ఎవరేనా అనుకుంటే వాళ్ల పప్పులో కాలేసినట్లే! ఎవరు వ్యూహం చేశారని అల నాడు విశ్వవిఖ్యాత నట సార్వభౌమ నందమూరి తారక రామారావు పార్టీ స్థాపించిన అతి తక్కువ కాలంలో ఆంధ్రప్రదేశ్ పీఠమెక్కగలిగారు. ఎవరి ప్రోత్సాహంతో ద్రవిడ నాట సినీ కథానాయకుడు దళపతి విజయ్ కొత్త రాజకీయ పార్టీతో ప్రజల్లోకొచ్చి ప్రజల కోసం, ప్రజల చేత ప్రజల పాలనకు తెరదీసే అవకాశమిచ్చారు.అదంతా ప్రజల చలువ వల్లనే. అదే దారిలో, అదే పోకడలో ద్రవిడ నాట రాజకీయాలు నడపాలన్న ధోరణిలో తమిళ నాడు మాజీ బిజెపి నేత అన్నామలై మరోసారి నడుం బిగించారు. తాను తమిళనాడు బిజెపి అధ్యక్షునిగా ఉన్నంతకాలం అక్కడ రాజకీయాల్లో కొత్త బాటలు వేసేం దుకు బిజెపి అధిష్టానం సహకారం పూర్తిస్థాయిలో దక్కలేదని ఆయనే స్వయంగా చెప్పారు. ఇటీవలి ఎన్నికల్లోనైనా ద్రవిడ పార్టీలను దాటి విజయ పథంలోకి అడుగుపెట్టాలన్న ఆయన ప్రయత్నాలకు బిజెపి కలిసి రాలేదు. తమిళనాట ద్రవిడ పార్టీల అనుబంధం నుంచి బయటికొచ్చే ప్రయత్నమేవీ చేయకపోగా అన్నాడిఎంకెలో కలిసి సాగడంతో అన్నామలై కాస్త పక్కకు జరిగి మౌనంగా, దూరంగా జరిగి ఉండిపోయారు. ఎన్నికల ముందూ వ్యూహాలు, ప్రతివ్యూహాలు ఆనక ఓటమి చెందితే మరో ఎన్నికకు సిద్ధం కావడం మామూలుగా ఏ రాజకీయ పార్టీయేనా చేసే పని. కానీ ఒక్కసారిగా ద్రవిడనాట ద్రవిడ నేపథ్యం, భావజాలం ఉన్న పార్టీలు చతికిలపడిపోవడం, సంప్రదాయేతర పార్టీతో ద్రవిడేతర పార్టీ అధికారంలోకి రావడంతో ఇప్పుడక్కడ రాజకీయ కలకలం చోటు చేసుకొంది. ఇవే సమీకరణలతో ఐదేళ్ల పాటు పార్టీలు నడుపుకోవడం, ప్రజాబాహుళ్యంలోకి వెళ్లి మనుగడ సాధించడమూ కష్టమే. పార్టీలు దిక్కుతోచని స్థితిలో ఉన్నాయి.అయితే ఐదేళ్లు వేచి ఉండాలా? పదేళ్లు వేచి ఉండాలా అనే విషయమై స్పష్టత లేని తమిళనాడు రాజకీయాలను ఎవరూ నమ్ముకునే పరిస్థితి లేదు. పార్టీల్లో ద్వితీయశ్రేణి నేతలు అటూ ఇటూ చెల్లాచెదుర వుతున్నాయి. ప్రథమ శ్రేణి నాయకత్వం కూడా పక్క చూపులు చూస్తున్నాయి. ఎంత వేచి చూసినా కను చూపు మేరలో భవిష్యత్ ఆశాజనకం లేదని ఎంచి మాజీ మంత్రులు అధికార పార్టీలో చేరిపోతున్నారు. అన్నాడిఎంకె నుంచి ఎమ్మెల్యేలుగా గెలిచిన నేతలు ఎక్కువ కాలం అధికారంలో లేకుండా ఉండేట్లు లేరు. ఎమ్మెల్యేగా గెలిచిన వారు సైతం బేషరతుగా టి.వి.కె. పార్టీలోకి చేరిపోతున్నారు. టివికె అధినేత ముఖ్యమంత్రి పూర్తి మెజారిటీకి అతితక్కువ దూరంలో ఉన్నందున చాలా మంది దానిని అందిపుచ్చుకుంటే తృణమోప్రణమో ప్రజా సేవలో ఉన్నట్లుగా ఉంటుంది. మర్యాద దక్కించు కున్నట్లూ ఉంటుంది అనుకుంటూ జంప్‌లు చేసేస్తు న్నారు. ఐపిఎస్ ఉద్యోగంచేస్తూ సమాజంలోమార్పుకోసం తన వంతుగా రాజీనామా చేసి రాజకీయ జపం చేసిన అన్నామలై కిందపడ్డా మళ్లీ తన ప్రయత్నాలను, ఆలోచ నలను వీడలేదు. ఎప్పుడైతే భారతీయ జనతాపార్టీవదిలి సరికొత్త రాజకీయ ప్రయాణానికి అడుగులువేశారు.'వుయ్ ది పీపుల్' పేరిట రాజకీయ ఉద్యమాన్ని ప్రారంభించా రు. స్పందన అనూహ్యం. త్వరలో ప్రజలే కేంద్రంగా ఓ రాజకీయ పార్టీని స్థాపించే పనిలో పడ్డారు. 'మారుదాం. మార్చుదాం' అనే నినాదంతో కొత్త రాజకీయ ప్రస్థానానికి నాంది పలికారు. 'నా మార్గం వేరు, నా లక్ష్యాలు విస్తృ తం. తమిళనాట ఒక సరికొత్త రాజకీయ సంస్కృతిని, సమున్నతమైన మార్పును తీసుకురావాలనుంది అని అన్నామలై స్పష్టం చేశారు. ఎవరెన్ని రాజకీయాలు చేసి నా, రాజకీయ పార్టీ లకు అంతిమ లక్ష్యం అధికారమే. ఒక ఉద్యమానికి పునాది వేస్తే 'మార్పు' అదే వస్తుందన్న ఆలోచనలతో ఆయన వ్యూహాన్ని నిర్మిస్తున్నారు. ఇటీవల తమిళ తంబి లో వచ్చిన మార్పు సినీ నటుడి పార్టీకి అధికారం కట్ట బెట్టిన తీరు చూస్తే 'మళ్లీ ఇంకేంకావాలి' అనిఎవరైనా ప్రశ్నిస్తే, అన్నామలై తన గమ్యానికి సరైన దారి వేసుకునే పనిలో ఉన్నారు. తమిళనాడు రాజకీయా ల్లో కాకావికలైన అన్ని పార్టీలు తమ రాజకీయమార్గాన్ని, రాజీ మార్గాన్ని కొత్త పుంతలు తొక్కించే ప్రయత్నం చేస్తున్నారు. ముందు ఉద్యమంలా బయటికొచ్చి ఆపైన రాజకీయ ఆకాంక్షలు నెరవేర్చుకునే విధంగా ఆలోచనలు చేస్తున్నారు. తమిళునిగా కొనసాగుతూ బిజెపిలో ఉండ డం కష్టమైన పనిగా భావించిన అన్నామలై కొత్త పంథా లోకి అడుగు పెట్టారన్న మాట. కొత్తగా రాజకీయాన్వే షణ చేసే వారికి రాజకీయాలు నేర్పేందుకు సన్నద్ధమ య్యారు. కోయంబత్తూరులో ఎపిజె అబ్దుల్ కలాం సెంటర్ ఫర్ ఎథిక్స్ ప్రారంభించే ఏర్పాట్లు జరుగుతు న్నాయి.రాజకీయ నేతలు కొత్తగా పార్టీ పెట్టే సమయం లో చెప్పే మాటలే ఆయనా చెప్పారు. తమిళనాట రాజ కీయ కూటముల్లో మిత్రులెవరూ ఆనందంగాలేరు. బయ టికెళ్లి అధికార పార్టీలో మమేకమైపోయినా లోపలుండి చేసేదేమీ లేదని తదుపరి కార్యాచరణకు సందిగ్ధంలో ఉన్నారు.నెమ్మదిగా తమకున్న రాజకీయ అనుబంధాలను తప్పించుకునే ప్రయత్నంలో ఉన్నారు. మొన్నటిఎన్నికల్లో చితికిపోయిన వారు సైతం ఏంచేయాలో తోచక, నలు గురులో నవ్వులపాలవకుండా ఉండేందుకు కొత్తగా ఉద్య మాలు నిర్మిస్తామంటున్నారు. ఇదిలాఉండగా సూపర్ స్టార్ విజయకాంత్ సతీమణి, సామాజిక కార్యకర్త ప్రేమలత రజినీకాంత్ ఎండిఎంకె తరపున ఎమ్మెల్యేగా గెలిచారు. కానీ ద్రవిడ పార్టీల కూటమిలో ఉండిపోవడం తో తమిళనాడు రాష్ట్ర శ్రేయస్సు అభివృద్ధి కోసం 'నినా దంతో'మక్కల్ మేద్రై' పేరిట సామాజిక ఉద్యమానికిపిలు పునిచ్చారు.ఆరాష్ట్రంలో రాజకీయ సామాజికపరిణామాలు ఎంతో మందికి ఎన్నో కొత్తదారులు చూపిస్తున్నాయి.



జీవితం ఒక పాఠశాల వంటిది. ఇక్కడ ప్రతి బాధ, ప్రతి హృదయం విదారకత మనకు అమూల్యమైన పాఠాన్ని నేర్పుతుంది.

స్వామి వివేకానంద



అనేక విత్తనాలు విత్తడం ద్వారా నేల ఏ విధంగా సారవంతమవుతుందో అలాగే రకరకాల విషయాలను పరిశీలించడం ద్వారా మనసు వికసిస్తుంది.

జెఫర్సన్

## ప్రజావాక్కు

### పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పరీక్షలనిర్వహణ పేపర్ల మూ ల్యాంకనం సరిగాజరగడం లేదనేది చాలా కాలంగా విని పిస్తున్నవిమర్శ.ప్రతిష్టాత్మకసంస్థల్లో చేరడానికి నిర్వహిం చే ఎంట్రన్స్ టెస్టులు ఉద్యోగాల కోసం అభ్యర్థులకు నిర్వ హించే టెస్టులు కూడా సరిగా ప్రూఫ్ రీడింగ్ చేయడం లేదు.గ్రమెటికల్‌మిస్టేక్స్ ఉంటున్నాయి.ప్రింటింగ్ మిస్టేక్స్ కూడా ఉంటున్నాయి.యాడ్స్ స్కోర్ఇవ్వడంలేదు. తప్పు లు ఏమైనాఉంటే అప్పీల్ చేయండిఅని అడుగుతున్నారు. ఎక్కువమంది అప్పిల్ చేయడానికి ఫీజు కట్టడానికి భయ పడి అప్పీల్ చేయడం లేదు. తద్వారా తప్పులు తడకల తో కూడినకే పేపర్ ఆధారంగానే మార్కులు ఇస్తున్నారు. ఇటీవల ఆంధ్ర యూనివర్సిటీ వారు నిర్వహించిన ఏపీ సెట్ 2025 లో పేపర్ వన్‌లో ఎనిమిది బిట్లు తప్పుగా ఇచ్చారు.వాటికిపదహారుమార్కులు.మాస్టర్‌కిలో ఆ తప్పు లు ఆధారంగానే ఆన్సర్లుఉన్నవి. ఇలాంటి పరీక్షలు నిర్వ హించే టప్పుడు అభ్యర్థుల నుండి ఎలాంటి విమర్శలు రాకుండా చూసుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.

- వీరగంట భాస్కర్ రావు, బొబ్బిలి

### ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలి

పజాస్వామ్య వ్యవస్థలో ఓటరు తీర్పు అత్యంత పవి త్రమైనది. ప్రజలు ఒకసిద్ధాంతాన్ని నమ్మి తమ ప్రతినిధు లను ఎన్నుకుంటారు. అయితే ఇటీవల రాజకీయాల్లో చోటు చేసుకుంటున్న ఫిరాయింపులు ఓటర్ల నమ్మకాన్ని వమ్ము చేస్తున్నాయి. ప్రజాప్రతినిధులు ప్రలోభాలకు గురై పక్షాలుమార్చడం ప్రజాస్వామ్య విలువలకే గొడ్డలి పెట్టు. ఈచట్టంలోని లొసుగులను వాడు కుని ప్రతినిధులు స్వార్థ ప్రయోజనాల కోసం పక్షాలు మారుతున్నారు. ఒక గుర్తుపై గెలిచి మరో పక్షంలోకి వెళ్లడం ఓటర్లను మోసం చేయడమే. ఫిరాయింపులకు పాల్పడినప్పుడు సభ్యత్వం తక్షణమే రద్దు చేయాలి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### కర్షకులు అంటే విలువలేదా

నేటి భారతంలో అధిక పనుల పేరిట ఆదివారం కూడా ఆకలి మంటల కోసంఅహర్నిశలు కృషి చేస్తూ ఆరోగ్యాన్ని సైతం లెక్కచేయకుండా ప్రైవేట్ ఆఫీసులు,ఆసుపత్రుల బంధిఖానలో తీవ్రఅనారోగ్యానికి గురవుతున్న కార్మికులు ఎక్కువమందేఉన్నారు.జరఆరోగ్యం గురించినిన్ను నమ్ము కున్న కుటుంబం గురించి ఆలోచించి ముందుకు సాగు.

-మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

### డబుల్ బెడ్‌రూమ్స్ ఇళ్లు ఇవ్వాలి

ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా డబుల్ బెడ్ రూమ్లు ను వెంటనే ఇవ్వవలెను. గత ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్ రూమ్‌లు ఇప్పుడుఉన్న ప్రభుత్వం లబ్ధిదారులకు కేటా యించాల్సినవి కేటాయిస్తే తమకేమీనష్టం వాటిల్తుందో అర్థం కావటం లేదు. ప్రజలను ఒక రకమైన ఆందోళనకు గురి చేస్తున్నారు. గత ప్రభుత్వంలో డబుల్ బెడ్రూంలో నిర్మించి ఇంతవరకు ఇవ్వకుండా జాప్యం చేయుచున్నారు. గ్యారెంటీ వారంటీ అనుకుంటూ ఓట్లు దండుకోవటం తప్ప ప్రజలకు మేలు చేకూర్చే,బాగోగులు చూసేపథకాలను ప్రణాళిక తీసుకు వచ్చి ప్రజలకులబ్ధిదారులకు న్యాయం చేయాలి.గత ప్రభుత్వ హయాంలో పంచాయతీలలో తీర్మానంచేసి లబ్ధిదారులను ఎంపిక చేసినారు.ప్రస్తుతం ఉన్న ప్రభుత్వం ఆ లబ్ధిదారులను కాకుండా వేరే లబ్ధిదారులను చాటు మార్గంగా ఎంపిక చేస్తు న్నారా?తమకు నచ్చిన వారినినకిలీల ఎంపిక చేసివారికి కేటా యించేవిధంగాఉందని ప్రజలుఅనుమానంతో భావిస్తున్నారు. ప్రభుత్వం వెంటనే డబుల్ బెడ్‌రూమ్స్ కేటాయించాలి.

- సింగు. లక్ష్మీనారాయణ, కరీంనగర్

### గ్రామాలలో జంతు బలి నిషేధించాలి?

గ్రామాలలో ఇండ్లవీధులలో జంతు బలిని నిషేధించాలి. వర్షా కాలంలో జంతువులను వధించడం వలన జంతువు కళేబ రాలు, వ్యర్థ పదార్థాలను,రక్తం,మాంసం, ఎముకలు, కసరు, వంటి పదార్థాలు మురుగు వాసనతో అంటూ రోగాలు వస్తు న్నాయి. జంతువులు బలిచేసే వారు ఆర్థికంగా లాభం పడు తున్నారు. కానీ చుట్టూ ప్రక్కల ప్రజలు అనారోగ్యం పాలు అవుతున్నారు. కనుక తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్య, హెల్త్ డిపార్ట్మెంట్, స్థానిక గ్రామ పంచాయతీ, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో గ్రామాలలో జంతు బలినినిషేధం చేయాలి. వారికీ నోటీసు ఇవ్వాలి. జరిమానావిధించాలి. కేసులు నమో దుచేయాలి.ఆరోగ్యమేమహాభాగ్యం కనుకశుభ్రత పాటించాలి.

- కదురు శ్రీనివాస్, వరంగల్

### నిధులను విడుదల చేయాలి

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఫీజ్ రీయంబర్స్‌మెంట్ బకాయి నిధులను సకాలంలో విడుదల చేయక పోవడం వల్ల ప్రైవేట్ కళాశాలల యాజమాన్యం ఫీజ్‌లు చెల్లించాలని విద్యార్థులపై వత్తిడి చెయడం వల్ల ఫీజ్‌లు చెల్లించే ఆర్థిక స్తొమత లేని విద్యార్థులు మధ్యలోనే చదువు మానేసే ప్రమాదం ఉంది. ప్రభుత్వంఫీజ్ బకాయి నిధులను విడుదల చేసి నిరుపేదలు ఉన్నత విద్యనభ్యసించేలా సహకరించాలి.

-బి. కృష్ణ యాదవ్, హైదరాబాద్

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి | ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్ (e-mail: editpage@vaartha.com)

# 'పొల్లు మాట'లతో చేటు తేవొద్దు

*తెలంగాణావారి హక్కులను ఇతరుల పాలు కాకుండా చేయడానికి. ఎవరైనా ఎక్కడివారైనా ఇక్కడికి రావచ్చు, ఏమైనా చేసుకోవచ్చు కాని ఇచటి రాజకీయ పరమైన ఉన్నత పదవులు అంటే, ప్రధాన మంత్రి, ముఖ్యమంత్రిలాంటివి ఇక్కడి వారికే, లేక ఇక్కడ చిరకాలంగా నివసిస్తున్నా వారికే దక్కాలి అనే నిబంధనను చేసుకోవచ్చు. అప్పుడు తెలంగాణలోని విద్యావకాశాలు, ఉద్యోగావకాశాలు, భూమి వనరులు మున్నగువాటికిచెందిన యాజమాన్యతలు పూర్వం నుండి ఇచటే పుట్టి పెరిగిన వారికి లేక చాన్నాళ్ల నుండి ఇచ్చట స్థిరపడ్డవారికి మాత్రమే లభించేటట్లు చేయవచ్చు. ఆర్థిక స్థోమతే కదా అన్ని స్థోమ తల కంటే మిన్న. అలాంటి ఆర్థిక స్థోమత తగ్గుతుందేమో నని తెలంగాణా ప్రాంతం వారికున్న భయాందోళనలు, సందేహాలు సహజమే కదా! ఇప్పుడు గొడవంతా వస్తున్నది ఆ భయాందోళనల, సందేహాల వలననే కదా? తెలంగాణా వారి భయాందోళనలను, సందేహాలను నివారించాలంటే పవన్ కళ్యాణ్ వీటిని పట్టించుకోవలసుంటుంది. సిద్ధమేనా మరి! పవన్ కళ్యాణ్ కాస్తాగి వీటిగురించి సావధానంగా ఆలోచించి ముందడుగు వేయగలరా మరి?*



డా॥కొండలరావు వెల్చాల

ఇదేనా మన సభ్యత, సంస్కారం, సాంప్రదాయం? ఇదేనా మనకు మన విద్య ద్వారా లభించినవినయం, వివేకం, వికాసం? ఈ మధ్య హైదరాబాదులో చెలరేగుతున్న మాటల మాయాజాలం నన్నెంతో కలవరపరిచింది. ఇంకా కలవర పరుస్తూనే ఉంది. దేశ స్వాతంత్ర్య సమరంలో, హైదరాబాదు రాష్ట్రం భారతదేశంలో విలీనం కావడానికి ఆనాటి హైదరాబాదు వారు జరిపిన విలీన పోరాటంలో, అటు తదుపరి తెలంగాణ అస్తిత్వ పోరాటంలో చాలా చురుకుగా పనిచేసి కరవల్లు మోసిన వాణ్ణి, కారాగారాల్లో బంధించబడినవాణ్ణి. నిజమైన, స్వచ్ఛమైన స్వాతంత్ర్య సమరయోధుణ్ణి. కనుకనే ఈనాటి అసభ్యకరమైన, ఆందోళనకరమైన మాటల పోటీలను చూస్తుంటే, వింటుంటే తట్టుకోజాలడం లేదు. ఇదేనా మనం మన యువతకిస్తున్న సందేశం, వారసత్వం? ఇందుకొరకేనా మనం సకల త్యాగాలతో స్వాతంత్ర్యాన్ని సాధించింది? అని అనుకుంటూ శాంతి ప్రశాంతతలు కోల్పోతున్నాను. ఒక దేశం లేక రాష్ట్రంవారు ఇంకొక దేశానికి, రాష్ట్రానికి అనేకానేక కారణాల వల్ల రావటం పోవటం జరగడం అనాదిగా మామూలే కదా! అది వ్యాపారం కొరకు కావచ్చు, విద్య కొరకు కావచ్చు. ఉపాధి కొరకు కావచ్చు, కాని నాకు తెలిసినంతవరకు అది రాజకీయాల కొరకు మాత్రం కాదు, కాకూడదు కూడా. కాని ఇప్పుడు మాత్రం తక్కినవాటికంటే రాజకీయ కారణాలే ఎక్కువేమోనని తెలంగాణావారు గాభరా పడుతున్నారు. అందుకేనేమో కొందరు అలజడులకు, అసభ్య పదజాలాలకు పాటుపడుతున్నారు. ఇది వారి విశ్వాసానికి చెందిన విషయం. దానికి గత చరిత్ర కారణం కదా! కాదనగలమా మరి! ఒకప్పుడు తెలంగాణాను ఆంధ్రా ప్రాంతంలో విలీనం చేస్తున్నప్పుడు 'జంటిల్మెన్ అగ్రిమెంట్' ద్వారా తెలంగాణా వారికి ఆంధ్రాప్రాంతపు నేతలు ఎన్నో వాగ్దానాలు చేశారు. వాటిని పట్టించుకోకపోవడం వలననే కదా ప్రత్యేక తెలంగాణా పోరాటం వచ్చింది. మరి ఇప్పుడుకూడా ఈనాటి ప్రభుత్వాలు అనేకానేక వాగ్దానాలు చేస్తూనే ఉన్నాయి. వాటిని అమలు చేయకుండా చేతులెత్తేస్తూనే ఉన్నాయి. వాటికి అనేకానేక కారణాలు ఉదహరిస్తూ. మరొకసారి తెలుగువారందరూ కలిస్తే రెండు రాష్ట్రాలు ఒకటైతే తెలంగాణా వారికి అదే గతి పడుతుందేమోననే అనుమానం రాకుండా ఉంటుందా? ఇంగ్లీషులో ఒక సామెత 'వి హాడ్ ద ఎక్స్‌పీరియన్స్ బట్ మిస్స్‌డ్ ద మీనింగ్' యనునది ఉంది. ఇంకొకటి 'హిస్టరీ టీచస్ అజ్ దట్ మ్యాన్‌కైండ్ హార్డ్‌లీ లర్న్స్ ఎనీథింగ్ ఫ్రమ్ హిస్టరీ' యనునది. ఇప్పుడు హైదరాబాద్‌లో జరుగుతున్న కలహాలను చూస్తుంటే ఔను కదా! అంతే కదా! అని అనిపిస్తుంది. మనకు మొదటి ప్రపంచ యుద్ధం వచ్చింది.దానితో మనమేం నేర్చుకున్నాం. రెండవ ప్రపంచయుద్ధం వచ్చింది. మనమేం నేర్చుకున్నాం. ఇప్పుడు మూడో ప్రపంచయుద్ధం దాదాపు మొదలైంది. దానివలన మనమేం నేర్చుకుంటున్నాం? తెలంగాణ అస్తిత్వ పోరాటం వచ్చింది, దానితో మనం ఏం నేర్చుకున్నాం? ఇదీ అంతే కావచ్చునను భయాందోళన ఈనాటి తెలంగాణా వారి



అలజడికి, అప్రస్తుత, అసభ్య పదజాల వాడుకకు కారణం కాదని నిస్సందేహంగా అనగలమా?పవన్ కళ్యాణ్ జనసేన యను ఒక పార్టీని స్థాపించారు. ఆ పార్టీని తెలంగాణాలో కూడా పెట్టదలచుకున్నారు. దానికి అభ్యంతరమెందుకు? ఆయన హైదరాబాదులో ఒక సభ జరపాలనిఅనుకున్నారు. దానికి అనుమతి నిరాకరణ ఎందుకు? ఆ పార్టీ కాక ఇంకా ఎన్నో పార్టీలు హైదరాబాదులో లేవా? ఇంకా వస్తూనే ఉన్నాయి కదా? ఆయా పార్టీలు వారివారి సభలు సమావేశాలు జరుపుకోవడం లేదా? అసలు కారణం అది కాదు. అసలు కారణం ఆనాటి అంధ్రాప్రాంతపు అధిపత్యం తిరిగి మరొకసారి తెలంగాణాకి వస్తుందేమోనని, ఇది తెలంగాణా వారి విశ్వాసానికి చెందింది. ఎవరెన్ని అన్నా ఆ విశ్వాసం ఇంత త్వరగా పోదు, పోజాలదు. ఇది పవన్ కళ్యాణ్ అర్థం చేసుకొని ఇంత తొందరగా ఇచట వారి పార్టీకి చెందిన సన్నాహాలు ప్రారంభించకపోతే బాగుండేదేమో? కాస్త రాజకీయ వాతావరణం చల్లబడ్డాక మరికొంతకాలం ఓపిక పట్టి, ఈలోపల అచటి ఇచటి మేధావులతో సంప్రదించి కొన్ని సమిష్టి సభలు, సదస్సులు నిర్వహించి అనుకూలమైన వాతావరణాన్ని సృష్టించి ఇప్పుడు చేయదలచుకున్న వన్నీ అప్పుడు చేస్తే బాగుండేదేమో? కాస్త తొందరపాటు జరిగిందని అనిపిస్తోంది. ఒకనాటి హైదరాబాదు రాష్ట్రంలో 'ముల్కీరూల్స్' యనునవి ఉండేవి. వాటిద్వారా హైదరాబాదు రాష్ట్రంలోని విద్యావసతులు, ఉద్యోగాలు, భూమి పుత్రులు మున్నగునవి మొదట హైదరాబాదు వారికే చెందాలి అనే నిబంధన ఉండేది. వాటిని తూ.చ తప్పక అమలు చేసినన్ని రోజులు ఏ గొడవలూ రాలేదు. ఎపుడైతే వాటిని అమలు చేయలేదో, అమలు చేయుటకు ఎన్నో అవరోధాలు కల్పించి, వాటిని ఇతర ప్రాంతాల వారు కాజేయుటకు వీలు కల్పించారో అప్పుడు వచ్చింది ప్రత్యేక తెలంగాణ పోరాటం, దీని గురించి'గిర్గలాని కమీషన్' సవివరంగా పేర్కొంది. అప్పటికీ ఇప్పటికీ అసలు గొడవంతా విద్యావసరాల కొరకు, ఉద్యోగాల కొరకు, భూములు, నీళ్ల వగైరాల కొరకే కదా? అలాంటప్పుడు ఆనాటి 'ముల్కీ రూల్స్' లాంటివి ఈనాడు కూడా తెలంగాణా వారికొరకు పెట్టుకోవచ్చు కదా! అలాంటి ముల్కీరూల్స్ లాంటివి కాశ్మీర్లో కూడా అమలులో ఉన్నాయి కదా. అప్పుడు ఈ గొడవంతా ఉండదు కదా! సోనియాగాంధీకి ఒకప్పుడు ప్రధానమంత్రి అయ్యే అవకాశం ఉండింది. ఆమెను అలా కానివ్వకుండా సుబ్రహ్మణ్యస్వామి రాష్ట్రపతి దగ్గరకు వెళ్ళి ఈమె ఇటాలియన్ దేశ పౌరసత్వం కలది, ఆ దేశ రాజ్యాంగంలో ఆ దేశపౌరులు కానివారు ఆ దేశానికి రావచ్చు. ఏ కార్యకలాపాలనైనా చేసుకోవచ్చు. కాని అత్యంత ప్రముఖమైన ప్రధానమంత్రిత్వాన్ని మాత్రం ఆ దేశ పౌరుడికే ఉంటుంది' యని రాసి ఉంది. అలాగే ఇక్కడ కూడా ఇక్కడి ప్రధాన మంత్రిత్వం ఇక్కడి వారికే దక్కాలి కాని మరొకరికి కాదు యని వాదించి ఆమెను ప్రధానమంత్రి కాకుండా చేశారు. అలాంటి నిబంధనను మనం కూడా 'ముల్కీరూల్స్' పెట్టుకోవడానికి ఉదాహరణగా తీసుకోవచ్చు. తెలంగాణావారి హక్కులను ఇతరులపాలు కాకుండా చేయడానికి. ఎవరైనా ఎక్కడివారైనా ఇక్కడికి రావచ్చు, ఏమైనా చేసుకోవచ్చు కాని ఇచటి రాజకీయ పరమైన ఉన్నత పదవులు అంటే, ప్రధాన మంత్రి, ముఖ్యమంత్రిలాంటివి ఇక్కడి వారికే, లేక ఇక్కడ చిరకాలంగా నివసిస్తున్నా వారికే దక్కాలి అనే నిబంధనను చేసుకోవచ్చు. అప్పుడు తెలంగాణలోని విద్యావకాశాలు, ఉద్యోగావకాశాలు, భూమి వనరులు మున్నగువాటికిచెందిన యాజమాన్యతలు పూర్వం నుండి ఇచటే పుట్టి పెరిగిన వారికి లేక చాన్నాళ్ల నుండి ఇచ్చట స్థిరపడ్డవారికి మాత్రమే లభించేటట్లు చేయవచ్చు. ఆర్థిక స్థోమతే కదా అన్ని స్థోమ తల కంటే మిన్న. అలాంటి ఆర్థిక స్థోమత తగ్గుతుందేమో నని తెలంగాణా ప్రాంతం వారికున్న భయాందోళనలు, సందేహాలు సహజమే కదా! ఇప్పుడు గొడవంతా వస్తున్నది ఆ భయాందోళనల, సందేహాల వలననే కదా? తెలంగాణా వారి భయాందోళనలను, సందేహాలను నివారించాలంటే పవన్ కళ్యాణ్ వీటిని పట్టించుకోవలసుంటుంది. సిద్ధమేనా మరి! పవన్ కళ్యాణ్ కాస్తాగి వీటిగురించి సావధానంగా ఆలోచించి ముందడుగు వేయగలరా మరి?

(రచయిత: సీనియర్ స్వాతంత్ర్య సమరయోధులు)

# అమెరికా, ఇజ్రాయెల్ సంబంధాల్లో కొత్త అధ్యాయం

సీహెచ్ వి ప్రభాకర్ రావు

ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు అమెరికా కాంగ్రెస్ సభ్యుడు మార్లిన్ స్టుట్మనక్కు పంపిన లేఖ అమెరికా-ఇజ్రాయెల్ సంబంధాలపై ఒక కొత్త చర్చకు తెర తీసింది. ఆ లేఖలో నెతన్యాహు అమెరికా ఇజ్రాయిల్ రక్షణ సహకారాన్ని 'సహాయం నుండి భాగస్వామ్యం వైపు' మార్చాలి అని పేర్కొనడం, అమెరికా రాజకీయ, రక్షణ, ఇంటెలిజెన్స్ వర్గాల్లో ఆసక్తికరమైన చర్చలకు దారితీసింది. అమెరికా మీడియా నివేదికల ప్రకారం, నెతన్యాహు 'ఇజ్రాయెల్ ఇక భాగస్వామి కావాలి' అని స్పష్టంగా చెప్పినట్లు తెలుస్తోంది. దశాబ్దాలుగా అమెరికా ప్రతి సంవత్సరం ఇజ్రాయెల్‌కు సుమారు 3.8 బిలియన్ డాలర్ల సైనిక సహాయం అందిస్తోంది. కానీ ఇప్పుడు ప్రతిపాదన ఏమిటంటే, ఆ సహాయాన్ని క్రమంగా తగ్గించి, దాని స్థానంలో సంయుక్త రక్షణ ఉత్పత్తి, సంయుక్త పరిశోధన, సైబర్ భద్రత, కృత్రిమ మేధస్సు, క్షి పణి రక్షణ వ్యవస్థలు, డ్రోన్ సాంకేతికతలలో ఉమ్మడి పెట్టుబడులు పెట్టే భాగస్వామ్య నమూనాను రూపొందించడం. ఈ మార్పు పైకి చూస్తే అమెరికా, ఇజ్రాయెల్ సంబంధాలను మరింత బలోపేతం చేసే చర్యలా కనిపిస్తుంది. అయితే లోతుగా పరిశీలిస్తే ఇది కేవలం ఆర్థిక సహాయం తగ్గింపు కాదు. ఇదిశక్తి సంబం ధాల పునర్వ్యవస్థీకరణ. గతంలో అమెరికా నాయకత్వం వహించే సంబంధం ఉండగా, ఇప్పుడు ఇజ్రాయెల్ సమాన భాగస్వామిగా గుర్తింపు కోరుతోంది.అమెరికా భద్రతా వ్యవ స్థలో కొందరు అధికారులు ఈమార్పును జాగ్రత్తగా గమనిస్తున్నారు.కారణం సైనిక సహాయంకంటే సాంకేతికభాగస్వామ్యం మరింత లోతైనది. ఒకసారిరెండు దేశాల రక్షణ పరిశ్రమలు,ఏఐ, వ్యవస్థలు,సైబర్ నెట్వర్క్, క్షి పణి రక్షణ వ్యవస్థలు పరస్పరం అనుసంధానమైతే, సమాచారం ప్రవా హం కూడా విస్తృతమవుతుంది.అప్పుడు ప్రశ్నకేవలం సహా కారం గురించే కాదు,సున్నితమైన సాంకేతికతపై ఎవరి ప్రభావం ఎంత అన్నది కూడా కీలకమవుతుంది. చరిత్రలో అమెరికా, ఇజ్రాయెల్ మధ్య సంపూర్ణ విశ్వాసం మాత్రమే ఉండలేదు.మిత్రదేశాల మధ్యకూడా గూఢచర్య ఆరోపణలు, ఇంటెలిజెన్స్ వివాదాలు చోటుచేసు కున్నాయి. అందువల్ల అమెరికా కౌంటర్ ఇంటెలిజెన్స్ వర్గాల్లో కొందరు 'భాగస్వామ్యం ఎంత వరకు?' అనే ప్రశ్నను లేవనెత్తడం సహజమే. నెతన్యాహు ప్రతిపాదనను మరో కోణంలోచూస్తే,ఇది ఇజ్రాయెల్ వ్యూహాత్మక ఆత్మవిశ్వాసానికి సంకేతం, గతంలో సహాయం పొందిన దేశం ఇప్పుడు 'మేము నిలబడగలుగుతాం, కానీ భాగస్వామ్యంగా ముందుకు వెళ్తాం' అని చెబుతోంది. ఇదిఅమెరికా సహాయంపై ఆధారపడే మోడల్ నుండి, అమెరికా సాంకేతిక రక్షణవ్యవస్థలో కీలక భాగస్వామిగా మారే ప్రయత్నం. ఇక్కడ అమెరికా రాజకీయాల్లో మరో అంశం కూడా ఉంది. గత కొన్నేళ్లుగా అమెరికాలో విదేశీ సహాయంపై విమర్శలు పెరుగుతున్నాయి. అమెరికా పన్ను చెల్లింపుదారుల డబ్బుఎందుకు విదేశాలకు వెళ్తోందనే ప్రశ్న రిపబ్లికన్ వర్గాల్లో బలపడుతోంది. ఈ నేపథ్యంలో 'సహాయం నుండి భాగస్వామ్యం వైపు' మోడల్ రాజకీయంగా కూడా ఆకర్షణీయంగా మారింది. ఎందుకంటే ఇది సహాయం కొనసాగించడం కాదువాణిజ్యం, ఉమ్మడి పెట్టుబడులు,ఉమ్మడి ఉత్పత్తి అనే కొత్తభాషనుఉపయోగిస్తోంది. అమెరికాకు ఇది ఒక అవకాశం. అత్యాధునిక సాంకేతిక రంగాల్లో విశ్వసనీయ భాగస్వామ్యాన్ని మరింతగా ఉపయోగించుకోవడం. ప్రపంచ అగ్రరాజ్యంగా తన వ్యూహాత్మక స్వాతంత్ర్యాన్ని,సాంకేతిక ఆధిపత్యాన్ని,ఇంటెలిజెన్స్ భద్రతను కాపాడుకుంటూనే ఆభాగస్వామ్యాన్ని నిర్వహించడం.

# భూ ఆక్రమణదారులపై హైడ్రా కొరడా!

ఆర్.భాస్కర్ రెడ్డి

ఒక బృహత్తర లక్ష్యంతో భావితరాల ఉపయోగార్థం ముఖ్యంగా హైదరాబాద్ ప్రజల సంరక్షణార్థం కొరకు ఆస్తుల రక్షణ ,పర్యవేక్షణ విపత్తుల నిర్వహణ పకడ్బందీగా అమలు చేసే ఉద్దేశంతో హైడ్రాను ఏర్పాటు చేసి త్వరిత గతిన ఆక్రమణలు తొలగించి ప్రభుత్వం హైడ్రా ద్వారా భూములను స్వాధీనం చేసుకుంటుంది .ఇది అన్ని వర్గాలు స్వాగతించవలసిన విషయం. కానీ ఎన్నో విమర్శలు, మరెన్నో విన్నపాల మధ్య దాదాపు ఎనభై ఆరు వేల కోట్ల రూపాయల విలువైన ,రెండు వేల తొంభై మూడు ఎకరాల భూములను స్వాధీనం చేసుకుంది. ఇందులో చెరువులు, కుంటలు, సరస్సులు,నాలాలు, ప్రభుత్వ భూములు,ప్రజల పార్కులు ఉన్నాయి. ఈ ఆక్రమణ నిర్మాణాలను గమనిస్తే ఎక్కువగా రాజకీయ నాయకులు చేసినవి లేదా వారి అధి నాయకులు చేసినవే ఎక్కువగాఉన్నాయని స్పష్టమవుతుంది. పేదలు, బడుగు బలహీన వర్గాల ప్రజలను నమ్మించి వారి ద్వారా సొమ్ముచేసుకున్న భూములు కనబడుతున్నాయి. విచిత్రంగా అన్ని రాజకీయ పార్టీల నుండి, అన్ని రకాల వర్గాల ప్రజల నుండి, మొత్తంగా రాష్ట్రవ్యాప్తంగా హైడ్రా తీసుకునే చర్యలను స్వాగతిస్తున్నారు ఇది హర్షించదగిన సందర్భం. గతంలోనే తెలంగాణ హైకోర్టు మూసీ నది నాలాల వెంట దాదాపు 30 వేల నిర్మాణాలు వెలిశాయని వాటిని తొలగించి అక్కడ నివసించే ప్రజలకు పునరావాస చర్యలు తీసుకోవాలని ,అప్పుడే వరదలు తగ్గుముఖం పడ తాయని, నాళాలు సురక్షితంగా ఉంచాలని ప్రభుత్వానికి సూచించింది. కానీ ఇప్పటివరకు ఏ ప్రభుత్వం వాటిపై సరైన దృష్టి పెట్టిన దాఖలు లేవు. వర్షాకాలం వచ్చిందంటే హైదరాబాదు నగర జీవనం అష్ట కష్టాలు పడుతూ జీవించాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. రోడ్లన్నీ జలాశయాలను తలపిస్తూ విపరీతమైన ట్రాఫిక్ అంతరాయం కలుగుతుంది. భారీ వర్షాలు పడిన సందర్భంలో ఎప్పుడూ ,ఎక్కడ, ఏ ప్రమాదం సంభవిస్తుందో అనే సందేహం, భయం ఉత్పన్నమవుతుంది. వీటన్నింటి అనర్థాలకు నాళాలు, చెరువులు, కుంటలు కబ్జా చేసిన పుణ్యఫలమే అని అందరికీ తెలుసు. ఈ మధ్యకాలంలో నాలాలలో పాఠశాల విద్యార్థులు పడి చనిపోయిన ఉదంతాలు చాలా జరిగాయి. కానీ ఏడు దశాబ్దాలుగా సినిమా సన్నివేశాల లాగా చూస్తూ ఉన్న ప్రభుత్వ పాలన శాఖలు కబ్జా కోరల నుండి రక్షణ కల్పించకపోగా, ఆక్రమణదారులకు రక్షణగా నిలిచి పర్యవేక్షణ చేశాయి. కానీ ఈ మధ్యే తెలంగాణ ప్రభుత్వం మూసి నాల అభివృద్ధి కార్యక్రమం పేరుతో మూసి నది పరివాహక ప్రాంతాన్ని అభివృద్ధి చేయడానికి పథకాన్ని రూపొందించింది. ఆక్రమణలు,కబ్జాలే కాక అనేక సమస్యలకు నిలయంగా మారిన కూడా హైదరాబాద్ ఒక విశ్వనగరంగావర్ధిల్లుతుంది.



అనేక రకాల మతాల, కులాల, ప్రాంతాల, భాషల,వివిధ దేశాల ప్రజలు కలిసిమెలిసి బ్రతుకుతూ బహుళ సంస్కృతిని ఏర్పరిచినారు. హైదరాబాద్ నగరానికి అనేక పేర్లు ఉన్నాయి. కానీ చెరువుల నగరం,తోటల నగరం అనే పేరు కూడా ఉండేదని చారిత్రకంగా అవగతం అవుతుంది. ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ ట్రైనింగ్ అండ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ అధ్యయనం ప్రకారం, హైదరాబాద్ నగరంలో సుమారు 140 పెద్ద చిన్న సరస్సులు ఉన్నాయి. మరో 834 నీటి ట్యాంకులు 25ఎకరాల కంటే తక్కువ విస్తీర్ణంలో ఉన్నాయి. కానీ హుడా సరస్సుల పరిరక్షణ ప్రణాళిక, క్రింద 2018 మే నాటికి కేవలం 169 సరస్సుల రికార్డులను మాత్రమే నిర్వహిస్తుంది. అనగా నగరంలోని నీటి వనరులు, ఇతర నీటి వనరుల ఉపరితల వైశాల్యం తగ్గుతూ వస్తుంది.అలాగే నగరంలో రియల్ ఎస్టేట్ లేదా పట్టణీకరణ వేగవంతమైన వృద్ధి వలన వేలాది ట్యాంకులు అంతరించిపోయాయి. ఉదాహరణకు అఫ్జల్ సాగర్, కుంట భవాని దాస్ ,మాసబ్ ట్యాంక్ ,మీరు జుమ్లా ట్యాంక్,నల్లకుంట ,నవాబ్ సాహెబ్ కుంట, సోమాజిగూడ ట్యాంక్, తీగలకుంట కను మరుగయ్యాయి. 1990లో హుస్సేన్ సాగర్ చెరువు 1375 ఎకరాలుగా ఉండేది. ఆక్రమణకు గురై ఈ ప్రాంతంప్రస్తుతం 825 ఎకరాలకు మాత్రమే పరిమితమై ఉంది. అలాగే నగరంలో 1973 నుండి 1996 కాలంలో పట్టణ ఆక్రమణ కాలుష్యం కారణంగా హైదరాబాద్ పది హెక్టార్ల కంటే ఎక్కువ పరిమాణంలో ఉన్న 18 నీటి వనరులను పది హెక్టార్ల కంటే తక్కువ పరిమాణంలో ఉన్న 80 చిన్న నీటి వనరులను కోల్పోయింది. అలాగే కేంద్ర జలవనరుల శాఖ సర్వే ప్రకారం,చిన్న నీటి వనరుల ఆక్రమణలలో దేశంలో నాలుగో స్థానంలో తెలంగాణ రాష్ట్రం ఉంది. బ్రాండ్ హైదరాబాద్ పేరును నిలబెట్టుకోవడానికి కావలసిన మౌలిక సదుపాయాలను కల్పిస్తూ, ప్రభుత్వ భూమి ఆక్రమణలకు తావు లేకుండా చేసి ప్రపంచ పెట్టుబడులను ఆకర్షించేలా, పరిశ్రమలను నెలకొల్పేలా, ప్రజాపాలన అందించేలా, ప్రభుత్వం పారదర్శకంగా, జవాబుదారీతనంగా నిర్ణయాలు తీసుకోవాలి. వీటిని నెరవేర్చడానికి హైడ్రా తోడ్పాటు అందిస్తుందని ఆశలు చిగురిస్తున్నాయి. కానీ ఇది వానాకాలం వరకే పరిమితం కాకుండా, రాజకీయ కోణంలో చూడకుండా, 365 రోజులు పనిచేసేలా చర్యలు తీసుకోవాలి. అలాగే హైడ్రాను తెలంగాణ మొత్తంపరిరక్షించే విధంగా చట్టంలో మార్పు తీసుకు రావాలి. గ్రామీణ స్థాయి నుండి పట్టణ స్థాయి వరకు జరుగుతున్న భూ కబ్జాలను గుర్తించి పేద వారికి న్యాయం చేయాలి. ఏడు దశాబ్దాలుగా ఆక్రమణలకు గురైన ప్రభుత్వ భూములను గుర్తించడానికి ఒక మంత్రివర్గ ఉప సంఘం నియమించి కబ్జాదారుల నుండి విడిపించుకోవాలి. అలాగే ఆస్తుల సంరక్షణకే పరిమితం కాకుండా విపత్తుల నిర్వహణ బాధ్యత కూడా హైడ్రా పై ఉన్నందున నగరంలో అనుమతుల్లేని నిర్మాణాల పైన ఉక్కుపాదం మోపాలి. ము ఖ్యంగా గత దశాబ్దకాలంగా వెల్లివిరిసిన అక్రమ నిర్మాణా లను వెంటనే గుర్తించి తగు చర్యలు తీసుకోవాలి. అనుమతి లేని నిర్మాణాల వలన ఆ నిర్మాణాల సమయంలో అగ్ని ప్రమాదాలు తావు లేకుండా చేయాల్సిన అత్యవసర మార్గాలను ఏర్పాటు చేయని కారణంగా అనేకమంది అమాయకులు ప్రాణాలు పోయిన సందర్భాలు ఈ మధ్యకాలంలో చాలా బయటపడినాయి. గత ప్రభుత్వం ప్రారంభించిన స్ట్రాటజిక్ నాలా డెవలప్మెంట్‌ను ముందుకు తీసుకెళ్తూ, మూసీ నది సుందరీకరణ ప్రాజెక్టును తక్షణమేప్రారంభించి, హైదరాబాదును అంతర్జాతీయ స్థాయిలో పెట్టుబడులను ఆకర్షించే నగరంగా, పర్యావరణహితంగా, సమగ్ర, సుస్థిర, సమ్మిళిత అభివృద్ధి జరిగేలా అన్నిరకాల చర్యలు తీసుకుం

9-6Pg5exH.qxd:9-6Pg5exH.qxd 1/1/02 5:47 AM Page 1



# చైనా, భారత్, పాక్ వద్ద మరిన్ని అణ్వాయుధాలు

## 'సిప్రి' నివేదికలో వెల్లడి

**న్యూఢిల్లీ, జూన్ 8:** 2025లో భారత్, పాకిస్థాన్ దేశాలు కొత్త తరహా అణ్వాయుధ డెలివరీ వ్యవస్థలను అభివృద్ధి చేసినట్లు ఓ నివేదిక ద్వారా తెలిసింది. బాలిస్టిక్ క్షిపణులకు వార్ హెడ్స్‌ను అమర్చే సామర్థ్యాన్ని కూడా ఆ దేశాలు పెంచుకున్నట్లు స్టాక్‌హోమ్ ఇంటర్నేషనల్ పీస్ రీసర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఎస్ఐపిఆర్ఐ) తన నివేదికలో పేర్కొన్నది. భారత్, చైనా దేశాలు తమ వద్ద ఉన్న అణ్వస్త్రాల సంఖ్యను పెంచుకున్నట్లు ఆ నివేదికలో చెప్పారు. దీంతోపాటు వార్‌హెడ్స్ ఉన్న అణ్వాయుధాలను వ్యూహాత్మక ప్రాంతాలకు తరలించినట్లు తెలుస్తోంది. జనవరి 2026 నాటికి భారత్ వద్ద సుమారు 190 న్యూక్లియర్ వెపన్స్ ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. గత యేడాదితో పోలిస్తే సంఖ్య స్వల్పంగా పెరిగింది. ఇక చైనా వదనద నిల్వల్లో 620 వార్‌హెడ్స్ ఉన్నాయి. గత యేడాది ఆ దేశం వద్ద 600 మాత్రమే ఉండే అని స్టాక్‌హోమ్ రీసర్చ్ సంస్థ తెలిపింది. భారత్ తన యుద్ధ విమానాలు, నేల నుంచి ప్రయోగించే క్షిపణులు, అణ్వాయుధ సామర్థ్యం కలిగిన జలంతార్గామిలకు న్యూక్లియర్ వెపన్స్‌ను అమర్చినట్లు కూడా ఆ రిపోర్టులో పేర్కొన్నారు. ఇంకా అదనపు క్షిపణుల కోసం మరి కొన్ని వార్‌హెడ్స్‌ను కూడా తయారుచేస్తున్నట్లు సిప్రి తన నివిదేకలో చెప్పింది. ఆ వార్‌హెడ్స్ ఉన్న క్షిపణులను కంటెయినర్లకు తరలిస్తున్నట్లు కూడా రిపోర్టులో చెప్పారు. స్టాక్‌హోమ్ సంస్థ అంచనాల ప్రకారం.. 2026 జనవరి నాటికే స్వల్ప సంఖ్యలో ఉన్న వార్ హెడ్స్‌ను ఇండియా తన జలాంతర్గాములకు తరలించినట్లు తెలుస్తోంది.




# ఇక 2 నెలలకోసారి 'ఇండియా కూటమి' భేటీ

## కూటమి నుంచి వైదొలగినట్లు ఆప్, డిఎంకె ప్రకటన

## 23 పార్టీల ప్రతినిధులు హాజరు

## తదుపరి సమావేశం హైదరాబాద్‌లో నిర్వహణ

**న్యూఢిల్లీ, జూన్ 8:** 2024 లోక్‌సభ ఎన్నికల తర్వాత తొలిసారిగా ఇండియా కూటమి పక్షాల నేతలు సమావేశమయ్యారు. దేశ రాజధాని ఢిల్లీలోని కానిస్టిట్యూషన్ క్లబ్‌లో నిర్వహించిన ఈ సమావేశానికి 23 పార్టీలకు సంబంధించి 27 మంది ప్రతినిధులు హాజరయ్యారు. డిఎంకె, ఆప్ పార్టీలు ఇండియా కూటమి సమావేశానికి దూరంగా ఉన్నాయి. రాజ్యసభ సభ్యుడు, మాజీ కాంగ్రెస్ పార్టీ నేత కపిల్ సిబల్ కూడా హాజరయ్యారు. శివసేన (యుబిటి) అధ్యక్షుడు ఉద్ధవ్ థాకరే వర్చువల్‌గా ఇండియా కూటమి సమావేశంలో పాల్గొన్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అధ్యక్షత వహించగా, ఆ పార్టీ తరఫున అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, కెసి వేణుగోపాల్ హాజరయ్యారు. సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్, టిఎంసి అధినేత్రి మమతాబెనర్జీ, ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ, ఆర్‌జెడి అగ్రనేత తేజస్వి యాదవ్, నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు ఒమర్ అబ్దుల్లా, పిడిపి అధ్యక్షుడు మొహబూబా ముఫ్తి, జెఎంఎం పార్టీ తరఫున సర్ఫరాజ్ అహ్మద్, ఎన్‌సిపి (ఎస్‌పి) సుప్రియా సూలే, సిపిఎం తరఫున జాబ్ బ్రిట్టాస్, సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి. రాజా, సిపిఐ ఎంఎల్ సీనియర్ నాయకుడు దీపాంకర్ భట్టాచార్య, ఆర్‌ఎస్‌పి నేత ఎన్‌కె ప్రేమచంద్రన్, ఐయుఎంఎల్ నేత సాధిఖ్ థంగల్, విసికె నేత తిరుమవలవన్, ఎండిఎంకె అధ్యక్షుడు డి.వైకో, కేరళ కాంగ్రెస్ అధ్యక్షుడు కె.జార్జ్, కేరళ కాంగ్రెస్ (ఎం) నేత జోస్ కె మణి, ఆర్‌ఎల్‌పి హనుమాన్ బెనివాల్, లోక్ దల్ నేత సునీల్ సింగ్, ఫార్వార్డ్ బ్లాక్ కార్యదర్శి జి.దేవరాజన్, శెట్కారి కమ్‌గర్ పకాష్ నేత జయంత్ పాటిల్ ఇండియా కూటమి సమావేశానికి హాజరయ్యారు. ప్రస్తుతంలో దేశంలో నెలకొన్న తాజా రాజకీయ పరిస్థితులు, ఎన్‌డియే ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై చర్చించారు. ప్రధానంగా ప్రతిపక్షాలను లక్ష్యంగా చేసుకుని ఆయా పార్టీలను నిర్వీర్యం చేసే చర్యలను ఇండియా కూటమి తీవ్రంగా ఖండించింది. అంతకుముందు, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే తన ప్రారంభోపన్యాసంలో, ఆర్థిక వ్యవస్థ నిర్వహణలో అసమర్థత, లోపభూయిష్టమైన విదేశాంగ విధానం కారణంగా దేశాన్ని ప్రమాదకరమైన స్థితిలోకి నెట్టినందుకు కేంద్రంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ప్రభుత్వ నిర్ణయాల వల్ల కోట్లాది మంది ఓటు హక్కును కోల్పోతున్నారని ఖర్గే ఆరోపించారు. బిజెపి పాలిత రాష్ట్రాల్లో బలహీన వర్గాలపై అఘాయిత్యాలు అడ్డూఅదుపు లేకుండా సాగుతున్నాయని మండిపడ్డారు. అంతేకాదు రాజ్యాంగంపై నిరంతరం దాడి జరుగుతోందని ఆరోపించారు. ప్రతిపక్షాలు ఐక్యంగా ఉంటే ఎన్‌డియే ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను అడ్డుకోవచ్చన్నారు. తాజాగా పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో డీలిమిటేషన్‌పై మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిన బిల్లులను ఓడించామని గుర్తు చేశారు. ఈ విషయంలో మన సంఘీభావం, ఐక్యతను ప్రదర్శించామన్నారు. ఇప్పుడు ఆ భావనను మరింత బలపరచాలన్నారు. మోడీ ప్రభుత్వం పాలన కారణంగా దేశం ఎదుర్కొంటున్న అనేక సమస్యలను పరిష్కరించేందుకు ఇండియా కూటమిని ముందకు తీసుకెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. తద్వారా రాజకీయ, ఆర్థిక, సమాజిక విదేశంగా విధానాలకు సంబంధించిన సవాళ్లను ఎదుర్కోవచ్చన్నారు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికలలో ఎదురైన భారీ పరాజయం నేపథ్యంలో జరిగిన ఈ సమావేశంలో, కూటమిని బలోపేతం చేసే మార్గాలపై కూడా చర్చించారు. ఇండియా కూటమిలోని పార్టీలన్నీ ప్రతి రెండు నెలలకోసారి సమావేశం కావాలని నిర్ణయించారు. తదుపరి సమావేశం ఆగస్టులో హైదరాబాద్‌లో జరగనుంది. అంతేకాకుండా, పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభమైనప్పుడు, ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున్ ఖర్గే కార్యాలయంలో ప్రతి ఉదయం ఒక సమన్వయ సమావేశం జరుగుతుంది. అక్కడ, ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన అంశాలపై అచంచలమైన దృష్టితో, ఐక్యంగా కేంద్రాన్ని ఎదుర్కోవడంపై ఇండియా బ్లాక్ చర్చించాలని తీర్మానించింది.

తమిళనాడులో టివికె నేతృత్వంలోని జోసెఫ్ విజయ్ సంకీర్ణ ప్రభుత్వంలో కాంగ్రెస్ పార్టీ భాగస్వామ్యంగా ఉన్నప్పటికీ, ఇండియా కూటమి సమావేశానికి టివికెను ఆహ్వానించలేదు. దీంతో ఆ పార్టీ తరఫున ఇండియా కూటమి భేటికి ఎవరూ హాజరుకాలేదు.

మరోవైపు నిన్నటి వరకు ఇండియా కూటమిలో క్రియాశీలకంగా ఉన్న డిఎంకె, ఇటీవల తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాల అనంతరం చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో ఇండియా కూటమి నుంచి డిఎంకె వైదొలగింది. ఈ మేరకు డిఎంకె ప్రకటన విడుదల చేసింది. అటు ఆమ్ ఆద్మీ పార్టీ కూడా ఇండియా కూటమిలో తాము లేమని స్పష్టంగా వెల్లడించింది. దీంతో ఇండియా కూటమి సమావేశానికి డిఎంకె, ఆప్‌లు దూరంగా ఉన్నాయి.





# సిఎం విజయ్ సర్కార్‌పై డిఎంకె స్టాలిన్ ధ్వజం

**చెన్నై,జూన్ 8:** తమిళనాడులో కొత్తగా కొలువుదీరిన టీవీకే ప్రభుత్వంపై డీఎంకే అధినేత, మాజీ ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ నేతృత్వంలోని ఈ ప్రభుత్వం మూడు నెలల కన్నా ఎక్కువ కాలం మనుగడ సాగించలేదని ఆయన జోస్యం చెప్పారు. రాష్ట్రంలో గత 60 ఏళ్లలో డీఎంకే, అన్నాడీఎంకేయేతర పార్టీ అధికారంలోకి రావడం ఇదే తొలిసారి. మే నెలలో విజయ్ సీఎంగా ప్రమాణస్వీకారం చేసిన విషయం తెలిసిందే. మాజీ వీసీకే ఎమ్మెల్యే పనైయూర్ బాబు, ఆయన మద్దతుదారులు డీఎంకేలో చేరారు. ఈ సందర్భంగా స్టాలిన్ మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వం గురించి తాను ఎక్కువగా చెప్పనవసరం లేదన్నారు.



# బెంగాల్ 'పుష్ప' జహంగీర్‌ఖాన్ అరెస్టు

కోల్‌కత్తా,జూన్ 8: పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో 15 ఏళ్ల తృణమూల్ కాంగ్రెస్ సుదీర్ఘ పాలనకు తెరపడి, కొత్త ప్రభుత్వం ఏర్పడిన నెల రోజులకే ఒక సంచలన అరెస్ట్ నమోదైంది. పశ్చిమ బెంగాల్ స్పెషల్ టాస్క్ ఫోర్స్ జరిపిన మెరుపు దాడిలో తృణమూల్ కాంగ్రెస్ కీలక నేత, మాజీ అభ్యర్థి జహంగీర్ ఖాన్ భారత్‌నేపాల్ సరిహద్దుల్లో అరెస్టయ్యారు. కలకత్తా హైకోర్టు ఆయనకు ముందస్తు బెయిల్ లేదా రక్షణ పొడిగించేందుకు నిరాకరించడంతో ఎస్టీఎఫ్ ఈ చర్య తీసుకుంది. మే 4న ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత ఆయనపై ఐదు కొత్త పోలీస్ కేసులు నమోదయ్యాయని కోర్టు ఈ సందర్భంగా గుర్తుచేసింది. మమతా బెనర్జీ మేనల్లుడు, డైమండ్ హార్బర్ ఎంపీ అభిషేక్ బెనర్జీకి జహంగీర్ ఖాన్ అత్యంత ఆప్తుడు. డైమండ్ హార్బర్ పరిధిలోని ఫాల్తా నియోజకవర్గంలో జహంగీర్ ఖాన్ వర్గీయులు భయాందోళనలు సృష్టిస్తున్నారనే ఆరోపణలు వచ్చాయి.

# ఫిలిప్పీన్స్‌లో భారీ భూకంపం.. నలుగురు మృతి

## 200 మందికి గాయాలు, సునామీ హెచ్చరికలు జారీ



**మనీలా, జూన్ 8:** ఫిలిప్పీన్స్‌లో సోమవారం ఉదయం భారీ భూకంపం సంభవించింది. ఉదయం 7.37 గంటల సమయంలో 7.8 తీవ్రతతో దక్షిణ ఫిలిప్పీన్స్‌లో ఈ భారీ భూకంపం వచ్చింది. దీని ప్రభావంతో నలుగురు మరణించారు. 200 మందికిపైగా గాయపడ్డారు. ఫిలిప్పీన్స్ భూకంపాలు రావడం సాధారణమే. అయితే, వాటి తీవ్రత చాలా తక్కువగా ఉంటుంది. కానీ, ఈసారి భూకంపం మాత్రం ఈ యేడాదిలోనే చాలా పెద్దది. ఈ భూకంప కేంద్రం ఫిలిప్పీన్స్, నైరుతి జనరల్ శాంటోస్ నగరానికి దక్షిణాన ఉన్న మిండానో ప్రాంతంలో కేంద్రీకృతమైందని అంతర్జాతీయ మీడియా తెలిపింది. భూకంప ప్రభావంతో సునామీకి కూడా అవకాశం ఉందని అధికారులు తెలిపారు. భూకంపం తీవ్రతతో చాలా భవనాలు, రహదారులు, వంతెనలు ధ్వంసమయ్యాయి. కొన్ని స్వల్పంగా ధ్వంసమైతే, ఇంకొన్ని పూర్తిగా ధ్వంసమయ్యాయి. రవాణా, జనజీవనం స్తంభించింది. ఫిలిప్పీన్స్‌తోపాటు ఇండోనేసియా, మలేసియాకు కూడా సునామీ హెచ్చరికలు జారీ అయ్యాయి. ఆయా దేశాల్లోని తీరప్రాంత ప్రజలను సురక్షిత ప్రదేశాలకు వెళ్లాల్సిందిగా ప్రభుత్వాలు సూచించాయి. కూలిన శిథిలాల కింద ఎంతమంది ఉన్నారనే విషయంపై ఇంకా అధికారుల నుంచి ఎలాంటి స్పష్టత లేదు. భూకంప ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. జనరల్ శాంటోస్ నగరంలోని ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టును తాత్కాలికంగా మూసివేశారు. దీంతో పలు విమానాలు రద్దయ్యాయి. భూకంపం కారణంగా జనరల్ శాంటోస్ నగరంలో స్కూళ్లలోని విద్యార్థులను ఉన్నట్లుండి తరలిస్తున్న క్రమంలో పలువురు విద్యార్థులు గాయపడ్డారు. అనేక ప్రాంతాలకు సునామీ హెచ్చరికల నేపథ్యంలో అక్కడి అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. సుల్తాన్ కుదారత్, సారంగాణి వంటి ప్రాంతాల్లో మానిటరింగ్ సెంటర్లలో సునామీ పరిస్థితిని సమీక్షిస్తున్నారు.

# నార్వే చెస్ ఛాంపియన్ ప్రజ్ఞానందకు సిఎం విజయ్

## రూ.50 లక్షల నగదు బహుమతి అందచేత



**చెన్నై,జూన్ 8:** నార్వే చెస్ టోర్నమెంట్‌లో చారిత్రక విజయం సాధించిన యువ చెస్ సంచలనం, గ్రాండ్‌మాస్టర్ ఆర్. ప్రజ్ఞానందను తమిళనాడు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ సోమవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయనకు రూ. 50 లక్షల నగదు పురస్కారాన్ని అందజేశారు. ప్రజ్ఞానందతో సీఎం విజయ్ కాసేపు సరదాగా చెస్ ఆడి ఆయన్ను ఉత్సాహపరిచారు. ఈ ఆసక్తికర ఘటన అక్కడున్న వారిని ఆకట్టుకుంది. ఓస్లోలో జరిగిన ఈ ప్రతిష్ఠాత్మక టోర్నీలో టైటిల్ గెలిచిన మొట్టమొదటి భారతీయుడిగా ప్రజ్ఞానంద చరిత్ర సృష్టించాడు. టోర్నీలో భాగంగా ఆయన ప్రపంచ నంబర్ 1, సొంతగడ్డ ఆటగాడైన మాగ్నస్ కార్ల్‌సెన్‌పై క్లాసికల్ ఫార్మాట్‌లో రెండుసార్లు గెలిచి అరుదైన ఘనత సాధించాడు. ప్రపంచ ఛాంపియన్ డి. గుకేశ్‌పై కూడా కీలక విజయం నమోదు చేసి తన సత్తా చాటాడు. అంతర్జాతీయ వేదికపై దేశానికి, రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచిన ప్రజ్ఞానంద మేధస్సును, సంయమనాన్ని సీఎం విజయ్ ప్రత్యేకంగా అభినందించారు. తమిళనాడు క్రీడాభివృద్ధి ప్రాధికార సంస్థ తరఫున రూ. 50 లక్షల చెక్కుతో పాటు జ్ఞాపికను సీఎం విజయ్ బహూకరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు ఆధవ్ అర్జున, క్రీడాభివృద్ధి సంస్థ సభ్య కార్యదర్శి జె. మేఘనాథ రెడ్డి, ప్రజ్ఞానంద తల్లిదండ్రులు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. జూన్ 1న విడుదలైన ర్యాంకింగ్స్‌లో 16వ స్థానంలో ఉన్న ప్రజ్ఞానంద, నార్వే చెస్‌లో అద్భుతమైన ప్రదర్శన కనబరిచాడు. టోర్నీలో ఆరో రౌండ్ ముగిసేసరికి చివరి స్థానంలో నిలిచి, అనూహ్యంగా పుంజుకున్నాడు. వరుసగా నాలుగు గేమ్‌లలో గెలిచి టైటిల్ రేసులోకి దూసుకొచ్చాడు. చివరి రౌండ్‌లో విన్సెంట్ కీమర్‌పై గెలిచి మొత్తం 18 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచి టైటిల్‌ను కైవసం చేసుకున్నాడు. 2021లో కార్ల్‌సెన్ తర్వాత ఒకే ఈవెంట్‌లో వరుసగా నాలుగు గేమ్‌లు గెలవడం ఇదే తొలిసారి.



# లాస్‌ఏంజిల్స్ మేయర్ రేసులో దూసుకెళ్తున్న నిత్యారామన్

**లాస్ ఏంజిల్స్, జూన్ 8:** అమెరికాలో భారతీయ సంతతి మహిళ నిత్యారామన్.. లాస్‌ఏంజిల్స్ మేయర్ ఎన్నిక రేసులో దూసుకెళ్తున్నారు. నవంబరులో జరిగే ఆ ఎన్నికల గురించి అప్పుడే యుద్ధం మొదలైంది. ఓ మీడియా సంస్థ నివేదిక ప్రకారం.. నిత్యారామన్ ఓటర్లను ఆకర్షిస్తున్నారు. లాస్ ఏంజిల్స్ కౌంటీలో ఉన్న సుమారు 48 వేల ఓట్లలో ఆమె ఆదివారం నాటికి 40 శాతం ఓట్లను గెలుచుకున్నట్లు తెలుస్తోంది. ప్రత్యర్థి ప్రాట్ కన్నా 10 వేల అధిక ఓట్లను ఆమె కైవసం చేసుకున్నట్లు ఓ రిపోర్టు ద్వారా తెలిసింది. కేరన్ బ్రాస్, స్పెన్సర్ ప్రాట్‌పై జూన్ 2న జరిగిన ప్రైమరీలో అత్యధిక ఓట్లను సాధించింది. దీంతో నిత్యారామన్ ఓట్ షేర్‌లో 5 పాయింట్లతో ముందున్నారు. రిపబ్లికన్ పార్టీ తరఫున ప్రాట్ పోటీ చేస్తుండగా, నిత్యారామన్ మాత్రం ప్రోగ్రెసివ్ అభ్యర్థిగా పోటీ పడుతున్నారు.

# మైనర్ బాలికపై సామూహిక లైంగిక దాడి

**కోల్‌కత్తా,జూన్ 8:** నగరంలోని దుర్గాపూర్ సిటీ సెంటర్ పరిధిలో ఎనిమిదో తరగతి చదువుతున్న 14 ఏళ్ల బాలికపై జరిగిన సామూహిక అత్యాచార ఘటనలో పోలీసులు స్పందించారు. ఈ దారుణానికి ఒడిగట్టిన ఇద్దరు ప్రధాన నిందితులతో పాటు వారికి సహకరించిన ఒక మహిళను, నిబంధనలకు విరుద్ధంగా గదిని కేటాయించిన హోటల్ మేనేజర్‌ను కలిపి మొత్తం నలుగురిని అసంసోల్‌దుర్గాపూర్ పోలీసులు అరెస్ట్ చేశారు. మరో నిందితుడు పరారీలో ఉన్నాడు. రెండురోజులక్రితం మధ్యాహ్నం 1:30 గంటల ప్రాంతంలో బాధితురాలి కుటుంబానికి తెలిసిన సిమ్రాన్ తమాంగ్ అనే మహిళ బాలికను మాయమాటలతో నమ్మించి ఇంటి నుంచి బయటకు తీసుకువచ్చింది. ఆ తర్వాత నిందితులు బాలికను కారులో ఎక్కించుకుని, అందులోనే బలవంతంగా కూల్ డ్రింక్‌లో మత్తుమందు, మద్యం కలిపి తాగించారు. బాలిక స్పృహ కోల్పోగానే కవిగురు ప్రాంతంలోని ఒక హోటల్‌కు తీసుకెళ్లి రాజ్ మల్లిక్, షేక్ అజారుద్దీన్‌తోపాటు మరికొందరు ఆమెపై అత్యాచారానికి పాల్పడినట్టు బాధిత బాలిక తండ్రి ఆరోపించారు. ఈ ఘాతుకం తర్వాత రాత్రి 10:30 గంటల సమయంలో నిందితులు బాలికను బైపాస్ రోడ్డు పక్కన పడేసి పారిపోయారు. తీవ్ర అస్వస్థతతో రోడ్డుపై పడి ఉన్న బాలికను ఒక ఈ రిక్షా డ్రైవర్ గుర్తించి, మానవత్వంతో ఆమెను సురక్షితంగా ఇంటికి చేర్చాడు.

## ఇరాన్ నుంచి వచ్చేయండి! - అక్కడి భారతీయులకు కేంద్రం సూచన

**న్యూఢిల్లీ,జూన్ 8:** పశ్చిమాసియాలో ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మరోసారి తీవ్ర స్థాయికి చేరడంతో భారత ప్రభుత్వం అప్రమత్తమైంది. ఈ నేపథ్యంలో ఇరాన్‌కు ప్రయాణాలు మానుకోవాలని, ఇప్పటికే అక్కడ ఉన్నవారు వెంటనే దేశం విడిచి వచ్చేయాలని తన పౌరులకు నేడు మరోసారి సూచించింది. ఈ మేరకు టెహరాన్‌లోని భారత రాయబార కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. ఈ ప్రాంతంలోని తాజా పరిణామాల దృష్ట్యా ఇరాన్‌కు ఎలాంటి ప్రయాణాలు చేయవద్దని మా పాత సలహాను పునరుద్ఘాటిస్తున్నాం. ప్రస్తుతం ఇరాన్‌లో ఉన్న భారత పౌరులు కూడా అందుబాటులో ఉన్న రవాణా మార్గాల ద్వారా దేశం విడిచి వెళ్లాలని సూచిస్తున్నామని ఎంబసీ తన ప్రకటనలో స్పష్టం చేసింది. ఇటీవల ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య దాడులు, ప్రతిదాడులు పెరిగాయి.

ఇరాన్‌లోని మహ్‌షహర్ ప్రాంతంలో ఉన్న పెట్రోకెమికల్ కాంప్లెక్స్‌పై దాడి చేసినట్లు ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ (ఐడీఎఫ్) ప్రకటించింది. మరోవైపు, సోమవారం ఉదయం ఇజ్రాయెల్‌పై ఇరాన్ ప్రయోగించిన క్షిపణులన్నింటినీ విజయవంతంగా అడ్డుకున్నామని ఐడీఎఫ్ తెలిపింది. ఈ దాడుల నేపథ్యంలోనే భారత్ ఈ ట్రావెల్ అడ్వైజరీని జారీ చేసింది. ఇజ్రాయెల్ గనక దక్షిణ లెబనాన్‌పై దాడులు కొనసాగిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని, ఇజ్రాయెల్, దాని మద్దతుదారులపై వినాశకరమైన దాడులు తప్పవని ఇరాన్ కమాండర్ అలీ అబ్దుల్లాహీ హెచ్చరించారు.

# హార్ముజ్‌ను తెరుస్తాం.. కానీ ఫీజు తప్పదు!

## నిబంధనలు యధాతథంగా అమలు చేస్తామన్న ఇరాన్

**టెహ్రాన్,జూన్ 8:** అంతర్జాతీయంగా ముడిచమురు, సహజ వాయువు రవాణాకు అత్యంత కీలకమైన హార్మూజ్ జలసంధి భవిష్యత్తుపై ఇరాన్ కీలక ప్రకటన చేసింది. కొన్ని నెలలుగా కొనసాగుతున్న యుద్ధ ఉద్రిక్తతల కారణంగా పాక్షికంగా మూతబడిన ఈ జలసంధిని అంతర్జాతీయ నౌకల రాకపోకల కోసం తెరిచే ఉంచుతామని, అయితే కొత్త నిబంధనలు వర్తిస్తాయని ఇరాన్ స్పష్టం చేసింది. రష్యాలోని ఇరాన్ రాయబారి కాజెం జలాలీ సోమవారం రష్యా వార్తాపత్రిక ఇజ్వెస్టియాతో మాట్లాడుతూ ఇరాన్, ఒమన్ దేశాలు సంయుక్తంగా రూపొందించే సరికొత్త ఫ్రేమ్‌వర్క్ ఆధారంగానే ఈ జలసంధిలో రవాణా సాగుతుందని వెల్లడించారు. ఈ కొత్త నిబంధనలలో భాగంగా హార్మూజ్ జలసంధి గుండా ప్రయాణించే వాణిజ్య నౌకలపై ట్రాన్సిట్ ఫీజు విధించనున్నారు. ప్రపంచ వ్యాప్తంగా సరఫరా అయ్యే చమురులో ఐదో వంతు ఈ సముద్ర మార్గం నుంచే వెళ్తుంది. మార్చి 2026 లో ఇరాన్ ఈ జలసంధిని మూసివేయడంతో గ్లోబల్ ఎనర్జీ మార్కెట్ తీవ్రంగా దెబ్బతింది. ఇప్పుడు దీనిని పూర్తిగా పునరుద్ధరించడానికి సిద్ధమవుతున్నప్పటికీ ఇరాన్, ఒమన్ దేశాలు అక్కడ అందించే రక్షణ, నిఘా, సెర్చ్ అండ్ రెస్క్యూ (సహాయక చర్యల) సేవలకు గానూ ఈ ఫీజులను వసూలు చేయనున్నట్లు రాయబారి పేర్కొన్నారు. ఇరాన్ ప్రతిపాదిస్తున్న ఈ రవాణా రుసుములపై అంతర్జాతీయంగా భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అంతర్జాతీయ సముద్ర చట్టాల ప్రకారం హార్మూజ్ జలసంధిలో ఎలాంటి ఆంక్షలు లేకుండా ఉచితంగా నౌకలు ప్రయాణించే హక్కు ఉందని అమెరికా వాదిస్తోంది. ఇరాన్‌కు ఎలాంటి ఫీజులు చెల్లించవద్దని, ఈ వసూళ్ల దందాలో భాగస్వామి కావద్దని ఒమన్‌ను కూడా అమెరికా హెచ్చరించింది. యుద్ధ భయాలు, బీమా ప్రీమియంలు పెరిగిపోవడం, ప్రయాణంలో ఆలస్యం కావడం కంటే ఇరాన్‌కు కొంత ఫీజు చెల్లించి సురక్షితంగా వెళ్లడమే మేలని కొన్ని అంతర్జాతీయ షిప్పింగ్ కంపెనీలు భావిస్తున్నాయి. ఈ ఫీజులు నౌక పరిమాణం, మోసుకెళ్లే సరుకును బట్టి ఒక్కో నౌకకు గరిష్టంగా 2 మిలియన్ డాలర్ల (దాదాపు రూ. 16 కోట్లు) వరకు ఉండే అవకాశం ఉంది. రష్యా వంటి మిత్రదేశాలకు మాత్రం ఇరాన్ ఇప్పటికే ఈ ఫీజుల నుంచి మినహాయింపు ఇచ్చింది. ఏప్రిల్‌లో అమెరికా మధ్యవర్తిత్వంతో కుదిరిన తాత్కాలిక కాల్పుల విరమణ తర్వాత ఈ సముద్ర మార్గాన్ని శాశ్వతంగా పునరుద్ధరించేందుకు ఇరాన్‌ఒమన్ సంయుక్త కమిటీ చర్చలు జరుపుతోంది. ఈ ప్రకటన గ్లోబల్ మార్కెట్‌కు కొంత ఊరటనిచ్చినప్పటికీ కొత్తగా విధించే ఫీజుల భారం చివరకు వినియోగదారులపైనే పడే అవకాశం ఉందని ఆర్థిక నిపుణులు అంచనా.

# అయోధ్యలో కరుడు గట్టిన క్రిమినల్ ఎన్‌కౌంటర్

**అయోధ్య,జూన్ 8:** ఉత్తరప్రదేశ్‌లో జరిగిన ఒక ఎన్‌కౌంటర్‌లో కరుడుగట్టిన క్రిమినల్ హతమయ్యాడు. ఈ ఘటనలో ఇద్దరు పోలీసులకు కూడా గాయాలయ్యాయి. అయోధ్యలో సోమవారం ఉదయం జరిగిన ఎన్‌కౌంటర్‌లో భాను ప్రతాప్ సింగ్ అలియాస్ బబ్లూ హతమయ్యాడు. ఉత్తర ప్రదేశ్ పోలీసులు, స్పెషల్ టాస్క్ ఫోర్స్ (ఎస్టీఎఫ్) సిబ్బంది కలిసి ఆపరేషన్ నిర్వహించారు. హతుడు భాను ప్రతాప్ సింగ్‌పై అనేక జిల్లాల్లో 40 వరకు కేసులున్నాయి. అతడిపై అనేక చోట్లా రూ2 లక్షల వరకు రివార్డ్ కూడా ఉంది. గోరక్‌పూర్ పరిదిలోని బిక్నిపూర్ గ్రామానికి చెందిన బబ్లూ అనేక నేరాలకు పాల్పడ్డాడు. అతడిపై యూపీలోని అనేక జిల్లాల్లో చాలా కేసులు నమోదయ్యాయి. కొంతకాలంగా అతడు పరారీలో ఉన్నాడు. అతడి గురించి ఇటీవల ఎస్టీఎఫ్ అధికారులకు సమాచారం అందింది.

# బలమైన గాలులకు ఎయిర్‌పోర్టులో దెబ్బతిన్న విమానాలు

**న్యూఢిల్లీ, జూన్ 8:** బలమైన గాలి వానకు ఎయిర్‌పోర్ట్‌లోని గ్రౌండ్ పరికరాలు వేగంగా కదిలాయి. పార్క్ చేసిన విమానాలను అవి ఢీ కొట్టాయి. ఈ నేపథ్యంలో ఎయిర్ ఇండియాకు చెందిన మూడు విమానాలు దెబ్బ తిన్నాయి. దేశ రాజధాని ఢిల్లీలో ఈ సంఘటన జరిగింది. ఆదివారం సాయంత్రం బలమైన గాలులతో కూడిన వర్షం కురిసింది. ఢిల్లీ అంతర్జాతీయ విమానాశ్రయం టెర్మినల్ 2 వద్ద ఉన్న ఎయిర్ ఇండియాకు చెందిన ఇంజినీరింగ్ పరికరం, ఇండిగోకు చెందిన గ్రౌండ్ సపోర్ట్ ల్యాడర్ బలమైన గాలులకు కదిలి ముందుకు దూసుకెళ్లాయి.

## మాజీ సిఎం కుమార్తెపై ఇడి విచారణకు హైకోర్టు గ్రీన్‌సిగ్నల్!

## వీణావిజయన్‌పై బిగుస్తున్న రూ.2.78 కోట్ల ఉచ్చు

**తిరువనంతపురం, జూన్ 8:** కేరళ రాజకీయాల్లో సంచలనం సృష్టించిన ఎక్సాలాజిక్ సొల్యూషన్స్ వ్యవహారంలో మాజీసీఎం పినరయి విజయన్ కుమార్తె వీణా విజయన్‌కు గట్టి షాక్ తగిలింది. ఈ సంస్థపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ జరుపుతున్న మనీ లాండరింగ్ దర్యాప్తును సవాల్ చేస్తూ కొచ్చిన్ మినరల్స్ అండ్ రుటైల్ లిమిటెడ్ దాఖలు చేసిన అప్పీల్‌ను కేరళ హైకోర్టు కొట్టివేసింది.

ఈడీ దర్యాప్తు యథావిధిగా కొనసాగవచ్చని స్పష్టం చేసింది. వీణా విజయన్‌కు చెందిన ఎక్సాలాజిక్ సొల్యూషన్స్ అనేది స్కూల్, కాలేజీ మేనేజ్‌మెంట్ సాఫ్ట్‌వేర్ తయారు చేసే ఒక చిన్న సంస్థ.

# ఇక కాల్పులు ఆపండి..ఇజ్రాయెల్‌కు ట్రంప్ హెచ్చరిక



**వాషింగ్టన్,జూన్ 8:** ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య మరోసారి ఉద్రిక్తతలు తీవ్రమయిన తరుణంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌తో చర్చలు ముగించాలనే తన నిర్ణయంలో ఎలాంటి మార్పు ఉండదని స్పష్టం చేశారు. ఈ శాంతి ప్రక్రియలో తనదే తుది నిర్ణయమని ట్రంప్ స్పష్టం చేశారు. ఇక్కడ అన్ని నిర్ణయాలు నేనే తీసుకుంటాను. నెతన్యాహు కాదు. భవిష్యత్తులో అమెరికాఇరాన్ మధ్య కుదిరే ఒప్పందాన్ని ఆయన అంగీకరించి తీరాల్సిందే అని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఇజ్రాయెల్ సరిహద్దులను లక్ష్యంగా చేసుకుని ఆదివారం రాత్రి ఇరాన్ భారీగా బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించిన విషయం తెలిసిందే. అంతకుముందు లెబనాన్ కాల్పుల విరమణను ఉల్లంఘిస్తూ ఇజ్రాయెల్ దళాలు బీరుట్ శివార్లలో దాడులు చేశాయి. దీనికి ప్రతికారంగానే ఇరాన్ క్షిపణులతో విరుచుకు పడింది. ఇరాన్ ప్రయోగించిన క్షిపణులను తమ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలు విజయవంతంగా అడ్డుకున్నాయని, ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని ఇజ్రాయెల్ ఆర్మీ సమర్థించుకుంది. ఇరాన్‌పై ఎదురుదాడి చేయొద్దని నెతన్యాహును ట్రంప్ కోరనున్నట్లు సమాచారం. ఇలాంటి సైనిక చర్యల వల్ల ప్రస్తుతం జరుగుతున్న దౌత్యపరమైన చర్చలు దెబ్బతింటాయని ఆయన ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇరాన్‌ను ఉద్దేశించి ట్రంప్ మాట్లాడుతూ మీరు క్షిపణులు ప్రయోగించారు. ఇక చాలు. ఇప్పుడైనా చర్చలకు వచ్చి ఒప్పందం చేసుకోండి అని పిలుపునిచ్చారు. అలాగే బీరుట్‌పై ఇజ్రాయెల్ చేసిన ముందస్తు దాడులపై కూడా ట్రంప్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఒకవేళ దౌత్యపరమైన చర్చలు విఫలమైతేపరిణామాలుంటాయని ట్రంప్ హెచ్చరించారు. చర్చలు ఫలించకపోతే ఇరాన్‌పై కమాండో దాడులు చేసే ఆలోచన కూడా ఉందన్నారు. మేం ఒప్పందానికి చాలా దగ్గరగా ఉన్నాం. ఇరాన్ వినకపోతే వారిపై బాంబులతో విరుచుకుపడతాం అని ఎన్‌బీసీ ట్రంప్ వ్యాఖ్యానించారు.

# ఆగస్టునుంచి కొత్త ప్యాసింజర్ రిజర్వేషన్ వ్యవస్థ

**న్యూఢిల్లీ,జూన్ 8:** టికెట్ బుకింగ్ విధానంలో గత కొన్ని దశాబ్దాలుగా ఎదురవుతున్న సమస్యలకు చెక్ పెట్టేందుకు రైల్వేశాఖ సిద్ధమైంది. ఆగస్టు నుంచి సరికొత్త ప్యాసింజర్ రిజర్వేషన్ సిస్టమ్ విధానాన్ని అందుబాటులోకి తీసుకురానుంది. దాదాపు 1986 నుంచి వాడుకలో ఉన్న పాత సాంకేతిక విధానాన్ని ఈ సరికొత్త వ్యవస్థతో పూర్తిగా మార్చేయనుంది. ఈ సరికొత్త అప్‌గ్రేడ్ వల్ల ఆన్‌లైన్ టికెట్ బుకింగ్ సామర్థ్యం నిమిషాల వ్యవధిలోనే లక్షలాది టికెట్లను ఎలాంటి సర్వర్ సమస్యలు లేకుండా బుక్ చేసుకోవచ్చు. ఈ కొత్త సిస్టమ్‌కు మారే ప్రక్రియపై రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఢిల్లీలోని రైల్ భవన్‌లో ఉన్నతాధికారులతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సాంకేతిక మార్పుల సమయంలో ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగరాదని అధికారులను ఆదేశించారు. రైల్వే శాఖ 2002 సంవత్సరంలో ఇంటర్నెట్ ఆధారిత టికెట్ బుకింగ్‌ను ప్రారంభించింది.

అప్పటి నుంచి కౌంటర్ల కంటే ఆన్‌లైన్‌లో బుక్ చేసుకునేవారి సంఖ్య పెరుగుతూనే వస్తోంది. ప్రస్తుతం దేశంలో అమ్ముడవుతున్న మొత్తం రైల్వే టికెట్లలో దాదాపు 88 శాతం బుకింగ్స్ కేవలం డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారానే జరుగుతున్నాయి. ఈ భారీ డిమాండ్‌కు అనుగుణంగానే పాత వ్యవస్థను అధునాతన సాంకేతికతతో రైల్వే మారుస్తోంది. రైల్వే శాఖ డిజిటల్ విప్లవంలో భాగంగా గతేడాది జులైలో ప్రారంభించిన రైల్ వన్ యాప్ సరికొత్త రికార్డు సృష్టించింది. కేవలం ఏడాది లోపే ఈ యాప్ 3.5 కోట్ల డౌన్‌లోడ్లను దాటేసింది. ఈ ఒక్క యాప్ ద్వారానే టికెట్ బుకింగ్, క్యాన్సిలేషన్, రైలు లైవ్ స్టేటస్, ప్లాట్‌ఫామ్ సమాచారం, ఫిర్యాదులను నమోదు చేయొచ్చు. ప్రస్తుతం ఈ యాప్ ద్వారా రోజూ సుమారు 9.29 లక్షల టికెట్లు బుక్ అవుతున్నాయని రైల్వే శాఖ వెల్లడించింది. కొత్త సిస్టమ్‌తో పాటు ఈ ఏడాది ప్రవేశపెట్టిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత వెయిటింగ్ లిస్ట్ టూల్ ప్రయాణికులకు ఎంతో ఉపయోగపడుతోంది. మనం బుక్ చేసుకున్న వెయిటింగ్ లిస్ట్ టికెట్ కన్ఫర్మ్ అవుతుందా లేదా అనే అవకాశాలను ఈ టూల్ ముందుగానే అంచనా వేస్తుంది. గతంలో 53 శాతంగా ఉన్న ఖచ్చితత్వం ఇప్పుడు ఏకంగా 94 శాతానికి పెరిగింది.

9-6Pg6exHMNWJQE.qxd:9-6Pg6exHMNWJQE.qxd 1/1/02 5:49 AM Page 1





# స్టీరింగ్ రాడ్ విరిగి పొలాల్లోకి ఆర్టీసి బస్సు

**● 15 మంది ప్రయాణికులు క్షేమం**

**విజయవాడ, జూన్ 8 ప్రభాతవార్త ప్రతినిధి:** కృష్ణా జిల్లా కంకిపాడు మండలంలో పెను ప్రమాదం తృటిలో తప్పింది. స్టీరింగ్ రాడ్ విరిగిపోవడంతో ఆర్టీసీ బస్సు అదుపుతప్పి రోడ్డు పక్కనున్న పంట పొలాల్లోకి దూసుకెళ్లి పల్టీ కొట్టింది. అయితే బస్సులో ప్రయాణిస్తున్న 15 మంది ప్రయాణికులు ఎలాంటి గాయాలు కాకుండా సురక్షితంగా బయటపడటంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. గన్నవరం డిపోకు చెందిన 220 నంబర్ ఆర్టీసీ బస్సు తెన్నేరు నుంచి గన్నవరం వైపు వెళ్తుండగా, తెన్నేరు-మంతెన మధ్య మార్గంలో ఒక్కసారిగా స్టీరింగ్ రాడ్ విరిగిపోయింది. దీంతో బస్సు నియంత్రణ కోల్పోయి రోడ్డు పక్కనే ఉన్న పొలాల్లోకి దూసుకెళ్లి పల్టీ కొట్టింది. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు, తోటి ప్రయాణికులు సహాయక చర్యలు చేపట్టి బస్సులో ఉన్న వారిని సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. ప్రమాద సమయంలో బస్సులో సుమారు 15 మంది ప్రయాణికులు ఉన్నప్పటికీ ఎవరికీ గాయాలు కాకపోవడం విశేషం.

# ఎన్ఐఏ కస్టడీకి ఉగ్రవాద సానుభూతిపరులు

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, జూన్ 8 ప్రభాతవార్త:** రాష్ట్రంలో కలకలం రేపిన ఉగ్రవాద సానుభూతిపరులను జాతీయ దర్యాప్తు సంస్థ తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో కస్టడీలోకి తీసుకుంది. కోర్టు అనుమతితో రాజమహేంద్రవరం సెంట్రల్ జైలు నుంచి తీసుకువచ్చిన ఈ నిందితులను. ఐదు రోజుల పాటు జాంపేట మహిళా పోలీస్ స్టేషన్‌లో ఎన్ఐఏ అధికారులు విచారించనున్నారు. గత మార్చిలో విజయవాడలో ముగ్గురు పట్టుబడగా, వారిచ్చిన సమాచారంతో దేశవ్యాప్తంగా ఏపీ, తెలంగాణ సహా 8రాష్ట్రాల్లో మొత్తం 13మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. వీరంతా ఐసిస్, అల్‌ఖైదా వంటి ఉగ్రవాద సంస్థల భావజాలానికి ఆకర్షితులైనట్లు అధికారులు గుర్తించారు. దేశంలో ఏమైనా పేలుళ్లకు వీరు కుట్ర పన్నారా? అన్న కోణంలో నిందితుల కాల్ డేటా, సోషల్ మీడియా ఖాతాల ఆధారంగా ప్రత్యేక ప్రశ్నావళి ద్వారా ఎన్ఐఏ అధికారులు ప్రస్తుతం ఆరా తీస్తున్నారు. ఈ విచారణ సందర్భంగా జాంపేటలో అదనపు బలగాలతో బందోబస్తు ఏర్పాటు చేశారు.

# తోతాపురికి మద్దతు ధర కల్పించాలి

**● కేజీకి రూ.15 చెల్లించాలని మామిడి రైతులు డిమాండ్ ● కలెక్టరేట్ ఎదుట భారీ ధర్నా**



తోతాపురి మామిడి కేజీకి రూ.15 చెల్లించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు వినతిపత్రం అందిస్తున్న మామిడి రైతు సంఘాల నాయకులు

**చిత్తూరు, జూన్ 8 ప్రభాతవార్త:** ఈ మామిడి సీజన్‌లో తోతాపురి మామిడికి కేజీకి రూ.15 చెల్లించాలని మామిడి రైతులు డిమాండ్ చేశారు. మామిడికి గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేస్తూ సోమవారం కలెక్టరేట్ ఎదుట పలు రైతు సంఘాల ఆధ్వర్యంలో భారీ ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి మామిడి రైతు సంఘాల నాయకులు మాట్లాడుతూ తోతాపురి మామిడి ధరలు గత వారం రోజులుగా భారీగా పతనం అయ్యాయని, ధరలు పతనం కావడంతో రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. మామిడి సీజన్ ప్రారంభం అయినప్పటికీ జిల్లాలోని పలు గుజ్జు పరిశ్రమలు రైతుల నుండి మామిడిని సేకరించడం లేదని, జిల్లాలో ప్రస్తుతం 2 గుజ్జు పరిశ్రమలు మాత్రమే రైతుల నుండి మామిడిని తక్కువ ధరలకు కొనుగోలు చేస్తున్నాయన్నారు. జిల్లాని అన్ని గుజ్జు పరిశ్రమలు రైతుల నుండి మామిడి కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని పల్ప్ ఫ్యాక్టరీ ప్రస్తుతం తోతాపురి మామిడి కేజీని రూ.4 నుండి రూ.5కు మాత్రమే కొనుగోలు చేస్తున్నాయని, ఈ మామిడిని ఫ్యాక్టరీలకు విక్రయించ డానికి రైతులు రోజుల తరబడి ఫ్యాక్టరీల ఎదుట పడిగాపులు పడాల్సిన పరిస్థితి నెలకొందని ధ్వజమెత్తారు. 2026 సంవత్సరం మామిడి సీజన్ ప్రారంభం అయినప్పటికీ మామిడి రైతు సంఘాల ప్రతినిధులు, మామిడి రైతులతో చర్చలు నిర్వహించకపోవడం బాధాకరమన్నారు. జిల్లాలోని మామిడి రైతులు, సంఘాల ప్రతినిధులతో చర్యలు ఎనిర్వహించచి పెట్టుబడి ఖర్చులను నిర్ణయించి ప్రతి ఏడాది వరుస నష్టాలతో కుదేలవుతున్న మామిడి రైతులకు ఈ ఏడాది అయినా తోతాపురి మామిడి పెట్టుబడి ఖర్చు కేజీ రూ.18గా నిర్ణయించి ఈ మేరకు రైతులకు ధర చెల్లించడానికి చర్యలు తీసుకోవాలని గుజ్జు పరిశ్రమలను ఆదేశించాలని డిమాండ్ చేశారు. ఈ ఏడాది తోతాపురి మామిడి కేజీకి ప్రభుత్వం పెట్టుబడి ఖర్చు రూ.7 నిర్ణయించిందని, గత ఏడాది తోతాపురి మామిడి కేజీకి ఈ ప్రభుత్వమే రూ.12 నిర్ణయించి చెల్లించేలా చర్యలు తీసుకుందన్నారు.

ఈ ఏడాది తోతాపురి మామిడికి ప్రభుత్వం నిర్ణయించిన కేజీ రూ.7ను సైతం ఎక్కడా చెల్లిచడం లేదని రైతు నాయకులు ఆరోపించారు. ప్రతి గుజ్జు ఫ్యాక్టరీ వద్ద మామిడి ధరల బోర్డును ఏర్పాటు చేయాలని, జిల్లా స్థాయి అధికారులతో పర్యవేక్షణ కమిటీలు ఏర్పాటు చేయాలని ఇప్పటికే పలుమార్లు డిమాండ్ చేసినా ఫలితం లేదని సత్వరం ఈ మేరకు చర్యలు తీసుకోవాలని రైతు సంఘాల నేతలు డిమాండ్ చేశారు.

జిల్లాలో జూన్ నెల ప్రారంభమైన కొన్ని గుజ్జు పరిశ్రమలు ఇప్పటికీ రైతుల నుండి మామిడి కొనుగోలు చేయడం లేదని కలెక్టర్ సత్వరం అలాంటి ఫ్యాక్టరీలతో చర్చించి మామిడి కొనుగోలుకు చర్యలు చేపట్టాలన్నారు. అలాగే జిల్లాలో ఉపాధి హామీ పథకంను మామిడి పంటకు అనుసంధానం చేస్తే రైతుకు కొంత మేరకు న్యాయం జరుగుతుందని ఆ మేరకు చర్యలు తీసుకోవాలని రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మామిడి పంటను సైతం బీమా పథకంలో చేర్పించి బీమా వర్తింపుకు చర్యలు తీసుకోవాలని, రైతులకు డిజిటల్ మార్కెట్లు ఏర్పాటు చేయాలని, మామిడి రైతుకు 50 శాతం సబ్సిడీతో ఎరువులు, పురుగుల మందులు, పనిముట్లు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో మామిడి సంఘాల నాయకులు మునీశ్వర్‌రెడ్డి, ఉమాపతి, హేమలత, సంజీవరెడ్డి, బెల్లంకొండ శ్రీనివాసులు, ఉమాపతి నాయుడు, చెంగల్రాయరెడ్డి, త్యాగరాజులురెడ్డి, మోహన్ రెడ్డి, జయదేవయ్య, పెద్ద సంఖ్యలో మామిడి రైతులు పాల్గొన్నారు.

ధర్నా అనంతరం మామిడి సంఘాల నాయకులు కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను కలిసి తోతాపురి మామిడికి గిట్టుబాటు ధర చెల్లింపుకు చర్యలు తీసుకోవాలని, ఇతర సమస్యను పరిశీలించి సత్వరం పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. కలెక్టర్ సుమిత్ కుమార్ మామిడి రైతుల సమస్యలను పరిశీలించి పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామని నాయకులకు హామీ ఇచ్చారు.

# కలెక్టరేట్ ఎదుట రైతు ఆత్మహత్యాయత్నం

**● తన భూమిని ఆక్రమించుకున్నారని ఫిర్యాదు చేసినా రెవెన్యూ నిర్లక్ష్యం**

**చిత్తూరు, జూన్ 8 ప్రభాతవార్త:** తన భూమిని ఇతరులు ఆక్రమించుకున్నారని, తనకు న్యాయం చేయాలని రెవెన్యూ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా తనను అధికారులు నిర్లక్ష్యంగా చూస్తున్నారని క్షేత్రస్థాయి రెవెన్యూ అధికారులతో తనకు న్యాయం జరుగకపోవడం తో మీరే న్యాయం చేయాలని కోరుతూ ఓ రైతు సోమవారం కలెక్టరేట్ ఎదుట శరీరంపై కిరోసిన్ పోసుకుని ఆత్మహత్యాయత్నంకు పాల్పడ్డాడు. వి.కోట మండలంకు చెందిన రాఘవేంద్ర అనే రైతు తన భూమిని తన సోదరులు ఆక్రమించు కున్నారని, ఈ విషయంపై విచారించి తనకు న్యాయం చేయాలని పలుమార్లు రెవెన్యూ అధికారులను కలసి ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయిందన్నారు. ఈ పరిస్థితుల్లో క్షేత్రస్థాయి అధికారులతో తనకు న్యాయం జరుగని భావించిన రాఘవేంద్ర సోమవారం కలెక్టరేట్‌లో జరిగే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో కలెక్టర్ సుమిత్ కుమార్‌కు ఈ విషయంగా ఫిర్యాదు చేయడానికి వచ్చారు. రైతు రాఘవేంద్ర తనతో పాటు కిరోసిన్ తీసుకుని కలెక్టరేట్ ఎదుట శరీరంపై తెచ్చుకున్న కిరోసిన్‌ను పోసుకుని ఆత్మహత్యాయత్నంకు పాల్పడటంతో అక్కడే విధుల్లో వున్న పోలీసులు సత్వరం స్పందించి రాఘవేంద్ర ఆత్మహత్యాయత్నంను అడ్డుకున్నారు. ఆత్మహత్యాయత్నంకు పాల్పడిన రాఘవేంద్రను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. కలెక్టరేట్ ఎదుట రెవెన్యూ అధికారుల తీరును నిరసిస్తూ రైతు ఆత్మహత్యాయత్నంకు పాల్పడటం కలకలం రేపింది.

# విద్యుత్ సమస్యలకు త్వరితగతిన పరిష్కారం

**● ఎస్‌పిడిసిఎల్ సిఎండి శివశంకర్ లోతేటి**



**తిరుపతి, జూన్ 8 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎస్‌పిడిసిఎల్ కార్పొరేట్ సంస్థ పరిధిలోని విద్యుత్ వినియోగదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తున్నామని ఆ సంస్థ సిఎండి శివశంకర్ లోతేటి పేర్కొన్నారు. ఎస్‌పిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన డయల్ యువర్ ఎస్‌పిడిసిఎల్ సిఎండి కార్యక్రమానికి 60 వినతులు అందాయి. ఈ కార్యక్రమం ద్వారా పలువురు వినియోగదారులు విద్యుత్ సమస్యలను తమ దృష్టికి తీసుకువచ్చారన్నారు. విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసమే ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమం ద్వారా నమోదయ్యే సమస్యల్ని త్వరితగతిన పరిష్కరించేందుకు అధికారులు, సిబ్బంది కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారానే కాకుండా వినియోగదారులు విద్యుత్ శాఖ టోల్ ఫ్రీ నంబర్లు: 1912, 1800 425 155333కు కాల్ చేయడం, వాట్సాప్ నంబరు: 91333 31912కు చాట్ చేయడం, ఎస్‌పిడిసిఎల్ చాట్ బోట్ ద్వారా విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి, పరిష్కరించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ ఐటి) పి.అయూబ్ ఖాన్, డైరెక్టర్ (టెక్నికల్ హెచ్ఆర్‌డి) కె.గురవయ్య, డైరెక్టర్/ఫైనాన్స్ (ఎఫ్ఏసి) కె.రామమోహన్ రావు, చీఫ్ జనరల్ మేనేజర్లు కె.ఆదిశేషయ్య, జె.రమణాదేవి, ఆర్.పద్మ, ఎం.మురళికుమార్, ఎన్.శోభా వాలెంటీనా, ఎం. ఉమాపతి, సిహెచ్ రామచంద్రరావు, ఎస్.రమణ, జనరల్ మేనేజర్లు సురేంద్రరావు, చక్రపాణి, జగదీష్, లత, పిఆర్ఒ తోట మధుసూదన తదితరులు పాల్గొన్నారు.

# రాజకీయాలు భ్రష్టు పట్టిపోయాయి

**కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చింతామోహన్**



**శ్రీకాకుళం, జూన్ 8 ప్రభాతవార్త:** దేశ రాజకీయాలు, రాష్ట్ర రాజకీయాలు భ్రష్టు పట్టిపోయాయని కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చింతామోహన్ అన్నారు. సోమవారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ, బిజెపి పాలనలో రూపాయి విలువ క్షీణించింది. ఆక్వాతో సహా, వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులు ఆగిపోయింది. మోడీ, బిజెపి పాలనలో గొప్ప ఆర్థిక సంక్షోభం దేశంలో నెలకొంది. పివి నరసింహారావు ప్రధానిగా ఉన్నప్పుడు, బంగారం ఎగుమతులు చేసి, విదేశీ మారకద్రవ్యం తెచ్చాము. ప్రతి ఇంట్లో ఆర్థిక సంక్షోభం మొదలైంది. గ్రామాల్లో ప్రతి ఇంట్లో రూ.200లకు మించి డబ్బు లేదు. ప్రభుత్వం ఇచ్చే రేషన్ బియ్యం ఉన్నది. మోడీ, చంద్రబాబు, జగన్ ముగ్గురు ఫెయిల్ అయ్యారు. ప్రభుత్వ ఆసుపత్రులలో పనిచేసే నర్సులకు మూడు నెలలుగా జీతాలు రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వలేదు. ఆరు లక్షల మంది ఉద్యోగులు ఉన్నారు. 8 సంవత్సరాలుగా పీఆర్సీ ప్రకటించలేదు. నాలుగు డిఎలు పెండింగ్‌లో వుంది. ప్రభుత్వ ఉద్యోగులు అప్పుల్లో ఉన్నారు. ఇంటి అద్దెలు కట్టుకోలేకపోతున్నారు. పిల్లలను చదివించలేకపోతున్నారు. మూడు రూపాయల వడ్డీలకు తెచ్చి, కష్టాలు పడుతున్నారు. వారం లోపు పిఆర్సీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు తిరుపతి విమానాశ్రయాన్ని అద్వానీకి అమ్మాలని అనుకుంటున్నారు. తిరుపతి విమానాశ్రయం వైబులిటీ తగ్గించే దానికి, చిన్న విమానాలు ఇస్తున్నారు. ఢిల్లీ, ముంబై వంటి నగరాల నుంచి విమానాలు తిరుపతికి రావడం లేదు. ఒక్క అంతర్జాతీయ విమాన సర్వీస్ కూడా నడపడం లేదు. తిరుపతి విమానాశ్రయం ప్రైవేటీకరణ చేస్తే, చంద్రబాబు, రామ్మోహన్ నాయుడు ఇరువురూ నష్టపోతారని చింతామోహన్ హెచ్చరించారు. బిజెపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను తీవ్రంగా ఖండిస్తున్నాం. వ్యతిరేకిస్తున్నాం అని అన్నారు. ఈ విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నాయకులు మంత్రి నరసింహామూర్తి, షణ్ముఖరావు, మామిడి సత్యనారాయణ పాల్గొన్నారు.



# అమరావతిలో రూ.200 కోట్లతో ఆప్కాబ్ ఐకానిక్ భవనం

**విజయవాడ జూన్ 8 ప్రభాతవార్త ప్రతినిధి:** రాజధాని అమరావతిలో రూ.200 కోట్లతో ఆప్కాబ్ ఐకానిక్ భవనం రూపుదిద్దుకుంటోంది. ఇందులో భవన నిర్మాణానికి రూ.87 కోట్లు, ఇంటీరియర్ ఇతర సౌకర్యాలకు రూ.113 కోట్లను వెచ్చించనున్నారు. భవన నిర్మాణం ఇప్పటికే మొదలైంది. ఆప్కాబ్ భవన నిర్మాణానికి లింగాయపాలెంలో 0.495 ఎకరాల స్థలాన్ని సీఆర్‌డీఏ కేటాయించింది. జీ+17 అంతస్తులతో దీన్ని నిర్మిస్తున్నారు. చివరి అంతస్తులో హెలిప్యాడ్ ఉంటుంది. ఆప్కాబ్ పాలనా కార్యాలయం, ఐటీ విభాగాలు, ఛైర్మన్, ఎండీ ఛాంబర్ సహా వివిధ విబాగాలు ఉంటాయి. మొత్తం 2.09 లక్షల చదరపు అడుగుల్లో భవనం నిర్మిస్తారు. ఆప్కాబ్ అనే అక్షరాలు ప్రతిబింబించేలా ప్లాన్ డిజైన్ చేశారు. నిర్మాణ బాధ్యతల్ని ఏపీఐఐసీకి అప్పగించారు. ఐఐటీ హైదరాబాద్‌తో పాటు విజయవాడలోని స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ నుంచి సాంకేతిక సహకారం తీసుకుంటున్నారు.

# పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్‌కు బెదిరింపులు

**విజయవాడ, జూన్ 8 ప్రభాతవార్త ప్రతినిధి:** కృష్ణా జిల్లా పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్ కుటుంబానికి బెదిరింపులు వస్తున్నాయి. ఈ మేరకు పెనమలూరు పోలీసు స్టేషన్‌లో ఎమ్మెల్యే బోడే ప్రసాద్ ఫిర్యాదు చేశారు. తన కుటుంబాన్ని చంపేస్తానని మాలంపాటి భాస్కర్‌రెడ్డి బెదిరించాడని ఎమ్మెల్యే ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఎమ్మెల్యే ఫిర్యాదుతో మాలంపాటి భాస్కర్‌రెడ్డిపై కేసు పోలీసులు నమోదు చేశారు. సామాజిక మాధ్యమాల్లో సిఎం చంద్రబాబు, లోకేశ్‌పై దుష్ప్రచారం చేశారని గతంలోనే భాస్కర్‌రెడ్డిపై కేసు నమోదు చేసారు. ఈ క్రమంలో మాలంపాటి వివిధ రీతుల్లో బోడే ప్రసాద్‌ను ఆయన కుటుంబ సభ్యులను బెదిరిస్తున్నది అభియోగం. ఈ అంశంపై కేసును నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు. ప్రస్తుతం మాలంపాటి భాస్కర్‌రెడ్డి యుకెలో ఉన్నట్లు ఆయన సన్నిహిత వర్గాల ద్వారా పోలీసులు గుర్తించినట్లు సమాచారం.

# మల్లవరపు ప్రకాష్ మృతికి సిఎం చంద్రబాబు సంతాపం

**విజయవాడ, జూన్ 8 ప్రభాతవార్త ప్రతినిధి:** విశాఖకు చెందిన క్రైస్తవ మత బోధకులు, విశ్రాంత ఆర్చ్ బిషప్ డాక్టర్ మల్లవరపు ప్రకాష్ మృతి పట్ల ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేశారు. డాక్టర్ మల్లవరపు ప్రకాష్ సమాజానికి చేసిన సేవలు ఎనలేనివని సిఎం వ్యాఖ్యానించారు. కడప, విజయవాడ, విశాఖపట్నంలో బిషప్‌గా సుదీర్ఘకాలం పాటు ఆయన అందించిన సేవలు ఎనలేనివని అన్నారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని సిఎం పేర్కొన్నారు. ప్రకాష్ కుటుంబ సభ్యులకు, క్రైస్తవ మత పెద్దలకు వారి అనుచరులకు ముఖ్యమంత్రి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

**మంత్రి నారా లోకేష్ తీవ్ర సంతాపం:** విశాఖపట్నం విశ్రాంత ఆర్చ్ బిషప్, మోస్ట్ రెవ. డాక్టర్ ప్రకాష్ మల్లవరపు మృతికి ఐటి శాఖా మంత్రి నారా లోకేష్ తీవ్ర సంతాపం ఎక్స్‌వేదికగా చేసిన పోస్టులో తెలిపారు. పరలోకపు తండ్రి పిలుపు పొంది ఉన్నారు. వారు భౌతికంగా మన మధ్య లేకపోవడం చాలా బాధాకరం. విద్యాధికులైన విశ్రాంత ఆర్చ్ బిషప్ ఆధ్యాత్మిక సేవకు తన జీవితాన్ని అంకితం చేశారు. విజయవాడ బిషప్‌గా, కడప బిషప్‌గా, ఏలూరు డయాసిస్ అపోస్టోలిక్ అడ్మినిస్ట్రేటర్‌గా, విశాఖపట్నం మెట్రోపాలిటన్ ఆర్చ్ బిషప్‌గా, శ్రీకాకుళం అపోస్టోలిక్ అడ్మినిస్ట్రేటర్‌గా ఎనలేని సేవలు అందించారు. ఆదర్శవంతమైన జీవనశైలి, వినయం, ప్రేమతో పేదల సేవలో తరించిన విశ్రాంత ఆర్చ్ బిషప్ ప్రకాష్ మల్లవరపు ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తూ, నివాళి అర్పిస్తున్నానని మంత్రి పేర్కొన్నారు.

### ఆర్టీసీ బస్సుల్లో చోరీలకు పాల్పడుతున్న

# ముగ్గురు మహిళా నిందితుల అరెస్టు

**● 32 గ్రాముల డైమండ్ గోల్డ్ నెక్లెస్ స్వాధీనం**




**పాకాల, జూన్ 8 ప్రభాతవార్త:** తిరుపతి జిల్లా పాకాల మండల పరిధిలో ఇటీవల కాలంలో ఆర్టీసీ బస్సులలో ప్రయాణికుల బ్యాగులు, హ్యాండ్ బ్యాగుల నుండి బంగారు ఆభరణాలు అపహరిస్తున్న ముఠాలపై జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బారాయుడు ఆదేశాల మేరకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో పాకాల పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసు దర్యాప్తును పాకాల పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ టి. చిన్న గోవింద పర్యవేక్షణలో ఎస్ఐ తరుణ్, డబ్ల్యూఎస్ఐ నాగ మంజుల ఆధ్వర్యంలోని ప్రత్యేక బృందం చేపట్టింది. దర్యాప్తులో భాగంగా నిందితుల కదలికలను గుర్తించిన ప్రత్యేక బృందం ఈ నెల 7వ తేదీన సాయంత్రం శంఖంపల్లి ఫ్లైఓవర్ క్రింద ముగ్గురు మహిళా నిందితులను అదుపులోకి తీసుకొని అరెస్టు చేసింది. అరెస్టు చేయబడిన నిందితులు జి. దివ్య (31), బి. రాధిక (38), బి. మేరీ (33)గా గుర్తించబడ్డారు. వీరంతా చిత్తూరు జిల్లా పరిధికి చెందినవారని పోలీసులు తెలిపారు. విచారణలో నిందితులు తమ నేరాన్ని అంగీకరించడంతో, వారి వద్ద నుండి కేసుకు సంబంధించిన సుమారు 32 గ్రాముల బరువున్న డైమండ్ గోల్డ్ నెక్లెస్ చైన్‌ను స్వాధీనం చేసుకున్నామని సీఐ తెలిపారు. స్వాధీనం చేసుకున్న ఆభరణం విలువ సుమారు రూ.3.5 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. అనంతరం నిందితులను న్యాయస్థానం ముందు హాజరుపరచగా, కోర్టు ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించామన్నారు. మహిళా ప్రయాణికులే లక్ష్యం ప్రాథమిక విచారణలో నిందితులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే మహిళలను లక్ష్యంగా చేసుకొని, రద్దీని ఆసరాగా తీసుకుని వారి బ్యాగుల్లోని విలువైన బంగారు ఆభరణాలను అపహరిస్తూ వచ్చినట్లు వెల్లడైంది. కేసును అత్యంత త్వరితగతిన ఛేదించి, నిందితులను అరెస్టు చేయడంతో పాటు దొంగిలించిన ఆభరణాన్ని రికవరీ చేసిన ఎస్ఐ తరుణ్, డబ్ల్యూఎస్ఐ నాగ మంజుల, ప్రత్యేక పోలీసు బృందాన్ని తిరుపతి జిల్లా ఎస్పీ అభినందించారు.

# తల్లి ఆశలన్నీ ఆవిరి

**● విద్యుత్ తీగ తొక్కిబాలుడు మృతి, వింజమూరులో విషాదం**

**వింజమూరు (నెల్లూరు), జూన్ 8 ప్రభాతవార్త:** కన్న కొడుకు ఎదిగొచ్చి ఆసరాగా నిలుస్తాడనుకున్న తల్లి ఆశలు క్షణాల్లో ఆవిరయ్యాయి. వింజమూరు పట్టణంలోని చల్లా వారి వీధిలో సోమవారం చోటుచేసుకున్న విద్యుదాఘాత ఘటన అందరి హృదయాలను ద్రవింపజేసింది. చల్లా వారి వీధిలో నివాసం ఉంటున్న పేర్నేటి రాజా మమత దంపతుల కుమారుడు మహిదర్‌రెడ్డి (13), 9వ తరగతి చదువుతున్నాడు. సోమవారం వారి ఇంటి పక్కనే పాత బిల్డింగును కూల్చివేస్తుండగా కుతూహలంతో హేమంత్ అక్కడికి వెళ్లి చూస్తున్నాడు. ఆ సమయంలో డ్రిల్లింగ్ మిషన్‌కు సరఫరా అవుతున్న కరెంటు తీగ నేలపై ఉంది. చెప్పులు లేకుండా వెళ్లిన హేమంత్ పొరపాటున ఆ తీగను తొక్కడంతో ఒక్కసారిగా విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. అమ్మా అంటూ కింద పడిపోయాడు. అక్కడ పనిచేస్తున్న కూలీలు వెంటనే మహిధర్ రెడ్డిని వింజమూరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. కానీ అప్పటికే బాలుడు ప్రాణాలు విడిచినట్లు వైద్యులు నిర్ధారించారు. కొడుకు మృతదేహాన్ని చూసి తల్లి మమత గుండెలవిసేలా రోధించింది.

మహిధర్‌రెడ్డి తండ్రి కొన్నేళ్ల క్రితమే ఇల్లు వదిలి వెళ్లిపోయాడు. అప్పటి నుంచి తల్లి మమత కూలి పనులు చేస్తూ ఇద్దరు బిడ్డలను సాకుతోంది. రెక్కలు ముక్కలు చేసుకుని ఇద్దరినీ చదివిస్తున్నా, పెద్దవాడే నా ఆసరా అనుకున్నా, ఇప్పుడు వాడూ లేకుండా పోయాడు అంటూ ఆ తల్లి కన్నీరు మున్నీరుగా విలపిస్తుంటే చూపరుల హృదయాలు బరువెక్కాయి. మహిధర్ మృతితో చల్లా వారి వీధిలో విషాదఛాయలు అలుముకున్నాయి. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. కేసు నమోదు చేసిదర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై ఉమా మహేశ్వర తెలిపారు.

# బాలల కథల పోటీలకు ఆహ్వానం

**ఆంధ్ర సారస్వత పరిషత్తు అధ్యక్షుడు గజల్ శ్రీనివాస్**

**విజయవాడ, జూన్ 8 ప్రభాతవార్త ప్రతినిధి:** ఒంగోలు నగరంలోని నెక్స్ట్ జెన్ ఇంటర్నేషనల్ స్కూల్ ప్రాంగణంలో 2026 డిసెంబర్ 5, 6 తేదీలలో జరగనున్న నాలుగవ ప్రపంచ తెలుగు మహాసభలు బాలలు సందర్భంగా అంతర్జాతీయ స్థాయిలో బాలబాలికల కోసం తెలుగు కథల రచనా పోటీలను నిర్వహిస్తున్నట్లు ఆంధ్ర సారస్వత పరిషత్తు అధ్యక్షులు గజల్ శ్రీనివాస్ ప్రకటించారు.తెలుగు భాషా సాహిత్యాల పట్ల చిన్నారుల్లో ఆసక్తి పెంపొందించడం, సృజనాత్మక రచనా నైపుణ్యాలను ప్రోత్సహించడం లక్ష్యంగా ఈ పోటీలను నిర్వహిస్తున్నామని తెలిపారు. పోటీలు రెండు విభాగాలలో నిర్వహించబడతాయి. మొదటి విభాగం 6 నుండి 10 సంవత్సరాల లోపు పిల్లలకు, రెండవ విభాగం 11 నుండి 16 సంవత్సరాల లోపు పిల్లలకు ఉద్దేశించారు. కథలు పంపడానికి 31 జూలై చివరి తేదీగా ఉంది. 10 ఆగస్టు 2026. ఫలితాలు విడుదల చేస్తారు. ప్రథమ బహుమతిగా రూ.3,116/ద్వితీయ బహుమతిగా రూ.2,116/ తృతీయ బహుమతి 1,116/ మూడు ప్రోత్సాహక బహుమతులు - రూ.516/ చొప్పున ఇస్తారు. విజేతలకు నగదు బహుమతులతో పాటు ప్రశంసాపత్రం, పతకం ప్రపంచ తెలుగు మహాసభల వేదికపై అందజేయబడతాయి. సంప్రదించవలసిన ఫోన్ నంబర్: 99497 35253 తెలుగు భాషను ప్రేమించే చిన్నారులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని అధిక సంఖ్యలో పాల్గొనవలసిందిగా బాలల ప్రపంచ తెలుగు మహా సభల కార్యక్రమాల అంతర్జాతీయ, జాతీయ సమన్వయకర్తలు రాధికా మంగిపూడి, కొల్లి రమావతి కోరారు.

### విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రమాదంలో మృతులకు

# కోటి పరిహారం చెల్లించాలి

**● సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్**

**విజయవాడ, జూన్ 8 ప్రభాతవార్త ప్రతినిధి:** విశాఖ స్టీల్‌ప్లాంట్ ఘోర ప్రమాదంలో మరణించిన 9 మంది కార్మికులకు సిపిఎం రాష్ట్ర కమిటీ తీవ్ర సంతాపం ప్రకటించింది. ఊహించని ఈ ప్రమాదంలో 9 మంది మరణించారు. అనేకమంది తీవ్రంగా గాయపడటం పట్ల సిపిఎం రాష్ట్ర కమిటీ దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. మరణించిన మృతుల కుటుంబాలకు ప్రగాడ సానుభూతిని ప్రకటించింది. మరణించిన వారి కుటుంబాలకు రూ.1 కోటి చొప్పున నష్టపరిహారం చెల్లించాలని వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేసింది. గాయపడిన ప్రతి ఒక్కరికి రూ.50 లక్షలు ప్రకటించాలని, తక్షణం మెరుగైన వైద్య సహాయం అందించాలని కోరింది. ఈ మేరకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు ఒక పత్రికా ప్రకటనను విడుదల చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దీన్ని ప్రయివేటీకరిచేందుకు ఉద్దేశపూర్వకంగానే నిరక్ష్యం వహించడం వల్లనే ఈ ప్లాంటు పూర్తిగా దెబ్బతింటున్నదని పేర్కొంది. అందువల్ల ఈ మరణాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని తెలిపింది. కేంద్ర మంత్రి, ముఖ్యమంత్రి దీనిపై ప్రజలకు పూర్తి వివరణ ఇవ్వాలని కోరింది. తక్షణమే ఈ ప్రమాద కారణాలపై విచారణ జరపాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ప్రభుత్వ ప్యాకేజీ ప్రకటిస్తున్నామని, ఆధునికరిస్తున్నామని చేసిన ప్రకటనలు ఆర్భాటానికేనని తెలిపోయిందని పేర్కొంది.

### పద్మావతి వర్సిటీ అధ్యాపక నియామకాల

# దరఖాస్తుల గడువు పొడిగింపు

**తిరుపతి, జూన్ 8 ప్రభాతవార్త ప్రతినిధి:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తొలి మహిళ విశ్వవిద్యాలయం తిరుపతి పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో అధ్యాపక నియామకాలకు సంబంధించి దర ఖాస్తు ప్రక్రియకు మరో వారంరోజులు గడువు పొడిగించారు. దరఖాస్తులను పూర్తి చేయడానికి మరింత సమయం కల్పించాలని అభ్యర్థుల నుండి వచ్చిన వినతులను పరిగణనలోకి తీసుకొని, కొనసాగు తున్న ఫ్యాకల్టీ రిక్రూట్‌మెంట్ -2026 ప్రక్రియకు సంబంధించిన గడువులను మరో వారం రోజుల పాటు పొడిగించాలని నిర్ణయిం చారు. దీననుసరించి, ఎపి కామన్ రిక్రూట్ మెంట్ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్ దరఖాస్తు సమ ర్పణ, రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లింపుకు తుది గడువు ను ఈనెల 15వ తేదీ వరకు పొడిగించారు. దరఖాస్తు హార్డ్ కాపీతో పాటు అవసరమైన అన్ని పత్రాలను రిజిస్టర్డ్ పోస్టు / స్పీడ్ పోస్టు / కొరియర్ ద్వారా పంపించడానికి ఉన్న చివరి తేదీ జూన్ 22 వరకు పొడిగించారు. ప్రాథమిక పరిశీలన అనంతరం అర్హులు అనర్హుల జాబితాను ఈనెల 29 వరకు సవరించారు. అలాగే ప్రాథమిక అర్హతలపై అభ్యంతరాలను స్వీకరించడానికి జులై 6వరకు గడువిచ్చారు. తుది అర్హుల జాబితాను జులై 7న ప్రకటిస్తారు. ఇప్పటివరకు కామన్ రిక్రూట్‌మెంట్ పోర్టల్ ద్వారా దరఖాస్తు ప్రక్రియను పూర్తి చేయని అభ్యర్థులు ఈనెల 15వతేదీ లోపు తప్పనిసరిగా పూర్తి చేయవలెనని విశ్వవిద్యాలయం కోరింది. దరఖాస్తు హార్డ్ కాపీతో పాటు అవసరమైన అన్ని ధ్రువపత్రాలు అనుబంధ పత్రాలు జూన్ 22వ తేదీ లోపు రిజిస్ట్రార్, పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, తిరుపతికి రిజిస్టర్డ్ పోస్టు/ స్పీడ్ పోస్టు / కొరియర్ ద్వారా చేరాలి. ప్రస్తుత నియామక ప్రక్రియకు సంబంధించిన తదుపరి సమాచారం, మార్గదర్శకాలు నవీకరణల కోసం అభ్యర్థులు ఎపి కామన్ రిక్రూట్‌మెంట్ పోర్టల్‌ను క్రమం తప్పకుండా పరిశీలించవలసిందిగా సూచించారు.

## రాజ్యసభ బరిలో

# చింతకాయల విజయ్

- నామినేషన్ దాఖలు
- స్పీకర్ అయ్యన్నపాత్రుడు హాజరు



(ప్రభాతవార్త – విశాఖపట్నం)

రాజ్యసభ ఎన్నికల నేపథ్యంలో టీడీపీ అభ్యర్థి చింతకాయల విజయ్ సోమవారం శాసనసభలోని రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో తన నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. ఈ సందర్భంగా ఆయన తండ్రి, ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అసెంబ్లీకి హాజరై ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. చింతకాయల విజయ్ నామినేషన్‌కు మంత్రి కొలుసు పార్థసారథి, పెదకూరపాడు ఎమ్మెల్యే బోడే ప్రసాద్, ఎమ్మెల్యే విజయ్‌కుమార్, బీజేపీ ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ ప్రతిపాదకులుగా సంతకాలు చేశారు. పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధుల సమక్షంలో ఆయన నామినేషన్ పత్రాలను సమర్పించారు. అసెంబ్లీలో కూటమికి ఉన్న బలమైన సంఖ్యాబలం దృష్ట్యా చింతకాయల విజయ్ రాజ్యసభకు ఏకగ్రీవంగా ఎన్నికయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. నామినేషన్ల పరిశీలన అనంతరం, ఉపసంహరణ గడువు ముగిశాక ఎన్నికల అధికారులు అధికారిక ప్రకటన చేయనున్నారు




(ప్రభాతవార్త – విశాఖపట్నం)

*సోమవారం తెలుగుదేశం పార్టీ రాజ్యసభ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన సందర్భంగా, ఆంధ్రప్రదేశ్ శాసనసభ ప్రాంగణంలో స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, అనకాపల్లి జిల్లా నాయకులు, యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్‌తో కలిసి రాజ్యసభ అభ్యర్థి చింతకాయల విజయ్ కి శుభాకాంక్షలు తెలియజేసిన టీడీపీ యువనేత, ధర్మ ఫౌండేషన్ చైర్మన్ కర్రి సాయికృష్ణ.*

## నేడు పలువురు మంత్రులు రాక

విశాఖపట్నం, జూన్ 8 ప్రభాతవార్త :

విశాఖ స్టీల్‌ప్లాంట్లో జరిగిన ప్రమాదంలో మృతి చెందిన వారితోపాటు క్షతగాత్రులను పరామర్శించేందుకు పలువురు మంత్రులు మంగళవారం నగరానికి రానున్నారు. వీరిలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ వస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే వీరు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేసి సహాయ చర్యలపై ఏ విధంగా జరుగుతుంది అని అధికారులను నాయకులను అడిగి తెలుసుకుంటున్నారు. సహాయ చర్యలపై సూచనలు కూడా చేస్తున్నారు.



### ప్రధాని మోదీ తీవ్ర విచారం..

## ఎక్స్‌గ్రేషియా ప్రకటన

గాజువాక, జూన్ 8, ప్రభాతవార్త :

విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రమాదంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా స్పందిస్తూ.. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు. పీఎం నేషనల్ రిలీఫ్ ఫండ్ కింద మృతుల కుటుంబాలకు రూ.2 లక్షలు, తీవ్రంగా గాయపడిన వారికి రూ.50 వేల చొప్పున ఆర్థిక సహాయం అందించనున్నట్లు ప్రధాని ప్రకటించారు.

# విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో భారీ పేలుడు





- తొమ్మిది మంది దుర్మరణం ?
- ఎస్ఎంఎస్-1లో ఎగసిపడిన వేడి ద్రవం..
- గుర్తుపట్టలేనంతగా కాలిపోయిన శరీరాలు
- మృతుల్లో ఐదుగురు రెగ్యులర్, నలుగురు కాంట్రాక్ట్ కార్మికులు.. మరో ఐదుగురి పరిస్థితి విషమం

గాజువాక,జూన్ 8,ప్రభాతవార్త :

విశాఖ ఉక్కు కర్మాగారంలో సోమవారం మధ్యాహ్నం ఘోర ప్రమాదం సంభవించింది. స్టీల్ మెల్ట్ షాప్ (ఎస్ఎంఎస్–1) విభాగంలో జరిగిన భారీ పేలుడు కారణంగా తొమ్మిది మంది కార్మికులు ప్రాణాలు కోల్పోగా, మరో ఐదుగురు తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. క్షతగాత్రుల పరిస్థితి విషమంగా ఉండడంతో మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశముందని తెలుస్తోంది.

**లాడిల్ ఓపెన్ చేస్తుండగా విపత్తు..**

సోమవారం మధ్యాహ్నం సుమారు 3 గంటల సమయంలో ఎస్ఎంఎస్–1 లోని సీసీడీ–2 వద్ద కార్మికులు విధుల్లో ఉన్నారు. ఎల్ అండ్ డి మీద లాడిల్ ఉంచి, స్లైడ్ గేట్ ఓపెన్ చేసిన వెంటనే సాంకేతిక లోపంతో వేలాది డిగ్రీల వేడితో కూడిన ద్రవరూప ఉక్కు (లిక్విడ్ స్టీల్) ఒక్కసారిగా బయటకు దూసుకొచ్చింది. దీంతో అక్కడ భారీ పేలుడు సంభవించి, మంటలు వ్యాపించాయి. అక్కడ పనిచేస్తున్న 14 మంది కార్మికులపై ఆ వేడి ద్రవం పడిపోవడంతో ఎనిమిది మంది అక్కడికక్కడే గుర్తుపట్టలేనంతగా కాలిపోయి మరణించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరొకరు కన్నుమూశారు.

**మృతుల వివరాలు:**

ఉక్కు ఉద్యోగులు: గోల్డ్ కుమార్ (మేనేజర్ – మెషిన్–2 ఇంచార్జ్), గొంతిన భానుకుమార్ (టెక్నీషియన్), జి.వి. అప్పారావు (టెక్నీషియన్), ఎం.కృష్ణ నాగు (టెక్నీషియన్), కే.ప్రభాకర్ (జనరల్ ఫైర్ మెన్).


**కాంట్రాక్ట్ కార్మికులు:** రమణ, త్రినాథ్, ఎం.అప్పలరాజు, (మరొకరి వివరాలు తెలియాల్సి ఉంది).

**సహాయక చర్యలు - దర్యాప్తుకు ఆదేశం..**

ప్రమాదం జరిగిన వెంటనే ఉక్కు రక్షణ సిబ్బంది రంగంలోకి దిగి మృతదేహాలను వెలికితీశారు. తీవ్రంగా (తరువాయి 8వ పేజీలో)

### సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి.. ఉన్నత స్థాయి దర్యాప్తునకు ఆదేశం

గాజువాక, జూన్ 8, ప్రభాతవార్త:



స్టీల్‌ప్లాంట్‌లో జరిగిన ఘోర దుర్ఘటనపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాద వార్త తెలియగానే ఆయన వెంటనే ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడి వివరాలు ఆరా తీశారు. పలువురు (తరువాయి 8వ పేజీలో)

### విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రమాదం విషాదకరం: మంత్రి నారా లోకేష్

గాజువాక, జూన్ 8, ప్రభాతవార్త :



విశాఖ స్టీల్ ప్లాంట్‌లో జరిగిన ప్రమాదంలో కార్మికులు మృతిచెందడం తీరని విషాదమని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. ఈ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన కార్మికుల కుటుంబాలకు ఆయన ప్రగాఢ సంతాపం (తరువాయి 8వ పేజీలో)

### విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రమాదంపై స్పీకర్ అయ్యన్నపాత్రుడు తీవ్ర దిగ్భ్రాంతి

గాజువాక, జూన్ 8, ప్రభాతవార్త:



విశాఖ స్టీల్ ప్లాంట్‌లో జరిగిన ఘోర ప్రమాదం పట్ల ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ శ్రీ అయ్యన్నపాత్రుడు గారు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. స్టీల్ ప్లాంట్ లో లిక్విడ్ ఉక్కు కార్మికుల మీద పడటంతో జరిగిన ఈ దుర్ఘటన తనను (తరువాయి 8వ పేజీలో)

### కేంద్ర మంత్రి కుమారస్వామి తీవ్ర ఆవేదన

గాజువాక, జూన్ 8, ప్రభాతవార్త:



కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ మంత్రి కుమారస్వామి స్టీల్ ప్లాంట్ ప్రమాద ఘటనపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. నిరంతరం ప్లాంట్ అధికారులతో సమీక్షిస్తున్నా నని, కార్మికుల భద్రత, శ్రేయస్సే తమకు ప్రథమ ప్రాధాన్యమని పేర్కొ న్నారు. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, భూపతిరాజు శ్రీనివాసవర్మ బాధిత కుటుంబాలకు సానుభూతి తెలిపారు.

## పారిశ్రామికాభివృద్ధికి ఆంధ్రప్రదేశ్‌కు అపార అవకాశాలు



**వీఎంఆర్‌డీఏ కమిషనర్ తేజ్ భరత్**

(ప్రభాతవార్త–విశాఖపట్నం)

కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) ఆధ్వర్యంలో విశాఖపట్నంలోని గ్రాండ్ బే హోటల్‌లో నిర్వహించిన తొలి విశాఖ జోనల్ కౌన్సిల్ సమావేశంలో వీఎంఆర్‌డీఏ కమిషనర్ ఎన్. తేజ్ భరత్, ఐఏఎస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధి అవకాశాలపై విస్తృతంగా మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్‌కు 974 కిలోమీటర్ల తీరప్రాంతం, అంతర్జాతీయ ప్రమాణాల నౌకాశ్రయాలు, పారిశ్రామిక కారిడార్లు, పెట్టుబడిదారులకు అనుకూల విధానాలు ఉండటంతో దేశంలోనే ప్రముఖ పారిశ్రామిక, ఎగుమతి ఆధారిత ఆర్థిక వ్యవస్థగా ఎదిగే సామర్థ్యం ఉందని ఆయన పేర్కొన్నారు. విశాఖపట్నం మెట్రోపాలిటన్ ప్రాంత అభివృద్ధికి (తరువాయి 8వ పేజీలో)

## జిల్లాలో యోగా వేడుకలను విజయవంతంగా నిర్వహించాలి

- జిల్లా థీమ్‌కు అనుగుణంగా ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలి
- జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్
- 9న ఈస్టర్న్ నావెల్ కమాండ్ ఫ్లీట్ స్పోర్ట్స్ మైదానంలో, 12న యారాడకొండ, 15న గోల్ఫ్ క్లబ్ లో వేడుకలు

విశాఖపట్నం, జూన్ 8, ప్రభాతవార్త :

అంతర్జాతీయ యోగా దినోత్సవం–2026 సందర్భంగా జిల్లాలో యోగా వేడుకలను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ ఆదేశించారు. ఈ ఏడాది యోగా దినోత్సవ థీమ్‌కు అనుగుణంగా (తరువాయి 8వ పేజీలో)



## విశ్రాంత ఆర్చ్‌బిషప్ ప్రకాష్ మల్లవరపు మృతి బాధాకరం

**మంత్రి నారా లోకేష్**



(ప్రభాతవార్త–విశాఖపట్నం)

విశాఖపట్నం విశ్రాంత ఆర్చ్‌బిషప్ మోస్ట్ రెవ. డాక్టర్ ప్రకాష్ మల్లవరపు పరలోక పిత్రు పిలుపు పొందడం అత్యంత బాధాకరమని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. ఆయన భౌతికంగా మన మధ్య లేకపోవడం క్రైస్తవ సమాజానికే కాకుండా రాష్ట్రానికి తీరని లోటని అన్నారు.

ఆధ్యాత్మిక సేవకు తన జీవితాన్ని అంకితం చేసిన ప్రకాష్ మల్లవరపు విద్యాధికులైన మతగురువుగా విశిష్ట సేవలు అందించారని కొనియాడారు. విజయవాడ బిషప్‌గా, కడప బిషప్‌గా, ఏలూరు (తరువాయి 8వ పేజీలో)

### హుటాహుటిన బయలుదేరిన

## హోంమంత్రి అనిత



గాజువాక, జూన్ 8, ప్రభాతవార్త:

విజయనగరం పర్యటనలో ఉన్న రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత.. ప్రమాద తీవ్రతను తెలుసుకుని తన కార్యక్రమాలను రద్దు చేసుకుని నేరుగా విశాఖకు బయలుదేరారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఐటీ మంత్రి నారా లోకేష్ కూడా ఘటనపై ఆరా (తరువాయి 8వ పేజీలో)

## స్టీల్ ప్లాంట్ అగ్ని ప్రమాద బాధితులకు దేవన్‌రెడ్డి పరామర్శ

గాజువాక,జూన్ 8,ప్రభాతవార్త :

విశాఖ స్టీల్ ప్లాంట్ ఎస్ఎంఎస్–1, ఎస్ఎంఎస్–2 విభాగాల్లో జరిగిన అగ్ని ప్రమాద ఘటనపై వైకాపా గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త తిప్పల శ్రీనివాస దేవన్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదంలో గాయపడి స్టీల్ ప్లాంట్ జనరల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను ఆయన సోమవారం పరామర్శించారు. బాధితులకు అందుతున్న వైద్య సహాయంపై వైద్యులను (తరువాయి 8వ పేజీలో)





### తిప్పల శ్రీనివాస దేవన్ రెడ్డి ఆధ్వర్యంలో..

## 'కూటమి ప్రభుత్వం వెన్నుపోటుకు రెండేళ్లు'

(ప్రభాతవార్త–విశాఖపట్నం)

'కూటమి ప్రభుత్వం వెన్నుపోటుకు రెండేళ్లు' కార్యక్రమంలో భాగంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం వారం గాజువాకలో టౌన్ హాల్ సమావేశం నిర్వహించారు. బీసీ రోడ్డులోని అగ్నికుల క్షత్రియ కళ్యాణ మండపంలో జరిగిన ఈ సమావేశానికి గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త తిప్పల శ్రీనివాస దేవన్ రెడ్డి అధ్యక్షత వహించారు.

ఈ కార్యక్రమానికి ఉత్తరాంధ్ర రీజినల్ కోఆర్డినేటర్ కురసాల కన్నబాబు, పార్టీ పొలిటికల్ అడ్వైజరీ కమిటీ సభ్యుడు తిప్పల నాగిరెడ్డి, జిల్లా పార్టీ అధ్యక్షుడు కె.కె. రాజు, నియోజకవర్గ పరిశీలకుడు పసుపులేటి బాలరాజు, రాష్ట్ర అధికార ప్రతినిధి కొండా రాజీవ్ గాంధీ హాజరయ్యారు.







నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో జరిగిన వైఫల్యాలను ప్రజలకు విస్తృతంగా వివరించాలని పార్టీ శ్రేణులకు సూచించారు. ఎన్నికల సమయంలో (తరువాయి 8వ పేజీలో)

### వైసీపీ మాజీ ఎంపీ వందల కోట్ల

## భవన నిర్మాణాన్ని ఆపండి

- అక్రమ టీడీఆర్‌లను రద్దు చెయ్యండి
- జనసేన నేత పీతల మూర్తి యాదవ్ డిమాండ్

విశాఖపట్నం,జూన్ 8, ప్రభాతవార్త :

విశాఖకి చెందిన వైఎస్ఆర్ కాంగ్రెస్ మాజీ ఎంపీ ఎంవివి సత్యనారాయణ ఎంవీవీ పీక్ పేరిట విశాఖ నగర నడిబొడ్డున ఉన్న సిరిపురంలో నిర్మిస్తున్న బహుళ (తరువాయి 8వ పేజీలో)



## స్టీల్ ప్లాంట్ అగ్ని ప్రమాద బాధితులకు దేవన్‌రెడ్డి పరామర్శ

(7వ పేజీ తరువాయి)

అడిగి తెలుసుకున్నారు. క్షతగాత్రులకు అత్యుత్తమ వైద్యం అందించాలని కోరారు. అనంతరం మార్చురీ వద్దకు చేరుకున్న దేవన్‌రెడ్డి.. ప్రమాదంలో మృతి చెందిన కార్మికుల పార్థివ దేహాలకు పూలమాలలు వేసి ఘన నివాళు లర్పించారు. పుట్టెడు దుఃఖంలో ఉన్న మృతుల కుటుంబ సభ్యులను ఓదార్చి, వారికి పార్టీ పరంగా, వ్యక్తిగతంగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

యాజమాన్యం ఆదుకోవాలి.. ఈ సందర్భంగా దేవన్‌రెడ్డి మాట్లాడుతూ.. పరిశ్రమల్లో కార్మికుల భద్రతకు యాజమాన్యాలు ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. భవిష్యత్తులో ఇలాంటి పునరావృతం కాకుండా కఠినమైన రక్షణ చర్యలు చేపట్టాలన్నారు. మృతుల కుటుంబాలకు, క్షతగాత్రులకు స్టీల్ ప్లాంట్ యాజమాన్యం వెంటనే గరిష్ఠ పరిహారం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట స్థానిక నాయకులు, కార్మిక సంఘాల ప్రతినిధులు ఉన్నారు.

## ప్రమాద బాధితుల్లో ఇద్దరి పరిస్థితి విషమం

విశాఖపట్నం, జూన్ 8(ప్రభాత వార్త )

విశాఖ స్టీల్ ప్లాంట్ లో సోమవారం సాయంత్రం సంభవించిన ఘోర ప్రమాదం లో కాలిన గాయాలకు గురైన ఆరుగురు క్షతగాత్రులను నగరం లోని ఎంజీఎం సెవెన్ హిల్స్ షిలానగర్ కిమ్స్ ఐకాన్ కార్పొరేట్ ఆసుపత్రులలో చేర్చి జిల్లా యంత్రాంగం మెరుగైన చికిత్స లను అందిస్తోంది. వీరిలో తీవ్రంగా గాయపడిన కాంట్రాక్టు ఉద్యోగులు జి. సూరిబాబు (55) కె. పైడిరాజు (57) శాశ్వత ఉద్యోగి పి. శ్రీనివాసరావు (51) ఎంజిఎం –సెవెన్ హిల్స్ హాస్పిటల్ లోఅత్యవసర చికిత్స పొందుతున్నారు. మిగిలిన ముగ్గురు శాశ్వత ఉద్యోగులైన ఆర్. మల్లిఖార్జున రావు (41)జి. అర్జున అప్పారావు (58) బి. సత్యానంద్ (38)లు షీలా నగర్ కిమ్స్ –ఐకాన్ ఆసుపత్రి లో చికిత్స పొందు తున్నారు. వీరిలో సెవెన్ హిల్స్ ఆసుపత్రి బర్న్స్ అత్యవసర వైద్య విభాగం లో చికిత్స పొందుతున్న ఇద్దరు పరిస్థితి విషమం గా ఉన్నట్టు ఆసుపత్రి వైద్యులు జిల్లా అధికారులకు వెల్లడించారు. ఇదిలావుండగా సెవెన్ హిల్స్ ఆసుపత్రి లో ప్రమాదం భాదితులకు అందుతున్న వైద్య చికిత్స లను భీముని పట్నం ఆర్డీఓ సంగీత్ మాధుర్ ఎప్పటికి అప్పుడు పర్యవేక్షస్తుండగా , కిమ్స్ –ఐకాన్ ఆసుపత్రి లో ప్రమాద బాదితులకు అందుతున్న చికిత్స లను గోపాలపట్నం ఎంఆర్ఓ సీహెచ్వి రమేష్ పర్యవేక్షస్తున్నారు. కాగా కిమ్స్ –ఐ కాన్ ఆసుపత్రి లో చికిత్స పొందుతున్న ముగ్గురు పరిస్థితి కొంతవరకు నిలకడగా ఉన్నట్టు అక్కడి వైద్య వర్గాలు అధికారులు కు వెళ్ళడిం చాయి.

## విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రమాద స్థలాన్ని పరిశీలించిన కేంద్ర, రాష్ట్ర మంత్రులు

(ప్రభాతవార్త–విశాఖపట్నం)

విశాఖ స్టీల్ ప్లాంట్‌లో జరిగిన ప్రమాద ఘటన నేపథ్యంలో కేంద్ర మంత్రులు కుమారస్వామి, రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత, విశాఖ ఎంపీ ఎం. శ్రీభరత్, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్ సోమవారం రాత్రి ప్రమాద స్థలాన్ని సందర్శించి పరిస్థితిని సమీక్షించారు.

ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని పరిశీలించిన వారు, ఘటనకు దారితీసిన పరిస్థితులపై ప్లాంట్ ఉద్యోగులు, అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ప్రమాదం ఏ విధంగా జరిగిందనే అంశంపై ప్రాథమిక సమాచారం సేకరించి, సహాయక చర్యల పురోగతిని సమీక్షించారు.

గాయపడిన కార్మికులకు అందుతున్న వైద్యసేవలు, బాధిత కుటుంబాలకు అందిస్తున్న సహాయంపై కూడా అధికారులు వివరించారు. ఘటనపై సమగ్ర విచారణ చేపట్టి, భవిష్యత్తులో ఇటువంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా అవసరమైన భద్రతా చర్యలు తీసుకోవాలని మంత్రులు అధికారులను ఆదేశించినట్లు సమాచారం.

## జూన్ 17న విశాఖలో ప్రాంతీయ విజయోత్సవ వేడుకలు

**అభివృద్ధి గాథలు, ప్రాజెక్టుల పురోగతిని ప్రతిబింబించేలా ఏర్పాట్లు చేయాలి**

**అధికారులకు జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ ఆదేశాలు**

విశాఖపట్నం, జూన్ 8, ప్రభాతవార్త :



రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తవుతున్న సందర్భంగా ఈ నెల 17న విశాఖపట్నంలో ప్రాంతీయ విజయోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ తెలిపారు. ఈ వేడుకల నిర్వహణకు సంబంధించిన అంశాలను సోమవారం కలెక్టరేట్ మీటింగు హాలులో అధికారులకు సూచనప్రాయంగా చెప్పారు. రాష్ట్రంలో అమరావతి, తిరుపతి, విశాఖపట్నం నగరాల్లో ప్రాంతీయ విజయోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్లు పేర్కొంటూ విశాఖలో నిర్వహించే కార్యక్రమంలో జిల్లాలో గత రెండేళ్ల కాలంలో సాధించిన అభివృద్ధి, చేపట్టిన ప్రాజెక్టుల పురోగతిని ప్రతిబింబించేలా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో వివిధ రంగాల్లో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలపై సమగ్ర నివేదికలు సిద్ధం చేయాలని సూచించారు. ఐటీ, నైపుణ్యాభివృద్ధి (స్కిల్ డెవలప్‌మెంట్), విద్యా రంగాల్లో సాధించిన పురోగతిని ప్రాధాన్యంగా తీసుకుని వివరాలను సిద్ధం చేయాలన్నారు. అలాగే ప్రజలకు ఉపయోగపడిన పథకాలు, విజయవంతమైన కార్యక్రమాలకు సంబంధించిన విజయగాథలను సేకరించి నివేదికల్లో పొందుపరచాలని సూచించారు. వేడుకల సందర్భంగా ఏర్పాటు చేయనున్న ప్రదర్శన స్టాళ్లలో గత రెండేళ్లలో జిల్లాలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు వివరాలను ఆకర్షణీయంగా ప్రదర్శించాలని అధికారులకు సూచించారు. జేసీ గొబ్బిళ్ల విద్యాధరి, డీఆర్వో ఎం. విశ్వేశ్వరనాయుడు, అన్ని విభాగాల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## విమ్స్ లో సర్జరీ విభాగం మరింత పటిష్టం

**సంక్లిష్టమైన సర్జరీలను చేసేందుకు సిద్ధమవుతున్న నూతన డైరెక్టర్ డాక్టర్ వి మన్మధరావు**

**70 ఏళ్ల వృద్ధుడికి విజయవంతంగా సర్జరీ పూర్తి చేసిన డైరెక్టర్**



విశాఖపట్నం జూన్ 8 ( ప్రభాత వార్త )

విశాఖ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్( విమ్స్ )నందు జనరల్ సర్జరీ విభాగం మరింత పటిష్టం కానుంది. ఇప్పటివరకు కేవలం ముగ్గురు అసిస్టెంట్ ప్రొఫెసర్ స్థాయి డాక్టర్లు సర్జరీలు చేయగా ఇప్పుడు జనరల్ సర్జరీ విభాగంలో ఎంతో అనుభవిజ్ఞులైన ప్రొఫెసర్ డాక్టర్ వి.మన్మధరావు విమ్స్ నూతనంగా డైరెక్టర్‌గా భాద్యతలు స్వీకరించటంతో ఆ విభాగం మరింత పటిష్ఠంగా మారింది. డాక్టర్ మన్మధరావు సోమవారం 70 ఏళ్ల వృద్ధుడికి సంక్లిష్టమైన లాప్ కోలిసిస్టెక్టమీ సర్జరీను విజయవంతంగా పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనరల్ సర్జరీ విభాగంలో ప్రస్తుతం ఉన్న డాక్టర్లు రోగులకు మెరుగైన అందిస్తున్నారని రోగులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు తనవంతుగా . ఇకపై సంక్లిష్టమైన సర్జరీలను చేయటం జరుగుతుందన్నారు.. విమ్స్ ఆస్పత్రి నందు సంక్లిష్టమైన సర్జరీలు చేసేందుకు అవసరమైన పరికరాలు అందుబాటులో ఉన్నాయన్నారు.. ఆసుపత్రి వాతావరణం కూడా ఎంతో ప్రశాంతంగా రోగులు వేగంగా కోలుకునే విధంగా ఉందన్నారు.. రోగులు విమ్స్ ఆస్పత్రి నందు వైద్య సేవలను వినియోగించుకొని వేగంగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ సర్జరీలో డాక్టర్ శ్రీకాంత్ వైద్య బృందం పాల్గొన్నారు.

# విశాఖ స్టీల్ ప్లాంట్‌లో భారీ పేలుడు







(7వ పేజీ తరువాయి)

గాయపడిన మిగతా వారిని అత్యవసరంగా నగరంలోని వివిధ ప్రైవేట్ ఆసుపత్రులకు స్టీల్ ప్లాంట్ జనరల్ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘోర ప్రమాదానికి గల కారణాలపై ఉక్కు యాజమాన్యం ఉన్నత స్థాయి విచారణకు ఆదేశించింది. సాంకేతిక లోపమా లేక నిర్వహణలో నిర్లక్ష్యమా అనే కోణంలో అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాద వార్తతో ఉక్కునగరంలో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి.

### సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి.. ఉన్నత స్థాయి దర్యాప్తునకు ఆదేశం

కార్మికులు ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమన్నారు. రెవెన్యూ, పోలీస్, వైద్య, అగ్నిమాపక శాఖలు సమన్వయంతో సహాయక చర్యల్లో పాల్గొనాలని, క్షతగాత్రులకు అత్యుత్తమ వైద్య సేవలు అందించాలని విశాఖ జిల్లా కలెక్టర్, సీపీలను ఆదేశించారు. ప్రమాదానికి గల కారణాలపై సమగ్ర విచారణ జరపాలని స్పష్టం చేశారు.

### విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రమాదం విషాదకరం: మంత్రి నారా లోకేష్

తెలిపారు. ప్రమాదంలో గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ, వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. క్షతగాత్రులకు చికిత్స అందించడంతో పాటు ప్రమాద స్థలంలో సహాయక చర్యలను ప్రభుత్వ యంత్రాంగం నిరంతరం పర్యవేక్షిస్తోందని మంత్రి వెల్లడించారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని, అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని నారా లోకేష్ భరోసా ఇచ్చారు.

### విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రమాదంపై స్పీకర్ అయ్యన్నపాత్రుడు తీవ్ర దిగ్భ్రాంతి

తీవ్రంగా కలచివేసిందని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రమాదంలో ఇప్పటికే 8 మంది కార్మికులు ప్రాణాలు కోల్పోవడం, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మరో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉండటం పట్ల స్పీకర్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ఆయన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ ఊహించని కష్టకాలంలో బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుంది అని భరోసా ఇచ్చారు.

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులకు అత్యుత్తమ వైద్య సేవలు అందించాలని సంబంధిత అధికారులను కోరారు, అలాగే వారు త్వరగా కోలుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

## విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రమాదంపై కన్నబాబు దిగ్భ్రాంతి

(ప్రభాతవార్త–విశాఖపట్నం)



విశాఖ స్టీల్ ప్లాంట్‌లో జరిగిన ఘోర ప్రమాదంపై మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రీజినల్ కోఆర్డినేటర్ కురసాల కన్నబాబు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో కార్మికులు మృతి చెందడం అత్యంత విషాదకరమని పేర్కొంటూ, మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

ప్రమాదంలో గాయపడిన కార్మికులకు అత్యుత్తమ వైద్య సేవలు అందించి, వారు త్వరగా కోలుకునేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రమాదానికి దారితీసిన కారణాలపై సమగ్ర విచారణ జరిపి, నిర్లక్ష్యానికి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు తగిన నష్టపరిహారం అందించడంతో పాటు, బాధిత కుటుంబాల పునరావాసం, సంక్షేమానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలవాలని సూచించారు. విశాఖ స్టీల్ ప్లాంట్ వంటి కీలక పరిశ్రమల్లో కార్మికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని, భవిష్యత్తులో ఇటువంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన భద్రతా ప్రమాణాలను అమలు చేయాలని కురసాల కన్నబాబు పేర్కొన్నారు.

## పారిశ్రామికాభివృద్ధికి ఆంధ్రప్రదేశ్‌కు అపార అవకాశాలు

(7వ పేజీ తరువాయి)

సమగ్ర భూ వినియోగ ప్రణాళికలు, పారిశ్రామిక, లాజిస్టిక్స్ కారిడార్లు, పట్టణ మౌలిక సదుపాయాల విస్తరణ, సుస్థిర రవాణా వ్యవస్థలు, పోర్టు ఆధారిత ఆర్థికాభివృద్ధి కార్యక్రమాలను వీఎంఆర్‌డీఏ ప్రాధాన్యతగా అమలు చేస్తోందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్లు, ఫుడ్ ప్రాసెసింగ్, ఔషధ తయారీ, పునరుత్పాదక ఇంధనం, గ్రీన్ హైడ్రోజన్, సముద్ర ఆధారిత పరిశ్రమల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. పారిశ్రామిక కారిడార్లు, మల్టీమోడల్ లాజిస్టిక్స్ పార్కులు, పారిశ్రామిక క్లస్టర్లు, డిజిటల్ మౌలిక సదుపాయాలు రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి ప్రధాన చోదకశక్తులుగా నిలుస్తున్నాయని చెప్పారు. తీర ప్రాంత అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ మధ్య సమతుల్యత సాధించే దిశగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సీఆర్‌జెడ్--2019 నిబంధనలు ఆంధ్రప్రదేశ్‌కు కొత్త అవకాశాలను తెరుస్తున్నాయని పేర్కొన్నారు. పోర్టు ఆధారిత పరిశ్రమలు, తీర ప్రాంత పర్యాటకం, సముద్ర మౌలిక సదుపాయాలు, లాజిస్టిక్స్, బ్లూ ఎకానమీ విస్తరణకు ఇవి దోహదపడుతున్నాయని వివరించారు. పెట్టుబడుల ఆకర్షణతో పాటు యువతకు ఉపాధి అవకాశాల కల్పన, ఎగుమతుల పెరుగుదల, సుస్థిర ఆర్థికాభివృద్ధి లక్ష్యాల సాధనకు రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర పారిశ్రామిక పర్యావరణ వ్యవస్థను రూపొందిస్తోందని తేజ్ భరత్ తెలిపారు. రాష్ట్ర అభివృద్ధిలో పరిశ్రమలు కీలక భాగస్వాములుగా ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీఐఐ ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు పాల్గొన్నారు.

## జిల్లాలో యోగా వేడుకలను విజయవంతంగా నిర్వహించాలి

(7వ పేజీ తరువాయి)

జిల్లాలో నాలుగు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు.

సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో జూన్ 09, 12, 15, 21వ తేదీన నాలుగు ఈవెంట్లు జరుగుతాయన్నారు. రెండు కార్యక్రమాలను ప్రముఖ పర్యాటక ప్రాంతాల్లో నిర్వహించనున్నట్లు చెప్పారు. మిగిలిన కార్యక్రమాల్లో ఒకదాన్ని "ఎక్స్–సర్వీస్‌మెన్" ప్రత్యేక జిల్లా థీమ్‌తో జూన్ 09వ తేదీన ఉదయం 6.00 గంటలకు శాతవాహన చివరి బస్ స్టాప్ సమీపంలోని నేవీ ఆధ్వర్యంలోని ఫ్లీట్ స్పోర్ట్స్ మైదానంలో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అలాగే జూన్ 21న రాష్ట్రస్థాయి వేడుకల్లో భాగంగా జిల్లాలో 1000 మందిని భాగస్వామ్యం చేస్తూ నిర్వహించతలపెట్టిన కార్యక్రమానికి ఇప్పటి నుంచే ముందస్తు ఏర్పాట్లు చేయాలని చెప్పారు. 9న జరిగే కార్యక్రమంలో నేవీకి చెందిన 300 మంది, ఎన్‌సీసీకి చెందిన 200 మంది, ఎక్స్–సర్వీస్‌మెన్ విభాగానికి చెందిన 50 మంది, జిల్లా అధికారుల నుంచి మరో 50 మంది పాల్గొంటారని, మొత్తం 600 మంది భాగస్వామ్యం అవుతారని తెలిపారు. కార్యక్రమం నిర్వహణకు నోడల్ అధికారిగా డి.ఆర్.డి.ఎ. ప్రాజెక్టు డైరెక్టర్ వ్యవహరిస్తారని చెప్పారు. కార్యక్రమానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

అదేవిధంగా ఈ నెల 12, 15 తేదీల్లో జిల్లాలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాలైన రుషికొండ, ముడసర్లోవ గోల్ఫ్ క్లబ్ ప్రాంతాల్లో ప్రత్యేక యోగా వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఒక్కో ఈవెంట్లో 500 మందిని భాగస్వామ్యం చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల విజయవంతమైన నిర్వహణకు అవసరమైన మౌలిక వసతులు, భద్రతా చర్యలు, పాల్గొనేవారికి సౌకర్యాలు కల్పించాలని పర్యాటక శాఖ అధికారులను ఆదేశించారు. జిల్లాలో నిర్వహించే అన్ని యోగా కార్యక్రమాల్లో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, యువత, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు విస్తృతంగా పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. యోగా ద్వారా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ తోడ్పడాలని సూచించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి, డీఆర్వో ఎం. విశ్వేశ్వరనాయుడు, జీవీఎంసీ అదనపు కమిషనర్ సత్యవేణి, డి.ఆర్.డి.ఎ. పీడీ లక్ష్మీపతి, టూరిజం అధికారిణి మాధవి, ఆయుష్ విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## భవన నిర్మాణాన్ని ఆపండి

(7వ పేజీ తరువాయి)

అంతస్తుల నిర్మాణం అనుమతులను రద్దు చేయటంతో పాటు అక్రమంగా కేటాయించిన టిడిఆర్ బాండ్లను రద్దు చెయ్యాలని జనసేన మాజీ కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన సోమవారం పీజిఆర్ఎస్ లో జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్‌కు వినతిపత్రం అందజేశారు. విశాఖ జీవీఎంసీ జారీచేసిన టిడిఆర్ బాండ్ పైన విచారణ జరిపి టిడిఆర్ బాండ్ కోసం గుర్తించిన భూమిని ఎంవీవీ సత్య నారాయణ నుంచి వెంటనే స్వాధీనం చేసుకోవాలని కోరారు. విశాఖపట్నం జిల్లా, బ్లాక్ నెం:9, వాల్తేరు వార్డు టౌన్ సర్వే నంబర్ 75–3,4 పార్ట్ 75, సిరిపురం మెయిన్ రోడ్డు లో ఈ అక్రమ నిర్మాణం తిరిగి ప్రారంభమైందని పేర్కొన్నారు. అక్రమ టి.డి.ఆర్ ల తో కడుతున్న ఇది చెల్లుబాటు కాదని, ఈ టి డి ఆర్ బాండ్లు జారీ చేయగానే అందుకు సంబంధించిన స్థలాన్ని జీవీఎంసీ వెంటనే స్వాధీనం చేసుకోవాలని కోరారు.

### చర్చి భూమిలో అక్రమంగా నిర్మాణం

"ఈ కాన్వేషన్ బాపిస్టు చేర్చేస్ అఫ్ నార్తన్ సిరికార్స్ చర్చ్ పై యాజమాన్య హక్కులు కోసం న్యాయస్థానాలలో పలు కేసులు న్యాయ వివాదాలలో పెండింగ్ ఉండగా మరియు భవన నిర్మణాలకు సంబంధించి ప్లాన్ అనుమతులకు అవసరమైన ఈసి, స్థల డాక్యుమెంట్లు, గతంలో యూఎల్ సి క్లియరెన్స్ వంటి డాక్యుమెంట్లు పూర్తి స్థాయిలో సమర్పించకపోయిన నిబంధలనలు విరుద్ధముగా టీ డీ ఆర్ లాంటివి మంజూరు చేయకూడదు. అంతేకాకుండా ఇందులో వినియోగించిన 128 కోట్లు విలువ చేసే టీడీఆర్ లు కాకినాడలో మున్సిపల్ కార్పొరేషన్ లొ సురేష్ నగర్ కన్వెర్టబుల్ స్టేడియం పేరుతో 128 కోట్లు టిడిఆర్ ల జారీ లొ పలు అవకతవకలు అక్రమాలు జరిగాయిని మరియు ఆ అక్రమ టీడీఆర్ ల రద్దు విషయమై హై కోర్టు లొ కేసు విచారణలో పెండింగ్ ఉన్నది.

ఈ టి డి ఆర్ బాండ్ల విషయంలో అక్రమాలకు పాల్పడిన కాకినాడ లో సర్పవరం సబ్ రిజిస్టార్ ను ప్రభుత్వం సస్పెండ్ చేసింది. అధికారిపై చర్యలు తీసుకున్న ప్రభుత్వం అక్రమంగా మంజూరైన టిడిఆర్ బాండ్లను రద్దు చేయకపోవడం గమనార్హం. " అని పేర్కొన్నారు.

"కావున కాన్వేషన్ బాపిస్టు చేర్చేస్ అఫ్ నార్తన్ సిరికార్స్ చర్చ్ కి సంబందించిన దినకర్ త్యాగరాజ్ అనే వ్యక్తి పేరుతో 1800 గజాలకు నాలుగు రెట్లు అంటే సుమారు రూ. 64 కోట్ల రూపాయిల విలువగల ఇచ్చిన అక్రమ టీడిఆర్ ను రద్దు చేయాలి .

ఈ భవన నిర్మాణ అదనపు ఫ్లోర్ లు సెట్ బ్యాక్ డీవియేషన్ కోసం వినియోగించిన 128 కోట్లు విలువ చేసే అక్రమ టీడీఆర్ లు కాకినాడలో మున్సిపల్ కార్పొరేషన్ లొ సురేష్ నగర్ కన్వెర్టబుల్ స్టేడియం పేరుతో భారీ కుంభకోణం జరిగినందున హైకోర్టులొ (పిల్–36/2024) కేసు పెండింగ్ ఉన్నందున, యాజమాన్య హక్కులు కోసం న్యాయస్థానాలలో పలు కేసులు న్యాయ వివాదాలలో పెండింగ్ ఉన్నందున నిబంధనలు కు విరుద్ధంగా కేటాయించిన భవన అనుమతులను రద్దు చేసి అక్కడ జరుగుతున్న అక్రమ నిర్మాణ పనులు నిలిపివేసి సంబంధిత అదికారులపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని" కోరారు.

### టౌన్ ప్లానింగ్ డైరెక్టర్ కు బెదిరింపులు

### అయినా ఆగని అనుమతులు

"ప్రస్తుత డిటిపిసి డైరెక్టర్ విద్యుల్లతను ఈ భవనం అనుమతుల విషయంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ మాజీ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ గత ఏడాది జూలై 24న ఆమె కార్యాలయానికి వెళ్లి తుపాకితో బెదిరించినట్లు ప్రముఖ పత్రికల్లో వార్తలు వచ్చాయి. అయినప్పటికీ బెదిరించిన సత్యనారాయణ పైన, లంచాల తీసుకుందన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న డైరెక్టర్ విద్యుల్లత పైన ప్రభుత్వం చర్యలు తీసుకోలేదు. పైగా ఇంత అక్రమాలతో కూడిన ఎంవివి పీక్ భవన నిర్మాణ పనులను లోపాయికారిగా తిరిగి ప్రారంభించేందుకు అనుమతులు మంజూరు చేశారు." అని పేర్కొన్నారు

### వారం రోజుల్లో వాయు వేగంతో ఫైల్

"ఇందుకు సంబంధించిన ఫైలు వారం రోజుల్లో అన్ని విభాగాలను దాటుకొని డిటిపిసి విద్యుల్లత ముందుకు చేరటం అవినీతి కథకు సాక్ష్యంగా మారింది. 2025 ఆగస్టు 24వ తేదీ నుంచి విద్యుల్లత దగ్గర పెండింగ్లో ఉన్న ఫైలు 2026 మే 27వ తేదీన జీవీఎంసీ సీసీపీ ప్రభాకర్ రావు వద్దకు వచ్చింది. అదేరోజు ప్రభాకర్ రావు కొన్ని షార్ట్ ఫాల్స్ మెన్షన్ చేసి ఫైలు పంపించగా మరుసటి రోజే జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ తన ఆమోదాన్ని తెలిపారు. ఒకరోజు గ్యాప్ తో 30వ తేదీన డిటిసిపి టిపిఏ సిహెచ్ భరత్ కుమార్ రెడ్డి తన రిమార్క్స్ తో అడిషనల్ డిటిపి ఎం రెడ్డి ప్రశాంత్ పంపించారు. అదే రోజు ఆయన తన రిమార్క్స్ తో ఆమోదముద్ర వేసి డిడిటిపి మక్బూల్ అహ్మద్ కి పంపగా ఆయన కూడా యుద్ధ ప్రాతిపదికన వెంటనే అదే రోజు తన ఆమోదంతో ఫైలు పంపించారు. 31వ తేదీన ఫైలు అడిషనల్ డైరెక్టర్ బి శ్రీనివాసులు టేబుల్ మీదకు వెళ్లగా మరుసటి రోజు జూన్ 1న డైరెక్టర్ విద్యుల్లత కు పంపేశారు.

అంటే వైఎస్ఆర్ కాంగ్రెస్కు చెందిన మాజీ ఎంపీ ఫైలు జెట్ స్పీడ్ తో జీవీఎంసీ నుంచి డిటిపిసి డైరెక్టర్ కు ఐదు రోజుల వ్యవధిలో చేరిపోయింది." అని వివరించారు.

### అనుమతులు రాకుండానే పనులు ప్రారంభం

"అనుమతులు రాకముందే పది రోజులుగా పనులు జరుగుతున్నాయి. అనుమతులు రాకుండా పనులు ప్రారంభింప చేసేందుకు అవకాశం కల్పించిన అధికారులను సస్పెండ్ చేయాల్సిందిగా కోరుతున్నాను. హెచ్.ఆర్.ఆర్ కన్స్ట్రక్షన్స్ పేరిట జరుగుతున్న ఈ భవన నిర్మాణానికి అనుమతులు మంజూరు చేసేందుకు టౌన్ ప్లానింగ్ అధికారులు పెద్ద షార్ట్ ఫాల్ జాబితాను సిద్ధం చేశారు. భవనాన్ని నిర్మిస్తున్న వారి నుంచి వాటికి సమాధానాలు రాకుండానే షార్ట్ ఫాల్ పూర్తికాకుండానే నిర్మాణాలు ప్రారంభించడం చట్ట విరుద్ధం .ప్రభుత్వాన్ని ధిక్కరించడమే అవుతుంది. దీనిపై సమగ్ర విచారణ జరిపి ఈ భవనానికి వినియోగించిన ఆరు అక్రమ టిడిఆర్లను రద్దు చేయాలని కోరుతున్నాను. తక్షణమే భవన నిర్మాణం పనులను నిలిపివేయాలని విజ్ఞప్తి చేస్తున్నాను. ఈ భవనానికి సంబంధించి దినకర్ త్యాగరాజు పేరిట మంజూరు చేసిన ఆరు టీ డీఆర్ బాండ్లపై ఇటు హైకోర్టులోను అటు రాష్ట్ర ప్రభుత్వ విజిలెన్స్ విభాగంలోనూ విచారణ జరుగుతున్నందున తుది నివేదిక వచ్చేవరకు వాటిని సస్పెండ్ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అక్రమ టిడిఆర్లను భవన నిర్మాణ అనుమతుల కోసం వినియోగించినందున భవన నిర్మాణ అనుమతులను కూడా తక్షణమే రద్దు

**హుటాహుటిన బయలుదేరిన**

## హోంమంత్రి అనిత

(7వ పేజీ తరువాయి)

తీసి సంతాపం వ్యక్తపరిచారు.

**ప్రతిపక్షాల డిమాండ్:**

మాజీ ముఖ్యమంత్రి, వైకాపా అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఈ ప్రమాదంపై తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ.. పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాల విషయంలో రాజీ పడకూడదని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ప్రమాద స్థలంలో సహాయక చర్యలు పూర్తిస్థాయిలో కొనసాగు తున్నాయి. సాంకేతిక లోపం వల్ల ఈ ప్రమాదం జరిగిందా లేదా నిర్వహణ లోపమా అనే కోణంలో అధికారులు ఉన్నత స్థాయి దర్యాప్తు ప్రారంభించారు.

## 'కూటమి ప్రభుత్వం వెన్నుపోటుకు రెండేళ్లు'

(7వ పేజీ తరువాయి)

ఇచ్చిన హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు.

ఈ సమావేశంలో మాజీ కార్పొరేటర్లు, రాష్ట్ర కమిటీ సభ్యులు, వార్డు అధ్యక్షులు, వార్డు పరిశీలకులు, జిల్లా కమిటీ సభ్యులు, రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, వార్డు స్థాయి అనుబంధ విభాగాల ప్రతినిధులు, సీనియర్ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## విశ్రాంత ఆర్చ్‌బిషప్ ప్రకాష్ మల్లవరపు మృతి బాధాకరం

(7వ పేజీ తరువాయి)

డయాసిస్ అపోస్టొలిక్ అడ్మినిస్ట్రేటర్‌గా, విశాఖపట్నం మెట్రోపాలిటన్ ఆర్చ్‌బిషప్‌గా, శ్రీకాకుళం అపోస్టొలిక్ అడ్మినిస్ట్రేటర్‌గా వివిధ బాధ్యతల్లో సేవలందిస్తూ సమాజాభివృద్ధికి కృషి చేశారని గుర్తుచేశారు. వినయం, ప్రేమ, సేవాభావంతో పేదల సంక్షేమానికి అంకితభావంతో పనిచేసిన ఆదర్శవంతమైన ఆధ్యాత్మిక నాయకుడిగా ఆయన నిలిచిపోతారని లోకేష్ పేర్కొన్నారు. విశ్రాంత ఆర్చ్‌బిషప్ ప్రకాష్ మల్లవరపు ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, ఆయనకు ఘన నివాళులు అర్పించారు.

## ప్రమాద బాధితుల్లో ఇద్దరి పరిస్థితి విషమం

విశాఖపట్నం జూన్ 8 (ప్రభాత వార్త)

విశాఖ స్టీల్ ప్లాంట్ లో సోమవారం సాయంత్రం సంభవించిన ఘోర ప్రమాదం లో కాలిన గాయాలకు గురైన ఆరుగురు క్షతగాత్రులను నగరం లోని ఎంజీఎం సెవెన్ హిల్స్ షిలానగర్ కిమ్స్ ఐకాన్ కార్పొరేట్ ఆసుపత్రులలో చేర్చి జిల్లా యంత్రాంగం మెరుగైన చికిత్స లను అందిస్తోంది. వీరిలో తీవ్రంగా గాయపడిన కాంట్రాక్టు ఉద్యోగులు జి. సూరిబాబు (55) కె. పైడిరాజు (57) శాశ్వత ఉద్యోగి పి. శ్రీనివాసరావు (51) ఎంజిఎం –సెవెన్ హిల్స్ హాస్పిటల్ లోఅత్యవసర చికిత్స పొందుతున్నారు. మిగిలిన ముగ్గురు శాశ్వత ఉద్యోగులైన ఆర్. మల్లిఖార్జున రావు (41)జి. అర్జున అప్పారావు (58) బి. సత్యానంద్ (38)లు షీలా నగర్ కిమ్స్ –ఐకాన్ ఆసుపత్రి లో చికిత్స పొందు తున్నారు. వీరిలో సెవెన్ హిల్స్ ఆసుపత్రి బర్న్స్ అత్యవసర వైద్య విభాగం లో చికిత్స పొందుతున్న ఇద్దరు పరిస్థితి విషమం గా ఉన్నట్టు ఆసుపత్రి వైద్యులు జిల్లా అధికారులకు వెల్లడించారు. ఇదిలావుండగా సెవెన్ హిల్స్ ఆసుపత్రి లో ప్రమాదం భాదితులకు అందుతున్న వైద్య చికిత్స లను భీముని పట్నం ఆర్డీఓ సంగీత్ మాధుర్ ఎప్పటికి అప్పుడు పర్యవేక్షస్తుండగా , కిమ్స్ –ఐకాన్ ఆసుపత్రి లో ప్రమాద బాదితులకు అందుతున్న చికిత్స లను గోపాలపట్నం ఎంఆర్ఓ సీహెచ్వి రమేష్ పర్యవేక్షస్తున్నారు. కాగా కిమ్స్ –ఐ కాన్ ఆసుపత్రి లో చికిత్స పొందుతున్న ముగ్గురు పరిస్థితి కొంతవరకు నిలకడగా ఉన్నట్టు అక్కడి వైద్య వర్గాలు అధికారులు కు వెళ్ళడిం చాయి.

## ఖరీఫ్ సీజన్ రైతులకు విత్తనాలు పంపిణీ

### పాడేరు పిఎసిఎస్ ఛైర్మన్ దప్పోడి వెంకటరమణ

పాడేరు,జూన్8, ప్రభాతవార్త



పాడేరు మండలం తుంపాడ పంచాయతీ రైతు సేవా కేంద్రంలో రెండు పంచాయతీలకు సంబంధించిన ఖరీఫ్ సీజన్‌లో రైతులకు పచ్చిరొట్ట, వేప నూనె ఎరువు, విత్తనాలు, వరి విత్తనాలు శ్రీ ధృతి, శ్రీకాకుళం సన్నలు తో పాటు విత్తన శుద్ది (సీడోమునస్) పేకట్లు ఒక్క రైతుకి 30 కేజీలు వరి విత్తనాల బేగులను అగ్రికల్చర్ అసిస్టెంట్ అధ్వర్యంలో పాడేరు పిఎసిఎస్ ఛైర్మన్ దప్పోడి వెంకటరమణ, చేతుల మీదుగా రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి కుజ్జెలి గ్రామ కమిటీ అధ్యక్షులు అర్జులు రవి, బూత్ కన్వీనర్లు సోంనాయుడు, ప్రేమ్ కుమార్, రైతులు పాల్గొన్నారు.

## రోడ్డు మరమ్మతులు చేయాలంటూ ఎంపీడీవోకు బీజేపీ నాయకుల వినతి

గూడెం కొత్తవీధి జూన్ 8, ప్రభాతవార్త



గూడెం కొత్తవీధి మండలం, పరిధిలోని తీముల బంధ నుండి కుంకుమపూడి వరకు గల ప్రధాన రహదారి గతంలో కురిసిన భారీ వర్షాల కారణంగా పూర్తిగా కొట్టుకుపోయింది. ప్రస్తుతం ఈ రోడ్డు పూర్తిగా అధ్వాన్నంగా తయారవడంతో ప్రయాణికులు, స్థానిక గిరిజనులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో, సదరు రహదారిని వెంటనే మరమ్మతులు చేపట్టి రవాణా సౌకర్యాన్ని పునరుద్ధరించాలని కోరుతూ భారతీయ జనతా పార్టీ నాయకులు స్థానిక మండల పరిషత్ అభివృద్ధి అధికారిని కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు కాకురు శేఖర్, టీడీపీ నాయకుడు ముక్కలి మహేష్, బీజేపీ గిరిజన మోర్చా కార్యవర్గ సభ్యుడు మచ్చరాస రామ్ కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

## రాష్ట్రంలో అన్ని జిల్లాల కంటే అల్లూరి జిల్లా సెన్సెస్‌లో మొదటి స్థానం

### జిల్లాలో లక్ష్యానికి మించి 'సెన్సస్' (జనగణన) పూర్తి, 111.67 శాతం నమోదుతో రికార్డు -జిల్లా కలెక్టర్ నిశాంతి వెల్లడి -అధికారులకు, సిబ్బందికి కలెక్టర్ అభినందనలు

పాడేరు,జూన్8, ప్రభాతవార్త



ప్రభాతవార్త రాష్ట్రంలోనే అన్ని జిల్లాల కంటే అల్లూరు జిల్లా అత్యంతంగా మొదటి స్థానంలో నిలవడం, జిల్లాలో జనగణన (సెన్సస్) ప్రక్రియ అత్యంత విజయవంతంగా, లక్ష్యానికి మించి పూర్తయిందని జిల్లా కలెక్టర్ టి.నిశాంతి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా యంత్రాంగం పక్కా ప్రణాళికతో వ్యవహరించడం వల్ల 111.67 శాతం నమోదుతో ప్రక్రియను విజయవంతంగా ముగించినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జనగణనకు సంబంధించిన ముఖ్య వివరాలను వెల్లడించారు. లక్ష్యాన్ని మించిన నమోదు, 2011 సెన్సెస్ అంచనా ప్రకారం ఈసారి ఎక్కువ జనగణన నమోదైంది, జనాభా వివరాలు, జిల్లాలో అంచనా ప్రకారం 6,73,252 మంది ఉందాలని భావించగా, క్షేత్రస్థాయిలో అన్ని హౌసింగ్ బ్లాకులను నిశితంగా పరిశీలించి, అంతకుమించి మొత్తం 7,51,818 మందికి జనగణనను విజయవంతంగా పూర్తి చేశారు. అందుకుగాను విస్తృత అవగాహన కార్యక్రమాలు, జనగణనపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు (గ్రామీణ ప్రాంతాల్లో దండోరా (టామ్, టామ్) వేయించడం, వారపు సంతల్లో పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ ద్వారా మైకుల్లో ప్రచారం చేయడం, 'కళాజాతా' ప్రదర్శనల ద్వారా విస్తృతమైన ప్రచార కార్యక్రమాలు నిర్వహించామని కలెక్టర్ తెలిపారు.

### అధికార యంత్రాంగానికి అభినందనలు

ఈ సెన్సెస్ కార్యక్రమాన్ని ఇంతటి విజయవంతంగా పూర్తి చేయడానికి రాత్రింబవళ్లు శ్రమించిన జిల్లా అధికారులను, సిబ్బందిని కలెక్టర్ అభినందించారు. "జనగణన ప్రక్రియను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ (మానిటరింగ్) విజయవంతం చేసిన జిల్లా జాయింట్ కలెక్టర్ తిరుమాని శ్రీపూజ వారికి, జిల్లా రెవెన్యూ అధికారి ఎంవీఎస్ లోకేశ్వరరావు వారికి ప్రత్యేక అభినందనలు. అలాగే క్షేత్రస్థాయిలో అద్భుతంగా పనిచేసిన 11 మంది ప్రత్యేక ఇన్‌చార్జ్ అధికారులు, ఎంపీడీఓలు సూపర్‌వైజర్లు మరియు ఎన్యూమరేటర్లందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేసిన జిల్లా కలెక్టర్. అలాగే భారత ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లాలో అదే జోష్ తో (సార్) స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కూడ పూర్తిచేయాలని అధికారులను, అందుకు సంబంధించిన సిబ్బందిని కలెక్టర్ ఆదేశించారు.

## పెద్ది సినిమాలో ఉన్న డైలాగులను తక్షణమే తొలగించాలి : అల్లూరి యూత్ డిమాండ్

డుంబ్రిగూడ, జూన్ 07 ప్రభాతవార్త

పెద్ది సినిమాలో గిరిజనులకు కించపరిచే విధంగా డైలాగులను ప్రచురించడానికి డుంబ్రిగూడ మండలం అల్లూరి యూత్ తీవ్రంగా ఖండించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజనుల మనోభావాలకు దెబ్బతీసే కించపరిచే విధంగా ఉన్న డైలాగులను సినిమా నుంచి తొలగించాలని వారు డిమాండ్ చేశారు. గిరిజన సంస్కృతి సాంప్రదాయలను మనోభావాలను భంగం కలిగించే విధంగా డైలాగులను పెట్టిన సినిమా తీసిన డైరెక్టర్ బుచ్చిబాబు గిరిజనులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అల్లూరి యూత్ సూర్య ప్రకాష్ నవ సూర్య యువత తదితరులు పాల్గొన్నారు.

## పద్మాపురంలో మన డబ్బులు- మన లెక్కలపై అవగాహన

అరకు రూరల్, జూన్ 8, ప్రభాతవార్త




అరకులోయ మండలం పద్మాపురంలో సోమవారం మన డబ్బులు - మన లెక్కలు పై ఎస్‌హెచ్‌జి సభ్యులకు అవగాహన కార్యక్రమం జరిగింది. వెలుగు ఏపి ఎం కృష్ణారావు నేతృత్వంలో, లీగల్ కోఆర్డినేటర్ ఎల్‌సి దాసు ఆధ్వర్యంలో పద్మాపురం గ్రామంలో ఎండిఎంఎల్, గ్రామ సంగం సమావేశం ప్రత్యేకంగా ఏర్పాటు చేసి మన డబ్బులు- మన లెక్కలు పై అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో పాల్గొన్న లీగల్ కోఆర్డినేటర్ ఎల్ సి దాసు, స్త్రీ నిధి మేనేజర్ నానాజీ, సిసి అప్పలరాజులు మాట్లాడుతూ మన డబ్బులు- మన లెక్కలు, ఐ.వి.ఆర్ కాల్ గురించి వివరించి. సభ్యులు చేత యాప్ ను ప్రారంభించారు. అలాగే శ్రీనిధి, సిఐఎఫ్, బ్యాంకు లింకేజీ కొత్త రుణాలు కోసం, పాత అప్పులు వాయిదాలు ప్రకారం ప్రతి నెల జమ చేయాలని చెప్పారు. అదేవిధంగా ఏసిఎల్‌పి బయోమెట్రిక్ గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఈఓఏలు వరహాలు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణ మనందరి బాధ్యత : అరకు సర్కిల్ సిఐ ఎల్.హిమాగిరి

డుంబ్రిగూడ, జూన్ 07 ప్రభాతవార్త



రోడ్డు ప్రమాదాల నివారణ మన అందరి బాధ్యతన ని అరకులోయ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎల్ హిమగిరి చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ ఆదేశాల మేరకు మండలంలోని సాగర పంచాయతీ గ్రామంలో స్థానిక ఎస్సై సురేష్ ఆధ్వర్యంలో సోమవారం రోడ్డు భద్రతతో పాటు మహిళలపై గౌరవంగా మెలగాలని సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని, హెల్మెట్ ధరించి ద్విచక్ర వాహనాలు నడపాలని ఇటువంటి నియమ నిబంధనలు పాటించినప్పుడే మన గమ్యానికి సురక్షితంగా చేరుకోగలమని సిఐ చెప్పారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది గ్రామ ప్రజలు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## ఈ వారం ముంచంగిపుట్టులో జిల్లా స్థాయి 'పీజీఆర్ఎస్' కార్యక్రమం

### మండలానికి సంబంధించిన పూర్తి సమాచారంతో తప్పనిసరిగా జిల్లా, మండల స్థాయి అధికారులకు హాజరు కావాలి : కలెక్టర్ టి.నిశాంతి ఆదేశం

పాడేరు, జూన్8,ప్రభాతవార్త

నేలకొక నియోజకవర్గంలో 4 సందర్శనలు జరుగుతాయాని, అందులో భాగంగా పిజిఆర్ఎస్ కార్యక్రమం ఈ నెల 10వ తేదీ బుధవారం అరకు నియోజకవర్గ, ముంచంగిపుట్టు మండలంలో నిర్వహించనున్నట్లు, అందుకు జిల్లా స్థాయి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేది కార్యక్రమానికి జిల్లా,మండల స్థాయి అధికారులందరూ తప్పనిసరిగా పూర్తి సమాచారంతో హాజరుకావాలని జిల్లా కలెక్టర్ నిషాంతి.టి ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు. నెలకోక నియోజకవర్గం, వారానికి 1 మండలం చొప్పున, ఇప్పటికే డుంబ్రిగూడ, అనంతగిరి, హుకుంపేట మండలాలు సందర్శించి పిజిఆర్ఎస్ ఘనంగా నిర్వహించడం జరిగిందని, అందులో భాగంగా పిజిఆర్ఎస్ కార్యక్రమం బుధవారం అరకువేలీ నియోజకవర్గం, ముంచంగిపుట్టు మండలంలో జిల్లా కలెక్టర్ వారి ఆదేశాల మేరకు పిజిఆర్ఎస్ కార్యక్రమన్ని నిర్వహించనున్నట్లు జిల్లా రెవిన్యూ అధికారి (ఎఫ్ఏసి) ఎంవీఎస్ లోకేశ్వరరావు, కెఆర్ఆర్‌సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, పిజిఆర్ఎస్ నోడల్ అధికారి బి.నీలకంఠరావు తెలియజేశారు. ప్రజల నుండి వచ్చే అర్జీలను స్వీకరించి, వాటిని త్వరితగతిన పరిష్కరించేందుకు ఈ కార్యక్రమాన్ని మండల స్థాయిలో పిజిఆర్ఎస్ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. కావున ముంచంగిపుట్టు మండల పరిధిలోని ప్రజలు పిజిఆర్ఎస్ కార్యక్రమనికి హాజరై వారి సమస్యలను విన్నవించు కోవచ్చునని తెలియజేశారు. జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు అందరూ ఉదయం 10.గంటలకు మండల అభివృద్ధి అధికారి వారి కార్యాలయ సమావేశ మందిరంలో నిర్ణీత సమయానికి ముందుగా పూర్తి సమాచారంతో హాజరుకావాలని, నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. ఈ అవకాశాన్ని మండల పరిధిలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, తమ సమస్యలపై అర్జీలను అందజేయవచ్చని జిల్లా కలెక్టర్ తెలియజేశారు.

## పెదబయలు మండలంలో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఆదిత్య వర్మ విస్తృత పర్యటన

### పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలు, పీఎం జన్మన్-పి ఏం జూగా పనుల ఆకస్మిక పరిశీలన

పాడేరు,జూన్8, ప్రభాతవార్త



అల్లూరి జిల్లా, పెదబయలు మండలంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను, అంగన్వాడి సెంటర్, విద్యా సంస్థలను ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఆదిత్య వర్మ మంగళవారం నాడు ఆకస్మికంగా తనిఖీ చేసి పనులను పరిశీలించారు. మండలం లోని సీతగుంట జీటీడబ్ల్యూఏ ఆశ్రమ పాఠశాల, బాలుర పాఠశాల-1, పాఠశాల-2లతో పాటు స్థానిక అంగన్‌వాడీ కేంద్రాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల ల్లో బాత్రూములు, మంచినీటి ఏర్పాట్లు అందులోని అందుతున్న వసతులు, రికార్డురూమ్ , స్టోర్ రూం ను పీఓ క్షుణ్ణంగా తనిఖీ చేశారు. పనులు జరుగుతున్న తీరుపై ఈఈ ట్రైబల్ వెల్ఫేర్ వారిని స్వయంగా మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాల్లో పని తీరును పరిశీలించి, నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సిబ్బందిని ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రత్యేక దృష్టి, గిరిజన ప్రాంతాల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పీఎం జన్మన్, పీఎం జుగా పథకాల కింద జరుగుతున్న వివిధ నిర్మాణ, సంక్షేమ పనులను ప్రాజెక్టు అధికారి క్షేత్రస్థాయిలో పరిశీలించి మండల అభివృద్ధి అధికారి సిబ్బందితో పనులపై సమీక్షించి, పురోగతిపై సంతృప్తి వ్యక్తం చేస్తూనే, నిర్దేశిత గడువులోగా నాణ్యతతో పనులను పూర్తి చేయాలని అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించారు. నిధుల దుర్వినియోగానికి తావులేకుం డా, అర్హులైన గిరిజనులందరికీ ఈ పథకాల ఫలాలు అందేలా చూడాలని స్పష్టం చేశారు. ఈ పర్యటనలో మండల అభివృద్ధి అధికారి శ్యాంసుందర్, ఏటిడబ్ల్యూఓ స్వర్ణలత, ఈఈ ట్రైబల్ వెల్ఫేర్ రాము, ఐసిడిఎస్ సిడిపిఓ శ్రావంతి, మండల స్థాయి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## సురవరంలో 121 మంది రైతులకు భూ హక్కు పట్టాల పంపిణీ

గూడెం కొత్తవీధి,జూన్ 8, ప్రభాతవార్త



ఆంధ్రప్రదేశ్ రీ సర్వే ప్రాజెక్టు లో భాగంగా భూ హక్కు పత్రాల పంపిణీ కార్యక్రమాన్ని జీ.కే విధి మండలం లకవరపు పేట పంచా యతీ పరిధిలో గల సురవరం గ్రామంలో సుమారు 121 మంది రైతులకు రాజముద్ర కలిగిన పట్టాదార్ పాస్ పుస్తకాలను పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. రీ సర్వే డిప్యూటీ తాహసిల్దార్ దుమంతి సత్యనారాయణ అధ్యక్షతన ఎంపీపీ బోయిన కుమారి, తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు పొత్తురు కొండలరావు ఆధ్వర్యంలో పట్టాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సత్యనారాయణ,తాజా మాజీ సర్పంచ్ కంకిపాటి వీరేంద్ర ప్రసాద్,వీఆర్వో శ్రీనివాస్,తాజా మాజీ ఉపసర్పంచ్ గంగాధర్, కూటమి నాయకులు రామారావు పాల్గొన్నారు.

## నీలవరంలో రైతులకు "భూ" పాసు పుస్తకాల పంపిణీ

గూడెంకొత్తవీధి,జూన్ 8, ప్రభాతవార్త



మండలంలోని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మ కంగా చేపట్టిన "మీ భూమి--మీ హక్కు" కార్యక్రమం మండలంలోని నీలవరం గ్రామం లో రైతులకు రాజముద్ర కలిగిన పట్టాదార్ పాస్ పుస్తకాలను పంపిణీ చేశారు. గూడెం కొత్తవీధి తహసీల్దార్ హెచ్. అన్నాజీరావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో స్థానిక ఎంపీటీసీ,తెలుగుదేశం పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పసుపులేటి నాగమణి రైతులకు పట్టాదార్ పాస్ పుస్తకాలను అందజేశారు. భూ రికార్డుల నవీకరణ ద్వారా రైతులకు తమ భూములపై స్పష్టమైన యాజమాన్య హక్కులు కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఈ సందర్భంగా రైతులు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, తాజా మాజీ వార్డు సభ్యులు,పేసా గ్రామ కమిటీ సభ్యులు,గ్రామ పెద్దలు,రైతులుతదితరులు పాల్గొన్నారు. గ్రామంలో జరిగిన ఈ కార్యక్రమం రైతుల్లో ఆనందోత్సాహాలను నింపింది.

## జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీ కల్పించాలి

### జర్నలిస్టుల హెల్త్ స్కీమ్‌కి సిఎస్ఆర్ నిధులు కేటాయించాలని జాయింట్ కలెక్టర్‌కు వినతి

విశాఖపట్నం జూన్ 8, ప్రభాతవార్త



ప్రతి ఏటా మాదిరిగానే జిల్లాలో అక్రిడేటేడ్ జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్ పాఠశాలల్లో 50% ఫీజు రాయితీ కల్పించాలని కోరుతూ జిల్లా జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరికి సోమవారం జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం పిజిఆర్ఎస్ కార్యక్రమంలో జేసీని కలిసి కోరారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే వర్కింగ్ జర్నలిస్ట్ హెల్త్ స్కీమ్ (డబ్ల్యూజెహెచ్ఎస్) కింద జర్నలిస్టులు చెల్లించాల్సిన ప్రీమి యంకు సిఎస్ఆర్ నిధులు కేటాయించి సహకరించాలని మరొక వినతి పత్రంలో అభ్యర్థిం చారు. ఎంతోమంది జర్నలిస్టులు అనారోగ్యంతో ఉన్నారని ఈ స్కీమ్ కింద వైద్యం పొందాల్సిన అవసరం ఉందన్నారు. వీటిపై సానుకూలంగా స్పందించిన జాయింట్ కలెక్టర్ సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఏపీయూడబ్ల్యూజే జిల్లా ప్రధాన కార్యదర్శి కె.చంద్రమోహన్, గాజువాక యూనిట్ అధ్యక్షుడు కె పరశురాం, లోకల్ న్యూస్ పేపర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పి. సత్యనారాయణ, సీనియర్ జర్నలిస్టు మొల్లి కమల్ కుమార్, ప్రతినిధులు ఎం.శ్రీహరి, ఐడిజేఎస్ ప్రతినిధి శ్రీనివాస్ నేతల పాల్గొన్నారు.

## హామీల అమలులో కూటమి విఫలం

### రాష్ట్ర వైకాపా సంయుక్త కార్యదర్శి గుడివాడ లతీష్

గాజువాక,జూన్ 8,ప్రభాతవార్త



కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చి రెండేళ్లు పూర్తైనా ఎన్నికల హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని రాష్ట్ర వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సంయుక్త కార్యదర్శి గుడివాడ లతీష్ విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ గాజువాక బీసీ రోడ్డులోని అగ్నికుల క్షత్రియ కల్యాణమండపంలో 'వెన్నుపోటు రెండేళ్లు' పేరిట సోమవారం టౌన్ హాల్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో వైకాపా ప్రాంతీయ సమన్వయకర్త కురసాల కన్నబాబు, మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, జిల్లా అధ్యక్షులు కేకే రాజు, గాజువాక వైకాపా సమన్వయ కర్త తిప్పల దేవన్‌రెడ్డి, రాష్ట్ర వైకాపా సంయుక్త కార్యదర్శి గుడివాడ లతీష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గుడివాడలతీష్ మాట్లాడుతూ రాష్ట్రంలో విద్య, వైద్యం, సంక్షేమ పథకాల అమలు పడకేసిందని, పెరుగుతున్న ప్రజా సమస్యలపై ప్రభుత్వం స్పందించడం లేదని ఆరోపించారు. ప్రజలకు జరుగుతున్న అన్యాయాలపై వైకాపా నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, వివిధ విభాగాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## జీవీఎంసీ నార్త్ జోన్ పీజీఆర్ఎస్‌కు 8 ఫిర్యాదులు

మాధవధార,జూన్ 08, ప్రభాతవార్త

మాధవధార ఉడా కాలనిలో గల జీవీఎంసీ నార్త్ జోన్ ఆఫీసులో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు 8 వినతులు వచ్చాయి.ఈ వినతులను జోనల్ కమీషనర్ బొడ్డేపల్లి రాము పరిశీలించి లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకొని వినతులు స్వీకరించారు. వీటిలో యూసిడి-4, టౌన్ ప్లానింగ్-2,రెవిన్యూ-1, ఇంజనీరింగ్-1 ఫిర్యాదులు వచ్చాయి. వాటిని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో పబ్లిక్ వర్క్ ఈఈ పద్మావతి, ఏపీడీ పుణ్యవతి, ఆర్ఓ బాబూరావు, ఆఫీసు సూపరిండెంట్ శ్రీనివాస్, పబ్లిక్ హెల్త్ అధికారులు ఉన్నారు.




## సుందరయ్య కాలనీలో బ్రహ్మంగారి కల్యాణం.. భారీ అన్నసమారాధన

గాజువాక,జూన్ 8,ప్రభాతవార్త



గాజువాక నియోజకవర్గం 71, 72వ వార్డుల పరిధిలోని సుందరయ్య కాలనీలో శ్రీశ్రీశ్రీ మద్దివిరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి, మాతా గోవిందాంబ వార్ల కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా శ్రీ కామాక్షి విశ్వ బ్రాహ్మణ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గత 23 ఏళ్లుగా నిర్వహిస్తున్న భారీ అన్నసమారాధన కార్యక్రమాన్ని కాలనీలో ఘనంగా ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి టీడీపీ రాష్ట్ర పరిశీలకులు, ఏపీ వీవర్స్ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ పప్పు రాజారావు ముఖ్య అతిథిగా హాజరై ప్రసాద వితరణను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆ యన మాట్లాడుతూ గత 23 ఏళ్లుగా అసోసి యేషన్ ఆధ్వ ర్యంలో ఇంతటి బృహత్తర ఆధ్యా త్మిక, సామాజిక కార్య క్రమాన్ని నిర్వి ఘ్నంగా కొన సాగించడం అభి నందనీయమన్నారు. బ్రహ్మం ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని కోరుకున్నారు. కార్యక్రమంలో కామాక్షి విశ్వ బ్రాహ్మణ వెల్ఫేర్ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.


వార్త VAARTHA CLASSIFIEDS CLASSIFIEDS వార్త VAARTHA CLASSIFIEDS

CHANGE OF NAME

★ I, BOLLA ROJA W/O BOLLA CHAKRAPANI previously called ATLA ROJAKUMARI R/O 27-1-149/4, OFFICIAL COLONY, SRINAGAR, GAJUWAKA, VISAKHAPATNAM, now changed my name from ATLA ROJAKUMARI to BOLLA ROJA. Henceforth I will be called as BOLLA ROJA for all purposes.
(Ro.No.9637)

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.



इंडियन बैंक ఇండియన్ బ్యాంక్

విశాఖపట్నం బ్రాంచ్

చిరునామా: 30-9-3, మొదటి అంతస్తు, శారదా వీధి, సెంటర్ పాయింట్ హోటల్ ఎదురుగా, దాబాగార్డెన్స్, విశాఖపట్నం. ఫోన్: 80194 96888

ఇ-వేలం ద్వారా వాహనము అమ్మకం

| ఋణగ్రహీత పేరు & చిరునామా అకౌంట్ నెంబరు | వాహనం వివరములు | రిజర్వు ధర & ధరావత్తు | ఇ-వేలం తేది & సమయం |
|---|---|---|---|
| శ్రీ వాకాడ చంద్రశేఖర్, తండ్రి: శంకర్ రావు, ఫ్లాట్ నెం.108, సి బ్లాక్, MVV అపార్ట్‌మెంట్స్, డి నెం.53-41-48, శివాలయం వీధి, KRM కాలనీ, విశాఖపట్నం-530013. | Tata – Nexon, AP39QW8919, Regn. Dt: 27.10.2022 Year of Manufacture: 09-2022 Chassis No.:MAT627306NLJ98038 Engine No.:REVTRN11HXXKA6663 | రూ. 6,72,300/- & రూ.67,230/- | 24.06.2026 ఉ॥ 10.00 గం॥ల నుండి సా॥ 4.00 గం॥ల వరకు |

ఆస్తి ఐడి: IDIB30496941358, బిడ్ పెంపుదల మొత్తం: రూ.10,000/- గుణింపులో హెచ్చింపవలెను.

ఇ-వేలం యొక్క నియమ నిబంధనలు: (1) పూర్తి బిడ్ మొత్తాన్ని చెల్లించిన తర్వాత, RTA కొత్త RC (రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్) కొరకు దరఖాస్తు ప్రకియ జరుగును మరియు తగిన సమయంలో విజేత అయిన బిడ్డర్‌కు RC జారీ చేయబడుతుంది. దీనికి సంబంధించిన అన్ని ఖర్చులను విజేత అయిన బిడ్డరే భరించవలెను. సేల్ సర్టిఫికేట్ మాత్రం వెంటనే జారీ చేయబడుతుంది. (2) EMD మొత్తంతో కూడిన ప్రాసెస్ కంప్లయన్స్ ఫారం సమర్పించడానికి చివరి తేదీ మరియు సమయం: 23.06.2026, సాయంత్రం 4:00 గంటల వరకు. (3) తేది.09.06.2026 నుండి 23.06.2026 వరకు సా॥ 5.00 గం॥ లోపు బ్యాంక్ పనిదినములలో వాహనమును తనిఖీకి అందుబాటులో ఉంటుంది. (4) మరిన్ని వివరాల కొరకు సంప్రదించండి: బ్రాంచ్ మేనేజర్, ఇండియన్ బ్యాంక్, విశాఖపట్నం బ్రాంచ్, మొబైల్ నెం.80194 96888 మరియు ఇ-వేలం కొరకు https://baanknet.com, PSB Alliance Pvt. Ltd., హెల్ప్ డెస్క్ నెం.82912 20220, EMD డిపాజిట్ చేయవలసిన ఖాతా నెం.6097913389, (IFSC Code: IDIB000V026), ఖాతా పేరు: E-Auction EMD A/c.

గమనిక: వాహనము రిజిస్ట్రేషన్ చేసుకొనుటకు వర్తించే స్టాంప్ డ్యూటీ, బదిలీ ఛార్జీలు, ఫీజు వగైరాలు మరియు చట్టపరమైన / నాన్ స్టాట్యుటరి బకాయిలు, పన్నులు, పార్కింగ్ ఛార్జీలు, ఫీజులు వగైరాలు విజయవంతమైన బిడ్డరు/కొనుగోలుదారే భరించవలెను.

తేది: 06.06.2026, ప్రదేశం: విశాఖపట్నం సం/- అధీకృత అధికారి, ఇండియన్ బ్యాంక్



LIC HFL LIC HOUSING FINANCE LTD

LIC హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్

బ్యాక్ ఆఫీస్, 4వ అంతస్తు, ఉత్తర విభాగం, జీవన్ సమృద్ధి, న్యూ ఇన్వెస్ట్‌మెంట్ భవనం, ఎల్ఐసి ఎనెక్స్ భవనం, తిక్కన్న రోడ్డు, విశాఖపట్నం - 530004.

డిమాండ్ నోటీసు

(సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 లోని సెక్షన్ 13(2) క్రింద - జారీ చేయబడిన నోటీసు)

1) ఋణగ్రహీత పేరు మరియు చిరునామా : శ్రీ శ్రీనివాసరావు చేబోలు, డి.నెం.6-50-1, శ్రీనివాసనగర్, ట్వింకిల్ స్కూల్ దగ్గర, పాత గాజువాక, విశాఖపట్నం, ఆంధ్రప్రదేశ్-530026, శ్రీ శ్రీనివాసరావు చేబోలు, ఫ్లాట్ నెం.513, నాల్గవ అంతస్తు, బ్లాక్-ఎ, ఎంవివి & ఎంకె పార్క్, కూర్మన్నపాలెం, గాజువాక, విశాఖపట్నం, ఆంధ్రప్రదేశ్-530032.
లోన్ ఖాతా నెం.లు : 711700011004 (ఏరియా ఆఫీస్ : గాజువాక)
చెల్లించవలసిన బకాయి మొత్తము : తేది.29.04.2026 నాటికి రూ.25,89,315.10 పై (అక్షరాల ఇరవై అయిదు లక్షల ఎనభై తొమ్మిది వేల మూడు వందల పదిహేను రూపాయల పది పైసలు మాత్రమే) + తేది.30.04.2026 నుండి భవిష్య వడ్డీ + అన్ని ఇతర ఛార్జీలు ఈ నోటీసు స్వీకరించిన తేదీ నుండి 60 దినములలోగా చెల్లించవలెను.
డిమాండ్ నోటీసు తేది : 29.04.2026
షెడ్యూలు ఆస్తి వివరములు: షెడ్యూల్-ఎ ఆస్తి: కంపెనీకి తీసుకున్న ఋణాన్ని తిరిగి చెల్లించేందుకు భద్రతగా, మీరు క్రింది తెలుపబడిన ఆస్తిని తనఖా చేసి యున్నారు. విశాఖపట్నం జిల్లా, గాజువాక సబ్ రిజిస్ట్రార్ ఆఫీసు పరిధిలో, విశాఖపట్నం, గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో, గాజువాక మండలం, కూర్మన్నపాలెం గ్రామం, సర్వే నెం.59-1బి, 60-1, 58-3, 52-5సి, పట్టా నెంలు.61 & 62లోని 51158.8 చ॥గ॥లు 44557.266 చ॥గ॥లు లేదా 37255.59 చ॥మీ॥లు విస్తీర్ణంల మొత్తం స్థలం. 1వ ఐటెమ్: సర్వే నెం.59-1బి, 60-1, 58-3లోని ఎ.9.99 సెంట్లు లేదా 48351.6 చ॥గ॥లు లేదా 40428.22 చ॥మీ॥లుకు హద్దులు: తూర్పు : రోడ్డు, దక్షిణం : సర్వే నెం.65లోని భూమి, పడమర: రేవాడ కెనాల్, ఉత్తరం : రోడ్డు.
2వ ఐటెమ్: సర్వే నెం.52-5సిలోని ఎ.0.58 సెంట్లు లేదా 2807.02 చ॥గ॥లు లేదా 2347.1814 చ॥మీ॥లుకు హద్దులు: తూర్పు : సర్వే నెం.52పిలోని ఇతరుల భూమి, దక్షిణం : రోడ్డు, పడమర: రేవాడ కెనాల్, ఉత్తరం : సర్వే నెం.52పిలోని ఇతరుల భూమి.
షెడ్యూల్-బి ఆస్తి: పైన తెలిపిన షెడ్యూల్-ఎలోని 51158.8 చ॥గ॥లు 44557.266 చ॥గ॥లు లేదా 37255.59 చ॥మీ॥లు విస్తీర్ణంల మొత్తం స్థలంలోని 18,077 చ॥గ॥లు లేదా 15.115 చ॥మీ॥ల అవిభాజ్య మరియు అనిర్దేశపు వాటాతో గల స్థలం అందు గల "ఎంవివి & ఎంకె పార్క్" యొక్క బ్లాక్-ఎ, నాల్గవ అంతస్తులోని సూపర్ బిల్టప్ ఏరియా (600.75 చ॥అ॥లు కార్పెట్ ఏరియా, 34.87 చ॥అ॥లు బాల్కనీ ఏరియా, 53.19 చ॥అ॥లు ఔటర్ వాల్స్ (కామన్ ఏరియా 206.19 చ॥అ॥లు), 895 చ॥అ॥లు (గోడలు బాల్కనీ/యుటిలిటీ ఏరియా మరియు అన్ని కామన్ ఏరియాలు మరియు బాల్కనీలుతో సహా) ఫినిష్ లెవల్ వరకు నిర్మించబడిన ఫ్లాట్ నెం.513గా గుర్తించబడిన నివాస ఫ్లాట్. హద్దులు: తూర్పు : ఓపెన్ సెట్ బ్యాక్ స్పేస్, దక్షిణం : ఓపెన్ సెట్ బ్యాక్ స్పేస్, పడమర: కామన్ కారిడార్, ఉత్తరం : ఓపెన్ సెట్ బ్యాక్ స్పేస్.
ఇప్పటి నుండి సెక్యూర్డు ఆస్తి అని పిలువవలెను

2) ఋణగ్రహీత పేరు మరియు చిరునామా : శ్రీ రామముని జగన్మోహన రావు (ప్రైమరీ అప్లికెంట్), ఎంఐజి-2బి 129, వుడా కాలనీ, అనసు వినాయక నగర్, గాజువాక, విశాఖపట్నం, ఆంధ్రప్రదేశ్-530044. శ్రీ రామముని జగన్మోహన రావు, ఫ్లాట్‌నెం.201, 1వ అంతస్తు, ప్లాటు నెం.171, జిఎస్ఆర్ ఎన్‌క్లేవ్, సర్వే నెం.292/2, వార్డు నెం.52, జోన్-5, రామచంద్రానగర్, కణితి గ్రామం, గాజువాక, విశాఖపట్నం, ఆంధ్రప్రదేశ్-530026. శ్రీ రామముని జగన్మోహన రావు, లారస్ ల్యాబ్స్ లిమిటెడ్, ప్లాటు నెం.21, ఫార్మాసిటీ పరవాడ జంక్షన్, ఎగ్జిక్యూటివ్ లెవల్ 5, ఇంజనీరింగ్ & మెయింటెనెన్స్, విశాఖపట్నం, ఆంధ్రప్రదేశ్-531021. శ్రీమతి రామముని ఉష (కో-అప్లికెంట్), ఎంఐజి-2బి 129, వుడా కాలనీ, అనసు వినాయక నగర్, గాజువాక, విశాఖపట్నం, ఆంధ్రప్రదేశ్-530044. శ్రీమతి రామముని ఉష, ఫ్లాట్‌నెం.201, 1వ అంతస్తు, ప్లాటు నెం.171, జిఎస్ఆర్ ఎన్‌క్లేవ్, సర్వే నెం.292/2, వార్డు నెం.52, జోన్-5, రామచంద్రానగర్, కణితి గ్రామం, గాజువాక, విశాఖపట్నం, ఆంధ్రప్రదేశ్-530026.
లోన్ ఖాతా నెం.లు : 711500011473 (ఏరియా ఆఫీస్ : విశాఖపట్నం)
చెల్లించవలసిన బకాయి మొత్తము : తేది.12.05.2026 నాటికి రూ.24,82,632.53 పై (అక్షరాల ఇరవై నాలుగు లక్షల ఎనభై రెండు వేల ఆరు వందల ముప్పై రెండు రూపాయల యాభై మూడు పైసలు మాత్రమే) + తేది.13.05.2026 నుండి భవిష్య వడ్డీ + అన్ని ఇతర ఛార్జీలు ఈ నోటీసు స్వీకరించిన తేదీ నుండి 60 దినములలోగా చెల్లించవలెను.
డిమాండ్ నోటీసు తేది : 12.05.2026
షెడ్యూలు ఆస్తి వివరములు : కంపెనీకి తీసుకున్న ఋణాన్ని తిరిగి చెల్లించేందుకు భద్రతగా, మీరు క్రింది తెలుపబడిన ఆస్తిని తనఖా చేసి యున్నారు. విశాఖపట్నం డిస్ట్రిక్ట్ రిజిస్ట్రేషన్, విశాఖపట్నం మరియు ద్వారకానగర్ సబ్‌డిస్ట్రిక్ట్, గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో, గాజువాక రూరల్ మండలం, కణితి గ్రామం, రామచంద్ర నగర్, సర్వే నెం.292/2, ప్లాటు నెం.171లోని 220 చ॥గ॥లు లేదా 183.94 చ॥మీ॥ల మొత్తం విస్తీర్ణంలో 35 చ॥గ॥లు లేదా 29.26 చ॥మీ॥ల అవిభాజ్య మరియు అనిర్దేశపు వాటాతో గల స్థలం అందు "జిఎస్ఆర్ ఎన్‌క్లేవ్" మొదటి అంతస్తులో 920 చ॥అ॥ల ప్లింత్ ఏరియా (కామన్ ఏరియాలు మరియు బాల్కనీలు), స్టిల్ట్ ఫ్లోర్ నందు 80 చ॥అ॥ల కార్‌పార్కింగ్ ఏరియాతో గల ఫ్లాట్ నెం.201. మొత్తం ఆస్తికి హద్దులు: తూర్పు : ఫ్లాట్ నెం.176, పడమర: ప్లాటు నెం.172, ఉత్తరం : ఫ్లాట్ నెం.170, దక్షిణం: 33 అ॥ల వెడల్పు గల రోడ్డు. క్రింద అంతస్తు నందు గల ఫ్లాట్ నెం.101కు హద్దులు: తూర్పు : కామన్ కారిడార్, పడమర : ఓపెన్ స్పేస్, ఉత్తరం : ఓపెన్ స్పేస్, దక్షిణం : ఓపెన్ స్పేస్.
ఇప్పటి నుండి సెక్యూర్డు ఆస్తి అని పిలువవలెను

3) ఋణగ్రహీత పేరు మరియు చిరునామా : శ్రీ శ్రీనివాస రావు పెందుర్తి (ప్రైమరీ అప్లికెంట్), డి.నెం.38-31-134, గ్రీన్ గార్డెన్స్, మర్రిపాలెం, విశాఖపట్నం, ఆంధ్రప్రదేశ్-530018. శ్రీ శ్రీనివాసరావు పెందుర్తి, ఫ్లాట్ నెం.401, మూడవ అంతస్తు, ప్లాటు నెం.17, రాజ శ్యామల నిలయం, డిఎఆర్ నగర్ ఏరియా, కొత్తపాలెం ఏరియా, గోపాలపట్నం ఎస్ఆర్ఓ, విశాఖపట్నం, ఆంధ్రప్రదేశ్-530027. శ్రీమతి శివ కుమారి అరిసూరి (కో-అప్లికెంట్), డి.నెం.38-31-134, గ్రీన్ గార్డెన్స్, మర్రిపాలెం, విశాఖపట్నం, ఆంధ్రప్రదేశ్-530018. శ్రీమతి శివ కుమారి అరిసూరి, ఫ్లాట్ నెం.401, మూడవ అంతస్తు, ప్లాటు నెం.17, రాజ శ్యామల నిలయం, డిఎఆర్ నగర్ ఏరియా, కొత్తపాలెం ఏరియా, గోపాలపట్నం ఎస్ఆర్ఓ, విశాఖపట్నం, ఆంధ్రప్రదేశ్-530027.
లోన్ ఖాతా నెం.లు : 7003170001536 (ఏరియా ఆఫీస్ : గాజువాక)
చెల్లించవలసిన బకాయి మొత్తము : తేది.17.04.2026 నాటికి రూ.28,66,869.70 పై (అక్షరాల ఇరవై ఎనిమిది లక్షల అరవై ఆరు వేల ఎనిమిది వందల అరవై తొమ్మిది రూపాయల డెబ్బై పైసలు మాత్రమే) + తేది.18.04.2026 నుండి భవిష్య వడ్డీ + అన్ని ఇతర ఛార్జీలు ఈ నోటీసు స్వీకరించిన తేదీ నుండి 60 దినములలోగా చెల్లించవలెను.
డిమాండ్ నోటీసు తేది : 17.04.2026
షెడ్యూలు ఆస్తి వివరములు : కంపెనీకి తీసుకున్న ఋణాన్ని తిరిగి చెల్లించేందుకు భద్రతగా, మీరు క్రింది తెలుపబడిన ఆస్తిని తనఖా చేసి యున్నారు. విశాఖపట్నం, గోపాలపట్నం రిజిస్ట్రేషన్ సబ్ డిస్ట్రిక్ట్, వెంకటాపురం గ్రామం, కొత్తపాలెం ఏరియా, సర్వే నెం.168/1, ప్లాటు నెం.17లోని 266.66 చ॥గ॥లు లేదా 222.96 చ॥మీ॥ల స్థలంలో 26.67 చ॥గ॥లు అవిభాజ్య మరియు అనిర్దేశపు వాటాతో గల స్థలం అందు "రాజ శ్యామల నిలయం", మూడవ అంతస్తులోని 850 చ॥అ॥లు (కామన్ ఏరియాలు మరియు బాల్కనీలుతో సహా గల), స్టిల్ట్ ఫ్లోర్ నందు 100 చ॥అ॥లు కార్ పార్కింగ్ ఏరియాతో గల ఫ్లాట్ నెం.401. మొత్తం ఆస్తికి హద్దులు: తూర్పు : దాడి అప్పాయమ్మ గారి ఇల్లు, దక్షిణం: వేదుల రామ త్రినాధ రావు గారి ప్లాటు నెం.18, పడమర : దాడి వెంకట అప్పారావు గారి ప్లాటు నెం.16, ఉత్తరం : 15 అ॥ల డిఎఆర్ నగర్ లేఅవుట్ రోడ్డు మరియు 15 అ॥ల వెడల్పు నాగేంద్రనగర్ వీకర్ సెక్షన్ కాలనీ, రోడ్డు మొత్తం 30 అ॥ల రోడ్డు. మూడవ అంతస్తు నందు గల ఫ్లాట్ నెం.401 నకు హద్దులు: తూర్పు: లిఫ్ట్, మెట్లు మరియు కామన్ కారిడార్, దక్షిణం : ఓపెన్ టు స్కై, పడమర : ఓపెన్ టు స్కై, ఉత్తరం : ఫ్లాట్ నెం.402.
ఇప్పటి నుండి సెక్యూర్డు ఆస్తి అని పిలువవలెను

పైన చెప్పబడిన ఋణగ్రహీత/ సహ-ఋణగ్రహీత ఎల్ఐసి హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ వారి నుండి ఇంటి కొరకు ఋణం పొందియున్నారు. సదరు ఋణమునకు పైన పేర్కొన్న ఆస్తిని తనఖాగా ఇచ్చియున్నారు. ఋణము యొక్క నియమ, నిబంధనలను అనుసరించి సకాలంలో బకాయిలు చెల్లించకపోవుటచే సదరు ఖాతాను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారి నియమ నిబంధనల ప్రకారము నిరర్థక ఖాతాగా పరిగణించబడినది. కావున ఎల్ఐసి హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ వారు రిజిష్టర్ పోస్టు ద్వారా డిమాండ్ నోటీసును పంపియున్నారు. పంపించిన డిమాండు నోటీసుకు సంబంధించిన తిరుగు రశీదులు / ఋణగ్రహీతలు / సహ-ఋణగ్రహీతలు సంతకములు సరిగా లేకుండా మాకు తిరిగి వచ్చినవి. కనుకనే పత్రికా మూలకముగా మీకు ఈ నోటీసు జారీచేయడమైనది. కావున సదరు ఋణగ్రహీతలు / సహ-ఋణగ్రహీతలు పైన పేర్కొన్న మొత్తములను నోటీసు తేదీ నుండి 60 రోజులలోగా, వడ్డీ మరియు ఇతర ఖర్చులతో సహా చెల్లించవలసినదిగా కోరడమైనది. లేని పక్షంలో పైన పేర్కొన్న చట్టము ప్రకారము ఎల్ఐసి హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ వారు బకాయిని రాబట్టుకొను నిమిత్తం తదుపరి చర్యలు గైకొనుట దిగువ సంతకందారునికి అనివార్యమవుతుంది.

తేది :03.06.2026, ప్రదేశం : విశాఖపట్నం సం/-అధీకృత అధికారి, ఎల్ఐసి హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్




# ఉపమాక వెంకటేశ్వర స్వామి చోరీ సొత్తు స్వాధీనం

## 5 రోజుల్లోనే నిందితుల అరెస్ట్... రూ.17.68 లక్షల విలువైన సొత్తు స్వాధీనం





అనకాపల్లి , జూన్ 8 (ప్రభాత వార్త):

అనకాపల్లి జిల్లా, నక్కపల్లి మండలం, ఉపమాక గ్రామంలోని ప్రసిద్ధి చెందిన శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 2 అర్ధరాత్రి సుమారు 01:00 గంటల సమయంలో భారీ దొంగతనం జరిగింది. ముఖాలకు మాస్కులు ధరించిన ఇద్దరు దొంగలు తౌలత కొండపై దొంగతనానికి ప్రయత్నించి, వీలుకాకపోవడంతో కిందకు దిగి ఆలయంలోకి ప్రవేశించారు. గర్భగుడి ముందున్న ప్రధాన హుండీతో పాటు, ఆండాళమ్మ అమ్మవారి ఆలయం వద్ద ఉన్న హుండీని కట్టర్‌తో కట్ చేసి, భక్తులు సమర్పించిన బంగారం, వెండి కానుకలతో పాటు రూ.1,20,000/- కి పైగా నగదును దొంగిలించారు. ఈ ఘటనపై టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నక్కపల్లి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఈ కేసును అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశించారు. నర్సీపట్నం సబ్ డివిజన్ డీఎస్పీ పోతిరెడ్డి శ్రీనివాసరావు పర్యవేక్షణలో నక్కపల్లి ఇన్‌స్పెక్టర్ మురళి, రూరల్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, కోటవురట్ల, పాయకరావుపేట, ఎస్.రాయవరం ఎస్సైలతో ప్రత్యేక పోలీస్ బృందాలను రంగంలోకి దింపారు. ఈ బృందాలు విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టి, సీసీటీవీ ఫుటేజీలు, సాంకేతిక ఆధారాలు విశ్వసనీయ సమాచారాన్ని సేకరించారు. దర్యాప్తులో భాగంగా ఈనెల 7 తేదీన ఉద్దండపురం బస్ స్టాప్ వద్ద ఇద్దరు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారించగా, తామే ఈ చోరీకి పాల్పడినట్లు నిందితులు అంగీకరించారు.ఈ మేరకు సోమవారం జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆయన కార్యాలయంలో ఇందు సంబంధించి వివరాలు విలేకరులకు తెలియజేశారు.రేవల్ల కొత్తూరు గ్రామం, నక్కపల్లి మండలానికి చెందిన కనిరెడ్డి శ్రీహరి(22), నక్కపల్లి మండలం, రేబాక గ్రామానికి చెందిన గంట్యాడ చిన్న ( 23) అనే ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి దొంగిలించబడిన వస్తువులను , నేరానికి ఉపయోగించిన సామాగ్రిని పోలీసులు పూర్తిగా రికవరీ చేసినట్లు వెల్లడించారు. దొంగిలించిన నగదు రూ.2,38,078, బంగారం కానుకలు 56 గ్రాములు (విలువ సుమారు రూ.8,28,800/-), వెండి కానుకలు 02 కేజీల 600 గ్రాములు (విలువ సుమారు రూ. 7,02,000/-)మొత్తం స్వాధీనం చేసుకున్న సొత్తు విలువ సుమారు రూ.17,68,000/- ఉంటుందని అంచనా వేశారు. ఘటన జరిగిన కేవలం 5 రోజుల వ్యవధిలోనే కేసును అత్యంత చాకచక్యంగా దర్యాప్తు చేసి, నిందితులను అరెస్ట్ చేయడంతో పాటు వంద శాతం రికవరీ సాధించిన డీఎస్పీ పోతిరెడ్డి శ్రీనివాసరావు, సిఐలు మురళి, రామకృష్ణ, అప్పలనాయుడు ప్రత్యేక బృందాలోని ఎస్ఐలు సన్నిబాబు, సాహిబా అంజుమ్, మహమ్మద్ అలీ షరీఫ్, ఇతర సిబ్బందిని జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. వారికి ప్రశంసా పత్రాలు, నగదు రివార్డులను అందజేశారు.ఈ చోరీ ఘటనను దృష్టిలో ఉంచుకుని జిల్లాలోని అన్ని ప్రముఖ దేవాలయాల వద్ద భద్రతా చర్యలను మరింత కట్టుదిట్టం చేయాలని ఎస్పీ అధికారులను ఆదేశించారు. అన్ని ఆలయాల్లో రాత్రి వేళల్లో పోలీసు గస్తీ (పెట్రోలింగ్) పెంచాలని సూచించారు. దేవాలయాల యాజమాన్యాలు, దేవాదాయ శాఖ అధికారులతో సమన్వయం చేసుకుంటూ, ఆలయ ప్రాంగణాల్లో హై-రిజల్యూషన్ సీసీటీవీ కెమెరాల ఏర్పాటు, నైట్ వాచ్‌మెన్ నియామకం , హుండీల భద్రతకు ప్రత్యేక రక్షణ ఏర్పాట్లు (ఐరన్ గ్రిల్స్ వంటివి) చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

# పీజీఆర్ఎస్ అర్జీలను సత్వరమే పరిష్కరించాలి : కలెక్టర్

అనకాపల్లి, జూన్ 8 (ప్రభాతవార్త) :



పీజీఆర్ఎస్ అర్జీలను ఏమాత్రం నిర్లక్ష్యం చేయకుండా, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం జిల్లా కలెక్టరేట్ పిజిఆర్ఎస్ మందిరంలో ప్రజా గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టమ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తో పాటు జాయింట్ కలెక్టర్ శౌర్య మాన్, డిప్యూటీ కలెక్టర్ సుబ్బలక్ష్మి, డి ఆర్ ఓ., వై.సత్యనారాయణ రావుతో కలసి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన దరఖాస్తుదారుల నుంచి 281 వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం వహించరాదన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ప్రతి అర్జీని బాధ్యతగా తీసుకుని నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సూచించారు. ముఖ్యంగా రెవిన్యూ, గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్, ఏడి సర్వే, ఇరిగేషన్, బీసీ వెల్ఫేర్, ఏపీఎస్ఆర్టీసీ, డోమా, తాగునీరు తదితర శాఖలకు సంబంధించిన ఫిర్యాదుల ను ఆలస్యం చేయకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పీజీఆర్ఎస్‌లో నమోదైన అర్జీలను కేవలం సమస్యలను పరిష్కరించడమే ముఖ్యం కాదని, ఫిర్యాదుదారుడు సంతృప్తి చెందేలా క్షేత్రస్థాయిలో విచారణ జరిపి శాశ్వత పరిష్కారం చూపాలని కలెక్టర్ స్పష్టం చేశారు. పీజీఆర్ఎస్ పోర్టల్‌లో నమోదైన ఫిర్యాదులు ఎట్టి పరిస్థితుల్లోనూ పెండింగ్‌లో ఉండకూడదని, గడువు ముగియక ముందే సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లాలోని వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలలకు చేరిన పాఠ్య,రాత పుస్తకాలు



అనకాపల్లి, జూన్ 8,(ప్రభాతవార్త):

కొత్త విద్యా సంవత్సరం త్వరలో ప్రారంభం కానున్న సందర్భంగా అన్ని ఉన్నత, ప్రాథమిక పాఠశాలకు పాఠ్య, రాత పుస్తకాలు పంపిణీ జరిగింది. అనకాపల్లి మండల విద్యాశాఖ అధికారి ఎన్ కే శ్రీదేవి ఆధ్వర్యంలో పుస్తకాలను పాఠశాలకు చర్విసే కార్యక్రమాన్ని వేగవంతం చేశారు. అనకాపల్లి మండలం మేజర్ పంచాయతీ కొత్తూరు రామాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె ఎస్ ఎస్ శాస్త్రి, పెనుమత్స కృష్ణంరాజు లకు సోమవారం పుస్తకాలను సీఆర్పీలు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శారద, భాగ్యలక్ష్మి, సీర్పీల సంఘం జిల్లా అధ్యక్షుడు సబ్బవరపు శంకర్రావు, సిఆర్పిలు పూజారి నీలవేణి, పత్తిపాటి దేవి, పీలా వెంకటేష్, కొర్ని వెంకట అప్పారావు, తులసి, శిరీష, పద్మజ, తదితరులు పాల్గొన్నారు.

# విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రమాదం బాధాకరం : ఎమ్మెల్యే

( అచ్చుతాపురం, జూన్ 8, ప్రభాతవార్త )



విశాఖ స్టీల్ ప్లాంట్‌లో జరిగిన విషాదకర ప్రమాదంలో పలువురు కార్మికులు మృతి చెందడం పట్ల ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. దేశ పారిశ్రామిక రంగానికి వెన్నెముకగా నిలిచిన విశాఖ ఉక్కు కర్మాగారంలో ఇటువంటి ఘటన చోటుచేసుకోవడం అత్యంత బాధాకరమని పేర్కొన్నారు.ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన కార్మికుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, వారి కుటుంబాలకు అండగా నిలవాలని సంబంధిత అధికారులు, యాజమాన్యాన్ని కోరారు. గాయపడిన కార్మికుల కు మెరుగైన వైద్యసేవలు అందించి, వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.కార్మికుల శ్రమ, త్యాగాల తోనే పరిశ్రమలు అభివృద్ధి చెందుతాయని, వారి భద్రతకు అత్యున్నత ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే అన్నారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు.ఈ విషాద సమయంలో బాధిత కుటుంబాలకు ఎలమంచిలి నియోజకవర్గ ప్రజల తరఫున తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నట్లు ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ పేర్కొన్నారు.

# పూడిమడకలో ఉచిత వైద్యశిబిరం

( అచ్యుతాపురం, జూన్ 8, ప్రభాతవార్త )

అచ్యుతాపురం మండలం పూడిమడక గ్రామంలో ఇషాన్ పిల్లల ఆసుపత్రి ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గ్రామ సచివాలయంలో ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు శిబిరం కొనసాగనుంది.శిబిరంలో పిల్లలు, గర్భిణులు, మహిళలు మరియు సాధారణ రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను ఉచితంగా అందజేయనున్నారు. ఎదుగుదల లోపాలు, జ్వరం, వాంతులు, విరోచనాలు, దగ్గు, జలుబు తదితర సమస్యలకు వైద్య సలహాలు ఇవ్వడంతో పాటు రక్తహీనత (అనీమియా) పరీక్షలు కూడా నిర్వహించనున్నట్లు తెలిపారు.పిల్లల వైద్య నిపుణుడు డా. ధర్మిరెడ్డి వెంకట్ (ఎంబీబీఎస్, డీసీహెచ్, పీజీపీఎన్) ఆధ్వర్యంలో శిబిరం నిర్వహించబడుతుందని, గ్రామ ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని నిర్వాహకులు కోరారు. మరిన్ని వివరాలకు 9505166386, 8303073569 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

# గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరల పెంపు రద్దు చేయాలి

## అచ్చుతాపురంలో సీపీఎం నిరసన

( అచ్చుతాపురం, జూన్ 8 ప్రభాతవార్త )




కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తాజాగా పెంచిన గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే రద్దు చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు అచ్చుతాపురం నాలుగు రోడ్ల జంక్షన్‌లో సోమవారం సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. గ్యాస్ సిలిండర్‌ను మోస్తూ ప్రభుత్వాల విధానాలకు వ్యతిరేకంగా నిరసన తెలిపారు.ఈ సందర్భంగా సీపీఎం అచ్చుతాపురం కన్వీనర్ ఆర్.రాము, సీనియర్ నాయకులు కె.రామ సదాశివరావు, కర్రి అప్పారావు మాట్లాడుతూ సామాన్య ప్రజలపై కేంద్ర ప్రభుత్వం వరుసగా భారాలు మోపడం దురదృష్టకరమన్నారు. అంతర్జాతీయ పరిస్థితులను సాకుగా చూపుతూ పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను పెంచడం వల్ల ఇప్పటికే పెరిగిన జీవన వ్యయంతో ఇబ్బందులు పడుతున్న ప్రజలపై మరింత భారం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.ఎల్పీజీ గ్యాస్ సిలిండర్‌పై రూ.29 పెంపు, పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదలతో నిత్యావసర వస్తువుల ధరలు కూడా పెరిగి ప్రజల జీవనం మరింత కష్టతరమవుతోందన్నారు. మరోవైపు విమానయాన రంగానికి ఇంధన ధరల్లో రాయితీలు ఇవ్వడం సామాన్య ప్రజల పట్ల వివక్షకు నిదర్శనమని విమర్శించారు.ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా, గోదావరి బేసిన్‌లో లభిస్తున్న గ్యాస్ నిల్వల్లో రాష్ట్రానికి 50 శాతం వాటా కేటాయించి స్థానిక అవసరాలకు వినియోగించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రజల సహజ వనరులను ఇతర ప్రాంతాలకు తరలించడం సరికాదన్నారు.పెరిగిన ధరలను వెంటనే ఉపసంహరించుకోవాలని, ప్రజలపై ఆర్థిక భారాన్ని తగ్గించే చర్యలు చేపట్టాలని ప్రభుత్వాలను కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కూండ్రపు సోమునాయుడు, ఆర్.లక్ష్మి, ఎ.రమణ, ఎల్.శ్రీనివాసు, కిల్లాడి పెంటారావు, గొర్లి దొరబాబు, ఒడిసెల పైడిరాజు, అల్లు రాజు, పెంటారావు తదితరులు పాల్గొన్నారు.

# నిబద్ధతకు గుర్తింపు.. కష్టానికి ఫలితం !

( అచ్చుతాపురం, జూన్ 8, ప్రభాతవార్త ):



తెలుగుదేశం పార్టీకి అంకితభావంతో సేవలందించిన వారికి సముచిత గుర్తింపు లభిస్తుందనే విషయాన్ని మరోసారి నిరూపిస్తూ రాజ్యసభ అభ్యర్థిగా చింతకాయల విజయ్ నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ శాసనసభ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్, అనకాపల్లి జిల్లా పార్టీ నాయకులతో కలిసి టీడీపీ యువనేత, ధర్మ ఫౌండేషన్ చైర్మన్ కర్రి సాయికృష్ణ రాజ్యసభ అభ్యర్థి చింతకాయల విజయ్‌ను కలిసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కర్రి సాయికృష్ణ మాట్లాడుతూ, పార్టీ అభివృద్ధి కోసం నిస్వార్థంగా పనిచేసే ప్రతి కార్యకర్తకు, నాయకుడికి ఏదో ఒకరోజు అవకాశం తప్పక వస్తుందనే నమ్మకానికి చింతకాయల విజయ్ ఎంపిక నిదర్శనమన్నారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో, నాయకత్వంపై విశ్వాసంతో పనిచేయడంలో చూపిన నిబద్ధతకు ఇది లభించిన గౌరవమని పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ప్రతిభ, సేవాభావం, అంకితభావానికి ఎల్లప్పుడూ ప్రాధాన్యం ఉంటుందని అన్నారు. పార్టీ కోసం నిరంతరం శ్రమించే వారికి తగిన సమయంలో తగిన గుర్తింపు లభిస్తుందనే విశ్వాసాన్ని ఈ ఎంపిక మరింత బలపరిచిందని తెలిపారు.రాజ్యసభ సభ్యుడిగా చింతకాయల విజయ్ రాష్ట్ర ప్రయోజనాలను సమర్థవంతంగా పార్లమెంట్ వేదికగా వినిపిస్తారని, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు చింతకాయల విజయ్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు.

# ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని టిడిపి కమిటీ సభ్యులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలి



ఎలమంచిలి, జూన్ 8, ప్రభాతవార్త:

పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పట్టణ ప్రధాన కార్యదర్శి ఆడారి ఆదిమూర్తి అధ్యక్షతన పట్టణ తెలుగుదేశం పార్టీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మాజీ పార్లమెంట్ సభ్యులు పప్పుల చలపతిరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పప్పుల చలపతిరావు మాట్లాడుతూ జూన్ 14వ తేదీ నుండి జూలై 15వ తేదీ వరకు ఎస్ ఐ ఆర్ కార్యక్రమం జరుగుతుందని, ఈ కార్యక్రమాన్ని తెలుగుదేశం పార్టీ పట్టణ కమిటీ సభ్యులు, క్లస్టర్ ఇంచార్జీలు, యూనిట్ ఇన్చార్జులు, బూత్ ఇన్చార్జులు, క్షేత్ర స్థాయిలో పరిశీలించి మై టిడిపి యాప్ లో అప్లోడ్ చేయాలని, ప్రతి వాటర్ లో క్షుణ్ణంగా పరిశీలించి వాటర్ వెరిఫికేషన్ కార్యక్రమాన్ని రూపొందించాలని, జాతీయ అధ్యక్షులు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ ప్రతిష్ఠాత్మకంగా ఈ ప్రక్రియను పరిశీలిస్తున్నారని, నెల రోజులపాటు క్షేత్రస్థాయి కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. జిల్లా అధికార ప్రతినిధి దాడి రమేష్, క్లస్టర్ ఇంచార్జ్ బొద్దపు శ్రీనివాసరావు, కరణం రవికుమార్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గొర్లె బాబురావు, తెలుగు యువత అధ్యక్షులు నమ్మి రమణ, యూనిట్ ఇన్చార్జులు, వార్డు అధ్యక్షులు,బూత్ ఇన్చార్జులు పాల్గొన్నారు.

# పిజిఆర్ఎస్‌లో కలెక్టర్కు ప్రైవేటు పాఠశాల యాజమాన్యంపై ఫిర్యాదు

ఎలమంచిలి, జూన్ 8, ప్రభాతవార్త:

పట్టణంలోని ధర్మవరానికి చెందిన గొల్లవిల్లి నాగేశ్వరరావు తన పిల్లల పట్ల వివక్షత చూపుతున్నారంటూ సోమవారం ప్రైవేట్ స్కూల్ యాజమాన్యంపై సోమవారం పి జి ఆర్ ఎస్ కార్యక్రమంలో కలెక్టర్కు ఫిర్యాదు చేశారు. పట్టణంలోని స్థానిక ప్రైవేటు స్కూలులోని పిల్లలకు టిసి ఇచ్చి పంపించేస్తున్నామంటూ బెదురుస్తున్నారని దీనిపై తగిన చర్యలు తీసుకోవాలంటూ కలెక్టర్కు ఫిర్యాదు చేశారు.

# యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయండి

## మండల పరిషత్‌లో శిక్షణ తరగతులు

గొలుగొండ, జూన్ 8, ప్రభాతవార్త :



ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా ఈ నెల 21 నిర్వహించే యోగ డే ను విజయవంతం చేయాలని ఎంపీడీవో ఉలబాల శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. మండల పరిషత్ లో ఏర్పాటు చేసిన శిక్షణ తరగతుల్లో ట్రైనర్ ద్వారా యోగ శిక్షణ ఇవ్వడం జరుగుతుందని అన్నారు. ఈనెల 9 నుంచి 17 వరకు సచివాలయాల పరిధిలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామని అన్నారు. అన్ని గ్రామ సచివాలయాల్లో శిక్షణా తరగతులు కొనసాగించి ఈ నెల 21 సందర్భంగా 500 మందితో యోగ డే నిర్వహణకు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రతి మనిషి తన ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకునేందుకు యోగ చేయాలని ఈ సందర్భంగా సూచించారు. ఈ శిక్షణా తరగతులు ద్వారా స్వర్ణ గ్రామం వార్డు సచివాలయం లో ప్రతి 20 మందికి యోగ పై శిక్షణ ఇచ్చి తద్వారా గ్రామాల్లో యోగాను ఆచరించే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. సోమవారం జరిగిన శిక్షణ తరగతుల్లో తహసిల్దార్ వి శ్రీనివాసరావు,, స్వర్ణ గ్రామ సిబ్బంది, పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు, శిక్షణ సిబ్బంది పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వం వెన్నుపోటుకు రెండేళ్లు : మాజీ ఎమ్మెల్యే కంబాల





(ఎస్.రాయవరం,జూన్ 8, ప్రభాతవార్త):

మాజీ ముఖ్యమంత్రివర్యులు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైయస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాలు మేరకు,సోమవారం అడ్డురోడ్ శ్రీనివాస కళ్యాణ మండపం ఫంక్షన్ హాల్‌లో మాజీ శాసనసభ్యులు



పాయకరావుపేట నియోజకవర్గం సమన్వయకర్త కంబాల జోగులు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం వెన్నుపోటుకు రెండేళ్లు పై నియోజకవర్గం స్థాయిలో సమావేశం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా జిల్లా పార్టీ అధ్యక్షులు బొడ్డెడ ప్రసాద్,మాజీ ఎమ్మెల్సీ సూర్యనారాయణ రాజు, రాష్ట్ర కార్యదర్శి వీసం రామకృష్ణ, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ నెంబర్ దత్తుడు సీత బాబు రాజు, నాలుగు మండలాల పార్టీ అధ్యక్షులు మధువర్మ,పైలా రమేష్ ,గెడ్డమూరి శ్రీనివాసరావు ,గొర్ల గోవిందు , జిల్లా ప్రధాన కార్యదర్శి సిరం నరసింహమూర్తి,మాజీ సర్పంచ్ లు,ఎంపిటిసి లు,జడ్పీటీసీలు,పార్టీ నాయకులు,కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# గూడుపమ్మకు వెండి నేత్రాలు బహూకరణ

(నక్కపల్లి /అడ్డు రోడ్డు, ప్రభాతవార్త)



కాకినాడ జిల్లా తేటగుంట తిమ్మాపురానికి చెందిన ప్రముఖ వేదపండితులు, అయ్యప్ప సేవా సంఘం ప్రతినిధి ప్రదీప్ శర్మ రేబాక గూడుపమ్మతల్లిని దర్శించుకున్నారు. గత ఏడాది అమ్మవారిని దర్శించుకున్న ప్రదీప్ శర్మ దంపతులకు సంతానభాగ్యం కలగడంతో ఆయన అమ్మవారికి వెండి నేత్రాలు బహూకరించారు.రూ 10 వేలు విలువైన 2 తులాల వెండి నేత్రాలను అందజేశారు.కుంకుమ పూజ అనంతరం ఆలయ ధర్మకర్త గొట్టుముక్కల శ్రీహరి రాజుకు వీటిని అప్పగించారు. అనంతరం ప్రదీప్ శర్మ దంపతులను అమ్మవారి శేష వస్త్రంతో సత్కరించారు.

# యోగాంధ్రను విజయవంతం చేయండి

## -పీఈటీలకు ఎంపీడీవో ఆదేశం

(నక్కపల్లి, ప్రభాతవార్త )జూన్ 8:



యోగాంధ్ర -2026 కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు పీఈటీలు కృషి చేయాలని, గ్రామస్థాయిలో పలుశాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ లక్ష్యాన్ని చేరుకోవాలని ఎంపీడీవో కె. చలపతిరావు ఆదేశించారు. సోమవారం నక్కపల్లి మండల పరిషత్ కార్యాలయంలో హైస్కూళ్ల పీఈటీలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పలు సూచనలు చేశారు. యోగాంధ్ర ప్రొటోకాల్ ఆసనాలపై విస్తృతంగా శిక్ష ణ ఇవ్వాలన్నారు. ఆయుష్ యోగా ట్రైనర్ దవరసింగి రాంబాబు మాట్లాడుతూ గ్రామాల్లో యోగా ట్రైనర్లను తయారు చేయాలని, యోగాంధ్ర ఎన్ రోల్ మెంట్ త్వరగా చేయాలని కోరారు. నక్కపల్లి మండలంలో టెంపుల్ స్పాట్లలో యోగాంధ్ర విస్తృత స్థాయి యోగాసనాల ప్రదర్శన జరుగుతుందని చెప్పారు. హోం మంత్రి, కలెక్టర్ సహా పలువురు హాజరవుతారని, అందుచేత యోగా శిక్షణ, పోటీలను విజయవంతంగా నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో పీఈటీలు లోవకృష్ణ, చినబాబు, నర్సింగరాజు, రంజాన్, నీరజ, తదితరులు పాల్గొన్నారు.

# మలేరియా వ్యతిరేక మాసోత్సవాలు



## దోమల నియంత్రణ - మలేరియా నివారణ

గొలుగొండ, జూన్ 8, ప్రభాతవార్త

మలేరియా నివారణకు ప్రతి ఒక్కరు ఆరోగ్యశాఖ సిబ్బందికి తమ వంతు సాయం అందించాలని డాక్టర్ శ్యామ్ కుమార్ పిలుపునిచ్చారు. మలేరియా వ్యతిరేక వాషోత్సవాల సందర్భంగా పాత మల్లంపేట పంచాయతీ నిమ్మగడ్డలో ఏర్పాటుచేసిన వైద్య శిబిరం ఆయన మలేరియా నివారణ పై అవగాహన కల్పించారు. దోమల వ్యాప్తిని అరికట్టి మలేరియాను తరిమికొడదామని ఇందుకు ప్రతి కుటుంబం అవగాహనతో మెలగాలన్నారు. మలేరియా అంతానికే ప్రతి ఒక్కరు పాటు పడి తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వ్యాధి నియంత్రణ నిర్మూలనకు సాధ్యమని అన్నారు. ఇంటి పరిసరాలల్లో, కొబ్బరి బొండాలు, పాత టైర్లు, ప్లాస్టిక్ వస్తువుల వ్యర్థాలలో నిలిచి ఉండే నీటి ద్వారా దోమల వ్యాప్తి పెరుగుతుంది అన్నారు. వీటిని ప్రతి శుక్రవారం శుభ్రపరిచి డ్రైడేగా పాటించాలని సూచించారు. జ్వరం వస్తే వెంటనే స్థానిక ఆశా వర్కర్, ఏఎన్ఎం, ఆరోగ్య కార్యకర్త లను సంప్రదించాలన్నారు. అధికంగా ఉంటే డెంగ్యూ, చికెన్ గున్యా, వంటి వ్యాధులకు దారితీస్తుంది అన్నారు. మలేరియా వ్యాప్తి ఎలా చెందుతుందో ఆడ అనోఫిలిస్ దోమ కాటు ద్వారా వ్యాపించే వ్యాధి అన్నారు. ఇది జ్వరం, వణుకు, తలనొప్పి, చెమటలు, నీరసం వంటి లక్షణాలను కలిగిస్తుందన్నారు. మలేరియా వ్యతిరేక వ్యతిరేక మాసోత్సవాలు ఈ నెలాఖరు వరకు నిర్వహిస్తామని ఈ సందర్భంగా తెలిపారు. అనంతరం ర్యాలీ నిర్వహించి వ్యతిరేక దినోత్సవాలు పాటించాలని అన్నారు. కార్యక్రమంలో సూపర్వైజర్ పకీరు నాయుడు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, సహాయ సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# నిపుణ్ భారత్ లక్ష్యాలపై అవగాహన కలిగి ఉండాలి

## జ్ఞానప్రకాష్ కో- ఆర్డినేటర్ బాలాజీ

(నక్కపల్లి, ప్రభాతవార్త )జూన్ 8:



ప్రాథమిక పాఠశాలల్లో 1,2 తరగతులను బోధిస్తున్న ఉపాధ్యాయులందరూ 2026-27 విద్యాసంవ త్సరంలో తప్పనిసరిగా తమ పాఠశాలల్లో చిన్నారులకు చదవడం-వ్రాయడం-చతుర్విధప్రక్రియలపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించేవిధంగా బోధించాలని కోర్స్ కో- ఆర్డినేటర్ వి.బాలాజీ.తెలిపారు.దీనిలో భాగంగా ఈనెల నాలుగునుండి స్థానిక హైస్కూల్‌లో నిర్వహిస్తున్న జ్ఞానప్రకాష్ తరగతులలో ఆయన మాట్లాడుతూ నక్కపల్లి,పాయకరావుపేట,ఎస్.రాయవరం మండలాలనుండి 106 మందికి శిక్షణనివ్వడం జరుగుతుందన్నారు.మండలానికి ముగ్గురుచొప్పున తొమ్మిదిమంది జిల్లా రిసోర్స్ పర్సన్ లను నియమించడం జరిగిందన్నారు. కీ రిసోర్స్ పర్సన్ ,సెంటర్ ఇన్ ఛార్జ్ గా నర్సుపల్లి మోహనరావును నియమించారు.విద్యార్థి కేంద్రీకృత విద్య,జోయ్ ఫుల్ లెర్నింగ్,కృత్యాధార బోధన,ఆటలతో బోధన వంటి నిపుణ్ భారత్ ఉద్దేశ్యాన్ని తెలియజేశారు. ప్రథమ్ డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్ కే.అనూరాధ (సమగ్రశిక్షా) హాజరయ్యారు.నూతన పాఠ్యపుస్తకాలు ఒకటి,రెండు తరగతులకు సంబంధించి అవగాహన కల్పించారు పాఠశాలలు ప్రారంభమయిన తరువాత 35 రోజులు సంసిద్ధతా కార్యక్రమాలు బోధన రోజువారీ బోధించాల్సిన అంశాలను వివరించారు. శిక్షణ తరగతులకు పర్యవేక్షకులుగా స్థానిక మండల విద్యాశాఖాధికారి కే.నరేష్, అదనపు మండలవిద్యాశాఖాధికారి రుత్తల నాగన్నదొర వ్యవహరించారు. ఉపాధ్యాయుడు ఎన్.వి.ఎస్. ఆచార్యులు, సి.ఆర్.ఎమ్.టి.బి.జ్యోతి,వై.దేవి,జి.సూరిశేఖర్,డి.అప్పారావు వారితో ఉన్నారు.

# జాతీయ రహదారిపై వేగాన్ని నియంత్రించేందుకు చర్యలు : ట్రాఫిక్ ఎస్ఐ



ఎలమంచిలి, జూన్ 8, ప్రభాతవార్త:

జాతీయ రహదారి కొక్కిరాపల్లి ,షేకిల్లపాలెం జంక్షన్ వద్ద వాహనాల వేగాన్ని నియంత్రించే విధంగా ట్రాఫిక్ ఎస్ఐ రామకృష్ణ చర్యలు చేపట్టారు. జాతీయ రహదారిపై జంక్షన్ల వద్ద వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు ఈ చర్యలు చేపట్టినట్టు ట్రాఫిక్ ఎస్సే రామకృష్ణ తెలిపారు.

# గంజాయి అక్రమ రవాణాలపై డ్రోన్ సర్వే

గొలుగొండ, జూన్ 8, ప్రభాతవార్త:



గంజాయి నియంత్రణకు మండలంలో పోలీస్ అధికారుల ఆధ్వర్యంలో డ్రోన్ ఎగరవేసి మారుమూల ప్రాంతాలపై నిగ నిర్వహించారు. గొలుగొండ, కృష్ణా దేవి పేట పోలీస్ స్టేషన్ల పరిధిలో ఉన్న మారుమూల ప్రాంతాలపై డ్రోన్ ఎగరవేసి పరిశీలించారు. నర్సీపట్నం డిఎస్పి శ్రీనివాసరావు ఆదేశాలతో రూరల్ సీఐ రేవతమ్మ ఎస్ ఐ రామారావు, రిషికేశ్వరరావు కలిసి వాహన తనిఖీలు నిర్వహిస్తూ డ్రోన్ ద్వారా పరిసరాలను అధ్యయనం చేశారు. గంజాయి,అసాంఘిక కార్యకలాపాలు నిర్వహణపై నిరంతర ప్రక్రియగా తనిఖీలు జరుగుతున్నాయని సీఐ అన్నారు. గంజాయి అక్రమ రవాణాకు వినియోగించే ప్రత్యామ్నాయ మార్గాలు గుర్తించడం, చట్టవ వ్యతిరేక కార్యకలాపాలపై నిఘా ఉంచడం కార్యక్రమం ముఖ్య ఉద్దేశం అన్నారు. గొలుగొండ, కొత్త మల్లంపేట,చిన్నయ్యపాలెం చోద్యం, గింజర్తి,లింగంపేట పంచాయతీలు పరిధిలో ఉన్న గ్రామాల్లో పరిసర ప్రాంతాలను ద్వారా పరిశీలించారు. ఎంజాయ్ అక్రమ రవాణాకు పాల్పడితే చట్టపరమైన చర్యలతో పాటు కఠినమైన శిక్షలు కూడా ఉంటాయని అన్నారు. గంజాయి అక్రమ రవాణా, చట్ట వ్యతిరేక కార్యకలాపాలు నిర్వహించే వ్యక్తులపై నిఘా ఉంచడమే కాకుండా ప్రజలకు తెలిస్తే సమాచారాన్ని ఇవ్వాలని వివరాలు గోపిగా ఉంచి పడతామని అన్నారు. రెండు స్టేషన్లు సిబ్బంది పాల్గొన్నారు.

# ఒడిశా నుంచి గంజాయి తరలిస్తున్న ఇద్దరు రాజస్థాన్ వ్యక్తుల అరెస్ట్

## - 8 కిలోల గంజాయి, దొంగిలించిన మోటార్ సైకిల్, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం

కసింకోట జూన్ 8, ప్రభాతవార్త;



అనకాపల్లి జిల్లా పోలీసు శాఖ మాదక ద్రవ్యాల నిర్మూలనకు చేపడుతున్న ప్రత్యేక చర్యల్లో భాగంగా కశింకోట పోలీసులు మరో కీలక విజయాన్ని నమోదు చేశారు.తేదీ 08-06-2026న కశింకోట పోలీస్ స్టేషన్ పరిధిలోని జాతీయ రహదారి-16 పై నూకాంబిక ఫం క్షన్ హాల్ సమీపంలో అందిన విశ్వసనీయ సమాచా రంపై స్పందించిన పోలీసులు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అల్లు స్వామినాయుడు పర్యవేక్షణలో రెండు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి, ఎస్.ఐ సతీష్ , ఎస్.ఐ కె. లక్ష్మణరావు తమ సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు నిర్వహించారనీ సిఐ అల్లు స్వామి నాయుడు తెలిపారు.తనిఖీల సందర్భంగా ఒడిశా రాష్ట్రం నుండి రాజస్థాన్ రాష్ట్రానికి గంజాయిని అక్రమంగా తరలిస్తున్న ఇద్దరు వ్యక్తుల ను అనుమానాస్పదంగా గుర్తించి అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా, వారి వద్ద సుమారు 8 కిలోల గంజాయి లభ్యమైంది. అనంతరం వారిని అరెస్ట్ చేసి, వారి వద్ద నుండి 8 కిలోల గంజాయి, ఒక మోటార్ సైకిల్ మరియు రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ కేసులో అరెస్టు చేయబడిన నిందితుల ఏ వన్ ఈశ్వర్ గుజ్జర్ ఏ 2 మహమ్మద్ సల్మాన్ మహమ్మద్ సలీం, కూలీ, మంగారి మొహల్లా, వార్డు నెం.15, దేలానా (రూరల్), భిల్వారా జిల్లా, రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన వారిని తెలిపారు.ప్రాథమిక విచారణలో నిందితులు రాజస్థాన్ రాష్ట్రం నుండి అనకాపల్లికి వచ్చి, జాతీయ రహదారిపై పూడిమడక బ్రిడ్జి సమీపంలో పార్క్ చేసి ఉన్న ఒక ద్విచక్ర వాహనాన్ని దొంగతనం చేసినట్లు వెల్లడైందని తెలిపారు. అనంతరం ఆ వాహనాన్ని ఒడిశా రాష్ట్రానికి తీసుకెళ్లి అక్కడ గంజాయిని కొనుగోలు చేసి, అదే వాహనంపై అక్రమంగా రాజస్థాన్‌కు తరలిస్తున్న సమయంలో కశింకోట పోలీసులకు చిక్కినట్లు దర్యాప్తులో తేలిందన్నారు. ఈ మేరకు నిందితులపై యూ/సే 20(బి)(ఐఐ)(బి) ఆర్/డబ్ల్యూ8(సి) ఎన్ డి పి ఎస్ యాక్ట్-1985 303(2) బిఎన్ఎస్ కింద కేసు నమోదు చేసి తదుపరి దర్యాప్తు కొనసాగిస్తుమున్నారు.ఈ ఆపరేషన్‌లో డబ్ల్యూ.ఏ.ఎస్.ఐ మాణికుమారి, పి.సి రమణ, పి.సి గొర్లె శ్రీనివాసరావు, పి.సి గోపి సమర్థవం తంగా వ్యవహరించి నిందితులను పట్టుకోవడంలో కీలక పాత్ర పోషించారు.మాదక ద్రవ్యాల అక్రమ రవాణాపై అనకాపల్లి జిల్లా పోలీసు శాఖ కఠిన చర్యలు కొనసాగిస్తోందని, గంజాయి, ఇతర మాదక ద్రవ్యాలకు సంబంధించిన సమాచా రాన్ని ప్రజలు పోలీసులకు అందించి సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. ఈ కేసును విజయవం తంగా ఛేదించి నిందితులను అరెస్ట్ చేసి, 8 కిలోల గంజాయి, దొంగిలించిన మోటార్ సైకిల్ రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్న సి.ఐ అల్లు స్వామినాయుడు , ఎస్ఐ సతీష్, ఎస్.ఐ కె. లక్ష్మణరావు కశింకోట పోలీసు సిబ్బందిని జిల్లా పోలీసు అధికారులు అభినందించారు.

## మూడో రోజు కొనసాగిన అంగన్వాడీ కార్యకర్తల శిక్షణ

(నక్కపల్లి,ప్రభాతవార్త):




నక్కపల్లి ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో పిఓ శ్రీవిద్య ఆధ్వర్యంలో రెండో విడత ఏర్పాటుచేసిన అంగన్వాడీ కార్యకర్తల శిక్షణ కార్యక్రమం స్థానిక నక్కపల్లి బాలికోన్నత పాఠశాలలో సోమవారం ప్రారంభించారు. ఈ శిక్షణ కు డాక్టరు జయప్రకాష్ హాజరై చిన్నపిల్లల ఆరోగ్య విషయాలపై పలు సూచనలు చేశారు. హెల్త్ సూపర్వైజర్స్ ఉపమాక శ్రీనివాసరావు, నక్కపల్లి మండల సూపర్వైజర్ సత్యవతి ఈ శిక్షణ కార్యక్రమంలో భాగంగా అంగనవాడి వర్కర్లకు 0-6 సంవత్సరాల పిల్లల పట్ల ప్రేమతో తల్లిదండ్రులు మెలగడం, ప్రేమతో మాట్లాడడం ,ప్రేమతో ఆటల ఆడించడంతోపాటు నిరంతర పరిశీలన ఉండేటట్లు వారిలో చైతన్య పరచాలని మన ఆ విధంగా కార్యకర్తలకు కృషి చేయాలని సూచించారు .పుట్టినప్పటినుంచి ఆరు సంవత్సరాల వరకు బిడ్డ యొక్క ప్రతి మైల్ స్టోన్ ని,ప్రతి ఫ్లాగ్నిని అభివృద్ధిని పరిశీలన చేయాలని, మంచి వాతావరణంలో పెరిగిన బిడ్డ ఆరోగ్యంగా, శారీరకంగా, మానసికంగా అభివృద్ధి చెందుతూ సమాజానికి మంచి పౌరుడిగా ఉంటాడని, రెండు సంవత్సరాలలోపు పిల్లలు మేధాశక్తి 80%శాతం అభివృద్ధి చెందుతుందని, ఈ పీరియడ్ బిడ్డకు చాలా కీలకమైందని సత్యవతి వివరించారు.డాక్టర్ మాట్లాడుతూ 0-6 సంవత్సరాల పిల్లలకు వచ్చే లోపాల గురించి ఏ విధంగా గుర్తించి తల్లికి ఎటువంటి సమాచారాన్ని అందించాలని వివరించారు .ఏ విధంగా పిల్లల స్క్రీన్ చేయాలి, అంగన్వాడి వర్కర్స్ చేయబోయే యాప్ గురించి విపులంగా వివరణ ఇచ్చారు. సూపర్వైజర్ సత్యవతి మాట్లాడుతూ ప్రతి అంగన్వాడి వర్కరు ఈ యాప్కు సంబంధించిన వర్క్ చేసేటప్పుడు ప్రతి బిడ్డని ఇంటింట పరిశీలన ద్వారా పరిశీలన చేయాలని ,తల్లిని పిల్లవాడు గురించి అన్ని విషయాలు క్షుణ్ణంగా అడిగి తెలుసుకోవాలని ,ప్రతి ఇంటింటికి సర్వే చేయాలని, 0-6 సంవత్సరాల్లో పిల్లలు ఎప్పుడూ ఏ విధంగా వారు ఆలోచన వారి పరివర్తన అభివృద్ధి చెందుతుందో, ఎలా అభివృద్ధి చెందుతుంది అన్నది .తల్లితండ్రులకి, కుటుంబ సభ్యులకి అవగాహన కలిగించాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ప్రాధాన్య కార్యక్రమాల అమలులో నిర్దేశిత లక్ష్యాలు తప్పనిసరిగా సాధించాలి : కలెక్టర్



అనకాపల్లి, జూన్ 8 (ప్రభాత వార్త):

జిల్లాలో అమలవుతున్న వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పురోగతిపై జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ సోమవారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాల అమలు, ఉపాధి హామీ పథకం పనులు, అక్షర ఆంధ్ర కార్యక్రమం, గృహ నిర్మాణం, పీఎం సూర్య ఘర్ యోజన, ఈ-కేవైసీ, మన మిత్ర, క్రాప్ బుకింగ్, ఓడీఎఫ్ గ్రామాలు, డీఆర్డీఏ ద్వారా, స్వచ్ఛాంధ్ర తదితర అంశాల పురోగతిని పై కలెక్టర్ సమీక్షించారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని, ప్రతి కార్యక్రమం గ్రామ స్థాయిలో సమర్థవంతంగా అమలయ్యేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఉపాధి హామీ పనులను వేగవంతం చేయడంతో పాటు గృహ నిర్మాణాలు, పీఎం సూర్య ఘర్ యోజనలో నిర్దేశిత లక్ష్యాల సాధనకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ-కేవైసీ, క్రాప్ బుకింగ్ ప్రక్రియలను త్వరితగతిన పూర్తి చేయాలని, గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణకు ప్రాధాన్యతనిస్తూ ఓడీఎఫ్ హోదాను కొనసాగించాలని కలెక్టర్ సూచించారు. శాఖల మధ్య సమన్వయంతో పనిచేసి అభివృద్ధి కార్యక్రమాలను విజయవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత జిల్లా స్థాయి అధికారులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## సహకార సంఘాల బలోపేతానికి రైతులకు కృషి చేయాలి : చైర్మన్ కొప్పిశెట్టి




(నక్కపల్లి రూరల్ ,ప్రభాతవార్త) :



నక్కపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘము పరిధి లో ఉన్న సహకార సంఘాల రైతులు సొసైటీల అభివృద్ధికి కృషి చేయాలని పిఏసిఎస్ అధ్యక్షులు కొప్పిశెట్టి బుజ్జి పిలుపునిచ్చారు. పెదతీనార్ల గ్రామములో నక్కపల్లి సొసైటీ ద్వారా రైతులకు అందిస్తున్న రుణాలను చైర్మన్ బుజ్జి వివరించారు. రైతులు సకాలంలో రుణాలు చెల్లిస్తే కేవలం 3శాతం వడ్డీకే వ్యవసాయ రుణాలు పొందవచ్చని, లేని పక్షంలో అధిక వడ్డీ చెల్లించవలసి వస్తుందని తెలియజేశారు . సొసైటీ ద్వారా భూమి తనఖా పై ఒక ఎకరం కు 6లక్షలు, పత్రాలు కలిగిన స్లాబ్ ఇంటికి 6లక్షలు ఋణం గా ఇవ్వడం జరుగుతుందని తెలియజేశారు. తనఖా పై ఇచ్చే రుణాలు రైతుల అవసరాలు దృష్టిలో పెట్టుకొని ఎకరాకు 7లక్షలు వరకు పెంచాలని డీసీసీబీ ని కోరడం జరిగిందని, కొద్దిరోజుల్లో అమలు చేయడం జరుగుతుందని బుజ్జి చెప్పారు. రైతు విజ్ఞప్తి మేరకు భూమి తనఖా రుణాలు ఒక రైతుకు ప్రస్తుతం 6లక్షలు వరకు ఇస్తుండగా దానిని 10లక్షలు వరకు పెంచడానికి ఆలోచన చేస్తున్నామని అధ్యక్షులు కొప్పిశెట్టి బుజ్జి రైతులకు వివరించారు. ముఖ్యంగా తనఖా రుణాలు తీసుకున్న రైతులకు లోన్ అమౌంట్ మొత్తానికి ఇన్సూరెన్స్ సదుపాయం కల్పించాలని, గత మహాజన సభలో ప్రస్తావించడం జరిగిందని, ఇప్పుడు దానిని డీసీసీబీ అధికారులు చర్యలు తీసుకుంటున్నారని రైతులకు వివరించారు. డీసీసీబీ బ్రాంచ్‌లో అకౌంట్ కలిగిన రైతులకు ఫోన్ పే, గూగుల్ పే సదుపాయాలు అందుబాటులోకి రావడంతో రైతులు ఉపయోగించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అడ్డరోడ్డు బ్రాంచ్ మేనేజర్ జ్యోతిలక్ష్మి, సూపర్‌వైజర్ సతీష్, సొసైటీ డైరెక్టర్ లు కోనారి శ్రీను, మనబాల కొండబాబు, సీఈవో కె. వి వి శ్రీనివాస్, సిబ్బంది ఖాన్, గోవింద్, నాగేష్, రైతులు, జిల్లా మత్స్యకార సంఘం అధ్యక్షులు గోసల చిన్న తాతారావు, మండల మాజీ కో -ఆప్షన్ సభ్యులు పీక్కి కొర్లయ్య, బొంది దేవుడు, వెంకటరమణ, మహేష్, గిరీష్, గరికిన నూకరాజు, పేర్ల శ్రీను, కొడబొడిరాజు ,తదితరులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో చైర్మన్ బుజ్జిని మత్స్యకార నాయకులు ఘనంగా సత్కరించారు.

## నక్కపల్లి సర్కిల్ పోలీసులకు అభినందనలు వెల్లువ .. రివార్డులు పంట !















(నక్కపల్లి, ప్రభాతవార్త):

ఉత్తరాంధ్ర జిల్లాల్లో చర్చనీ యాంశమైన ఉపమాక వెంకటేశ్వర స్వామి ఆలయ హుండీ చోరీ కేసు అత్యంత వేగంగా జిల్లా అధికారుల ఆదేశాల మేరకు రాత్రనక పగలనక కష్టపడి మూడు రోజుల్లో నిందితులను పట్టుకుని శభాష్ అనిపించుకున్న నక్కపల్లి సిఐ జూరెడ్డి మురళి ఆధ్వర్యంలో ఎస్సై పోశిరెడ్డి శ్రీనివాస్ పర్యవేక్షణ నక్కపల్లి పోలీసులకు అన్ని వర్గాల నుంచి అభినందనలు , ప్రశంసల జల్లు కురిపించారు. జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిందితులను ప్రవేశపెట్టిన సందర్భంలో అత్యంత వేగంగా ఈ కేసులో పురోగతి సాధించిన సిఐ జూరెడ్డి మురళిని అభినందిస్తూ నగదు బహుమతితో పాటు రివార్డ్ అందజేశారు. వారితోపాటు అడ్డ రోడ్డు సర్కిల్ సీఐ రామకృష్ణ, నక్కపల్లి ఎస్సై సన్నీ బాబు, మహిళా ఎస్సై సాహిబా అంజుమ్, హెడ్ కానిస్టేబుల్‌లు శ్రీను, కానిస్టేబుల్ రమణ ,చంద్రమౌళి, హోంగార్డులు గోవింద, లోవరాజులు లను ఎస్పీ అభినందిస్తూ వారికి నగదు బహుమతితో పాటు ప్రశంస పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో ముందడుగు వేసే ఎటువంటి కేసునైనా పట్టుకోవడానికి అవకాశం ఉంటుందని అదే ధైర్య సాహసాలతో ముందడుగు వేయాలని, కేసులో కష్టపడిన ప్రతి ఒక్కరికీ అభినందనలు తెలియజేశారు. నిరంతరం ఈ కేసు విషయంలో పరిశీలన చేసి దర్యాప్తు వేగం తంగా కొనసాగే విధంగా కృషి చేసిన నర్సీపట్నం డిఎస్పీ పోశిరెడ్డి శ్రీనివాస్ లను ఈ సందర్భంగా అభినందించారు. ఈ కేసులో పోలీసులు మూడు రోజుల్లో నిందితులను పట్టుకొని దేవుడు సొమ్మును రికవరీ చేసేందుకు కృషి చేసిన డి.ఎస్.పి పోశిరెడ్డి శ్రీనివాస్ సిఐ జూరెడ్డి మురళి తోపాటు సీఐ రామకృష్ణ, ఎస్సైలు సన్నీబాబు, సాహిబా అంజుమ్, కానిస్టేబుల్ హోంగార్డులకు రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత తో పాటు పాయకరావుపేట నియోజకవర్గం చెందిన ప్రజలు, భక్తులు, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ప్రముఖులు ,మేధావులు అభినందనలు తెలిపారు.



## బీజేపీలో చేరిన వైకాపా నాయకుడు ఈశ్వరరావు



గాజువాక,జూన్ 8,ప్రభాతవార్త

గాజువాక హైస్కూలు రోడ్డుకు చెందిన వైకాపా నాయకుడు, వ్యాపారి సిల్ల ఈశ్వరరావు సోమవారం బీజేపీలో చేరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో నియోజకవర్గ ఇంచార్జ్ కరణంరెడ్డి నరసింగరావు (కేఎన్ఆర్) ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. గూటూరు శంకరరావు, దుర్గానాగరాజుల ఆహ్వానం మేరకు ఆయన పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఈశ్వరరావు మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ సుపరిపాలనకు ఆకర్షితుడనై పార్టీలో చేరానని, సంస్థాగత బలోపేతానికి కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు జి.లక్ష్మణస్వామి, ఎ.కాశీవిశ్వనాథం, విఠల్ పటేల్, సింహాచలం నాయుడు పాల్గొన్నారు.

## అదానీ పోర్టు కాలుష్యంపై యువత ఆగ్రహం

### -పెదగంట్యాడ తహశీల్దార్‌కు వినతి

గాజువాక,జూన్ 8,ప్రభాతవార్త



గంగవరం అదానీ పోర్టు నుంచి వెలువడుతున్న కాలుష్యం కోరల నుంచి స్థానిక ప్రజలను కాపాడాలంటూ పరిసర నాలుగు గ్రామాల యువత నిరసనకు దిగింది. జీవీఎంసీ 64వ వార్డు గంగవరం నుంచి పెదగంట్యాడ తహసీల్దార్ కార్యాలయం వరకు యువకులు భారీ పాదయాత్ర నిర్వహించారు. అనంతరం స్థానిక సమస్యలపై తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పోర్టు కాలుష్యంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాలుష్య ప్రభావంతో శ్వాసకోశ వ్యాధులు, అలర్జీలు, కంటి, చర్మ సమస్యల బారిన పడి ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే ఉన్న కాలుష్యం చాలదన్నట్లు, ఇప్పుడు అదానీ పోర్టు, ఎన్ఎండీసీ సంయుక్తంగా నిర్మిస్తున్న 'ఐరన్ ఓర్ బ్లెండింగ్ ప్లాంట్' వల్ల చుట్టుపక్కల గ్రామాల మనుగడే ప్రశ్నార్థకంగా మారుతుందని ధ్వజమెత్తారు. పోర్టు యాజమాన్యంపై గతంలో ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా ప్రభుత్వం, అధికారులు చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోకపోతే రాబోయే రోజుల్లో ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ నిరసన పాదయాత్రలో నాలుగు గ్రామాల యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## విశాఖ పశ్చిమ 'వైకాపా'లో ప్రోటోకాల్ రగడ!

### -రసాభాసగా మారిన 'వెన్నుపోటుకు రెండేళ్లు' సమావేశం




గాజువాక,జూన్ 8,ప్రభాతవార్త

విశాఖ పశ్చిమ నియోజకవర్గంలో వైకాపా అంతర్గత విభేదాలు మరోసారి రోడ్డుకెక్కాయి. నియోజకవర్గ పరిధిలో సోమవారం గల్లా ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన "చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు" కార్యక్రమంలో తీవ్ర ఉద్రిక్తతకు, ఇరువర్గాల మధ్య ఘర్షణ వాతావరణానికి దారితీసింది. మాజీ ఎమ్మెల్యే మళ్లా విజయప్రసాద్ ఆధ్వర్యంలో 'చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు' పేరిట ఓ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో వేదికపై నేతలకు కేటాయించిన స్థానాలు, ప్రాధాన్యతకు సంబంధించి ప్రోటోకాల్ వివాదం తలెత్తింది. పార్టీ సీనియర్ నాయకుడు ఆల్ఫా కృష్ణకు ఈ సమావేశంలో తగిన ప్రాధాన్యత ఇవ్వకుండా, కావాలనే అవమానించారంటూ ఆయన వర్గీయులు ఒక్కసారిగా మండిపడ్డారు. మాజీ ఎమ్మెల్యే మళ్లా విజయప్రసాద్ సమక్షంలోనే నేతలు, కార్యకర్తలు ఒకరిపై ఒకరు తీవ్ర స్థాయిలో కేకలు వేసుకుంటూ వాగ్వాదానికి దిగారు. దీంతో కొద్దిసేపు నియోజకవర్గ కార్యాలయం పరిసర ప్రాంతమంతా తీవ్ర రసాభాసగా మారింది. నియోజకవర్గంలో సీనియర్లను పక్కనబెట్టి ఏకపక్షంగా వ్యవహరిస్తే సహించేది లేదని ఆల్ఫా కృష్ణ అనుచరులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతర్గత కుమ్ములాటలతో పశ్చిమ నియోజకవర్గ వైకాపా సమావేశం కాస్తా రసాభాసగా ముగియడం స్థానికంగా పెద్ద చర్చనీయాంశమైంది.

## కూటమి ప్రభుత్వం ప్రజలను నిలువునా ముంచింది:మాజీ మంత్రి కన్నబాబు

### -క్షేత్రస్థాయిలో ప్రజాపోరాటాలకు మళ్ళ విజయప్రసాద్ పిలుపు

గాజువాక,జూన్ 8,ప్రభాతవార్త



ఎన్నికల సమయంలో మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు.. నేడు వాటిని అమలు చేయకుండా ప్రజలను నిలువునా ముంచారని వైకాపా ఉత్తరాంధ్ర రీజినల్ కో-ఆర్డినేటర్, మాజీ మంత్రి కురసాల కన్నబాబు ధ్వజమెత్తారు. పార్టీ అధినేత వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు.. విశాఖ పశ్చిమ నియోజకవర్గం శ్రీహరిపురం వైష్ణవి ఫంక్షన్ హాల్‌లో "చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు" టౌన్ హాల్ సమావేశం నిర్వహించారు. నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మళ్ళ విజయ ప్రసాద్ నేతృత్వంలో జరిగిన ఈ సభకు పార్టీ శ్రేణులు భారీగా తరలివచ్చారు. సమావేశంలో మళ్ళ విజయప్రసాద్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో సంక్షేమ కార్యక్రమాలు కుంటుపడ్డాయని, యువత, మహిళల సమస్యలపై వైకాపా శ్రేణులు క్షేత్రస్థాయిలో నిరంతరం పోరాడాలని పిలుపునిచ్చారు. మహిళలకు నెలకు రూ 1500, నిరుద్యోగ భృతి అంటూ నమ్మించి కూటమి ప్రభుత్వం ప్రజలను వెన్నుపోటు పొడిచిందని వైకాపా జిల్లా అధ్యక్షుడు కేకే రాజు విమర్శించారు. పార్టీ పరిశీలకులు జహీర్ అహ్మద్ భవిష్యత్ కార్యాచరణను వివరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ జియ్యని శ్రీధర్, బల్ల లక్ష్మణ్ రావు, గుండపు నాగేశ్వర రావు, కాలిదింది బద్రీనాథ్, పిల్లా కన్నబాబు, పలువురు వార్డు అధ్యక్షులు, పార్టీ పరిశీలకులు, సోషల్ మీడియా ప్రతినిధులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పన్నెండు సంవత్సరాల నుండి బొత్సపేటకి మంచినీరు ఇవ్వని పాలకులు



పద్మనాభం, జూన్ 8,ప్రభాతవార్త

మండలంలో బొత్సపేట గ్రామానికి సుమారు పన్నెండు సంవత్సరాల నుండి పాలకులు తాగునీటిని ఇవ్వలేక పోయారని గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ గ్రామంలో సుమారు పది సంవత్సరాల క్రితం అప్పటి టీడీపీ ప్రభుత్వం లక్షలాది రూపాయలతో నిర్మించిన రక్షిత మంచినీటి పథకంను నేటి వరకు ప్రారంభానికి నోచుకోలేక పోయింది. దీంతో ప్రజలు తాగునీటి కోసం అనేక ఇబ్బందులు పడు తున్నారు. అలాగే ఇటీవల జలజీవన్ పథకంలో భాగంగా వేసిన కుళాయిలను అస్తవ్యస్తంగా, మొక్కుబడిగా వేసారు. వీటి ద్వారా కూడా చుక్కనీటిని అధికారులు ఇవ్వలేకపోయారని ప్రజలు మండిపడు తున్నారు. అలాగే కుళాయిలు వెయ్యడానికి తవ్విన సిసి రోడ్లు గ్రామంలో అస్తవ్యస్తంగా ఉన్నాయి. పాలకులు ఇటు తాగు నీరు ఇవ్వలేక పోయారు, అటు తవ్విన రోడ్లను సరిచెయ్యలేక పోయారని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి తమకు తాగునీటిని ఇవ్వాలని ప్రజలు చేతులెత్తి మొక్కుతున్నారు.

## విమ్స్‌లో సర్జరీ విభాగం మరింత పటిష్టం

### సంక్లిష్టమైన సర్జరీలను చేసేందుకు సిద్ధమవుతున్న నూతన డైరెక్టర్

### డా.వి.మన్మధరావు -70 ఏళ్ల వృద్ధుడికి విజయవంతంగా సర్జరీ పూర్తి చేసిన డైరెక్టర్

ఆరిలోవ, జూన్ 8, ప్రభాతవార్త



విశాఖ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ నందు జనరల్ సర్జరీ విభాగం మరింత పటిష్టం కానుంది. ఇప్పటివరకు కేవలం ముగ్గురు అసిస్టెంట్ ప్రొఫెసర్ స్థాయి డాక్టర్లు సర్జరీలు చేయగా ఇప్పుడు జనరల్ సర్జరీ విభాగంలో ఎంతో అనుభవజ్ఞులైన ప్రొఫెసర్ డాక్టర్ వి.మన్మధరావు విమ్స్ నూతనంగా డైరెక్టర్ గా బాధితులు స్వీకరించటంతో ఆ విభాగం మరింత పటిష్టంగా మారింది. డాక్టర్ మన్మధరావు సోమవారం 70 ఏళ్ల వృద్ధుడికి సంక్లిష్టమైన లాప్ కోలిసిస్టెక్టమీ సర్జరీను విజయవంతంగా పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనరల్ సర్జరీ విభాగంలో ప్రస్తుతం ఉన్న డాక్టర్లు రోగులకు మెరుగైన సేవలు అందిస్తున్నారని రోగులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు తనవంతుగా సంక్లిష్టమైన సర్జరీలను చేయటం జరుగుతుందన్నారు. విమ్స్ ఆస్పత్రి నందు సంక్లిష్టమైన సర్జరీలు చేసేందుకు అవసరమైన పరికరాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆసుపత్రి వాతావరణం కూడా ఎంతో ప్రశాంతంగా రోగులు వేగంగా కోలుకునే విధంగా ఉందన్నారు. రోగులు విమ్స్ ఆస్పత్రి నందు వైద్య సేవలను వినియోగించుకొని వేగంగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ సర్జరీలో డైరెక్టర్ మన్మధరావుతో పాటు డాక్టర్ శ్రీకాంత్ మరియు హరికృష్ణ వైద్య బృందం పాల్గొన్నారు.

## ఇసుకులపాలెం పాఠశాలను పద్మనాభం పాఠశాలలో విలీనం చెయ్యవద్దు

పద్మనాభం, జూన్ 8, ప్రభాతవార్త



మండలంలో ఇసుకలపాలెం ప్రాథమిక పాఠశాలను పద్మనాభం ప్రాథమిక పాఠశాలలో విలీనం చెయ్యవద్దని పాఠశాల కమిటీ చైర్మెన్ హంసజ్యోతి, విద్యార్థులు, తల్లి దండ్రులు, గ్రామ పెద్దలు సోమవారం విశాఖపట్నం తరలివెళ్లి జిల్లా కలెక్టర్‌కి, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, రాష్ట్ర బిజెపి అధ్యక్షులు మాధవకి, డీఒకి, వినతిపత్రాలను అందజేసారు. తమ గ్రామానికి కిలోమీటరు దూరంలో ఉన్న పద్మనాభం పాఠశాలకు పుస్తకాలను మోసుకొని పిల్లలు గతంలో వెళ్లలేకపోయారని వారు వివరించారు. అలాగే పద్మనాభం పాఠశాలకి వెళ్లాలంటే నిత్యం వాహనాలతో రద్దీగా ఉండే సింహాచలం రోడ్డును దాటినపుడు పిల్లలు ప్రమాదాల బారిన పడతారని వారు విన్నవించారు. తమ పాఠశాలను పద్మనాభంలో విలీనం చేయకూడదని వారు పాలకులను వేడుకున్నారు.

## షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం

### పూర్తిగా దగ్ధమైన సామాగ్రి -బాధితులకు ఏడువాక ఆర్థిక సాయం



ఆరిలోవ, జూన్ 8, ప్రభాతవార్త

తూర్పు నియోజకవర్గం స్థానిక 13వ వార్డు ఆరిలోవ భగత్ సింగ్ నగర్ -1 కొండవాలు ప్రాంతంలో షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో ఒక స్లాబ్ ఇంట్లో మంటలు చెలరేగడంతో ఇంట్లో ఉన్న విలువైన వస్తువులు, సామాగ్రి పూర్తిగా అగ్నికి ఆహుతి అయింది. విషయం తెలుసుకున్న వార్డు అధ్యక్షులు ఏడువాక సన్యాసిరావు సంఘటన స్థలానికి చేరుకొని అగ్ని ప్రమాద బాధితులను ఓదార్చి ఆర్థిక సాయంగా 10వేల రూపాయలు అందజేశారు. చెట్టు కొమ్మలు కరెంటు వైర్లపై పడడంతో ప్రమాదం..! ఒక వ్యక్తి తన ఇంటి ముందు ఉన్న భారీ చెట్టును తొలగించాలని ఉద్దేశంతో విద్యుత్ శాఖ సిబ్బందికి ఎటువంటి సమాచారం ఇవ్వకుండా చెట్టు కొమ్మలు నరకడంతో ఆ చెట్టు కొమ్మలు విద్యుత్ తీగలకి తగలగా ఆ ప్రాంతమంతా ఒక్కసారిగా షార్ట్ సర్క్యూట్ కు గురైందంటూ అక్కడ ఉన్న ప్రాంత ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై విద్యుత్ శాఖ ఏఈ మాట్లాడుతూ... విద్యుత్ శాఖకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా వైర్లకు తాకి ఉన్న భారీ కొమ్మలను నరకడం వాస్తవమేనని ఈ విషయంపై ఇంటి యజమానిపై కేసు నమోదు చేయనున్నట్లు తెలిపారు. అసలు షార్ట్ సర్క్యూట్ గల కారణాలపై విచారణ చేపడుతున్నట్లు ఆయన తెలిపారు.

## మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌ని తక్షణమే అరెస్ట్ చేయాలి

విశాఖపట్నం, జూన్ 8, ప్రభాతవార్త



మీ పార్టీ అధ్యక్షులు జగన్మోహన్ రెడ్డి నువ్వు మీరందరూ క్రోరా మృగాలు... రాష్ట్రాన్ని ప్రగతి బాట వైపు తీసుకెళ్తున్న చంద్రబాబుని గాని పవన్ కళ్యాణ్‌ని గాని అవహేళన చేస్తే రాష్ట్రంలో ప్రజలు మిమ్మల్ని ఎన్నికల్లో భూస్థాపితం చేస్తారని.... 35 వార్డ్ జనసేన ఇంచార్జ్ మరియు బీసీ ప్రజా సంక్షేమ సంఘ రాష్ట్ర కార్యదర్శి కోసూరి శ్రీనివాసరావు దక్షిణ నియోజకవర్గ నుండి హెచ్చరించారు. ఖబర్దార్ వాసుపల్లి గణేష్ ఈసారి నీకు దక్షిణ నియోజకవర్గంలో కనీసం డిపాజిట్ కూడా రాకుండా దక్షిణ నియోజకవర్గ ప్రజలు మీకు బుద్ధి చెబుతారని కోసూరి శ్రీనివాసరావు హెచ్చరించారు. ఈసారి దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి పేదల పెన్నిధి నిరంతరం ప్రజల్లో ఉండే వ్యక్తి వంశీకృష్ణ శ్రీనివాస్‌ని లక్షకు పైగా మెజారిటీతో రాష్ట్రంలోనే నెంబర్ వన్‌గా గెలిపించుకుంటామని కోసూరి శ్రీనివాస్ ఆశాభావం వ్యక్తం చేశారు కూటమి ప్రభుత్వంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం సర్వతో ముఖాభివృద్ధి చెందుతుందని పారిశ్రామికంగా అనేక కంపెనీలు వస్తున్నాయి నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కలుగుతున్నాయి అదే విధంగా పేదలకు సంక్షేమ పథకాలు పెన్షన్లు ఘనంగా అందజేస్తున్నారని తెలియజేశారు.

## యువకుని హత్య కేసులో 12 మంది అరెస్ట్.. రిమాండ్‌కు తరలింపు




విశాఖపట్నం, జూన్ 8 ప్రభాతవార్త

పాత కక్షల నేపథ్యంలో ఆది వారం రాత్రి యువకుని హత్య జరిగినట్లు కంచరపాలెం పోలీసులు తెలియజేశారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమా వేశంలో వెస్ట్ సబ్ డివిజన్ ఏసిపి పి.ప్రదీప్తి కంచరపాలెం ఇన్స్పెక్టర్ రవికుమార్ తో కలిసి వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా ఏసిపి పి.ప్రదీప్తి మాట్లాడుతూ ఆదివారం రాత్రి మురళీనగర్ మసీదు వద్ద జరిగిన హత్య కేసులో నిందితులను కంచరపాలెం పోలీసులు సాంకేతిక పరిజ్ఞానంతో బృందాలుగా ఏర్పడి గంటల వ్యవధిలో హత్య కేసు నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. హత్య కేసుకు సంబంధించి 12 మందిని అదుపులోకి తీసుకున్నామని మూడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు కూడా తెలిపారు. ఆదివారం రాత్రి సుమారు 10గంటల సమయంలో మురళీనగర్ మసీదు సమీపంలో జోసఫ్ అనే యువకుని జన్మదిన వేడుకల కు సాలిపేట ప్రాంతానికి చెందిన రుద్రాక్ష వరుణ్ రాజ్ కూడా పాల్గొన్నాడని తెలిపారు. వరుణ్ రాజ్ ఇటీవలే సీమెన్ ట్రైనింగ్ పూర్తి చేసుకొని మరో వారం రోజుల్లో ఉద్యోగులను చేరవలసి ఉంది. అయితే స్నేహితుడు జన్మదిన సందర్భంగా అక్కడికి చేరుకున్నాడు. ఈక్రమంలో అతని స్నేహితులు అక్కడ గుమికూడి ఉన్నారు. సుమారు 15 రోజుల క్రితం మాధవధార మద్యం దుకాణం వద్ద జరిగిన గొడవలో పాత కక్షలు వీరి మధ్య ఉన్నాయి. గతంలో జరిగిన తేజా హత్యకు సంబంధించిన విషయాలు ప్రస్తావనకు రావడంతో ఇరు వర్గాల మధ్య విభేదాలు మరింత పెరిగాయి. ఈ కక్షల నేపథ్యంలో ఆదివారం రాత్రి కొంతమంది వ్యక్తులు ద్విచక్ర వాహనాల పై మురళీనగర్ మసీదు సమీపానికి చేరుకొని ప్రత్యర్థి వర్గంపై కర్రలు, రాళ్లతో దాడి చేశారు. అక్కడ ఉన్న యువకులంతా చల్లా చదురుగా పారిపోయారు. ఈ క్రమంలో రుద్రాక్ష వరుణ్ రాజ్ నిందితుల చేతికి చిక్కి తీవ్రంగా గాయపడ్డాడు. అనంతరం అక్కడ వారు అప్పటికే అక్కడికి చేరుకున్న పోలీసులు అతడిని చికిత్స నిమిత్తం కేజీహెచ్ కు తరలించగా చికిత్స పొందుతూ రుద్రాక్ష వరుణ్ రాజ్ మృతి చెందినట్లు తెలిపారు. దీంతో మృతుని తల్లి రుద్రాక్ష రాజామణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన కంచరపాలెం పోలీసులు బృందాలుగా ఏర్పడి ఈతలపాక రాజ్ కుమార్, రావాడ జగదీష్, బండి కార్తీక్, ముష్యల శివ శంకర్, కొన్న వైకుంఠరావు, కొప్పర రామకృష్ణ, సారిక ఫణీంద్ర, జొన్నాడ చంద్రశేఖర్, అల్లిపురం సాయికుమార్, అలమండ జగదీష్, బసవ సాయి రోహిత్ రావు, కంకణాల కిరణ్ కుమార్ అదుపులోకి తీసుకొని రిమాండ్ కు కోర్టులో హాజరు పరిచి రిమైండర్ తరలిస్తున్నట్లు తెలిపారు. కాగా నిందితుల్లో ఈతలపాక రాజ్ కుమార్, రావాడ జగదీష్ పై ఇప్పటికే రౌడీ షీట్ ఉందని అలాగే బండి కార్తీక్, ముష్యల శివ శంకర్ హత్య కేసులో నిందితులుగా ఉన్నారని జొన్నాడ చంద్ర శేఖర్, అల్లిపురం సాయి కుమార్, బసవ సాయి రోహిత్ రావు పై హత్య యత్నం కేసులో నిందితులుగా పేర్కొన్నారు. కేసులో ప్రతిభ కనబరిచిన కంచరపాలెం సీఐ కే. రవికుమార్, ఎస్ఐలు ఎం.రవికుమార్, కే. భాస్కర్‌రావు, ఎస్.అజయ్ కుమార్, ఉమెన్ ఎస్ ఐ అరుణ, సి హెచ్ కార్తీక్‌లను నగర పోలీసు కమీషనర్ డా.శంఖబ్రత బాగ్చి ప్రత్యేకంగా అభినందించారని ఏసిపి తెలిపారు.

## యోగాంధ్ర-2026 కార్యక్రమాలను విజయవంతం చేద్దాం

### జూన్ 7 నుండి 20 వరకు యోగా మాసం కార్యక్రమాలు -జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం ఘనంగా నిర్వహణ : జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్

విశాఖపట్నం, జూన్ 8, ప్రభాతవార్త



అంతర్జాతీయ యోగా దినోత్సవం (ఇంటర్నేషనల్ డే ఆఫ్ యోగ డే )-2026 ను పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న "యోగాంధ్ర-2026" కార్యక్రమాలను" మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ పరిధిలో విస్తృత స్థాయిలో నిర్వహించనున్నట్లు జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ జూన్ 7 నుండి 20 వరకు రాష్ట్రవ్యాప్తంగా "యోగ మాసం" కార్యక్రమాలు నిర్వహించబడుతున్నాయని, జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవ ప్రధాన కార్యక్రమం ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. విజన్ 2047 యొక్క "ఆరోగ్య ఆంధ్ర" లక్ష్యంగా "యోగాంధ్ర-2026" కార్యక్రమాలను నిర్వహణ చేపట్టమన్నారు. యోగాంధ్ర-2026 కార్యక్రమం ద్వారా యోగాను ప్రజల దైనందిన జీవితంలో భాగం చేసి శారీరక, మానసిక, భావోద్వేగ ఆరోగ్యాన్ని మెరుగుపరచడం, ఆరోగ్యవంతమైన ఆంధ్రప్రదేశ్ నిర్మాణానికి తోడ్పడడం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా జీవీఎంసీ పరిధిలోని అన్ని జోన్లలో ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని, వార్డు లెవెల్ కమిటీని ఏర్పాటు చేసి వార్డు అడ్మిన్ సెక్రటరీగా చైర్మన్ ను వార్డు రెవెన్యూ, ఉమెన్ వేకర్ సెక్షన్ ప్రొటెక్షన్ సెక్రెటరీలు, ఏఎన్ఎం లేదా హెల్త్ డిపార్ట్మెంట్ ప్రతినిధిను ఏర్పాటు చేయాలని జోనల్ కమిషనర్లను ఆదేశించినట్లు తెలిపారు. పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, స్వచ్ఛంద సంస్థలు, రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్లు, స్వయం సహాయక సంఘాలు, మహిళా సంఘాలు, యువజన సంఘాలు, మార్కెట్ ప్రాంతాలు, కాలనీలలో యోగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అలాగే ప్రతి మూడు నుండి నాలుగు వార్డులకు యోగా శిక్షణా నిపుణులను గుర్తించి ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు, యోగా సాధనకు అనువైన ప్రదేశాలను గుర్తించి ప్రతిరోజూ యోగా సాధన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. యోగా కార్యక్రమాలకు అవసరమైన వేదికలు,సౌండ్ సిస్టం, తాగునీరు, వైద్య సహాయం, పారిశుద్ధ్య నిర్వహణ, భద్రతా ఏర్పాట్లు తదితర సౌకర్యాలను పకడ్బందీగా కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు పేర్కొన్నారు. వార్డు స్థాయిలో ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసి యోగా కార్యక్రమాల నిర్వహణ, సమన్వయం, ప్రచారం, ప్రజల భాగస్వామ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. స్వయం సహాయక సంఘాల మహిళలు, యువత, విద్యార్థులు, ఉద్యోగులు, వృత్తి నిపుణులకు ప్రత్యేక యోగా శిక్షణా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. యోగ ద్వారా ఆరోగ్యం, ఆనందం, ఆత్మవిశ్వాసం పెంపొందుతాయని పేర్కొన్న కమిషనర్, అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా నిర్వహించే కార్యక్రమాలలో విశాఖ నగర ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని యోగాను జీవన విధానంగా అలవర్చుకోవాలని కమిషనర్ ప్రజలకు పిలుపునిచ్చారు.

9-6Pg7exHMNWJQE.qxd:9-6Pg7exHMNWJQE.qxd 1/1/02 7:15 AM Page 1



# పాత సింగరాయకొండ బావిలో లభ్యమైన మృతదేహం

## హైదరాబాద్ బిటెక్ విద్యార్థి రాహుల్‌గా గుర్తింపు

## ర్యాగింగ్ అనుమానాలు.. రాహుల్ మృతిపై అన్ని కోణాల్లో దర్యాప్తు



మృతుడి స్నేహితులను ప్రశ్నిస్తున్న పోలీస్ అధికారి

**సింగరాయకొండ,జూన్ 8, ప్రభాతవార్త** మండలంలోని పాత సింగరాయకొండ గ్రామంలో శ్రీ వరాహ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానానికి చెందిన పూలతోటలోని వాడుకలో లేని బావిలో ఇటీవల లభ్యమైన గుర్తుతెలియని యువకుడి మృతదేహం కేసులో కీలక మలుపు చోటుచేసుకుంది. హైదరాబాద్‌లో అదృశ్యమైన బీటెక్ విద్యార్థి రాహుల్‌గా మృతుడిని కుటుంబ సభ్యులు గుర్తించినప్పటికీ, డీఎన్ఏ పరీక్షల అనంతరమే పూర్తి నిర్ధారణకు వచ్చే అవకాశముందని పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం, జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం ఐలాపూర్ గ్రామానికి చెందిన రాహుల్ హైదరాబాద్‌లోని మాతృశ్రీ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. మే 27న ఇంటికి వెళ్తున్నానని చెప్పి స్నేహితుడు బైక్ మీద కాచిగూడ రైల్వే స్టేషన్‌కు చేరుకున్నాడు. కుటుంబ సభ్యులు నాలుగు రోజులైన ఇంటికి రాకపోతే అంత గాలించి ఎక్కడ ఆచూకీ కనపడక పోవడంతో మే 31 కాచిగూడ పోలీస్ స్టేషన్ లో తండ్రి రాజేష్ పిర్యాదు చేయడం తో మిస్సింగ్ కేసు నమోదు చేశారు. దీనితో దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు రైల్వే స్టేషన్ లో శబరి ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణించినట్లు సీసీటీవీ ఫుటేజీల ద్వారా గుర్తించారు. ఇదిలా ఉండగా, మే 30న సింగరాయకొండలోని స్వామివారి తోట బావిలో అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతదేహం లభించింది. మృతుడి వద్ద ఉన్న ఎర్రటి టీషర్ట్, మెడలోని ఆంజనేయస్వామి లాకెట్ తదితర ఆధారాలను పోలీసులు సోషల్ మీడియా, పత్రికల ద్వారా ప్రచారం చేశారు. ఈ సమాచారం రాహుల్ కుటుంబ సభ్యులకు చేరడంతో వారు సింగరాయకొండకు వచ్చి ఆధారాలను పరిశీలించి మృతుడిని తమ కుమారుడిగా గుర్తించారు. సోమవారం తెలంగాణ, సింగరాయకొండ పోలీసులు కుటుంబ సభ్యులతో కలిసి ఘటనాస్థలాన్ని పరిశీలించారు. మృతదేహం లభ్యమైన బావితో పాటు ఖననం చేసిన ప్రదేశాన్ని కూడా వారికి చూపించారు. రాహుల్ తండ్రి అంకం రాజేష్ మాట్లాడుతూ, తన కుమారుడు హాస్టల్ నుంచి అదృశ్యమైన తర్వాత మిస్సింగ్ కేసు నమోదు చేశామని తెలిపారు. వందల కిలోమీటర్ల దూరంలోని సింగరాయకొండకు రాహుల్ ఎలా చేరుకున్నాడనే విషయంపై అనుమానాలు ఉన్నాయని చెప్పారు. ఇది ఆత్మహత్యా, హత్యా అన్నది తేల్చాలని, కాలేజీలో ర్యాగింగ్‌కు సంబంధించిన అంశాలపై కూడా సమగ్ర విచారణ జరపాలని పోలీసులను కోరారు. సీఐ శ్రీహరి మాట్లాడుతూ, మే 30న బావిలో గుర్తించిన మృతదేహాన్ని యువనేస్తం ఫౌండేషన్ సభ్యుల సహకారంతో బయటకు తీసి పోస్టుమార్టం, ఫోరెన్సిక్ అనంతరం ఖననం చేసినట్లు తెలిపారు. మృతుడి వద్ద లభించిన ఆధారాల ఆధారంగా ప్రచారం చేయడంతో కుటుంబ సభ్యులు స్పందించారని చెప్పారు. మృతదేహం వద్ద లభించిన టీషర్ట్, లాకెట్ తదితర వస్తువులను కుటుంబ సభ్యులకు చూపించగా, వారు రాహుల్‌గా గుర్తించినట్లు తెలిపారు. అయితే పూర్తి నిర్ధారణ కోసం కుటుంబ సభ్యుల డీఎన్ఏ నమూనాలను సేకరించి పరీక్షలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.



ఎంపి సానా సతీష్‌కు దుర్గమ్మ చిత్రపటం అందజేస్తున్నఆలయ సిబ్బంది

# ఇంద్రకీలాద్రిపై వైభవంగా యోగాంధ్ర

**ఇంద్రకీలాద్రి, జూన్ 8, ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రం లోని ముఖ్య దేవాలయాల్లో ఖాళీగా ఉన్న వేదపారాయణదారులు, అర్చకులు, పరిచారకులు, భజంత్రీలు, వంట స్వాములు తదితర ధార్మిక పోస్టుల భర్తీకి ఇప్పటికే నోటిఫికేషన్ జారీ చేసి, అభ్యర్థుల నుండి దరఖాస్తులు స్వీకరించి, పరిశీలన అనంతరం హాల్ టిక్కెట్లు జారీ చేసి మొదటగా వేదపారాయణదారులుకు పరీక్ష నిర్వహిస్తున్నామని రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ కె. రామచంద్రమోహన్ అన్నారు. వేదపారాయణదారుల పోస్ట్ లకు సంబందించిన మౌఖిక పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. మాడపాటి అతిధి గృహంలో దేవదాయ కమిషనర్ మీడియాతో మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి రాష్ట్రంలో అన్ని ఆలయాలలో ఖాళీగా ఉన్న వైదిక సిబ్బంది పోస్టులు అన్నీ భర్తీ చేయాలని ఆదేశించిన మేరకు వైదిక సిబ్బంది ఖాళీల వివరాలన్ని సేకరించి, భర్తీకి ప్రభుత్వానికి ప్రతిపాదన పంపించగా, ప్రభుత్వం సెంట్రలైజెడ్ ఎ రిక్రూ నిర్వహించి, పూర్తి పారదర్శకత్వంతో ప్రతిభకే పట్టం కట్టే విధంగా నియామకాలు జరుపాలని ఆదేశించిందని రామచంద్ర మోహన్ పేర్కొన్నారు. 342 ధార్మిక పోస్టులకు గానూ రాష్ట్రవ్యాప్తంగా 5వేల మందికి పైగా అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారని, శ్రీకాకుళం నుండి కృష్ణా జిల్లా గల మల్టీజోన్1 వేదపారాయణదారుల అభ్యర్థులకు విజయవాడ మాడపాటి అతిధి గృహంలో వేరే జోన్ కు చెందిన పండితులు అర్హత పరీక్ష జరుపుతుండగా, వేరే జోన్ కు చెందిన ఇద్దరు డిప్యూటీ కమిషనర్లు పర్యవేక్షణ చేస్తున్నారని, గుంటూరు నుండి రాయలసీమ వరకు గల మల్టీ జోన్ 2 అభ్యర్థులకు ఇదే విధంగా సీతానగరంలో పూర్తి పారదర్శకంగా ఈనెల 16 వరకు మౌఖిక పరీక్షలు జరుగుతాయని రామచంద్ర మోహన్ వివరించారు. ఈ మౌఖిక పరీక్షల్లో పారదర్శకత వహించి, ప్రతిభావంతులకే పట్టం కట్టేందుకు పరీక్షల నిర్వహణ అంతా వీడియో లైవ్ రికార్డింగ్ చేస్తున్నామని, వేదపారాయణదారు పోస్టుల భర్తీలో విద్యార్హతలు, వేదార్హతలు, అనుభవం, మౌఖిక పరీక్షలలో ప్రదర్శించిన ప్రతిభ ఆధారంగా మార్కులు కేటాయించి, మెరిట్ జాబితా రూపకల్పన జరుగుతుందని, మూడు ఇంటర్వ్యూ బోర్డులు ఏర్పాటు చేసామని, ఏ అభ్యర్థి ఏ ఇంటర్వ్యూ బోర్డుకు వెళ్తారో ఆఖరు నిమిషం వరకు అభ్యర్థికి తెలియదని కమిషనర్ వెల్లడించారు. వేదపారాయణదారు పోస్టుల ఎంపిక ప్రక్రియ పూర్తయిన అనంతరం అర్చకులు, పరిచారకులు, భజంత్రీలు తదితర పోస్టుల భర్తీని దశలవారీగా పూర్తి చేస్తామని రామచంద్ర మోహన్ పేర్కొన్నారు.

**- దుర్గమ్మవారి సేవలో ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి :**

రాజ్యసభ సభ్యులు, ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి సానా సతీష్ గారు రెండోసారి రాజ్యసభకు ఎంపికైన ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి సానా సతీష్ సోమవారం దుర్గమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ పండితులు ఆయనకు వేద మంత్రాలతో ఆశీర్వచనం అందించి, అమ్మవారి శేషవస్త్రం, తీర్థప్రసాదాలు మరియు చిత్రపటాన్ని ఆలయ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కిషోర్ కుమార్ బహుకరించారు.

**- నిత్యాన్నదాన పథకానికి విరాళాలు:**

దుర్గమ్మవారి ఆలయంలో జరుగుతున్న నిత్యాన్నదాన పథకానికి తాడేపల్లికి చెందిన ఐ అండ్ పి ఆర్ ఉద్యోగి వేమూరి ప్రసాద్, వెంకటలక్ష్మి దంపతులు వారి పదవీ విరమణ సందర్భంగా పార్టీ అల్లుడు కృష్ణ కుమార్తె సాయి సింధూర పేర్ల మీద నిత్య అన్నదాన పథకమునకు రూ.1.01,116లు మరియు ఎండాడ, విశాఖపట్నం వాస్తవ్యులు కె త్రినాధ రెడ్డి ఝాన్సీ రాణి దంపతులు రూ.1,01,116లు మరియు భీమునిపట్నం విశాఖపట్నం వాస్తవ్యులు ఎం మాల్యాద్రి వెంగమ్మ దంపతులు రూ.1,01,116లువిరాళమును అందించారు. దాతలకు దుర్గమ్మవారి చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రాలను అధికారులు అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.

**- ఉత్సాహంగా యోగాంధ్ర :**

ఇంద్రకీలాద్రిపై ఉత్సాహంగా యోగాంధ్ర కార్యక్రమం రెండవ రోజు సోమవారం కొనసాగింది. గర్రె రాజేష్ రెండవ రోజు శిక్షణలో భాగంగా మానసిక ఒత్తిడిని తగ్గించే ప్రత్యేక ఆసనాలు మరియు శ్వాస ప్రక్రియకు (ప్రాణాయామం) సంబంధించిన విధివిధానాలను ప్రాక్టికల్‌గా వివరించారు. జూన్ 21వ తేదీ వరకు ప్రతి రోజు ఉదయం ఇంద్రకీలాద్రిపై ఈ ఉచిత యోగా శిక్షణ నిరంతరాయంగా కొనసాగుతుందని, భక్తులు, విజయవాడ నగర వాసులు ఈ సువర్ణావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఇఓ తెలిపారు.

# బీహార్ రోడ్డు ప్రమాద బాధితులకు తక్షణమే సహాయ చర్యలు

## : మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి

**నెల్లూరు, జూన్ 8, ప్రభాతవార్త - వైద్యం** బీహార్ రాష్ట్రంలోని ఔరంగాబాద్ సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో నెల్లూరు జిల్లా యాత్రికులు మృతి చెందడం తీవ్ర విషాదకరమని, బాధితులకు సత్వర సహాయం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టిందని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. నెల్లూరు సంతపేటలోని తన క్యాంపు కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ గయా నుంచి వారణాసికి వెళ్తున్న యాత్రికుల బస్సు ఔరంగాబాద్ సమీపంలో లారీ ఢీకొనడంతో ప్రమాదం జరిగిందన్నారు. ఈ ప్రమాదంలో సంగం, ఆత్మకూరు, దుత్తలూరు ప్రాంతాలకు చెందిన యాత్రికులు ప్రయాణిస్తున్నారని, ఉదయం 5 గంటల సమయంలో సమాచారం అందిందని చెప్పారు. బస్సులో మొత్తం 45 మంది ప్రయాణిస్తున్నారని, వారిలో ఇద్దరు డ్రైవర్లు, ఒక వంటమనిషి, 42 మంది యాత్రికులు ఉన్నట్లు తెలిపారు. ప్రమాదంలో ముగ్గురు మృతి చెందగా, 15 మంది గాయపడ్డారని వెల్లడించారు. మృతి చెందిన వారిలో టూర్ అటెండెంట్, వంటమనిషి, ఒక మహిళా యాత్రికురాలు ఉన్నారని చెప్పారు. సమాచారం అందిన వెంటనే జిల్లా కలెక్టర్, ముఖ్యమంత్రి కార్యాలయం, ఢిల్లీలోని ఆంధ్రభవన్ కమిషనర్‌కు సమాచారం ఇచ్చి సహాయక చర్యలు ప్రారంభించినట్లు మంత్రి తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఘటనపై వెంటనే స్పందించి బాధితులకు అత్యవసర సహాయ సహకారాలు అందించాలని అధికారులను ఆదేశించారని వెల్లడించారు. గయా నుంచి నెల్లూరు జిల్లాకు రోడ్డు మార్గంలో రావడానికి 38 గంటలకు పైగా సమయం పడుతుందని, ఈ నేపథ్యంలో మృతి చెందిన ముగ్గురు యాత్రికుల మృతదేహాలను సోమవారం ఉదయం ప్రత్యేక విమానంలో గయా నుంచి రేణిగుంట విమానాశ్రయానికి తీసుకువస్తామని మంత్రి తెలిపారు. అక్కడి నుంచి జిల్లా అధికారుల పర్యవేక్షణలో ప్రత్యేక వాహనాల ద్వారా వారి స్వగ్రామాలకు తరలించే ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. ప్రమాదంలో గాయపడిన 15 మంది యాత్రికులకు గయాలోని మెడికల్ కాలేజీలో వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. క్షతగాత్రులను కూడా ప్రత్యేక విమానంలో చెన్నైకి తీసుకువచ్చి, అక్కడి నుంచి ప్రత్యేక బస్సుల ద్వారా అధికారుల సహకారంతో నెల్లూరు జిల్లాకు తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. ముఖ్యమంత్రి కార్యాలయంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి బీహార్ అధికారులతో సమన్వయం కొనసాగిస్తున్నామని మంత్రి తెలిపారు. ఢిల్లీలోని ఆంధ్రభవన్ కమిషనర్ ఆధ్యా శ్రీకాంత్ బీహార్ ప్రభుత్వ అధికారులతో, సీఎంవో అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ పరిస్థితిని సమీక్షిస్తున్నారని చెప్పారు. బీహార్‌లో పనిచేస్తున్న సీనియర్ తెలుగు ఐఏఎస్ అధికారి డా. రాజేందర్ కుమార్, ఐపీఎస్ అధికారి వివేక్‌తో పాటు ఇతర ఉన్నతాధికారులు ప్రమాద స్థలానికి చేరుకుని సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారని మంత్రి వెల్లడించారు ఈ ప్రమాదంలో మొత్తం ముగ్గురు భక్తులు మృతి



చెందడం అత్యంత బాధాకరమని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. ఆత్మకూరు నియోజకవర్గ పరిధిలోని సంగం, ఆత్మకూరు, ఉదయగిరి నియోజకవర్గంలోని దుత్తలూరు నుంచి ఈనెల 1న ప్రైవేట్ బస్సు లో గయా, వారణాసి యాత్రకు వెళ్లిన భక్తులు ప్రమాదానికి గురికావడం తీవ్ర విచారం కలిగించిందన్నారు. మృతుల కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేసిన మంత్రి, గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. వారికి అవసరమైన వైద్య సహాయం అందేలా అధికారులు నిరంతరం చర్యలు చేపడుతున్నారని తెలిపారు.



# మనం శత్రువులం కాదు..మిత్రులం.!

## భారత్‌కు చైనా స్నేహహస్తం

**బీజింగ్,జూన్ 8:** భారత్ పట్ల చైనా తన వైఖరిని మార్చుకుంటోంది. ఇప్పుడు మనం మిత్రులం అంటూ స్నేహహస్తం అందిస్తోంది. భారత్, చైనాలు ప్రత్యర్థులు లేదా వ్యతిరేక శక్తులు కాదని, ఒకరి అభివృద్ధికి మరొకరు ముప్పుగా కాకుండా అవకాశాలుగా నిలిచే సహాయకారి భాగస్వాములు అని చైనా చెప్పింది. సోమవారం చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి లిన్ జియాన్ ఈ వ్యాఖ్యలు చేశారు. భారత్, చైనాలతో రష్యాకు ఉన్న సంబంధాలను ప్రస్తావిస్తూ ఇటీవల పుతిన్ చేసిన వ్యాఖ్యల తర్వాత డ్రాగన్ కంట్రీ నుంచి ఈ కామెంట్స్ వచ్చాయి. భారత్, చైనాలు సహకార భాగస్వాముల్లు అభివర్ణించిన లిన్ జియాన్, ప్రస్తుతం రెండు దేశాల సరిహద్దుల్లో సాధారణ స్థితి ఉందని చెప్పారు. ఇరు దేశాల మధ్య సమాచార మార్గాలు సజావుగా ఉన్నట్లు తెలిపారు. రెండు దేశాల మధ్య సానుకూల సంబంధాలు రెండు దేశాలకే కాకుండా మొత్తం ఆ ప్రాంతానికి చాలా ముఖ్యమైనవి అని అన్నారు. ఇరు పక్షాల సంబంధాలు వ్యూహాత్మక, దీర్ఘకాలిక దృక్పథంతో చూడాలని ఆయన తెలిపారు. చర్చలు, సంప్రదింపుల ద్వారా విభేదాలను పరిష్కరించుకోవాలని చైనా చెప్పింది. రష్యా, భారత్, చైనా సంబంధాల గురించి మాట్లాడుతూ మూడు వర్ధమాన దేశాలని, ఈ దేశాల మైత్రి ప్రపంచ శాంతి, స్థిరత్వానికి ప్రయోజనకరమని అన్నారు. దీనికి ముందు రష్యా అధ్యక్షుడు భారత్‌చైనా సంబంధాల గురించి మాట్లాడుతూ రెండు దేశాల మధ్య సంబంధాలు చాలా సున్నితమైనవిగా,

బహుపాక్షికమైనవిగా అభివర్ణించారు. రెండు దేశాల మధ్య మూడో పక్షం జోక్యం చేసుకోవడం తగదని ఆయన అన్నారు. రష్యాకు రెండు దేశాలు మిత్రలే అని చెప్పారు. సరిహద్దు వివాదం వంటి సున్నితమైన అంశాలతో సహా పరస్పర ఆసక్తి ఉన్న అన్ని సమస్యలు పరిష్కరించడానికి మోడీ, జిన్ పింగ్ కృషి చేస్తున్నట్లు చెప్పారు.

# 10 నుంచి భవన నిర్మాణ కార్మికుల బంద్

**- సెంట్రింగ్ కాంట్రాక్టర్ల అనుచిత వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలి**

**- భవన నిర్మాణ రంగ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆత్మగౌరవ సభ**

**- మద్దతు తెలిపిన హార్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, బీఆర్ఎస్ నేత ఆర్.ఎస్.ప్రవీణ్**



ధర్నానుద్దేసించి ప్రసంగిస్తున్న హార్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ

**ధర్నాచౌక్, జూన్ 8, ప్రభాతవార్త:** ఈనెల 10 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా భవన నిర్మాణ కార్మికులు బంద్ పాటిస్తున్నట్లు భవన నిర్మాణ రంగ కార్మిక సంఘం నేతలు స్పష్టం చేశారు. సోమవారం సెంట్రింగ్ కాంట్రాక్టర్లు, తాపీ మేస్త్రీలపై చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘం గ్రేటర్ హైదరాబాద్ ఆధ్వర్యంలో ఆత్మగౌరవ సభ పేరుతో ధర్నా నిర్వహించారు. గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు సూర వెంకటయ్య అధ్యక్షతన జరిగిన ఈ ధర్నా కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు కామల్ల ఐలన్న, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉప్పు సాయికుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షులు మురుగు యాదగిరి, మేడ్చల్ జిల్లా అధ్యక్షులు చొక్కాపురం శ్రీరాములు, గ్రేటర్ ప్రధాన కార్యదర్శి ఆదిరాల రవికుమార్ పాల్గొని తమ తాపీ మేస్త్రీల సమస్యలపై ప్రసంగించారు. ధర్నాకు హార్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ హాజరై మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులు ఐక్యంగా ఉండి, తమ హక్కులను సాధించుకోవాలని సూచించారు. కార్మిక శాఖ నుంచి వచ్చే అన్ని సంక్షేమ పథకాలు కార్మికులందరికీ అందాలని తెలిపారు. బీఆర్ఎస్ నేత ఆర్.ఎస్.ప్రవీణ్ మాట్లాడుతూ సెంట్రింగ్ కాంట్రాక్టర్లు, తాపీ మేస్త్రీలు అన్నదమ్ముల వంటి వారని, రాష్ట్ర ప్రభుత్వం, కార్మిక శాఖామంత్రి వీరి మధ్య రాజీ కుదర్చాలని కోరారు. రాష్ట్ర అధ్యక్షులు కామల్ల ఐలన్న మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులంతా ర్యాలీగా వెళ్లి అన్ని పోలీస్‌స్టేషన్లలో సెంట్రింగ్ కాంట్రాక్టర్లపై కేసులు నమోదు చేస్తామని తెలిపారు. తాపీ మేస్త్రీలపై సెంట్రింగ్ కాంట్రాక్టర్లు చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకుని, భేషరతుగా క్షమాపణలు చెప్పాలని కోరారు. కార్మిక సంక్షేమం కోసం ఏర్పాటుచేసిన సంక్షేమ బోర్డు ప్రభుత్వ ఆధీనంలోనే ఉండాలని, తాపీ మేస్త్రీల ధరలు పెరగాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం స్పందించి, భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షం పోరాటాన్ని ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. ఈ ధర్నా కార్యక్రమంకు తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి భవన నిర్మాణ కార్మికులు వేలాదిగా తరలి వచ్చారు.

# అక్రమంగా తెల్లరాయి రవాణా

## - గ్రామస్తుల ఫిర్యాదుతో లారీ సీజ్ చేసిన పోలీసులు

**వింజమూరు (నెల్లూరు), జూన్ 8, ప్రభాతవార్త :** వింజమూరు మండల పరిధిలోని జనార్ధనపురంలో అక్రమంగా తీసిన తెల్లరాయి తరలిస్తున్న లారీని స్థానిక గ్రామస్తులు సోమవారం అడ్డుకున్నారు. అనుమతులు లేకుండా తెల్లరాయిని తరలిస్తున్నారని ఆరోపిస్తూ గ్రామస్తులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న వింజమూరు ఎస్ఐ ఉమామహేశ్వరరావు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని లోడుతో ఉన్న లారీని డ్రైవర్ను అదుపులోకి తీసుకున్నారు. స్వాధీనం చేసుకున్న లారీని వింజమూరులోని అగ్నిమాపక కేంద్రం ఆవరణలో భద్రపరిచారు. ఈ ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి, చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్ఐ తెలిపారు. గతంలో కూడా జనార్ధనపురం నుంచి అనధికారికంగా తెల్లరాయిని తరలించేందుకు ప్రయత్నించారని గ్రామస్తులు తెలిపారు. అప్పట్లో పోలీసు అధికారులు స్పందించి, గనుల శాఖ అనుమతి లేకుండా రాయిని తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించడంతో అతడు తరలింపు ప్రయత్నాన్ని విరమించుకున్నాడు.

అయితే ఇటీవల గ్రామస్తుల కళ్లుగప్పి ఒక లోడు తెల్లరాయిని అక్రమంగా తరలించాడని స్థానికులు ఆరోపిస్తున్నారు. మిగిలిన మరో లోడు రాయిని సోమవారం తరలించేందుకు యత్నించగా అప్రమత్తమైన గ్రామస్తులు అడ్డుకుని పోలీసులకు సమాచారం అందించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ అక్రమ తెల్లరాయి తవ్వకాలు పై గనుల శాఖ అధికారులకు సమాచారం అందించమన్నారు. సహజ వనరులను

ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై పేర్కొన్నారు.

# ఢిల్లీలో తగ్గిపోతున్న పచ్చదనం

## కాలుష్యంతో ప్రమాదాలు - హైకోర్టు అసహనం

**న్యూఢిల్లీ,జూన్ 8:** దేశ రాజధాని నగరం ఢిల్లీలో పచ్చని ప్రదేశాలు వేగంగా తగ్గిపోతున్నాయని ఢిల్లీ హైకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ముఖ్యంగా న్యూ ఢిల్లీ మున్సిపల్ కౌన్సిల్ పరిధిలో మిగిలి ఉన్న కొద్దిపాటి గ్రీన్ స్పేస్‌లను కూడా స్వాధీనం చేసుకుంటే, భవిష్యత్తులో ప్రజలు ఊపిరాడక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని కోర్టు వ్యాఖ్యానించింది. ఢిల్లీలోని జిమ్ఖానా క్లబ్, పోలో గ్రౌండ్ సహా పలు ఆస్తులను కేంద్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకునే అంశంపై దాఖలైన పిటిషన్‌ను విచారిస్తున్న సందర్భంగా ఈ వ్యాఖ్యలు వెలువడ్డాయి. పోలో అసోసియేషన్ దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ నీనా బన్సల్ కృష్ణ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. విచారణ సందర్భంగా, ఇప్పటికే ఢిల్లీలో పచ్చదనం గణనీయంగా తగ్గిపోతున్న పరిస్థితిని కోర్టు ప్రస్తావించింది. ముఖ్యంగా ఎన్‌డీఎంసీ పరిధిలో ఉన్న కొద్దిపాటి పచ్చని ప్రదేశాలు నగర ప్రజలకు స్వచ్ఛమైన గాలి అందించే ఊపిరితిత్తుల్లా పనిచేస్తున్నాయని పేర్కొంది. అలాంటి ప్రాంతాలను కూడా ఇతర అవసరాల కోసం వినియోగిస్తే పరిస్థితి మరింత దిగజారే ప్రమాదం ఉందని అభిప్రాయపడింది. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వాన్ని ఉద్దేశించి కోర్టు కీలక ప్రశ్నలు సంధించింది. స్వాధీనం చేసుకోబోయే భూములపై ఎత్తైన భవనాలు లేదా ఇతర భారీ నిర్మాణాలు చేపట్టే ఆలోచన ఉందా అని ప్రశ్నించింది. పచ్చని ప్రదేశాలు తగ్గిపోతే నగరంలో పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుందని, ప్రజల జీవన ప్రమాణాలపై కూడా తీవ్ర ప్రభావం పడుతుందని కోర్టు పేర్కొంది. ఎన్‌డీఎంసీ పరిధిలో ప్రజలు ఊపిరి పీల్చుకునేందుకు మిగిలి ఉన్న కొద్దిపాటి స్థలాలు కూడా కనుమరుగైతే, భవిష్యత్తులో అందరం ఊపిరాడక ఇబ్బంది పడాల్సి వస్తుంది. దేవుడే అందర్నీ కాపాడాలంటూ ధర్మాసనం ఆందోళన వ్యక్తం చేసింది.

# కొత్త అణ్వాయుధ వ్యవస్థలు పెంచుకుంటున్న భారత్ పాక్‌దేశాలు

## స్టాక్‌హోం కేంద్రంగా ఉన్న సిప్రీ సర్వే నివేదికలో ప్రస్తావన

**న్యూఢిల్లీ, జూన్ 8:** భారత్, పాకిస్థాన్ దేశాలు కొత్త తరహా అణ్వాయుధ డెలివరీ వ్యవస్థలను అభివృద్ధి చేసినట్లు అంతర్జాతీయ సర్వేసంస్థలు చెపుతున్నాయి. బాలిస్టిక్ క్షిపణులకు వార్‌హెడ్స్‌ను అమర్చే సామర్థ్యాన్ని కూడా ఆ దేశాలు పెంచుకున్నట్లు స్టాక్‌హోమ్ ఇంటర్నేషనల్ పీస్ రీసర్చ్ ఇన్స్‌టిట్యూట్ సిప్రీ తన నివేదికలో ప్రస్తావించింది. భారత్, చైనా దేశాలు తమ వద్ద ఉన్న అణ్వస్త్రాలసంఖ్యను పెంచుకున్నట్లు ఆ నివేదికలో చెప్పారు. దీంతో పాటు వార్‌హెడ్స్ ఉన్న అణ్వాయుధాలను వ్యవూహాత్మక ప్రాంతాలకు తరలించినట్లు తెలుస్తోంది. జనవరి 2026 నాటికి భారత్ వద్ద సుమారు 190 న్యూక్లియర్ వెపన్స్ ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. గత ఏడాదితో పోలిస్తే సంఖ్య స్వల్పంగా పెరిగింది. ఇక చైనా వద్ద నిల్వల్లో 620 వార్‌హెడ్స్ ఉన్నాయి. గత ఏడాది ఆ దేశం వద్ద 600 మాత్రమే ఉండేవని స్టాక్‌హోమ్ రీసర్చ్ సంస్థ తెలిపింది. భారత్ తన యుద్ధ విమానాలు, నేల నుంచి ప్రయోగించే మిస్సైళ్లు, అణ్వాయుధ సామర్థం కలిగిన జలాంతర్గామిలకు న్యూక్లియర్ వెపన్స్‌ను అమర్చినట్లు కూడా ఆ రిపోర్టులో పేర్కొన్నారు. ఇంకా అదనపు మిస్సైళ్ల కోసం మరికొన్ని వార్‌హెడ్స్‌ను కూడా తయారు చేస్తున్నట్లు సిప్రి తన రిపోర్టులో చెప్పింది. ఆ వార్‌హెడ్స్ ఉన్న క్షిపణులను కంటైనర్లకు తరలిస్తున్నట్లు రిపోర్టులో చెప్పారు. సిప్రీ అంచనాల ప్రకారం ఈ ఏడాది జనవరి నాటికే స్వల్ప సంఖ్యలో ఉన్న వార్‌హెడ్స్‌ను ఇండియా తన జలాంతర్గాములకు తరలించినట్లు తెలుస్తోంది. చైనాపై ఫోకస్‌తో ఇండియాన సుదీర్ఘశ్రేణి ఆయుధ వ్యవస్థలను తయారు చేసుకుంటున్నట్లు రిపోర్టులో తెలిపారు. దీంతో పాటు పాకిస్థాన్‌తో ఉన్న శత్రుత్వాన్ని దృష్టిలో పెట్టుకుని కూడా ఇండియా తన ప్లానింగ్ చేస్తున్నట్లు సిప్రి నివేదికలో ఉటంకించింది. ఇక పాకిస్థాన్ అణ్వాయుధాల రిపోర్టును సిప్రి తెలియచేసింది. ఈ ఏడాది నాటికి పాకిస్థాన్ వద్ద 170 వార్‌హెడ్స్ ఉన్నట్లు రిపోర్టులో వెల్లడించారు. ల్యాండ్, ఎయిర్ సామర్థంలో బాగానే ఉన్నా సముద్ర సామర్థ్యాన్ని పాక్ పెంచుకునే ప్రయత్నం చేస్తున్నది. రాబోయే దశాబ్దంలో తన అణ్వస్త్ర సామర్థ్యాన్ని పాక్ పెంచుకోనున్నదని రిపోర్టులో పేర్కొన్నారు. ఈ ఏడాది జనవరి నాటికి ప్రపంచవ్యాప్తంగా 12,187 అణ్వాయుధాలు ఉన్నట్లు సిప్రీ వెల్లడించింది. మిలిటరీ వద్ద 9745 ఆయుధాలు ఉన్నాయని తేల్చింది. ఇక 4012 మాత్రం క్షిపణులు, ఎయిర్‌క్రాఫ్ట్ లో నిక్షిప్తంచేసారు. రష్యా, అమెరికా దేశాలు సుమారు 2200 ఆయుధాలను హై అలర్ట్‌లో పెట్టినట్లు తెలుస్తోంది. భారత్, చైనా దేశాలు కూడా హై ఆపరేషనల్ అలర్ట్‌లో వార్‌హెడ్స్‌ను పెట్టినట్లు తెలుస్తోంది. చైనా, ఫ్రాన్స్, రష్యా, యూకే, యూఎస్ దేశాల వద్ద ఎంఐఆర్వీ టెక్నాలజీ ఆయుధాలు ఉన్నాయి. ఇక ఇండియా, పాక్, ఉత్తర కొరియా ఆ టెక్నాలజీ కోసం ప్రయత్నిస్తున్నాయి. ఎంఐఆర్వీ టెక్నాలజీ అత్యంత శక్తివంతమైందని భావిస్తున్నారు. ఇండియా కూడా ఇటీవల అగ్ని5 మధ్యంతర క్షిపణి ద్వారా ఎంఐఆర్వీ టెక్నాలజీని పరీక్షించింది. మరోవైపు పాక్ మీడియం రేంజ్ క్షిపణులను డెవలప్ చేస్తున్నది.

# నిరుద్యోగ సమస్యలపైనే యువజన సమ్మేళనం

## 16, 17 తేదీల్లో కొత్తపేట బీజేఆర్ భవన్‌లో నిర్వహణ - కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై జాన్‌వెస్లీ ధ్వజం

**చిక్కడపల్లి జూన్ 8 (ప్రభాతవార్త ) :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విఫల విధివిధానాలు, నిరుద్యోగ సమస్యలపై చర్చించి యువతను చైతన్యపర్చేందుకు ఈ నెల 16, 17 తేదీల్లో నగరంలోని కొత్తపేటలోని బీజేఆర్ భవన్‌లో యువజన సమ్మేళనం నిర్వహించనున్నట్లు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ ప్రకటించారు. సోమవారం ఆర్టీసీ క్రాస్ రోడ్స్ సిపిఎం రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఈ సమ్మేళనానికి ముఖ్య అతిథులుగా సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు, కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం, రాజ్యసభ సభ్యులు ఏ.ఏ.రహీం హాజరవుతారని తెలిపారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాల భర్తీ చేస్తామన్న కేంద్ర హామీ ఏమైందని జాన్‌వెస్లీ ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వ శాఖల్లో 60 లక్షలు, ఒక్క రైల్వే శాఖలోనే 10 లక్షల ఖాళీలున్నా భర్తీ చేయడం లేదని, పైగా ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరిస్తూ ఉన్న ఉద్యోగాలను ఊడబీకుతున్నారని మండిపడ్డారు. ప్రైవేటు రంగంలో రిజర్వేషను లేకపోవడం వల్ల దళితులు, ఆదివాసీలు, బీసీలు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఇక రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే 2 లక్షల ఉద్యోగాల భర్తీ చేస్తామన్న హామీని బుట్టదాఖలు చేసిందని విమర్శించారు.

9skl13:9skl13.qxd 09-06-2026 00:04 Page 1



## అప్పలస్వామి కుటుంబానికి పరామర్శ

**కంచిలి, జూన్ 8, ప్రభాతవార్త :**



మండలం రేఖాదేవిపురం గ్రామానికి చెందిన దేవరపత్ర అప్పలస్వామి (45) ఆకస్మికంగా మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ విషయం తెలుసుకున్న ఎంటీఎస్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుడ్డెపు కామేష్ రెడ్డి సోమవారం గ్రామానికి చేరుకుని మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా అప్పలస్వామి మృతి పట్ల ప్రగాఢ సంతాపం వ్యక్తం చేసిన కామేష్ రెడ్డి, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ కష్ట సమయంలో కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఆయనతో పాటు గ్రామ పెద్దలు, స్థానిక నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## మహిళల నైపుణ్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి



### ఎమ్మెల్యే, పియుసి కమిటీ చైర్మన్ కూన

**ఆమదాలవలస, జూన్ 8 (ప్రభాతవార్త) :**

మహిళల నైపుణ్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే, పియుసి కమిటీ చైర్మన్ కూన రవికుమార్ అన్నారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే రవికుమార్ స్వగ్రామమైన పెనుబర్తి గ్రామంలో మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలను కల్పించే లక్ష్యంతో యూనియన్ బ్యాంకు రూరల్ సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే రవికుమార్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రవికుమార్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత మహిళలకు ఉపాధి కల్పించడంలో ఇటువంటి శిక్షణ కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. మహిళలు ఏపీ ప్రభుత్వం మరియు బ్యాంకుల ఆధ్వర్యంలో అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని తమ కుటుంబ ఆర్థికాభివృద్ధికి తోడ్పడాలని మహిళలకు సూచించారు. నైపుణ్యాభివృద్ధి ద్వారా మహిళలు స్వయం సమృద్ధిని సాధించి సమాజ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే రవికుమార్ పిలుపునిచ్చారు. మండల అధ్యక్షుడు చీగిరిపల్లి రామ్మోహన్‌రావు, సిపాన శ్రీరంగనాయకులు, బాడన గిరి, దండా రవి, శిక్షణ సంస్థ ప్రతినిధులు, బ్యాంకు అధికారులు, మహిళా సంఘాల సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## వీఆర్వోలపై పనిభారం తగ్గించాలి

**పాతపట్నం, జూన్ 8, ప్రభాతవార్త**



విఆర్వోలపై పనిభారాన్ని తగ్గించాలని కోరుతూ పాతపట్నం మండల వీఆర్వోల సంఘం నాయకులు కోరారు. మండలంలోని వీఆర్వోలు, వీఆరఏలు, సర్వేయర్స్, ఎన్జీఓ సంఘం వారు పాతపట్నం తహశీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేశారు. అనంతరం తహశీల్దార్ నందిగాం ప్రసాదరావుకి వినతిపత్రాన్ని అందజేశారు. ఇటీవల పనిభారం తట్టుకోలేక కర్నూలు జిల్లా వెంకాయపాలెం విఆరఓ మహమ్మద్ హుస్సేన్ ఆత్మహత్య చేసుకొని మరణించారని, మరణించిన విఆరఓ మృతిపై అధికారులు ఒత్తిడే ప్రధాన కారణమని వారు ఆరోపించారు. హుస్సేన్‌కు సంతాపం తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల వీఆర్వోల సంఘం అధ్యక్షులు బి.మురళీకృష్ణ, కార్యదర్శి అలేఖ్య, జిల్లా ఉపాధ్యక్షులు బి.తిరుపతిరావు, ఎన్జీఓ సంఘం నాయకులు పి.బాలరాజు మరియు వీఆర్వోలు, వీఆరఏలు, సర్వేయర్లు పాల్గొన్నారు. అలాగే ఈ ఘటనకు నిరసనగా రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం ఆదేశాల మేరకు 9వ తేదీన రాష్ట్రంలోని అన్ని జిల్లా కలెక్టరేట్ కార్యాలయాల ఎదుట శాంతియుతంగా నిరసన తెలిపి, జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం ఇవ్వాలని నిర్ణయించారని, ఇందుకు తహశీల్దార్‌కు అనుమతిని వారు కోరారు.

## బాధితులకు అండగా కూటమి ప్రభుత్వం : కూన



**ఆమదాలవలస, జూన్ 8, (ప్రభాతవార్త)**

నియోజకవర్గంలో పొందూరు మండలం పలు గ్రామాలకు చెందిన పలు కుటుంబాలకు చెందిన లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును ఎమ్మెల్యే కూన రవికుమార్ ఇంటింటికి వెళ్లి పంపిణీ చేశారు. పిల్లలవలస గ్రామానికి చెందిన బుడుమూరు అమ్మాయమ్మకు రూ.42500లు, మొదలవలస గ్రామానికి చెందిన సీతారామారావుకు రూ.192000లు, రామదాసుపురం గ్రామానికి చెందిన పైడి వెంకటరమణకు రూ.21900లు, కనిపెట్ట గ్రామానికి చెందిన బొడ్డేపల్లి భానుమూర్తికు రూ.92700లు పలు కుటుంబాలు వైద్య ఖర్చులకోసం ముఖ్యమంత్రి సహాయ నిధి అందించాలని పలువురు ఎమ్మెల్యే రవికుమార్‌కు విన్నవించుకున్నారు. వారి విన్నపాన్ని ఎమ్మెల్యే ముఖ్యమంత్రి కార్యాలయానికి అందించారు. ఈ దరఖాస్తులు పరిశీలించిన ముఖ్యమంత్రి కార్యాలయం సహాయనిధి మంజూరు చేశారు. సీఎం సహాయనిధి చెక్కులను వైద్య చికిత్స నిమిత్తం ఇంటింటికి వెళ్లి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రవికుమార్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి కార్యకర్తకు తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని అన్నారు. కూటమి ప్రభుత్వం అభివృద్ధి ధ్యేయంగా పని చేస్తుందని అన్నారు. ప్రభుత్వం చేపడుతున్న పలు సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకుని వెళ్లవలసిన బాధ్యత ప్రతి టిడిపి కార్యకర్తపై ఉందని అన్నారు. సీఎంఆరఎఫ్ సహాయం అందడంతో లబ్ధిదారుల కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే రవికుమార్‌కు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వంపై 'వెన్నుపోటుకు రెండేళ్ల పేరిట నిరసన

**పాతపట్నం, జూన్ 8, ప్రభాతవార్త:**




తెలుగుదేశం నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం గడిచిన రెండేళ్ళలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోగా, తీవ్రంగా వెన్నుపోటు పొడిచిందని వైఎసఆర్సీపీ రాష్ట్ర క్రమశిక్షణా కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. వైకాపా అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పాతపట్నం నియోజకవర్గంలో రెండు రోజుల పాటు కీలక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆమె తెలియజేశారు. జూన్ 9వ తేదీన స్థానిక వైకాపా కార్యాలయంలో వెన్నుపోటుకు రెండేళ్ళు నిరసన సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అలాగే జూన్ 10న స్థానిక కెఎసఎం ప్లాజాలో భవిష్యత్తు ఎన్నికలు, పార్టీ బలోపేతమే లక్ష్యంగా నియోజకవర్గ పరిధిలోని 323 బూత్‌లకు సంబంధించిన ఏజెంట్ల శిక్షణ, ఎసఐఆర్ ఓటర్ల సవరణపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ శిక్షణా కార్యక్రమానికి వైఎసఆర్సీపీకి చెందిన పలువురు రాష్ట్ర, జిల్లా స్థాయి సీనియర్ నాయకులు ముఖ్య అతిథులుగా హాజరు కానున్నారని, ఈ రెండు రోజుల కార్యక్రమాలను విజయవంతం చేయాలని, నియోజకవర్గంలోని వైఎసఆర్సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలి రావాలని రెడ్డి శాంతి పిలుపునిచ్చారు.

## రణస్థలం గెడ్డ కబ్జాపై కదిలిన రెవెన్యూ యంత్రాంగం!



### -ఆక్రమణను తొలగించిన రెవెన్యూ అధికారులు

**రణస్థలం, జూన్ 8, ప్రభాతవార్త :**

జె.ఆర్.పురం పంచాయితీ పరిధి వెంకటేశ్వర కాలనీలో తారురోడ్డు అనుకొని ఉన్న ప్రభుత్వ గెడ్డను అర్ధరాత్రి వేళలో జెసిబితో పూడ్చి, కబ్జా చేసిన ఉదంతంపై రెవెన్యూ యంత్రాంగం స్పందించింది. ఈ కబ్జాపై సోమవారం పలు పత్రికల్లో కథనాలు వెలువడడంతో రణస్థలం తహసీల్దార్ ఎస్.కిరణ్ కుమార్ స్పందించి కబ్జాకు గురైన స్థలాన్ని పరిశీలించాల్సిందిగా రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఎమ్.సంతోష్, గ్రామ రెవెన్యూ అధికారి వై.జగన్నాధం, గ్రామ సర్వేయర్ సౌజన్యను ఆదేశించారు. తహసీల్దార్ ఆదేశాల మేరకు వారు సోమవారం ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. రాత్రికి రాత్రే జెసిబితో గెడ్డను పూడ్చివేసి చదును చేసిన ఉదంతం నిజ మేనని ప్రాథమికంగా గుర్తించి కబ్జాకు గురైన ప్రభుత్వ గెడ్డను జేసీబీ సాయంతో పూర్వ స్థితికి తీసుకొచ్చారు. ప్రభుత్వ భూములను, సహజ నీటి వనరులను ఆక్రమిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా వారు హెచ్చరించారు. రెవెన్యూ అధికారులు కబ్జాపై స్పందించి చర్యలు తీసుకోవడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

## నీలాచలం మాస్టర్ మృతి తీరని లోటు

**కవిటి, జూన్ 8 ప్రభాతవార్త**



కవిటి పంచాయతీ ప్రగడపుట్టుగకి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు పూడి నీలా చలం మృతి ఎందరికో తీరని లోటుగా మారిందని పలువురు ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. విశ్రాంత ఉపాధ్యా యులైన పూడి నీలాచలం శనివారం వేకువజామున అనారోగ్యంతో మృతి చెందారు. మరునాడు జిల్లా పరిషత్ చైర్మన్ పిరియా విజయసాయిరాజ్, ఎమ్మెల్సీ ఎం.రామారావుతో పాటు పలువురు వైసిపి నాయకులు పూడి గుణవతి కుమారుడు శ్రీహరిని కలిసి పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. వీటితోపాటు కవిటి ఎంపీపీ ప్రతినిధి కడియాల ప్రకాష్, మాజీ ఎంపీపీ ప్రతినిధి బెందాళం జయప్రకాష్, మాజీ ఏఎంసీ ఉపాధ్యక్షులు నిలయ్య వైసీపీ నాయకులు జల్లు యుగంధర్ బతకల భాస్కరరావు పాల్గొన్నారు.

## యోగాపై శిక్షణ

**కవిటి, జూన్ 8 ప్రభాతవార్త**

మండల పరిషత్ కార్యాలయంలో యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా మాస్టర్ ట్రైనర్‌లు పంచాయతీ డెవలప్‌మెంట్ ఆఫీసర్‌కు యోగా మీద శిక్షణా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఎంపిడిఓ ఎల్.త్రినాధ్ పాల్గొని మన దైనందిక జీవితంలో యోగాప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో గోవా ట్రైనీలుగా యోగ గురువు సత్యానంద్, సురేష్ మాస్టర్, గోపి మాస్టర్, అలాగే కార్యాలయపు ఏవో శ్రీనివాస రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఫైనల్‌లో నెగ్గిన సోంపేట



**కంచిలి, జూన్ 8, ప్రభాతవార్త :**

మండలం చోట్రాయిపురం గ్రామంలో జరిగిన క్రికెట్ ఫైనల్ పోటీల్లో సోంపేట జట్టు గెలిచింది. సోమవారం ఫైనల్ మ్యాచ్ సోంపేటతో జరగ్గా సోంపేట ప్రథమ స్థానంలో జేపీ కొత్తూరు ద్వితీయ స్థానంలో నిలిచింది. ప్రథమ స్థానంలో నిలిచిన జట్టుకు 5000 రూపాయలు నగదు షీల్డ్, ద్వితీయ స్థానంలో నిలిచిన జేపీ కొత్తూరు జట్టుకు మూడు వేలు నగదు షీల్డ్ వైఎసఆర్ పార్టీ నాయకులు ఇప్పిలి కృష్ణారావు, గుమ్మడి రామదాసు అందజేశారు.

## వీరఘట్టం పీహెచ్‌సిలో ఆరోగ్య సివిర్



**వీరఘట్టం, జూన్ 8 ప్రభాతవార్త:**

వీరఘట్టం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం ఆరోగ్య సివిర్ కార్యక్రమాన్ని డిప్యూటీ డి ఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ విజయ పార్వతి ఆధ్వర్యంలో నిర్వహించినట్లు పి హెచ్ సి వైద్యాధికారి బి.ప్రదీప్ కుమార్ విలేకరులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలతో మరియు వ్యసనాలతో సులభంగా టీబీ బారిన పడేటటువంటి వ్యక్తులను గుర్తించి వారికి హ్యాండ్ హెల్డ్ ఎక్స్ రే మిషన్ ద్వారా 135 మందికి ఎక్స్ రేలు తీయడం జరిగిందన్నారు. వారందరికీ నిశితంగా పరీక్షలు నిర్వహించి వారికి తగు సలహాలు సూచనలు ఇవ్వడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ ప్రదీప్ కుమార్, డాక్టర్ సాయికుమార్, డిసిపి సన్యాసిరావు, ఎస్ టి ఎస్ సురేష్‌లతో పాటు ఎమ్మెల్ హెచ్ పి లు, ఏఎనఎంలు, ఆశా కార్యకర్తలు, తదితరులు ఉన్నారు.

## పలాస తైక్వాండో క్రీడాకారుల హవా

**పలాస, జూన్ 8 ప్రభాతవార్త :**



శ్రీకాకులం పట్టణంలో గల వైఎస్సార్ మున్సిపల్ కల్యాణ మండపంలో జరిగిన సమ్మర్ ఓపెన్ డిస్ట్రిక్ట్ తైక్వాండో లీగ్ పోటీలు జరిగిన సందర్భంగా పలాసకు చెందిన కిషోర్ స్కూల్స్ అఫ్ మార్షల్ ఆర్ట్స్ క్రీడాకారులు పతకాల పంట పండించారు. మిని సబ్ జూనియర్ బాలికలు అండర్ 16 కేజీల విభాగంలో తన్వి బంగారు పతకం, సబ్ జూనియర్ బాలికల పి.తన్వి అండర్ 41కేజీలు బంగారు పతకం, ఎమ్.తేజశ్రీ అండర్ 57 కేజీలు వెండి పతకం, సబ్ జూనియర్ బాలుర విభాగంలో తెజేశ్వర్ అండర్ 23 కేజీలు రజత పతకం,(క్యాడట్ ) రిత్విక్ రెడ్డికి 41 కేజీలలో బంగారు పతకం, లలిత ఆదిత్య అండర్ 41కేజీల రజత పతకం, యోజిత్ అండర్ 44 కేజీల రజత పతకం, జస్వంత్ అండర్ 61కేజీలలో వెండి పతకం, మహాలక్ష్మి అండర్ 41 కేజీలలో రజత పతకం గెలిచారాని కోచ్ ముడిదాన ఢిల్లేశ్వరరావు తెలిపారు. ఓవరాల్ ఛాంపియన్స్‌గా కిషోర్ స్కూల్స్ అఫ్ మార్షల్ ఆర్ట్స్ క్రీడాకారులు విజయం సాధించిన క్రీడాకారులకు చీఫ్ కోచ్ నర్సిపురం శేఖర్ అభినందనలు తెలియజేసారు.

## పాలకొండ నగర పంచాయతీ కమిషనర్‌గా నూకరాజు

**వీరఘట్టం, జూన్ 8, ప్రభాతవార్త:**



పాలకొండ నగర పంచాయతీ కమిషనర్‌గా నూకరాజు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ పాలకొండ నగర పంచాయతీని అభివృద్ధి బాటలో నడిపిస్తానన్నారు. పాలకొండలో ప్రధాన సమస్యగా ఉన్న డంపింగ్ యార్డ్, తాగునీరు, వీధి దీపాలు, డ్రైనేజీ వ్యవస్థపై ప్రత్యేక శ్రద్ధ చూపుతానని కమిషనర్ నూకరాజు తెలిపారు. ప్రతిరోజు ప్రతి వార్డులో ఉన్న సమస్యలను తానే స్వయంగా తెలుసుకొని వెను వెంటనే పరిష్కరించే దిశగా చర్యలు చేపడతానన్నారు. రాజకీయాలకు అతీతంగా సమస్యలను పరిష్కరిస్తానని కమిషనర్ నూకరాజు తెలిపారు.

## మధుములు మరమ్మత్తుకు రూ.15 లక్షలు మంజూరు

**కంచిలి, జూన్ 8, ప్రభాతవార్త:**



మండలం జలంత్రకోట, గోకర్ణపురం పంచాయతీ పరిధిలో ఉన్నటువంటి గంగాసాగరం ఆయకట్టు ప్రధాన కాలువలు తాలూకా మధుములకి సెంట్రల్ వేయడానికి కోసం రూ.15 లక్షల నిధులు మంజూరు అయినట్లు గంగాసాగరం ఆయకట్టు రైతులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నిధులు మంజూరు చేసిన స్థానిక ఎమ్మెల్యే అశోక్ బాబు, కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు జిల్లా కలెక్టర్, కంచిలి మండల అధ్యక్షులు మాదిన రామారావు, గంగాసాగర్ ఆయకట్టు రైతులు తరపున రెండు గ్రామ పంచాయతీల ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు.

## సైకిల్‌పై కలెక్టర్, జేసీ.. 'మీకోసం' వేదికకు వినూత్నంగా ప్రయాణం!





**శ్రీకాకులం, జూన్ 8 ప్రభాతవార్త :**

భవిష్యత్తు తరాలకు మంచి పర్యావరణాన్ని అందిం చడంతో పాటు శారీరక దృఢత్వానికి సైకిల్ తొక్కడం ఎంతో అవసరమని, ప్రతి సోమవారం 'మీకోసం' గ్రీవెన్స్ డే రోజున జిల్లా అధికారులు అందరూ సైకిళ్లపై రావాలని శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పిలుపునిచ్చారు. సోమవారం ఉదయం జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ ఇద్దరూ స్వయంగా సైకిళ్లు తొక్కుకుంటూ జిల్లా పరిషత్ కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నగర పరిధిలో అధికారులు రెండు మూడు కిలోమీటర్ల మేర సైకిల్ తొక్కడం వల్ల చక్కని శారీరక శ్రమ కలిగి ఆరోగ్యం చేకూరుతుందన్నారు. వాహనాల్లో వెళ్లేటప్పుడు గమనించలేని మన చుట్టూ ఉన్న పరిసరాలను, క్షేత్రస్థాయి పరిస్థితులను స్వయంగా కళ్లారా చూసే అవకాశం ఈ ప్రయాణం ద్వారా కలుగుతుందని పేర్కొన్నారు. ఇప్పటికే సైకిళ్లపై కార్యాలయానికి చేరుకున్న అధికారులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. సైకిళ్లు అందుబాటులో లేని వారు లేదా సైకిల్ తొక్కడంలో ఇబ్బందులు ఉన్నవారు కనీసం ఈ-బైక్‌లను వినియోగించాలని సూచించారు. అధికారులు అంతా ఇదే బాటలో నడిచి ఆదర్శంగా నిలవాలని కలెక్టర్ ఆకాంక్షించారు.

## మండలంలో విత్తన విక్రయ కేంద్రం తనిఖీ


**ఇచ్ఛాపురం, జూన్ 8 ప్రభాతవార్త :**



మండలంలో రైతులకు నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉన్నాయో లేదో నిర్ధారించేందుకు విత్తన విక్రయ కేంద్రాన్ని సహాయ వ్యవసాయ సంచాలకులు మరియు మండల వ్యవసాయ అధికారి అజయ్ కుమార్ సంయుక్తంగా తనిఖీ చేశారు. తనిఖీ సందర్భంగా విత్తనాల నిల్వలు, నాణ్యత, లాట్ నంబర్లు, గడువు తేదీలు, స్టాక్ రిజిస్టర్లు, విక్రయ రికార్డులు, లైసెన్సు వివరాలను పరిశీలించారు. రైతులకు ధృవీకరించబడిన, నాణ్యమైన విత్తనాలను మాత్రమే విక్రయించాలని డీలర్లకు సూచించారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని వరి విత్తనాల లభ్యతను సమీక్షించి, రైతుల అవసరాలకు అనుగుణంగా తగిన నిల్వలు అందుబాటులో ఉంచాలని సూచించారు. విత్తనాల సరఫరాలో ఎటువంటి అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు నాణ్యమైన వ్యవసాయ ఇన్‌పుట్లు అందుబాటులో ఉండేలా నిరంతర తనిఖీలు నిర్వహించబడతాయని అధికారులు తెలిపారు.

## ఎట్టకేలకు మున్సిపాల్టీకి సెంట్రల్ లైటింగ్ వెలుగులు

**ఇచ్ఛాపురం, జూన్ 8 ప్రభాతవార్త:**



వరుస విమర్శలకు నోచుకోని కేంద్ర బిందువుగా మారిన ఇచ్ఛాపురం సెంట్రల్ లైటింగ్ వెలుగులు సోమవారం నుండి జిగేల్ మన్నాయి. ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బెందాళం అశోక్ 60 లక్షల రూపాయల సు డా నిధులతో చేపట్టిన సెంట్రల్ లైటింగ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 5ఏళ్లలో వైసీపీ ప్రభుత్వం మున్సిపాల్టీపై పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మున్సిపాల్టీపై ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామని ప్రభుత్వ విప్ నియోజకవర్గ ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేతగాని తనం వల్లే మున్సిపాల్టీ సెంటర్ లైటింగ్ పనులు చేయలేక మున్సిపాల్టీని చీకటి చేసిందని కూటమి ప్రభుత్వం అదికారంలోకి వచ్చిన వెంటనే అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి పనులు వేగవంతం చేశామని అన్నారు. మున్సిపాల్టీ జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన సెంటర్ లైటింగ్ స్విచ్లు ఆన్చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ ఎన్ రమేష్, జనసేన నాయకులు దాసరి రాజు, రాష్ట్ర రెడ్డిక కార్పోరేషన్ చైర్మన్ కొండా శంకర్ రెడ్డి, టీడీపీ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు పత్రి తవిటయ్య, ఎన్ కోటి, తెలుగు యువత అధ్యక్షులు కాళ్ల జయదేవ్, మాజీ కౌన్సిలర్లు కాళ్ల దిలీప్, ఆశి లీలారాణి, మాజీ కార్యదర్శి నందికి జాని, డి.డిల్లీరావు, సహదేవ్, లోపింటి పద్మనాభం తదితరులు పాల్గొన్నారు.

# శ్రీకాకుళం వార్త



## గ్రామ రెవెన్యూ అధికారులకు పని ఒత్తిడి తగ్గించాలి

**సంతకవిటి, జూన్ 8 ప్రభాతవార్త:**



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గ్రామ రెవెన్యూ అధికారులకు పని ఒత్తిడి ఎక్కువై మరియు పై అధికారుల వేధింపులు ఎక్కువై ఈ మధ్య కర్నూలు జిల్లాలో ఆత్మహత్య చేసుకున్న మహమ్మద్ హుస్సేన్‌కు సంఘీభావంగా మరియు గ్రామ రెవెన్యూ అధికారులకు రెగ్యులర్ వర్క్‌లతో మిగిలిన వర్క్‌లు కూడా ఎక్కువై సమయం ఇవ్వకుండా పై అధికారుల వేధింపులు ఎక్కువై చాలామంది విఆర్వోలు అనారోగ్య పాలవుతున్నారు. కావున విఆరఓలపై పని ఒత్తిడి తగ్గించి మరియు పై అధికారుల వేధింపులు తగ్గిస్తారని తాహసిల్దార్ వారి కార్యాలయం ఎదుట సంతకవిటి గ్రామ రెవిన్యూ అధికారులు నిరసన తెలిపారు.

## సీతానగరం గెడ్డలో పడి మతిస్థిమితం లేని వ్యక్తి మృతి

**సంతబొమ్మాళి, జూన్ 8 ప్రభాతవార్త:**



సంతబొమ్మాళి మండలం, నౌపడ పంచాయతీ సీతానగరం గ్రామంలో ఉన్న ముసళ్ళ ఖాన గెడ్డలో పడి మతిస్థిమితం లేని వ్యక్తి సోమవారం మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఎండ తీవ్రతకు రాత్రిపూట గెడ్డలో స్నానానికి దిగి చనిపోవడం జరిగి ఉంటుందని అంటున్నారు. తెల్లారితే నీటిపై మృతదేహం తేలి ఉండడంతో స్థానికులు నౌపడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్థానిక వీఆర్వో జోగారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు నౌపడ ఎస్సై నారాయణస్వామి తెలిపారు. పోస్టుమార్టం కోసం టెక్కలి జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలియజేశారు.



## విఆర్వో మృతిపై నిరసన

**వీరఘట్టం జూన్ 8 ప్రభాతవార్త :**

వీ ఆర్ ఓ మహమ్మద్ హుస్సేన్ ఆత్మహత్యకు కారకులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ అమరావతి రెవెన్యూ ఎంప్లాయిస్ జేఏసీ పిలుపుమేరకు వీరఘట్టం విఆర్వోల సంఘం ఆధ్వర్యంలో సోమవారం నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. వీఆర్వోలపై పని భారం ఎక్కువైందని, రెవెన్యూకు సంబంధించిన పనులు మాత్రమే అప్పజెప్పాలని వాళ్లంతా డిమాండ్ చేశారు. ఇటువంటి పరిస్థితుల్లో వృత్తిలో నిమగ్నత కోల్పోవడమే కాకుండా ఆరోగ్యాలు కూడా పాడవుతున్నాయని వారంతా ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నెల 9వ తేదీన కలెక్టరేట్‌ల వద్ద నిరసన, 11వ తేదీన ఉమ్మడి కర్నూలు జిల్లా కలెక్టరేట్ వద్ద జేఏసీ ఆధ్వర్యంలో భారీగా నిరసన కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు వారు తెలిపారు.

## జీవవైవిధ్య చట్టం-2002పై అవగాహన సదస్సు

**పాతపట్నం, జూన్ 8 ప్రభాతవార్త**



స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో బయో డైవర్సిటీపై అవగాహన సదస్సును సోమవారం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జీవవైవిధ్య బోర్డు (అమరావతి) ప్రాంతీయ కో-ఆర్డినేటర్ బి.జానకిరావు ఈ సమావేశానికి హాజరై గ్రామ పంచాయతీల్లో 'జీవవైవిధ్య చట్టం-2002' అమలు తీరుపై అధికారులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించారు. గ్రామ స్థాయిలో ప్రకృతి వనరులను కాపాడుకుంటూ, పర్యావరణ సమతుల్యతను రక్షించడంలో పంచాయతీల పాత్ర కీలకమని పేర్కొన్నారు. చట్టంలోని ముఖ్య నిబంధనలను, వాటి ద్వారా స్థానికులకు చేకూరే ప్రయోజనాలను వివరించారు. ఈ సమావేశంలో డిప్యూటీ ఎంపిడిఓలు వి.రవీంద్ర ప్రసాద్, బి.కృష్ణారావు, ఏఓ తిరుపతి పట్నాయక్, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది హాజరయ్యారు. గ్రామ స్థాయిలో జీవవైవిధ్య కమిటీల బలోపేతానికి, రికార్డుల నిర్వహణకు అందరూ బాధ్యతగా కృషి చేయాలని ఈ సందర్భంగా అధికారులు పిలుపునిచ్చారు.

## కార్గో ఎయిర్‌పోర్ట్‌కు వైసీపీ వ్యతిరేకం కాదు : సీదిరి

**ప్రభాతవార్త, పలాస**



పలాస నియోజకవర్గంలోని కాశీబుగ్గలో ఏర్పాటు చేసిన టౌన్ హాల్ సదస్సు మాజీ మంత్రివర్యులు డాక్టర్ సీదిరి అప్పలరాజు ఆధ్వర్యంలో విజయవంతంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమం లో పలాస, వజ్రపుకొత్తూరు, మందస మండలాలతో పాటు పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, వివిధ హోదాల్లో ఉన్న ముఖ్య నాయకులు, మేధావులు, రైతులు, విద్యార్థులు, ప్రజా సంఘాల ప్రతినిధులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు మాట్లాడుతూ, ఉద్దానం ప్రాంత ప్రజల దీర్ఘకాల పోరాటానికి తాము పూర్తి మద్దతు తెలుపుతున్నామన్నారు. కార్గో ఎయిర్‌పోర్ట్ నిర్మాణాన్ని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకిస్తోందని జరుగుతున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని స్పష్టం చేశారు. సదస్సులో పలువురు పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, రైతు సంఘాల నాయకులు, మేధావులు పాల్గొన్నారు.

## విశాఖ స్టీల్ ప్లాంట్ దుర్ఘటన దురదృష్టకరం : కేంద్రమంత్రి



**ప్రభాతవార్త, పలాస :**

విశాఖ స్టీల్ ప్లాంట్‌లో జరిగిన ఘోర ప్రమాదంపై కేంద్ర పౌర విమానయాన శాఖామంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

## స్వయం సహాయక సంఘాల ఆర్థిక అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

**సీతంపేట, జూన్ 8, ప్రభాతవార్త :**



ఐటీడీఏ పరిధిలో నిర్వహిస్తున్న స్వయం సహాయక సంఘాల ఆర్థిక అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని డి ఆర్ డి ఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ సిహెచ్ పద్మావతి స్పష్టం చేశారు. సోమవారం సీతంపేటలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల రుణాల గ్రౌండింగ్, రుణాల వినియోగం మరియు జీవనోపాధి కార్యక్రమాల పురోగతిని సమీక్షించారు. బ్యాంకు రుణాలు ఏ సి ఎల్ పి నిధుల ద్వారా కొనుగోలు చేసిన జూకి టైలరింగ్ మిషన్లు ఇతర జీవనోపాధి పరికరాలను పరిశీలించారు. సభ్యులు పొందిన నిధుల వినియోగం, ఆస్తుల సృష్టి జీవనోపాధి కార్యక్రమాల అమలును సమీక్షించారు. కార్యక్రమంలో ఆర్.వి. రమణ, డిపిఎం.శ్రీనివాస, బంగారమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం ... ప్రజా సంఘాలు తీవ్ర విమర్శ



**ప్రభాతవార్త, పలాస**

కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లలో ప్రజలకు జరిగిన నష్టాలు రౌండ్ టేబుల్ సమావేశం లో అన్ని ప్రజాసంఘాల నాయకులు పాల్గొని ప్రసంగించారు.. ఈ సందర్భంగా రైతులు, మహిళలు, గిరిజనులు, దళితులు, ప్రజా సంఘాల ప్రతినిధులు తమ సమస్యలను వివరించిన సదస్సుకార్గో ఎయిర్‌పోర్ట్ కోసం సారవంతమైన భూముల సేకరణను విరమించుకోవాలని డిమాండ్ పలాస-కాశీబుగ్గలో మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన టౌన్ హాల్ సదస్సులో పలాస నియోజకవర్గంలోని వివిధ వర్గాలకు చెందిన నాయకులు, రైతు సంఘాల ప్రతినిధులు, మహిళా నాయకులు, గిరిజన సంఘాల ప్రతినిధులు, దళిత నాయకులు, ప్రజా సంఘాల సభ్యులు, మేధావులు, మీడియా ప్రతినిధులు పాల్గొని రాష్ట్ర ప్రభుత్వం, స్థానిక సమస్యలు మరియు కార్గో ఎయిర్‌పోర్ట్ అంశంపై తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు హనుమంతు వెంకటరావు దొర మాట్లాడుతూ, వైఎస్ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో రాష్ట్రంలో సంక్షేమం మరియు అభివృద్ధి సమాంతరంగా కొనసాగాయని అన్నారు. రైతులు, మహిళలు, విద్యార్థులు, ఉద్యోగులు, చిన్న వ్యాపారులు, సామాన్య ప్రజలు ప్రభుత్వ పథకాల ద్వారా ప్రత్యక్షంగా లబ్ధి పొందారని గుర్తు చేశారు.

9 -6Pg9th cheli tue.qxd:9 -6Pg9th cheli tue.qxd 1/1/02 6:26 AM Page 1



## మీ చర్మానికి ఏ క్రీమ్ కావాలి



మీకేదైనా చర్మ వ్యాధి వచ్చిందనుకోండి. అమ్మమ్మ చెప్పిన చిట్కా లు పాటించేయండి. కాదూ.. కూడదు అను కుంటే.. మీ చర్మ తత్వమిటో తెలుసు కుంటే మంచిది. విపరీతంగా నూనెలు కారు తోంటే.. హైలు రోనిక్ యాసిడ్ ఉన్న సీరమ్ లేదా క్రీము వాడండి. ఇది జిడ్డును తగ్గంచడమే కాదు, చర్మ ఆరోగ్యాన్నీ సంరక్షిస్తుంది. జిడ్డే కాదు, రంధ్రాలు పెద్దగా తెరుచుకున్నట్లు కనిపిస్తోంటే నియాసినమైడ్ ఉత్తమ ఎంపిక.

**ఇక పొడిచర్మమైతే..** లాక్టిక్ యాసిడ్, గ్లైకాలిక్ యాసిడ్‌లు ఎంచుకుంటే సరి. ఇవి చర్మరంధ్రాల్లోకి చేరిన మృతకణాలు తొలగించి, యాక్నే రాకుండా చూస్తాయి. మరీ ఎండిపోయినట్లు కనిపిస్తోంటే హైలురోనిక్ యాసిడ్, సెరమైడ్ క్రీములు వాడొచ్చు. ఇవి చర్మంలో తేమను బయటికి పోకుండా ఆపి, మెరిసేలా చూస్తాయి. యవ్వనంగా కనిపించాలంటే ఆర్గాన్, జొజొబా ఆయిల్ ఉన్న క్రీములను వాడితే సరి.

**మొటిమలు ఎక్కువా?** అయితే సాల్సిలిక్ యాసిడ్, క్లే ఆధారిత ఉత్పత్తులను ఎంచుకోండి. నియాసినమైడ్ చర్మరంధ్రాలను శుభ్రం చేసి, యాక్నేని రానివ్వదు. జెంజాల్ పెరాక్సైడ్ ఉన్నవీ వీటి బారి నుంచి రక్షించేవే.

ముప్పై దాటకుండానే ముఖంపై ముడతలు సాధారణం అయిపోయాయి కదూ! రెటినాల్ ఉన్న క్రీములు ఆడండి. వృద్ధాప్యఛాయల్ని ఇది నెమ్మదింపజేస్తుంది. అయితే రాత్రి మాత్రమే వాడాలి. పగలు కనీసం 30 ఎస్‌పిఎఫ్ ఉన్న సన్‌స్క్రీన్ లోషన్ తప్పనిసరి. ఇంకా కొలాజెన్, పెప్టైడ్ ఉన్న. రకాలను ఎంచుకుంటే తగినంత తేమతోపాటు, చర్మ సాగే గుణం కోల్పోకుండా కాపాడతాయి. ◻

## అభినేత్రి.. 'షష్టిపూర్తి' నాయకి









భారతీయ చలనచిత్రరంగాన తనదైన ముద్రవేసి దశాబ్దాలుగా ప్రేక్షకుల హృదయాలను కొల్లగొట్టిన ఎవర్‌గ్రీన్ బ్యూటీ డ్రీమ్‌గర్ల్ హేమామాలిని సినీ ప్రస్థానానికి అరవై ఏళ్లు పూర్తయ్యాయి. ఈ ప్రత్యేక సందర్భాన్ని పురస్కరించుకుని డ్రీమ్‌గర్ల్ డైమండ్ జూబ్లీ సంబరాలు ముంబైలో 'ది డ్రీమ్‌గర్ల్స్ డైమండ్ జూబ్లీ' కాన్సెప్ట్ పేరిట బుధవారం ఒ ప్రతిష్టాత్మక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. 'లెజెండ్స్‌కి కహానీ, లెజెండ్స్‌కి జుబానీ అనే థీమ్‌తో సాగే ఈ ఈవెంట్‌లో హేమామాలిని తన చిత్రాల్లోని పాటలను తానే స్వయంగా పాడనున్నారు.

లైవ్ ఆర్కెస్ట్రాతో పాడటం తొలి అనుభవం తన అభినయంతో ప్రేక్షకులను అలరించడం ఒక ఎత్తయితే అందచందాలతో అశేష ప్రేక్షక లోకం అభినందన లందుకున్న అభినేత్రిగా కన్పించడం మరో ఎత్తు. సినిమాకు సంబంధించినంత వరకు అంతే. 16 ఏళ్ల వయసులో రాజ్‌కపూర్ సరసన 'సప్నో కా సౌదాగర్' చిత్రంతో ఆమె సినీ జీవితం మొదలైంది. ముందుగా ఒక తమిళ చిత్రంలో సినీ పరిశ్రమకు పరిచయమై పదిహేడేళ్ల వయసులో తెలుగు పౌరాణిక చిత్రం పాండవ వనవాసం, 'మహినేలు మహరాజు' అంటూ సాగిన పాటలో నర్తించారు. అదే ఆమె తొలి నృత్య అరంగేట్రం. ఆనాటి నుంచి శాస్త్రీయ నృత్య అభినయాన్ని వీడలేదు. 70 ఏళ్ల వయసులోనూ నృత్యం చేసి భారతీయ నాట్య కళాకారిణిగా పేరు ప్రఖ్యాతలు సంపాదించారు.


'నేను డాన్సర్‌ని, సింగర్‌ని కాదంటూనే స్టేజి విభావరిలో పాల్గొనడం అభినందించదగిన విషయం. ఈ కార్యక్రమంలో వచ్చే నిధులను పేద సినీ కార్మికుల సంక్షేమానికి వెచ్చిస్తారు.

సినీ ప్రపంచంలో ఆరు దశాబ్దాల పాటు ప్రాధాన్యత నిలబెట్టుకోవడం సాధారణ విషయం కాదు. అది ప్రతిభ, కృషి, క్రమశిక్షణ, వ్యక్తిత్వం కలిసొచ్చినప్పుడు మాత్రమే సాధ్యమవుతుంది. ఇవన్నీ కలిసి భారతీయ సినీ చరిత్రలో ఒక ప్రత్యేక అధ్యాయాన్ని నిర్మించాయి. గ్లామర్, అభినయం, నృత్యం మాత్రమే కాదు, పాత్రకు అవసరమైన భావ ప్రకటనలోనూ ఆమె తనదైన ముద్ర వేశారు. ముఖ్యంగా పౌరాణిక పాత్రలు, ప్రేమకథా పాత్రలు అనే రెండు విభిన్న కోణాల్లో ఆమె నటనను పరిశీలిస్తే, హేమామాలిని కళాకారిణిగా ఎంత విస్తృతమైన పరిధిని కలిగి ఉన్నారో అర్థమవుతుంది. అందం, అభినయం, నృత్యం, స్టార్‌డమ్ ఈ నాలుగు అంశాల సమ్మేళనంగా నిలిచిన ఆమె సినీ ప్రస్థానం ఆరు దశాబ్దాలను పూర్తి చేసుకుంటున్న వేళ, మరోసారి ఆమె. అ నాలుగు అంశాలు ఆమెను ఇతర తారల నుంచి ప్రత్యేకంగా నిలబెట్టాయి. ప్రేమకథా పాత్రల్లో హేమామాలిని నటనలో ఉత్సాహం, చురుకుదనం, గ్లామర్ ప్రధానంగా కనిపిస్తే, పౌరాణిక పాత్రల్లో ప్రశాంతత, గాంభీర్యం, ఆధ్యాత్మికత ప్రధానంగా కనిపిస్తాయి. ఒకవైపు ఆమె ప్రేమకథా చిత్రాల్లో కలల రాణిగా ప్రేక్షకులను మంత్ర ముగ్ధులను చేస్తే ఆమె స్టార్‌డమ్‌ను నిర్మించగా మరోవైపు పౌరాణిక పాత్రల్లో భారతీయ స్త్రీత్వానికి ప్రతీకగా ఆరాధనీయం కనిపించారు. అల్లరి, ఆత్మ విశ్వాసం, అమాయకత్వం ఇవన్నీ ఆమె సహజంగా తెరపై ఆవిష్కరించారు. చలాకీ యువతిగా బసంతి పాత్ర ఆమె భారతీయ సినీ చరిత్రలో చిరస్థాయిగా నిలబెట్టింది. నటిగా ఆమె మహిళా పాత్రలకు పెద్దగా ప్రాధాన్యం లేని పరిస్థితుల్లో కూడా హేమామాలిని తన స్క్రీన్ ప్రెజెన్స్‌తో సినిమాను తన చుట్టూ తిప్పగలిగారు. అదే ఆమె ప్రత్యేకత. భారత నాట్యంలో ఆమె సాధించిన ప్రావీణ్యం అసాధారణం. ప్రపంచవ్యాప్తంగా అనేక నృత్య ప్రదర్శనలు ఇస్తూ భారతీయ సాంప్రదాయ కళలకు ఆమె రాయబారిగా నిలిచారు. నేటికీ వేదికపై అదే ఉత్సాహంతో నృత్య ప్రదర్శనలు ఇవ్వడం ఆమె కళపట్ల ఉన్న అంకితభావానికి నిదర్శనం. చిన్న నాటి నుంచే భారతనాట్యంలో శిక్షణ పొందిన ఆమె, సినీ కెరీర్ శిఖరాగ్రంలో ఉన్నప్పటికీ నాట్యాన్ని విస్మరించలేదు. దేశ విదేశాల్లో నిర్వ హించిన నృత్య ప్రదర్శనల ద్వారా భారతీయ శాస్త్రీయ నృత్య కళలకు విశేష ప్రచారం కల్పించారు. నేటికీ వేదికపై ఆమె ప్రదర్శించే నృత్య రూపకాలు ప్రేక్షకు లను ఆకట్టుకుంటున్నాయి. సినిమాలతో పాటు రాజకీయ రంగంలోనూ హేమామాలిని తనదైన ముద్ర వేశారు. ఇప్పుడామె 'మధుర' లోక సభాసభ్యు రాలు కళాకారిణిగా మొదలైన ఆమె ప్రయాణం ప్రజాసేవ దిశగా విస్తరించడం విశేషం. ప్రజాప్రతి నిధిగా సేవలందిస్తూ సామాజిక కార్యక్రమాల్లో, చురుకైన పాత్ర పోషిస్తున్నారు. ◻

## ఓం బ్రహ్మ కడిగిన పాదం

పురాణకథలను అనుసరించి గంగా దేవి హిమవంతుడి కూతురు. చతుర్ముఖ బ్రహ్మ ఆమెని దత్త పుత్రికగా స్వీకరించి, పరమశివుడికి ఇచ్చి పెళ్లి చేశాడు. శివుడి వెంట వెళ్తున్న గంగను చూసి, బ్రహ్మదేవుడు వాత్సల్యంతో కన్నీరు పెట్టు కున్నాడు. ఆయనను ఓదార్చిన గంగ-బ్రహ్మదేవుడి కమడలంలో తాను జలరూపంలో ఉంటానని చెప్పి, వనితా రూపంలో పరమశివుణ్ణి అనుసరించింది. కొంతకాలానికి శ్రీమహావిష్ణువు వామనుడిగా అవతరించి, బలిచక్రవర్తి నుంచి మూడడుగుల నేలను దానమడిగాడు. ముల్లోకాలను ఆక్రమిస్తూ ఒక పాదంతో బ్రహ్మ లోకాన్ని ఆక్రమించాడు. అప్పుడు చతుర్ముఖ బ్రహ్మ భక్తి పారవశ్యంతో, తన కమండలం లోని గంగాజలంతో ఆ శ్రీహరి పాదాలను కడగగా.. పరమ పావన గంగ అక్కడే స్థిరంగా ఉండి పోయింది. అలా విష్ణుపాదాన ఒదిగిన గంగనే భగీరథుడు తపస్సుతో భువి పైకి రప్పించాడు. ఆ విధంగా గంగా దేవి 'విష్ణు పాదోద్భవ' అయ్యింది. బ్రహ్మ కడిగిన పాదము అనే వ్యాకం వెనుక కథ ఇది. ఈ ఘట్టాన్నే స్మరించుకుంటూ అన్నమాచార్యులు.. బ్రహ్మ కడగిన పాదం, బ్రహ్మము తానె నీ పాదము అన్న కీర్తనను ఆలపించాడు. నీ పాదం భక్తుల పాలిట పరబ్రహ్మ స్వరూపం అంటూ స్వామిని స్తుతించాడు. ✶

## కారం ఎక్కువ తింటే?



కారం బాగా తగ్గించండి. లేదంటే అల్సర్లు, ఎసిడిటీ లాంటి సమస్యలు వస్తాయనే హెచ్చరికలు విని భయపడుతుంటాం కదూ! అందులో నిజం లేదని కాదు. కానీ హార్వర్డ్ టి.హెచ్ స్కూల్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ ఏడేళ్ల దాదాపు 5 లక్షల మంది మీద జరిపిన అధ్యయనంలో స్పైసీ ఫుడ్ తినేవారికి ఆయుర్దాయం ఎక్కువని తేలింది. అలాగని మరీ ఎక్కువ కారం తిని సమస్యలు కొని తెచ్చుకోకండి. ◻

## రాగి పిండి సమోసా



**కావాల్సినవి :** రాగిపిండి-కప్పు, ఉల్లిపాయ ముక్కలు-అర కప్పు, ఉప్పు-తగినంత, జీలకర్ర-పావు చెంచా, అల్లం తరుగు, చింతపండు గుజ్జు-పెద్ద చెంచా చొప్పున, తరిగిన పచ్చిమిర్చి-రెండు, జీడిపప్పు, కిస్‌మిస్-ఏడెనిమిది చొప్పున, కీర ముక్కలు, బఠాణీ-అర కప్పు చొప్పున, పసుపు- చిటికెడు, బంగాళాదుంప-ఒకటి, నూనె-తగినంత వాము-కొద్దిగా.

**తయారీ :** గిన్నెలో రాగిపిండి, ఉప్పు, వాము, నూనె వేసిచపాతీ పిండిలా కలపాలి. దీన్ని పది నిమిషాలు పక్కన పెట్టుకోవాలి. పాన్‌లో నూనె వేసి డ్రైఫ్రూట్స్‌ను వేయించి పక్కన పెట్టుకోవాలి. అదే పాన్‌లో మరికాస్త నూనె వేసి ఉల్లిపాయ, పచ్చిమిర్చి, అల్లం ముక్కలు, పసుపు, ఉప్పు, వాము, జీలకర్ర వేసి వేయించుకోవాలి. ఇందులోనే ఉడికించిన బఠాణీ, ఆలూ ముక్కలు, కీర ముక్కలు చింతపండు గుజ్జు వేసి మరికాసేపు వేయించాలి. చివరగా డ్రైఫ్రైట్స్ వేసి కలిపి పక్కన పెట్టాలి. ఇప్పుడు రాగిపిండిని చపాతీలా చేసి డ్రైఫ్రూట్, ఆలూ మసాలా మిశ్రమాన్ని ఇందులో వేసి చివర్లు మూసేయాలి. ఇలా చేసుకున్న సమోసాలను డీప్ ఫ్రై చేసుకుంటే సరి. అవెన్‌లోనూ బేక్ చేసుకోవచ్చు. ◻

# తెర

## 12న 'పోలీస్ కంప్లైంట్' రిలీజ్



హారర్, యాక్షన్, థ్రిల్లర్ అంశాల సమ్మేళనంగా రూపొందిన అవుట్ అండ్ అవుట్ యాక్షన్ ఎంటర్‌టైనర్ పోలీస్ కంప్లైంట్ జూన్ 12న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఎంఎస్‌కే ప్రమిద శ్రీ ఫిలిమ్స్ బ్యానర్‌పై బాలకృష్ణ మహారాణా నిర్మించిన ఈ చిత్రానికి క్రియే టివ్ డైరెక్టర్ సంజీవ్ మేగోటి దర్శకత్వం వహించారు.

ఇప్పటికే విడుదలైన ట్రైలర్, ప్రచార గీతాలు ప్రేక్షకుల్లో మంచి ఆసక్తిని రేకెత్తించగా, తాజాగా చిత్రంలో సూపర్‌స్టార్ కృష్ణకు నివాళిగా రూపొందించిన ప్రత్యేక గీతం మరింత ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా కృష్ణసాయి, కృతి వర్మలపై చిత్రీకరించిన ప్రత్యేక గీతాన్ని చిత్రబృందం విడుదల చేసింది. సూపర్‌స్టార్ కృష్ణపై రూపొందించిన ఈ గీతం అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఈ సందర్భంగా దర్శకుడు సంజీవ్ మేగోటి మాట్లాడుతూ, సూపర్‌స్టార్ కృష్ణ సోదరుడు ఘట్టమనేని ఆదిశేషగిరిరావు గారు మా చిత్రాన్ని, ముఖ్యంగా కృష్ణ గారిపై రూపొందించిన ప్రత్యేక గీతాన్ని మెచ్చుకోవడం మా యూనిట్‌కు ఎంతో గర్వకారణం. ఆయన ఆశీర్వాదాలు మాకు మరింత ఉత్సాహాన్ని ఇచ్చాయి. .హీరో కృష్ణసాయి మాట్లాడుతూ, మా అభిమాన హీరో సూపర్‌స్టార్ కృష్ణపై రూపొందించిన పాటలో నటించే అవకాశం రావడం నా అదృష్టంగా భావిస్తున్నాను. ఆ పాట ను కృష్ణ సోదరుడు ఆదిశేష గిరిరావు చూసి ప్రశంసిం చడం మాకు ఎంతో ఆనం దాన్ని కలిగించింది. దర్శకు డు సంజీవ్ మేగోటి సినిమా ను అద్భుతంగా తెరకెక్కించారు. నవీన్ చంద్ర, వరలక్ష్మి శరత్‌కుమార్, కృష్ణసాయి, రాగిణి ద్వివేది ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రంపై ఆదిశేషగిరిరావు ఆశీర్వాదాలతో అంచనాలు మరింత పెరిగాయి.

## 'సింగ్ గీతం'తో 40 ఏళ్ల నా కల తీరింది: కమల్



'సింగ్ గీతం' నేను నిర్మించి ఉంటే బాగుండే దనిపించే చిత్రం. నాగ్ అశ్విన్ చేస్తే నేను నిర్మించినట్లే. గొప్ప ప్యాషన్‌తో ఈ చిత్రాన్ని నిర్మించిన వైజయంతి మూవీస్‌కు నా అభినందనలు: గ్రాండ్ ప్రీరిలీజ్ ఈవెంట్‌లో యూనివర్సల్ స్టార్ కమల్ హాసన్‌సింగ్ గీతంతో 40 ఏళ్ల నా కల తీరింది. ఈ సినిమా క్రెడిట్ మొత్తం నాగ్ అశ్విన్ దే. వైజయంతి మూవీస్, నాగ్ అశ్విన్ నాపై ఎంతో ప్రేమ, ఆప్యాయత చూపించారు: లెజెండరీ డైరెక్టర్ సింగీతం శ్రీనివాసరావు సింగీతం ప్రశంస ఆస్కార అవార్డ్ లా ఫీలౌతున్నాను: దేవిశ్రీ ప్రసాద్‌సంగీతంతో నాగ్ అశ్విన్, స్వప్న, ప్రియాంక అందరూ కలిసి ఈ ప్రాజెక్ట్‌ను చేస్తున్నారని తెలిసినప్పుడు నాకు ఎంతో గర్వంగా అనిపించింది: నిర్మాత అశ్వినీదత్ లెజెండరీ డైరెక్టర్ సింగీతం శ్రీనివాసరావు తన అత్యంత ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్ట్ 'సింగ్ గీతం' తో ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. ప్రతిష్టాత్మక బ్యానర్లు వైజయంతి మూవీస్, స్వప్న సినిమా పై నాగ్ అశ్విన్ ఈ చిత్రాన్ని నిర్మించారు. ప్రీరిలీజ్ ఈవెంట్‌లో యూనివర్సల్ స్టార్ కమల్ హాసన్ మాట్లాడుతూ.. మాయాబజార్ నుంచి ఇప్పటి సింగ్ గీతం వరకు సింగీతం శ్రీనివాసరావు లో ఎలాంటి మార్పు లేదు. సినిమా ఆయనతో పాటే ఉంది. ఇది చాలా అరుదుగా జరిగే విషయం. నాకు 20 ఏళ్లు ఉన్నప్పుడు ఆయనతో కలిసి పనిచేయడం మొదలుపెట్టాను. దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు మాట్లాడుతూ... ఈ చిత్రం 40 సంవత్సరాల కల. మాటలే పాటలైతే అనే ఆలోచనతో ఈ కథ పుట్టింది. ఈ కథను ఎంతోమందికి వినిపించాను. కానీ దైవ నిర్ణయం వల్ల చివరకు వైజయంతి మూవీస్ బ్యానర్‌పై నాగ్ అశ్విన్ నిర్మాణంలో ఈ సినిమా రూపుదిద్దుకోవడం నా అదృష్టంగా భావిస్తున్నాను. ఈ సినిమా మొదటి నుంచి చివరి వరకు దర్శకత్వం నాదే. కానీ సినిమా నిర్మాణానికి సంబంధించిన అన్ని బాధ్యతలను వైజయంతి మూవీస్, నాగ్ అశ్విన్ ఎంతో ప్రేమతో భుజాన వేసుకున్నారు.

## 'కొత్త మలుపు' రొమాంటిక్ లవ్ మూవీ : ఆకాష్



ప్రముఖ గాయని సునీత కుమారుడు ఆకాష్ గోపరాజు హీరోగా నటించిన రెండో చిత్రం 'కొత్త మలుపు' దర్శకుడు శివ వరప్రసాద్ కేశనకుర్తి తెరకెక్కించిన ఈ చిత్రం జూన్ 12న ప్రేక్షకుల ముందుకు రానుంది. కోనసీమ నేపథ్యంలో రూపొందిన ఈ రొమాంటిక్ లవ్ అండ్ సస్పెన్స్ ఎంటర్‌టైనర్‌పై ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది. ఈ సందర్భంగా చిత్ర ప్రమోషన్స్‌లో భాగంగా హీరో ఆకాష్ మీడియా ప్రతినిధులతో ముచ్చటించారు.

**మీ తొలి చిత్రం 'సర్కారు నౌకరి'తో పోలిస్తేకొత్త మలుపు ఎలా భిన్నంగా ఉంటుంది?..**

'సర్కారు నౌకరి' ఒక పీరియడ్ డ్రామా అయితే,'కొత్త మలుపు' పూర్తిగా భిన్నమైన జానర్‌లో రూపొందింది. ఇది కోనసీమ బ్యాక్‌డ్రాప్‌లో సాగే విలేజ్ రొమాంటిక్ లవ్ అండ్ సస్పెన్స్ ఎంటర్‌టైనర్. లవ్, కామెడీ, ఎమోషన్స్‌తో పాటు కథను ముందుకు నడిపే ఆసక్తికరమైన సస్పెన్స్ కూడా ఉంటుంది.

**సినిమాలో మీ పాత్ర ఎలా ఉండబోతోంది?..**

ఈ సినిమాలో నా పాత్ర చాలా ఎనర్జిటిక్‌గా ఉంటుంది. నేటి యువత ఆలోచనలు, వారి భావోద్వేగాలకు దగ్గరగా ఉండే పాత్ర ఇది. నటన పరంగా కూడా మొదటి సినిమాతో పోలిస్తే మరింత మెరుగ్గా కనిపించేందుకు ప్రయత్నించాను. బాడీ లాంగ్వేజ్, ఎక్స్‌ప్రెషన్స్ విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నాను. సీనియర్‌ల సలహాలతో, మా అమ్మ సూచనలతో నా ఫర్మామెన్స్, యాక్టింగ్ స్కిల్స్ చాలా నేర్చు కున్నాను.

**ఈ కథలో మిమ్మల్ని ఎక్కువగా ఆకట్టుకున్న అంశం ఏది?..**


దర్శకుడు శివ వరప్రసాద్ కథ చెప్పినప్పుడు అందులోని ట్విస్టులు నన్ను బాగా ఆకట్టుకున్నాయి. నేను ఎలా అయితే సరదాగా సాగిపోయే పాత్ర ఉండాలో అచ్చం అలాంటి పాత్రతో కూడిన సబ్జెక్టును డైరెక్టర్ గారు నాకు చెప్పగానే నాకు బాగా నచ్చింది. ఇక టైటిల్‌కు తగ్గట్టే కథలో వచ్చే మలుపులు ప్రేక్షకులు ఊహించలేరు. కోనసీమ అందాలను అందంగా చూపిస్తూ, కమర్షియల్ ఎలిమెంట్స్‌తో కథను చాలా ఆసక్తికరంగా తెరకెక్కించారు.

## 'ఐ యామ్ హ్యాండ్సమ్' ట్రైలర్ లాంచ్



: తండ్రికొడుకుల అనుబంధం, త్యాగం, ప్రేమ, భావోద్వేగాల నేపథ్యంలో రూపొందిన హృదయాన్ని హత్తుకునే చిత్రం 'ఐ యామ్ హ్యాండ్సమ్' దుర్గా దేవ్ నాయుడు హీరోగా నటిస్తూ స్వయంగా కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వ బాధ్యతలు నిర్వహించిన ఈ చిత్రాన్ని రీ ఫిలిమ్స్ బ్యానర్ పై, మహేష్ గుడారు సమర్పణలో కేదార్‌నాథ్ నిర్మించారు. అన్విష కథానాయికగా నటించిన ఈ చిత్రం జూన్ 12న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. ముఖ్య అతిథి కేఎల్ దామోదర్ ప్రసాద్ మాట్లాడుతూ, సినిమా విజయానికి అసలు బలం కంటెంట్. మంచి కథ, బలమైన భావోద్వేగాలు ఉన్న సినిమాలు ప్రేక్షకుల గుండెల్లో నిలిచిపోతాయి. దుర్గా దేవ్ నాయుడు నటుడిగా, దర్శకుడిగా ఒకేసారి బాధ్యతలు నిర్వర్తిస్తూ ఈ చిత్రాన్ని తెరకెక్కించడం అభినందనీయం. దర్శకుడు, హీరో దుర్గాదేవ్ నాయుడు మాట్లాడుతూ, నేను ఏలూరుకు చెందినవాడిని. మా నాన్న అరటిపండ్ల వ్యాపారి. చిన్న పట్టణం నుంచి వచ్చి ఈ రోజు ఇక్కడ నిలబడటం నాకు ఎంతో ఆనందంగా ఉంది. అందుకే నేను నాకు నేనే స్టార్ అని గర్వంగా చెప్పుకుంటాను. ప్రేక్షకులందరికీ నచ్చే సినిమా తీశాను. ఒకవేళ నచ్చకపోతే ఇంకా మంచి సినిమా తీస్తాను అని నిజాయితీగా చెబుతున్నాను. ఈ సినిమాపై నాకు పూర్తి నమ్మకం ఉంది. చిత్ర యూనిట్‌లోని ప్రతి ఒక్కరూ ప్రాణం పెట్టి పనిచేశారు. డబ్బుల గురించి ఆలోచించకుండా సినిమా కోసం కష్టపడ్డారు. నిర్మాత కేదార్‌నాథ్ , కేఎల్ దామోదర్ ప్రసాద్ ఎంతో సహకారం అందించారు. తెలుగు ప్రేక్షకులతో పాటు మంచి కంటెంట్ కోసం ఎదురుచూసే ప్రతి సినీ ప్రేమికుడికి ఈ సినిమా తప్పకుండా నచ్చుతుంది" అన్నారు.

## 'నాగబంధం' జూలై 3న విడుదల



అభిషేక్ నామా దర్శకత్వం లో తెరకెక్కుతున్న ఎపిక్ అడ్వెంచర్ థ్రిల్లర్ 'నాగబంధం' – ది సీక్రెట్ ట్రెజర్ చిత్రాన్ని దేశవ్యాప్తంగా సంచలనంగా నిలిపేందుకు చిత్రబృందం విస్తృత స్థాయిలో ప్రమో షన్స్ నిర్వహిస్తోంది. నిక్ స్టూడియోస్ బ్యానర్‌పై కిషోర్ అన్నపురెడ్డి, నిశిత నాగిరెడ్డి నిర్మిస్తున్న ఈ చిత్రంలో విరాట్ కర్ణ హీరోగా నటిస్తున్నారు. జూలై 3న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న ఈ సినిమా కోసం మేకర్స్ దేశవ్యాప్తంగా ప్రత్యేక ప్రమోషనల్ టూర్‌ను ప్రకటించారు. సాధారణ ప్రమోషన్స్‌కు భిన్నంగా, సినిమా కథలోని ట్రెజర్ హంట్ కాన్సెప్ట్‌కు అనుగుణంగా ఈ ప్రచార యాత్రను రూపొందించారు. ప్రతి నగరంలో జరిగే కార్యక్రమం ద్వారా సినిమా ప్రపంచం, అందులోని రహస్యాలు, సాహస అంశాలను ప్రేక్షకులకు మరింత దగ్గర చేయనున్నారు. ఈ టూర్‌లో తొలి కార్యక్రమం జూన్ 19న హైదరాబాద్‌లో ట్రైలర్ లాంచ్. సినిమా స్థాయి, విజువల్స్, కథపై మరింత ఆసక్తిని పెంచేలా ఈ ఈవెంట్ ఉండనుంది.అనంతరం జూన్ 20 నుంచి 23 వరకు ముంబై, చెన్నై, బెంగళూరు, కొచ్చి నగరాల్లో వరుసగా ప్రమోషనల్ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ ఈవెంట్స్ ద్వారా దేశవ్యాప్తంగా సినిమా రీచ్‌ను మరింత విస్తరించాలనే లక్ష్యంతో చిత్రబృందం ముందుకు సాగుతోంది.ఈ ప్రమోషనల్ టూర్‌లో ప్రత్యేక ఆకర్షణగా జూన్ 26న వారణాసిలో జూలై 3న పాట విడుదల కానుంది. వారణాసి నగరానికి ఉన్న ఆధ్యాత్మిక, సాంస్కృతిక ప్రాధాన్యత సినిమా టైటిల్, కథలోని నేపథ్యానికి అద్భుతంగా వుంటుంది. అలాగే జూన్ 28న హైదరాబాద్‌లో గ్రాండ్ ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించ నున్నారు. విడుదలకు ముందు రోజు జూలై 2న ప్రత్యేక ప్రీమియర్ షో ఏర్పాటు చేసి, చిత్రబృందం ఈ ప్రమోషనల్ జర్నీని ఘనంగా సెలబ్రేట్ చేయనుంది.

## 'భోళా బాలయ్య' సాంగ్ అద్భుతం



బాలయ్య బాబు పుట్టినరోజు ఓ పండగ. బాలయ్య స్ఫూర్తి తో, ఆయనకు ఇష్టమైన సేవా కార్యక్రమాలను అభిమానులు కూడా బాధ్యతగా తీసుకుని ముందుకు తీసుకెళ్లడం అభినందనీయం: సాంగ్ లాంచ్ ఈవెంట్‌లో బ్లాక్‌బస్టర్ డైరెక్టర్ బోయపాటి శ్రీను బాలయ్య బాబుగారిని ప్రేమిస్తే నో బ్రేకప్స్... ఆ ప్రేమ జీవితాంతం ఉంటుంది: ఎన్‌బీకే హెల్పింగ్ హ్యాండ్స్ వ్యవస్థాపకులు అనంతపురం జగన్ గాడ్ ఆఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ పుట్టిన రోజు వేడుకలు సందర్భంగా రూపొందించిన "భోళా బాలయ్య" సాంగ్ లాంచ్ ఈవెంట్ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి బ్లాక్ బస్టర్ డైరెక్టర్ బోయపాటి శ్రీను ముఖ్య అతిథిగా హాజరై వేడుకకు మరింత ప్రత్యేకత తీసు కొచ్చారు. భోళా బాలయ్య సాంగ్ లాంచ్ ఈవెంట్ లో డైరెక్టర్ బోయపాటి శ్రీను మాట్లాడుతూ.. బాలయ్య ఏంటనేది నేను నా సిని మాల ద్వారా చెప్పాను. ఈ సాంగ్ గురించి చెప్పాలంటే, పాట చాలా అద్భుతంగా వచ్చింది. మ్యూజిక్, లిరిక్స్, డ్యాన్స్, ఆర్టిస్టులు, అలాగే ఈ సాంగ్‌ను రూపొందించిన జగన్‌తో సహా అందరూ అద్భుతంగా కుదిరారు. ముఖ్యంగా విజువల్స్ అయితే చాలా గొప్పగా ఉన్నాయి. ఆయనతో కలిసి ముందుకు నడవాలి. బాలయ్య బాబుగారు నిండు నూరేళ్లు ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుం టున్నాను. జై బాలయ్య! ఎన్‌బీకే హెల్పింగ్ హ్యాండ్స్ వ్యవస్థాపకులు అనంతపురం జగన్ మాట్లాడుతూ... కారణజన్ముడు, యుగ పురు షుడు నందమూరి తారక రామారావు వార సుడు, మనందరి అభిమాన దైవం నందమూరి బాలకృష్ణపుట్టిన రోజు మనందరికీ ఒక పండుగ రోజు. దేవీ నవరాత్రులు తొమ్మిది రోజులు ఎలా జరుపుకుంటామో, అలాగే బాలయ్య బర్త్‌డేను కూడా జూన్ 1 నుంచి 10 వరకు కన్నుల పండుగగా జరుపుకుంటాం. బాలకృష్ణ సాధిం చిన విజయాలు, సృష్టించిన చరిత్ర, చేసిన సేవా కార్యక్రమాలు ఒక్కరోజులో చెప్పలేం. లిరిసిస్ట్ దివాకర్ అమిలినేని మాట్లాడుతూ... బాలయ్య కోసం పాట రాస్తే అది జీవితాంతం నిలిచి పోయేలా ఉండాలని జగన్ మాకు చాలా మంచి ఇన్‌పుట్ ఇచ్చారు.

9vzm15:9vzm15.qxd 08-06-2026 23:11 Page 1



## రెవెన్యూ సిబ్బంది సేవలు ప్రశంసనీయం : హోం మంత్రి

వేపాడ , జూన్ 8, ప్రభాతవార్త:



వేపాడ మండలం బల్లంకి గ్రామంలో 95 శాతం పాస్ పుస్తకాలు పంపిణీ చేసిన రెవెన్యూ సిబ్బంది సేవలు ప్రశంసనీయమని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత కొనియాడారు. సోమవారం పాస్ పుస్తకాలు పంపిణీ కార్యక్రమంలో ప్రత్యేకంగా తహసిల్దార్ జె రాములమ్మ, వీఆర్వో, సర్వేయర్ నాయుడును అభినందించడమే కాకుండా, సాలువలు కప్పి ఘనంగా సత్కరించారు. భూ సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న రైతన్నలను ఆదుకోవాలన్న ధ్యేయంతో పనిచేస్తున్న సీఎం చంద్రబాబు నాయుడు లక్ష్యం మేరకు ఇక్కడ రెవెన్యూ సిబ్బంది పనిచేయడం ఎంతైనా హర్షనీయమన్నారు. రెవెన్యూ సిబ్బంది సక్రమంగా పని చేయకపోతే ప్రజాప్రతినిధులపై తీవ్ర ఒత్తిడి వస్తుందని , తద్వారా రాష్ట్ర ప్రభుత్వంపై చెడు అభిప్రాయం వస్తుందని తెలిపారు. ముఖ్యంగా ఈ గ్రామంలో 2000 పైగా ఉన్న జనాభాలో 1236 మంది రైతులకు గాను 1174 పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ చేయడం సామాన్యమైన విషయం కాదన్నారు. అలాగే దివ్యాంగ రైతు గుమ్మడి శ్రీనివాసరావు మాట్లాడుతూ తన భూమికి 20 ఏళ్లుగా పట్టాదారు పాసుపుస్తకం అందక అనేక ఇబ్బందులు పడే వాడినని ,నేడు కూటమి ప్రభుత్వం హయాంలో అన్ని హక్కులతో కూడిన పాస్ పుస్తకం అందించిన అధికారులను అభినందిస్తూ సభాముఖంగా కృతజ్ఞతలు తెలియజేశారు . అందుకు స్పందించిన హోంశాఖ మంత్రి శ్రీనివాసరావును దుస్సాలువతో సత్కరించారు.

## ప్రభుత్వం ప్రైవేటీకరణ విధానాలు వెంటనే నిలిపివేయాలి

సాలూరు, జూన్ 8, ప్రభాతవార్త :



పట్టణాల్లో మున్సిపల్ కార్మికులకు ఇంకా ప్రజలకు పౌర సేవలు నేటి వరకు రాష్ట్ర ప్రభుత్వమే అందించేదని అలాంటి 14 రకాల పౌర సేవలను ప్రైవేటుగా చేస్తూ కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే నిలిపివేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది.అలాగే సోమవారం ప్రభుత్వం చేసిన నిర్ణయాన్ని ప్రజలకు కార్మికులకు వివరిస్తూ ముద్రించిన కరపత్రాన్ని మున్సిపల్ ఫెడరేషన్ కమిటీ విడుదల చేసింది.అనంతరం నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కార్మికులకు అనేక హామీలు అమలు చేయడం లేదని, ఉన్న హక్కులు కాలరాసేలా నిర్ణయాలు చేస్తుందని ఇలాంటి నిర్ణయాలపై ఇప్పటికే పోరాటం కొనసాగుతుందని తెలిపారు. అలాగే సుప్రీంకోర్టు, హైకోర్టు స్పష్టమైన మార్గదర్శకాలను కాంట్రాక్టు , ఔట్సోర్సింగ్ డైలీ వేజ్ కార్మికుల విషయంలో తెలియజేసిన వాటిని అమలు చేసి కార్మికులకు ఉద్యోగ భద్రత మరియు కనీస జీతం అమలు చేసినటువంటి పరిస్థితి రాష్ట్రంలో లేదని గుర్తు చేశారు.అంతేకాకుండా మరో ప్రక్క ఉన్న పని గ్యారంటీ లేకుండా జీతం గ్యారంటీ లేకుప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వం అన్ని సేవలను ప్రైవేటీకరించడమే లక్ష్యంగా పనిచేస్తుందని అందులో భాగంగానే ఇటీవల క్యాబినెట్ 14 రకాల సేవలను ప్రైవేటీకరణ చేస్తూ నిర్ణయం చేసిందని ఈ నిర్ణయంపై ఇంకా సుప్రీంకోర్టు హైకోర్టు ఆదేశాలను అమలు చేయాలని డిమాండ్ చేసారు.అలాగే శాసనసభ్యులు ఇంకా మంత్రులు మరియు ప్రజల వద్దకు క్యాంపెయిన్ యూనియన్ ఆధ్వర్యంలో చేపడుతున్నామని స్పష్టం చేసారు. కార్యక్రమానికి సంస్థలు సంఘాలు ప్రజలు మద్దతుగా నిలవాలని విజ్ఞప్తి చేశారు.మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సాలూరు కమిటీ అధ్యక్షులు కార్యదర్శి కోశాధికారి మీడియా ఇన్చార్జ్ టి శంకర్రావు టి రవి, టి రాముడు,శ్రీను మహిళా కన్వనర్ జె.స్వప్న,లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

## ఏపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ చైర్మన్ సుజయ్ కృష్ణ రంగారావు

బొబ్బిలి, జూన్ 8, ప్రభాత వార్త:



కామెంట్స్‌లిగత సీజన్ లో ఏ పి ఎల్ ను ఏ విధం గా సపోర్ట్ చేసారో సీజన్ 5 కూడా అదే సహకారం రావాలి అని కోరుకుంటున్నగత సీసన్స్ కన్నా భిన్నం గా ఆంధ్ర క్రికెట్ కి మేలు జరిగే విధం గా ఈ 5 వ సీజన్ ఉండబోతుంది.ఈ సారి 3 ప్రాంతాల్లో ఏ పి ఎల్ జరగబోతుంది.వినూత్న ఆలోచనకు ఈసారి శ్రీకారం చుట్టం తొలిమ్యాచ్ నుండి అనగా 9 నుండి 14 వరకు వైజాగ్ 17 నుండి 21వరకు కడపలో24 నుండి30 వరకు మంగళగిరిలో మ్యాచ్లు జరుగుతాయి.కోట్లాది రూపాయిలు పెట్టి వసతులు పెంచడం జరిగింది.రాబోయే రోజుల్లో మరిన్ని స్టేడియమ్స్ లో ఏపీఎల్ జరుగుతుంది.ఏపీఎల్ ద్వారా ఏది అయితే ఏసిఏ ఆలోచన చేసిందో అదంతా సఫలికృతం అవుతుంది అని తెలియచేస్తున్నామునం చూస్తే సయెద్ ముస్తాక్ అలీ ట్రోఫీ లో ఆంధ్ర జట్టు ప్రదర్శన ఇంకా ఐపీఎల్ లో ఆంధ్ర క్రికెటర్స్ ను తీసుకోవడనేడు ఓపెనింగ్ సెర్మోనీ 6 గంటలకు ప్రారంభం కాబోతుంది.ముఖ్య అతిథిగా కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు వస్తున్నారుప్రముఖ గాయకురాలు సునీత తో కల్చరల్ ప్రోగ్రామ్ ఏర్పాటు చేసాముఇప్పటికే టీమ్స్ అన్ని పూర్తి సహాయసహకారాలు అందించాయినితీష్ కుమార్ రెడ్డి, త్రిపురాన విజయ్, పైలా అవినాష్ లాంటి ఐపీఎల్ లాంటి వాళ్ళు ఈ సీజన్ లో అలరించా బోతున్నాం గ్రామీణ క్రీడాకారులకు ఏపీఎల్ ఒక మంచి వేదికకడప స్టేడియం పూర్తిగా ఇంటర్నేషనల్ మ్యాచ్లకు సిద్ధం అయ్యింది. మంగళగిరి లో కూడా ఏసిఏ స్టేడియం ను తీర్చిదిద్దడం కోసం 50 కోట్లు ఖర్చు చేసిందిరేపు తొలి మ్యాచ్ 7.30 జరగబోతుందిసింహాద్రి వైజాగ్ లయన్స్ ఐం కాకినాడ కింగ్స్ మధ్య తొలి మ్యాచ్ జరగనుంది.

## బురద నీటి సరఫరా .. ఇంకెంత కాలం ?

గరివిడి ,జూన్ 8, ప్రభాత వార్త



కొండ పాలెం (గరివిడి)మేజర్ పంచాయతీ లో నీటి సరఫరా పై ప్రజానీకం తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేస్తుంది. బురద నీటి సరఫరా జరగడం పై వారు కన్నెర్ర చేస్తున్నారు. బురద నీరు తాగడం వలన ప్రజలు అనారోగ్యం పాలైతే బాధ్యులె వరని వారు ప్రశ్నిస్తున్నారు. గత కొంత కాలంగా గరివిడి పట్టణానికి సరఫరా అవుతున్న తాగు నీరు బురద మయమైంది. దీంతో ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. నీటి సరఫరా అయిన కొద్ది నిముషాలు మాత్రమే రంగు మారిన నీరు సరఫరా అవుతుందని అధికారులు పేర్కొంటున్నా, ఏ మాత్రం తాగు నీరు బురద మయమైనా ప్రజలు రోగాల బారిన పడే ప్రమాదం ఉందని పట్టణ వాసులు కలవర పడుతున్నారు..అధికారులు ప్రజలు అనారోగ్యం పాలకాక ముందే సురక్షిత మైన మంచినీరు సరఫరా కి అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు.

## స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పై అప్రమత్తంగా ఉండాలి

### శాసనమండలి విపక్ష నేత బొత్స

గరివిడి, జూన్ 8, ప్రభాత వార్త:



స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పై ప్రతీ వైకాపా కార్యకర్త అప్రమత్తంగా ఉండాలని శాసన మండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ అన్నారు. కూటమి సర్కారు కి ప్రజాస్వామ్యం పై నమ్మకం లేదని ఏ నిమిషాన ఏ చేస్తుందని ఆయన ఆరోపించారు.కూటమి రెండేళ్ళ వైఫల్యాలు ప్రజల్లోకి తీసుకువెళ్ళాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ నెల12 న చేపట్టే వైకాపా ప్రజా పోరాటానికి సన్నద్ధం కావాలని ఆయన కోరారు. వైకాపా చేపట్టిన వెన్నుపోటు కి రెండేళ్ళు కార్యక్రమ సమావేశం గరివిడి లో గల ఆయన క్యాంపు కార్యాలయ ప్రాంగణంలో నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న శాసన మండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ కూటమి సర్కారు వైఫల్యాలు పై విరుచుకు పడ్డారు. సమావేశంలో వైకాపా ఉత్తరాంధ్ర కో ఆర్డినేటర్ కురసాల కన్నబాబు, జిల్లా వైకాపా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఎంపి బెల్లాన చంద్రశేఖర్, వైకాపా యువ నాయకురాలు డాక్టర్ బొత్స అనూష, డాక్టర్ బొత్స సందీప్ తదితరులు ప్రసంగిస్తూ కూటమి సర్కారు పై విరుచుకు పడ్డారు. సమావేశంలో చీపురుపల్లి నియోజకవర్గ వైకాపా నాయకులు మీసాల విశ్వేశ్వర రావు, కొట్ల విశ్వేశ్వర రావు, సిరిపూరు వెంకట రమణ రాజు,వలిరెడ్డి శ్రీనివాసులు నాయుడు, మీసాల వరహాల నాయుడు, కొనిసి కృష్ణం నాయుడు, శీర అప్పలనాయుడు, పొట్నూరు సన్యాసి నాయుడు,వాకాడ శ్రీను,తదితరులు ప్రసంగించారు. పెద్ద సంఖ్యలో వైకాపా శ్రేణులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం రెండేళ్ళ కూటమి వైఫల్యాలు పై ఏర్పాటు చేసిన ఫోటో ప్రదర్శనను బొత్స, కురసాల,బెల్లాన, మజ్జి తదితరులు కార్యకర్తలతో పరిశీలించారు.

## అంతర్జాతీయ యోగా డే సెలబ్రేషన్స్‌కు యోగాంధ్ర ప్రోగ్రామ్స్

సాలూరు, జూన్ 8, ప్రభాతవార్త:



రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు 12వ ఇంటర్నేషనల్ యోగ డే ఉత్సవాలలో భాగంగా 14 రోజులు యోగాంధ్ర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కమిషనర్ టిటి రత్నకుమార్ తెలిపారు. సోమవారం అందులో భాగంగా సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమారు 15 వందల మందితో యోగాంధ్ర ప్రోగ్రామ్స్ చేయడానికి దీనికిగాను మాస్టర్ ట్రైనర్స్ 13 మందిని సెలెక్ట్ చేయడం జరిగిందన్నారు.అలాగే 200 మంది ట్రైనర్స్ ను ఎన్రోల్ చేసి కాంపిటీషన్ కండక్ట్ చేస్తామని ఇంకా ఈనెల 21న మెగా ఈవెంట్ ను నిర్వహిస్తామని కమిషనర్ స్పష్టం చేశారు. సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## పారదర్శక ఓటర్ల జాబితా తయారీలో అప్రమత్తంగా వ్యవహరించాలి

### మార్కెఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు

నెల్లిమర్ల, జూన్ 8, ప్రభాతవార్త



పారదర్శక ఓటర్ల జాబితా తయారీలో తెలుగుదేశం పార్టీ బూత్ లెవెల్ ఏజెంట్లు( బి ఎల్ ఎ )లు అప్రమత్తంగా వ్యవహరించాలని ఏపీ మార్క్ ఫెడ్ చైర్మన్, టిడిపి నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్చార్జ్ కర్రోత్ బంగార్రాజు అన్నారు. మండలంలోని రామతీర్థం పంచాయితీ డి. నెలివాడ గ్రామంలో గల కళ్యాణ మండపం లో సోమవారం నిర్వహించిన స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్ ( ఎస్ ఐ ఆర్)పై టిడిపి నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ అధ్యక్షులు కడగల ఆనంద్ కుమార్ , పల్లె భాస్కర రావు , మాజీ జెడ్పిటిసి పతివాడ అప్పలనారాయణ, నగర పంచాయతీ అధ్యక్షులు లెంక అప్పలనాయుడు , రాష్ట్ర మత్సకార సాధికార సమితి కన్వీనర్ మైలపల్లి సింహాచలం , నగర పంచాయతీ ప్రధాన కార్యదర్శి అవనాపు సత్యనారాయణ , రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్లు చీకటి సుహాసిని ,పిల్లా సూరిబాబు , కాళ్ల సత్యవతి , కింతాడ కళావతి ,క్లస్టర్ ఇన్చార్జిలు పిన్నింటి శ్రీనివాసరావు , మజ్జి ఆదినారాయణ , నియోజకవర్గ ఎలక్షన్ కోఆర్డినేటర్ కాళ్ల రాజశేఖర్ , బూత్ లెవెల్ ఏజెంట్ లు, ఏఎంసి డైరెక్టర్ గరి వెంకటరమణ ,రాష్ట్ర ఎస్ ఎస్ సి సెల్ అధికార ప్రతినిధి పోతల రాజప్పన్న ,జిల్లా అధికార ప్రతినిధులు తాడ్డి సత్యనారాయణ , నీలాపు అప్పలరామిరెడ్డి ,చందక గౌరీ ,తెలుగు యువత అధ్యక్షులు నల్లం శ్రీను వాసరావు నాలుగు మండలాల పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## గ్రోమోర్ సెంటర్లో అపాయమ్స్ 2.0 యాప్ ద్వారా ఎరువులు

సాలూరు, జూన్ 8, ప్రభాతవార్త :



ప్రస్తుత ఖరీఫ్ సీజన్ 2026 లో కొత్తగా ప్రవేశపెట్టిన అపాయమ్స్ 2.0 యాప్ ద్వారా రైతులకు గోమోర్ సెంటర్ వద్ద ఎరువులు పంపిణీ చేస్తున్నారు.సోమవారం అందులో భాగంగా సహాయ వ్యవసాయ సంచాలకులు జి.సత్యవతి అక్కడకు వెళ్లి పర్వేక్షించారు.అనంతరం ఆమె మాట్లాడుతు ఈ యాప్ ద్వారా రైతుపంట కాలానికి కావలసిన మొత్తం ఎరువును మూడు దఫాలుగా విభజించి ఇవ్వడం జరిగుతుందన్నారు.అలాగే అన్ని రైతుసేవ కేంద్రాలు ఇంకా ప్రైవేట్ డీలర్స్ పీఏసీఎస్ వారు అపాయమ్స్ 2.వా యాప్ ద్వారా రైతులకు యూరియా ఇంకా డీఏపీ అందస్తున్నారని క్లారిటీ ఇచ్చారు. అంతేకాకుండా రైతులకు ఉన్నభూమి వేసిన పంట ఆధారంగా ఎరువుల ఇస్తారని అలాగే రైతు ఎన్నిబస్తాల ఎరువు తీసుకున్నారో ఫోన్ కు మెసేజ్ కూడా వస్తుందని స్పష్టం చేసారు.మండల వ్యవసాయ అధికారి కె శిరీషా పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ యోగాభ్యసన చేయాలి : ఎమ్మెల్యే మాధవి

నెల్లిమర్ల, జూన్ 8, ప్రభాతవార్త



ప్రతి ఒక్కరూ యోగాను తమ దిన చర్యల్లో భాగంగా చేసుకోవాలని ఎమ్మెల్యే లోకం నాతో మాధవి సూచించారు. ఈనెల 21వ తేదీన జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని స్థానిక సరస్వతీ శిశు మందిర్ పాఠశాలలో సోమవారం నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమంలో ఎమ్మెల్యే నాగ మాధవి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె అందరితోపాటు పలు యోగ ఆసనాలు వేశారు. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ యోగాతో చాలా ప్రయోజనాలు ఉన్నాయని, మెరుగైన ఆరోగ్యం సిద్ధిస్తుందని అన్నారు. యోగా దినోత్సవం ఉత్సవంగా నిర్వహించాలని అన్నారు.యువత, మహిళలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని యోగా సాధన చేయడం అభినందనీయమని పేర్కొన్నారు.ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి యోగా ఎంతో దోహదపడుతుందని, రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న “యోగాంధ్ర” కార్యక్రమాన్ని ప్రజలు విజయవంతం చేయాలని ఆమె కోరారు. అంతకుముందు ఆమె ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమంలో పాల్గొన్నారు.“స్వచ్ఛ ఆంధ్ర -- ఆరోగ్య ఆంధ్ర” లక్ష్య సాధనలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని, తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని అన్నారు. అనంతరం నాలుగో వార్డులోని సిమెంట్ రోడ్లను ఆమె లాంఛనంగా ప్రారంభోత్సవం చేశారు. కార్యక్రమాల్లో నగర పంచాయతీ కమిషనర్ కిల్లాన అప్పలరాజు తోపాటు జనసేన పార్టీ నాయకులు బంగారు సరోజిని, చనమల్లు వెంకటరమణ, కరుమజ్జి గోవిందరావు, జనా ప్రసాద్, గంటా సత్యనారాయణ (సతీష్ ), ఎం. ఎం. నాయుడు, అప్పికొండ రవికుమార్, పతివాడ గోవిందరావు, తుమ్మ వెంకటరమణ, సారిపల్లి శంకర్, జనా రమణమ్మ, జనా సంధ్యారాణి మెప్మా రిసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి

### వైసీపీ రౌండ్ టేబుల్ సమావేశంలో ఎమ్మెల్సీ సురేష్ బాబు, నెక్కల

నెల్లిమర్ల, జూన్ 8, ప్రభాతవార్త



అమలు కాని హామీలు, మోసపూరిత వాగ్దానాలతో చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రజలను నిలువునా ముంచారని ఎమ్మెల్సీ డాక్టర్ పి వి. సూర్యనారాయణ రాజు ( సురేష్ బాబు), వైసిపి నెల్లిమర్ల నియోజకవర్గం పరిశీలకుడు, డి సి సి బి మాజీ చైర్మన్ నెక్కల నాయుడు బాబు విమర్శించారు. చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు కార్యక్రమంలో భాగంగా వైసిపి నియమర్ల నియోజకవర్గం స్థాయిలో నెల్లిమర్ల నగర పంచాయతీలో పరిధిలోని జరజాపు పేటలోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్ లో సోమవారం నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఎమ్మెల్సీ డాక్టర్ సూర్యనారాయణ రాజు, నియోజకవర్గ పరిసరకుడు నాయుడు బాబు మాట్లాడారు. చంద్రబాబు ఎన్నికలకు ముందు ప్రకటించిన మేనిఫెస్టోలో ఏ ఒక్క హామీ అమలు కాలేదని ప్రజలను మోసం చేసి అక్రమ మార్గంలో ముఖ్యమంత్రి పదవి అధిష్టించారని వారు ఆరోపించారు. అధికారం చేపట్టి రెండు సంవత్సరాలు గడుస్తున్నా సూపర్ సిక్స్ పథకాలు అమలు కాలేదని వారు దుయ్యబట్టారు. అర్హులైన వృద్ధులు, వితంతువులు, వికలాంగులు సామాజిక పింఛన్ కోసం ఎదురుచూస్తున్నారని వారి పరిస్థితి మరింత దయనీయంగా ఉందని వారన్నారు. 50 ఏళ్ళు నిండిన బి సి ఎస్ సి ఎస్ టి లకు సామాజిక పింఛన్ మంజూరు చేస్తానని ప్రకటించిన చంద్రబాబు ఇప్పుడు ప్రజలకు ఏం సమాధానం చెబుతారని వారు ప్రశ్నించారు. అమ్మ ఒడి ఆచూకీ లేదని, రైతులకు అన్ని విషయాల్లో తీరని అన్యాయం జరిగిందని వారు విమర్శించారు. రాబోయే ఎన్నికల్లో కూటమి పార్టీల నాయకులను మట్టి కరిపించేందుకు వైసీపీ శ్రేణులు సమాయత్తం కావాలని వారు పిలిపించారు. స్థానిక ఎన్నికలలో వైసిపి నాయకులు తమ సత్తా చూపించాలని అన్నారు. 2029 సాధారణ ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డి తిరిగి ముఖ్యమంత్రి కాబోతున్నారని నాయకులు కార్యకర్తలు ఉత్సాహంగా పనిచేయాలని అన్నారు. కోటమ్మ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లేందుకు ప్రతి ఒక్క కార్యకర్త చురుగ్గా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో సూర్యనారాయణ రాజు, నాయుడు బాబులతో పాటు జెడ్పిటిసిలు గదల సన్యాసినాయుడు, జనార్ధన రావు, మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు తనయులు మణిదీప్ నాయుడు ప్రదీప్ నాయుడు, పార్టీ నాయకులు చిక్కాల సాంబశివరావు, సముద్రపు రామారావు, పతివాడ అప్పలనాయుడు, పిన్నింటి తమ్మి నాయుడు, రేగాన శ్రీనివాసరావు, దంతులూరి జోగి జగన్నాథరాజు ( గిరిబాబు ), పతివాడ సత్యనారాయణ, కారుకొండ కృష్ణ,ఉప్పాడ శివారెడ్డి, అంబల్ల కిరణ్ కుమార్, బొద్దాన రమణ, పతివాడ కృష్ణవేణి, కనకల హైమావతి తదితరులు మాట్లాడారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## అర్జీల పరిష్కారంలో జిల్లా అధికారులు భాద్యత వహించాలి

విజయనగరం, జూన్ 8: ప్రభాతవార్త :



సమస్యల పరిష్కార వేదిక (పి జి ఆర్ ఎస్) కార్యక్రమలో వచ్చిన అర్జీలను పరిష్కరిండంలో సంబంధిత శాఖల జిల్లా అధికారులు భాధ్యత వహించాలని జిల్లా కలెక్టరు ఎస్. రాంసుందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో జిల్లా కలెక్టరు మాట్లాడుతూ పి.జి.ఆర్.ఎస్. కార్యక్రమంలో ప్రజలు అందజేసిన అర్జీలు పరిష్కారంలో సంబంధిత శాఖల జిల్లా అధికారులు బాధ్యత తీసుకోవాలన్నారు. కింది స్థాయి సిబ్బంది సకాలంలో పరిష్కారం చూపేలా పర్యవేక్షణ చేయాలని, అర్జీదారునితో నేరుగా మాట్లాడి సమస్యను పరిష్కరించాలని తెలిపారు. మునిసిపాలిటీ, గ్రామీణ నీటిసరఫరా, పెన్షన్లు పంపిణీ తదితర పథకాలకు సంబంధించి ప్రజా సానుకూలత శాతం తగ్గడంపై అసంతృప్తి వ్యక్తంచేసారు. జాయింటు కలెక్టరు సేధు మాధవన్, జిల్లా రెవిన్యూ అధికారి సిహెచ్. సత్తిబాబు, ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

## జనసేన ఆధ్వర్యంలో .. డొక్కా సీతమ్మ అన్నదానం

బొబ్బిలి జూన్ 8 ప్రభాతవార్త:



సోమవారం బొబ్బిలి జనసేన పార్టీ కార్యాలయం వద్ద ఆంధ్రుల అన్నపూర్ణ డొక్కా సీతమ్మ క్యాంటీన్ 07 వ వారం జనసేన పార్టీ ఇంచార్జి డా, గిరడ అప్పలస్వామి ఆదేశాల మేరకు బొబ్బిలి జనసేన పార్టీ కార్యాలయం వద్ద ప్రతి సోమవారం లనే బొబ్బిలి జనసేన పార్టీ కార్యాలయం ఆవరణలో 200 మంది కి పేదలకు అన్నదాన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జనసేన పార్టీ నాయకులు లంక రమేష్, పైల హరి ప్రసాద్, అడబాల నాగు, ఉల్లి సంతోష్, జమ్మూ గణేశ్,గొల్లపల్లి జాన్, దాకరపు చంద్ర మౌళి, పళ్ళెం రాజా , పొట్నూరు జనార్ధన్,అల్లు రమేష్ జనసేన వీర మహిళలు రామలక్ష్మి తదితరులు విజయవంతం చేశారు.

విజయనగరం
పార్వతీపురం మన్యం
వార్త
25

## 11న జిల్లా కేంద్రంలో రెండేళ్ల సంబరాలు : కలెక్టర్

విజయనగరం, జూన్ 8, ప్రభాతవార్త:



ప్రభుత్వ రెండేళ్ల పాలన పై విస్తృత ప్రచారం చేయాలని జిల్లా కలెక్టరు ఎస్. రాంసుందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. కూటమి ప్రభుత్వం (ఎన్.డి.ఎ.) రెండేళ్ల పాలన పూర్తిచేసుకున్న సంధర్భంగా ఈ నెల 11వ తేదిన పోలీసు పెరేడ్ గ్రౌండ్ లో ఏర్పాటు చేస్తున్న కార్యక్రమంలో ప్రభుత్వ పథకాలపై విస్తృత ప్రచారం నిర్వహించి ప్రజలలో అవగాహన కల్పించాలని సూచించారు. సోమవారం మద్యాహ్నం కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా ఎస్.పి. ఎ.ఆర్.దామోదర్ తో కలసి నియోజకవర్గ, మండలాల ప్రత్యేక అధికారులతో కార్యక్రమ ఏర్పాట్లపై సమావేశం నిర్వహించారు. జిల్లా ఎస్.పి. ఎ.ఆర్. దామోదర్ మాట్లాడుతూ ఈ నెల 11వ తేదిన డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ థీమ్‌తో జిల్లా స్థాయిలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో యువత డ్రగ్స్ బారిన పడకుండా వారికి అవగాహన కల్పిండం జరుగుతుందని, వినియోగం వలన కలిగే దుష్పరిణామాలపై విస్తృత ప్రచారం కల్పిస్తూ హెూర్డింగులు ఏర్పాటు వంటి కార్యక్రమాలు నిర్వహించనున్న ట్లు తెలిపారు. సమావేశంలో జాయింటు కలెక్టరు సేధు మాధవన్, ఎ.ఎస్.పి. జిల్లారెవిన్యూ అధికారి సిహెచ్. సత్తిబాబు, సిపిఒ బాలాజీ, నియోజకవర్గ, మండల ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

## విశాఖ స్టీల్ ప్లాంట్ ఘటనపై మంత్రి తీవ్ర దిగ్భ్రాంతి

విజయనగరం, జూన్ 8 ప్రభాతవార్త:

జిల్లా అధికారులతో మాట్లాడి ప్రమాద ఘటనపై ఆరా తీసిన మంత్రిప్రమాదంలో 9 మంది కార్మికులు మృతి చెందడం బాధాకరం స్టీల్ ప్లాంట్‌లో అనుకోని సంఘటనతో కార్మికులు ప్రాణాలు కోల్పోవడం దురదృష్టకరం మృతుల కుటుంబాలకు ప్రగాఢ సంతాపం తెలిపిన మంత్రిముఖ్యమంత్రి గారు అన్ని శాఖల అధికారులకు సహాయక చర్యలపై ఆదేశాలు జారీ చేశారు.క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలి... వీరి కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలి. విశాఖ స్టీల్ ప్లాంట్‌లో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి.

## రైతులకు న్యాయం జరిగేలా చూస్తాం

### జిందాల్ సమస్యపై రైతులతో చర్చించిన ఇంచార్జ్ మంత్రి వంగలపూడి అనిత

విజయనగరం, జూన్ 8, ప్రభాతవార్త:



ఏ ఒక్క రైతుకు అన్యాయం జరగకుండా చూడాలనే ఆలోచనతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉన్నారని, అందరికీ న్యాయం జరిగేలా చూస్తామని జిల్లా ఇంచార్జ్ మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. మంత్రి కొండపల్లి శ్రీనివాస్ , జిల్లా కలెక్టర్ ఎస్. రామ్ సుందర్ రెడ్డి తో కలసి మంత్రి జిందాల్ రైతులతో మాట్లాడారు. వారి సమస్యలన్నింటినీ , ప్రతి ఒక్కరి సమస్యను విని సానుకూలంగా స్పందించారు. సమస్యను ఓపెన్ గా చర్చించుకుందామని, అందరూ సహకరించాలని కోరారు. జిల్లా ఇంచార్జ్ మంత్రిగా మీ ముందుకు వచ్చానంటే ప్రభుత్వ ప్రతినిధిగానే వచ్చినట్లుగా భావించాలని, మీ సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధి తో కృషి చేస్తానని అన్నారు. గతసారి రైతులతో జిందాల్ సమస్య పై చర్చించిన అంశాలను మినిట్స్ చేయడం జరిగిందని, కంపెనీ తో కూడా మాట్లాడి మీకు రావలసినవన్నీ వచ్చేలా చూస్తామని తెలిపారు .మధ్యవర్తుల మాటలు విని మీరు మోసపోవద్దని, ప్రభుత్వానికి సహకరిస్తే అందరికీ మేలు జరుగుతుందని స్పష్టం చేశారు. ఎం .ఎల్.సి ఇందుకూరి రఘురాజు , శాసన సభ్యులు కోళ్ల లలిత కుమారి, లోకం నాగ మాధవి, డి.సి.ఏం.ఎస్ చైర్మన్ గొంప కృష్ణ, జిల్లా ఎస్. పీ ఎ.ఆర్. దామోదర్, జే.సి సేదు మాధవన్ , డి.ఆర్.ఓ సత్తిబాబు, ఆర్.డి.ఓ సుధా సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి పికిల్ బాల్ పోటీల్లో సుజయ్ కృష్ణ రంగారావు ఘన విజయం!

విజయనగరం, జూన్ 8, ప్రభాతవార్త



విజయవాడ వేదికగా రెండు రోజుల పాటు ఉత్సాహభరితంగా సాగిన ‘రాష్ట్ర స్థాయి పికిల్ బాల్ ఛాంపియన్షిప్’ పోటీల్లో ఆంధ్ర ప్రీమియర్ లీగ్ చైర్మన్, ఏపీ అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ , మాజీ మంత్రి రావు వెంకట సుజయ్ కృష్ణ రంగారావు అద్భుత ప్రతిభ కనబరిచి, క్రీడా మైదానంలోనూ తన సత్తా చాటారు. ఈ పోటీల్లో ఆయన 35ం డబుల్స్ మరియు 50ం డబుల్స్ విభాగాల్లో అజేయంగా నిలిచి, విజేతగా ఛాంపియన్ షిప్ కైవసం చేసుకుని విజయనగరం జిల్లాకు ఘన కీర్తిని చేకూర్చారు.ఈ క్రీడా సంబరాన్ని లోక్‌సభ సభ్యులు కేశినేని నాని, స్థానిక శాసనసభ్యులు గద్దె రామ్మోహన్ రావు ఘనంగా ప్రారంభించారు. జిల్లాకు చెందిన పలువురు ఆటగాళ్లు కూడా ఈ పోటీల్లో టాప్ ప్లేస్‌లో నిలిచి విజయకేతనం ఎగురవేశారు.

## బల్లంకిలో పాస్ పుస్తకాల పంపిణీ

విజయనగరం, జూన్ 8, ప్రభాతవార్త:

వేపాడ మండలం బల్లంకి గ్రామంలో పట్టాదారు పాసుపుస్తకాలను పంపిణీ చేసిన రాష్ట్ర హోం మంత్రి, జిల్లా ఇంచార్జి మంత్రివర్యులు వంగలపూడి అనిత. పట్టాదారు పాసుపుస్తకాల ద్వారా భూమిపై సంపూర్ణ శాశ్వత హక్కులు కల్పించి భరోసా కల్పిస్తున్నాం.. మంత్రి అనిత గత ప్రభుత్వ హయంలో రీ సర్వే తప్పుల తడక...మంత్రి అనిత గత ప్రభుత్వం 70 శాతం తప్పులతో పాస్ పుస్తకాలు తయారు చేశారు.... మంత్రి అనిత ల్యాండ్ టైటిల్లింగ్ యాక్ట్ తో ప్రజలకు భయాందోళనలు సృష్టించారు. ప్రభుత్వ రాజముద్రతో పట్టాదారు పాసుపుస్తకాలను తయారు చేసి ఇస్తున్నాం.సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు అందకపోతే ఫోన్ ద్వారా తెలియజేసేందుకు త్వరలో ఒక వ్యవస్థను ఏర్పాటు చేస్తాం. నిబద్ధతతో ప్రజలకు సేవ చేస్తున్న ప్రభుత్వం మాది...మంత్రి అనిత. జూలై చివరినాటికి జాయింట్ ఎల్పీఎంలు విడదీస్తాం ..

LIC HFL
LIC HOUSING FINANCE LTD

**LIC హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్**

బ్యాక్ ఆఫీస్, 4వ అంతస్తు, ఉత్తర విభాగం, జీవన్ సమృద్ధి, న్యూ ఇన్వెస్ట్‌మెంట్ భవనం, ఎల్ఐసి ఎనెక్స్ భవనం, తిక్కన్న రోడ్డు, విశాఖపట్నం - 530004.

**డిమాండ్ నోటీసు**

(సెక్యూరిటైజేషన్ అండ్ రీకనస్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 లోని సెక్షన్ 13(2) క్రింద - జారీ చేయబడిన నోటీసు)

**ఋణగ్రహీత పేరు మరియు చిరునామా :** **శ్రీమతి ఓమిని హరి కౌసల్య దేవి (ప్రైమరీ అప్లికెంట్),** ఫ్లాట్ నెం.101, సత్యసాయి నివాస అపార్ట్‌మెంట్, సన్ స్కూల్ దగ్గర, రింగు రోడ్డు, కళ్యాణ వెంకటేశ్వర స్వామి గుడి రోడ్డు, విజయనగరం, ఆంధ్రప్రదేశ్-535003. **శ్రీమతి ఓమిని హరి కౌసల్య దేవి,** ప్లాటు నెం.154 (విల్లా), వారిస్ హోమ్స్ లేఅవుట్ ఫేజ్-1, లక్ష్మీ గణపతి గుడి నుండి 1 కిలోమీటరు, సర్వే నెం.70/1, 70/2, 71/1, 71/1-ఎ2, కుకలమెట్ట, లక్ష్మీపురం గ్రామం, విజయనగరం, ఆంధ్రప్రదేశ్-535001. **శ్రీ వినోద్ వంశీ కిరణ్ ఓమిని (కో-అప్లికెంట్),** ఫ్లాట్ నెం.101, సత్యసాయి నివాస అపార్ట్‌మెంట్, సన్ స్కూల్ దగ్గర, రింగు రోడ్డు, కళ్యాణ వెంకటేశ్వర స్వామి గుడి రోడ్డు, విజయనగరం, ఆంధ్రప్రదేశ్-535003. **శ్రీ వినోద్ వంశీ కిరణ్ ఓమిని,** ప్లాటు నెం.154 (విల్లా), వారిస్ హోమ్స్ లేఅవుట్ ఫేజ్-1, లక్ష్మీ గణపతి గుడి నుండి 1 కిలోమీటరు, సర్వే నెం.70/1, 70/2, 71/1, 71/1-ఎ-2, కుకలమెట్ట, లక్ష్మీపురం గ్రామం, విజయనగరం, ఆంధ్రప్రదేశ్-535001.

**లోన్ ఖాతా నెం.లు : 720200003498 (ఏరియా ఆఫీసు: విజయనగరం)**

**చెల్లించవలసిన బకాయి మొత్తము : తేది.19.05.2026 నాటికి రూ.39,75,677.79 పై.** (అక్షరాల ముప్పై తొమ్మిది లక్షల డెబ్బై అయిదు వేల ఆరు వందల డెబ్బై ఏడు రూపాయల డెబ్బై తొమ్మిది పైసలు మాత్రమే) + **తేది.20.05.2026** నుండి భవిష్య వడ్డీ + అన్ని ఇతర ఛార్జీలు ఈ నోటీసు స్వీకరించిన తేదీ నుండి 60 దినములలోగా చెల్లించవలెను.

**డిమాండ్ నోటీసు తేది : 19.05.2026**

**షెడ్యూలు ఆస్తి వివరములు :** కంపెనీకి తీసుకున్న ఋణాన్ని తిరిగి చెల్లించేందుకు భద్రతగా, మీరు క్రింది తెలుపబడిన ఆస్తిని తనఖా చేసి యున్నారు. విజయనగరం జిల్లా మరియు విజయనగరం వెస్ట్ సబ్ రిజిస్ట్రేషన్ డిస్ట్రిక్ట్, పూర్వం కుకలమెట్ట లక్ష్మీపురం పంచాయితీ పరిధిలో ఉండి, ప్రస్తుతం విజయనగరం మున్సిపాలిటీ పరిధిలో ఉన్న కుకలమెట్ట లక్ష్మీపురం గ్రామంలోని "వారిస్ హోమ్స్"లో గల సర్వే నెంలు.70-1, 70-2, 71-1, 71-1-ఎ-2, 71-2 భాగాలు, దిగువ వివరించిన కొలతలు, విస్తీర్ణం మరియు హద్దులతో కూడిన ప్లాటు నెం.154లోని 150 చ॥గ॥లు స్థలంలో నందు స్లాబ్ లెవల్ వరకు నిర్మించబడిన ఆర్‌సిసి స్లాబ్ విల్లా మొత్తం 2000 చ॥అ॥ల విస్తీర్ణం కలిగిన ఆస్తి, **మొత్తం ఆస్తికి కొలతలు: తూర్పు నుండి పడమర :** 30 అ॥లు (9.15 మీ॥లు) **మరియు ఉత్తరం నుండి దక్షిణం:** 45 అ॥లు (13.72 మీ॥లు) **విస్తీర్ణం: 150 చ॥గ॥లు (125.420 చ॥మీ॥లు),** **క్రింది అంతస్తు ఆర్‌సిసి స్లాబ్ బిల్టప్ ఏరియా: 1000 చ॥అ॥లు. మొదటి అంతస్తు ఆర్‌సిసి స్లాబ్ బిల్టప్ ఏరియా: 1000 చ॥అ॥లు. హద్దులు: తూర్పు :** 30 అ॥ల వెడల్పు లేఅవుట్ రోడ్డు, **దక్షిణం :** ప్లాటు నెం.137లోని ఖాళీ స్థలం, **పడమర :** ప్లాటు నెం.155లోని ఖాళీ స్థలం, **ఉత్తరం :** 30 అ॥ల వెడల్పు లేఅవుట్ రోడ్డు.

**ఇప్పటి నుండి సెక్యూర్డు ఆస్తి అని పిలువవలెను**

పైన చెప్పబడిన ఋణగ్రహీత/ సహ-ఋణగ్రహీత **ఎల్ఐసి హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్** వారి నుండి ఇంటి కొరకు ఋణం పొందియున్నారు. సదరు ఋణమునకు పైన పేర్కొన్న ఆస్తిని తనఖాగా ఇచ్చియున్నారు. ఋణము యొక్క నియమ, నిబంధనలను అనుసరించి సకాలంలో బకాయిలు చెల్లించకపోవుటచే సదరు ఖాతాను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారి నియమ నిబంధనల ప్రకారము నిరర్ధక ఖాతాగా పరిగణించబడినది. కావున **ఎల్ఐసి హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్** వారు రిజిష్టర్ పోస్టు ద్వారా డిమాండ్ నోటీసును పంపియున్నారు. పంపించిన డిమాండు నోటీసుకు సంబంధించిన తిరుగు రశీదులు / ఋణగ్రహీతలు / సహ-ఋణగ్రహీతలు సంతకములు సరిగా లేకుండా మాకు తిరిగి వచ్చినవి. కనుకనే పత్రికా మూలకముగా మీకు ఈ నోటీసు జారీచేయడమైనది. కావున సదరు ఋణగ్రహీతలు / సహ-ఋణగ్రహీతలు పైన పేర్కొన్న మొత్తములను నోటీసు తేదీ నుండి 60 రోజులలోగా, వడ్డీ మరియు ఇతర ఖర్చులతో సహా చెల్లించవలసినదిగా కోరడమైనది. లేని పక్షంలో పైన పేర్కొన్న చట్టము ప్రకారము **ఎల్ఐసి హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్** వారు బకాయిని రాబట్టుకొను నిమిత్తం తదుపరి చర్యలు గైకొనుట దిగువ సంతకందారునికి అనివార్యమవుతుంది.

తేది :03.06.2026, ప్రదేశం : విశాఖపట్నం

సం/-అధీకృత అధికారి, ఎల్ఐసి హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్




# మూడు రోజుల్లోనే ఖేల్ ఖతమ్

## ఇన్నింగ్స్ 300 రన్స్‌తో ఘన విజయం *ఏకైక టెస్ట్ సిరీస్ భారత్ కైవసం
## స్పిన్‌కు అఫ్ఘానిస్థాన్ విలవిల*డెబ్యూ టెస్ట్‌లోనే మానవ్ ప్లేయర్ ఆఫ్ ది సిరీస్

**న్యూచండీఘర్, జూన్ 8:** ముల్లన్‌పూర్ స్టేడియంలో ఆఫ్ఘనిస్తాన్‌తో జరిగిన ఏకైక టెస్ట్‌లో టీమిండియా అదరగొట్టింది. బ్యాటింగ్, బౌలింగ్‌లో చెలరేగుతూ క్రికెట్ కూనను దెబ్బ తీసింది. ఏకంగా ఇన్నింగ్స్ 300పరుగుల తేడాతో ఘన విజయం అందుకుని చరిత్ర సృష్టించింది. టెస్ట్‌ల్లో భారత్‌కిదే అత్యంత భారీ విజయం. భారత్ బౌలర్ల ధాటికి తొలి ఇన్నింగ్స్‌లో 152 పరుగులకు ఆలౌటై ఫాలోఆన్ ఆడింది. రెండో ఇన్నింగ్స్‌లోనూ మరింత ఘోరంగా 112 పరుగులకే కుప్పకూలింది. ఈ ఏకైక టెస్ట్ మ్యాచ్ మూడు రోజుల్లోనే ముగిసింది. ఏకైక టెస్ట్ సిరీస్‌ను భారత్ కైవసం చేసుకుంది.

**మానవ్ స్పిన్ ఉచ్చుకు ఆఫ్ఘనిస్థాన్ విలవిల**

ఓవర్‌నైట్ స్కోరు అయిదు వికెట్ల నష్టానికి 113 పరుగులతో మూడో రోజు ఆటను కొనసాగించిన ఆఫ్ఘనిస్థాన్.. భారత బౌలర్ల ముందు క్రీజ్‌లో నిలవలేకపోయారు. టాప్ ఆర్డర్ లాగే మిడిల్ ఆర్డర్, లోయర్ ఆర్డర్ బ్యాట్స్‌మెన్ చేతులెత్తేశారు. లంచ్‌కు ముందే ఆఫ్ఘన్ తొలి ఇన్నింగ్స్‌లో 152 రన్స్‌కు ఆలౌటైంది. అజ్మతుల్లా ఓమర్‌జాయ్‌ను ఆరంభంలోనే డకౌట్‌గా ప్రసిద్ధ్ కృష్ణ పెవలియన్‌కు పంపాడు. డెబ్యూ బౌలర్ మానవ్ సుతార్ చక్కని స్పిన్‌తో షరఫుద్దీన్(11)ను ఔట్ చేశాడు. ఇక 43 పరుగులతో బ్యాటింగ్ కొనసాగించిన రహత్ షా(135 బంతు ల్లో 60) అర్ధసెంచరీ పూర్తిచేశాడు. చివరకు అతన్ని మానవ్ సుతార్ క్లీన్ బౌల్డ్ చేశాడు. అదే ఊపులో సలీమ్‌ను వికెట్ల ముందు దొరకబుచ్చుకుని ఎల్బీగా ఔట్ చేశాడు. రహ్మాద్‌ను వాష్టింగ్టన్ సుందర్ అవుట్ చేయడంతో ఆఫ్ఘన్ తొలి ఇన్నింగ్స్ ముగిసింది. భారత స్పిన్నర్ సుతార్ తొలి ఇన్నింగ్స్‌లో ఆరు వికెట్లు తీసుకుని సత్తా చాటాడు. ప్రసిధ్ కృష్ణ మూడు వికెట్లు పడగొట్టాడు.

**ఫాలోఆన్‌లోనే చతికిల**

తొలి ఇన్నింగ్స్‌లో 412 పరుగులు వెనకబడ్డ ఆఫ్ఘనిస్తాన్‌ను టీమిండియా ఫాలోఆన్ ఆడించింది. అయితే రెండో ఇన్నింగ్స్‌లో ఆఫ్ఘనీలు మరీ దారుణంగా చేతులెత్తేశారు. తొలి వికెట్ కు 42 పరుగులు జోడించాక పతకం మొదలైంది. మహ్మద్ సిరాజ్... ఓపెనర్ మాలిక్(8)ను ఔట్ చేసి ఆఫ్ఘన్ వికెట్ల పతనానికి నాంది పలికాడు. ముగింపు బాధ్యత స్పిన్నర్లు వాషింగ్టన్ సుందర్, కుల్‌దీప్ యాదవ్ తీసుకున్నారు. వీరి స్పిన్ బంతులను ఆడలేక ఆఫ్ఘన్ బ్యాట్స్‌మెన్ పెవిలియన్‌కు క్యూ కట్టారు. ఓపెనర్ అటల్ (42), గుర్బాజ్ (24) మాత్రమే కాస్త క్రీజ్‌లో నిలిచారు. స్పిన్‌కు అనుకూలిస్తున్న పిచ్‌పై భారత స్పిన్నర్లు సత్తా చాటారు. ఆఫ్ఘనిస్తాన్ రెండో ఇన్నింగ్స్‌ను కేవలం 35.3 ఓవర్లలో 112 రన్స్ చేసి ఆలౌట్ చేశారు. మూడో రోజు ఆటలో వాషింగ్టన్ సుందర్, కుల్దీప్ యాదవ్ కీలక పాత్ర పోషించారు. రెండో ఇన్నింగ్స్‌లో సుందర్ 4, కుల్దీప్ మూడు వికెట్లు తీసుకున్నారు. మూడోరోజుఆటలో ఏకంగా 14వికెట్లు పడ్డాయి. డెబ్యూ టెస్ట్‌లోనే ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా నిలిచి మానవ్ సుతార్ అరుదైన ఘనత అందుకున్నాడు.

**స్కోర్ బోర్డు**

**భారత్ తొలి ఇన్నింగ్స్: 564/8** (శుభ్‌మన్ గిల్ 126, కేఎల్ రాహుల్ 100); **ఆఫ్ఘనిస్థాన్ తొలి ఇన్నింగ్స్: 152 ఆలౌట్(58.4 ఓవర్లలో)** (రషమత్ షా 60, మానవ్ సుథార్ 6/33); **ఆఫ్ఘని స్థాన్ రెండో ఇన్నింగ్స్(ఫాలోఆన్): 112 ఆలౌట్(35.5 ఓవర్లలో)** (అటల్ 42, వాషింగ్టన్ సుందర్ 4/36, కుల్‌దీప్ 3/30)

**ఫలితం:** భారత్ ఇన్నింగ్స్ 300రన్స్ విజయం

## 93 యేళ్లలో ఇదే ఫస్ట్

ఆఫ్ఘనిస్థాన్‌పై ఇన్నింగ్స్ 300 పరుగుల తేడాతో నెగ్గిన గిల్ సేన అరుదైన ఘనతను ఖాతాలో వేసుకుంది. 93 ఏళ్ల కిందట మొదలైన భారత టెస్ట్ ప్రయాణంలో.. న్యూ చండీగర్ లోని ముల్లన్‌పూర్‌లో సాధించిన ఈ విజయం సరికొత్త అధ్యాయాన్ని లిఖించింది. భారత్ చరిత్రలోనే ఇదే అత్యంత అతి పెద్ద విజయం. ఆఫ్ఘనిస్థాన్‌ను ఫాలోఆన్ ఆడించి మరీ ఇన్నింగ్స్ 300 పరుగుల తేడాతో ఓడించి టీమిండియా ఈ నయా రికార్డును సెట్ చేసింది.

**టెస్ట్ క్రికెట్‌లో భారత్ టాప్-5 విజయాలు**

**2026:** ఆఫ్ఘనిస్థాన్‌పై ఇన్నింగ్స్ 300 రన్స్ విజయం
**2018:** వెస్టిండీస్‌పై ఇన్నింగ్స్ 272 రన్స్ గెలుపు
**2018:** ఆఫ్ఘనిస్థాన్‌పై ఇన్నింగ్స్ 262 రన్స్ విజయం
**2007:** బంగ్లాదేశ్‌పై ఇన్నింగ్స్ 239 రన్స్ గెలుపు
**2017:** శ్రీలంకపై ఇన్నింగ్స్ 239 రన్స్ విజయం

## విండీస్‌పై వామప్ మ్యాచ్‌లో టీమిండియా మహిళల విక్టరీ

**కార్డిఫ్, జూన్ 8:** మహిళల టీ20 ప్రపంచకప్ వార్మప్ మ్యాచ్‌లో టీమిండియా అదరగొట్టింది. వెస్టిండీస్‌తో జరిగిన మ్యాచ్‌లో 26 పరుగుల తేడాతో గెలుపొందింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన భారత విమెన్ టీమ్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 179పరుగులు చేయగా.. విండీస్ 20 ఓవర్లలో 8వికెట్లు కోల్పోయి 153రన్స్‌కే పరిమితమైంది. భారత ఇన్నింగ్స్‌లో భారతి ఫుల్మాలి (56 నాటౌట్) అర్ధ సెంచరీతో రాణించగా.. షఫాలీ వర్మ (29), స్మృతి మంధన (39), యస్తికా భాటియా (36) ఓ మోస్తరు స్కోర్లతో పర్వాలేదనిపించారు. మిగతా ప్లేయర్లు జెమీమా రోడ్రిగ్స్ (7), రిచా ఘోష్ డకౌట్, రాధా యాదవ్ (1), శ్రేయాంక పాటిల్ (2), క్రాంతి గౌడ్ (4)నిరాశ పరిచారు. విండీస్ బౌలర్లలో అఫీ ఫ్లెచర్ 4 వికెట్లతో సత్తా చాటగా.. కరిష్మ రామ్హరాక్, ఆలియా అలెన్, డియాండ్రా డొట్టిన్ తలో వికెట్ తీశారు.

అనంతరం ఓ మోస్తరు లక్ష్య ఛేదనలో ఓపెనర్లు డొట్టిన్ (49), షెర్మైన్ క్యాంప్‌బెల్ (25) శుభారంభం అందిచారు. అయితే రాణించిన శ్రేయాంక పాటిల్ నాలుగు వికెట్లు, రాధా యాదవ్ మూడు వికెట్లు తీసి కట్టడిచేశారు. దీంతో విండీస్‌కు ఓటమి తప్పలేదు. భారత్ జూన్ 10న ఇంగ్లండ్‌తో మరో వార్మప్ మ్యాచ్ ఆడనుంది.

## భారత్, ఇంగ్లండ్ సిరీస్ వేళల్లో మార్పు

**లీడ్స్:** భారత్‌తో జరుగబోయే 5 మ్యాచ్‌ల టీ20 సిరీస్ వేళల్లో ఇంగ్లండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డు మార్పులు చేసింది. బ్రాడ్‌కాస్టర్లతో చర్చల అనంతరం మ్యాచ్‌లను సాయంత్రం 5.30 గంటలకు (భారత కాలమానం ప్రకారం రాత్రి 10 గంటలకు) ప్రారంభించాలని నిర్ణయించారు. ఈ నిర్ణయం వెనుక ప్రధాన కారణం భారత ప్రేక్షకులే. భారత్‌లో క్రికెట్‌కు ఉన్న విపరీతమైన ఆదరణ దృష్ట్యా, మ్యాచ్‌లు మరింత ఎక్కువ మంది వీక్షించేలా టైమింగ్ ను మార్చినట్లు తెలుస్తోంది. ఈ విషయంలో బ్రిటన్‌కు చెందిన స్కై స్పోర్ట్స్, భారత్‌కు చెందిన సోనీ స్పోర్ట్స్ నెట్‌వర్క్‌లతో నిదితీ సంప్రదింపులు జరిపింది.

కాగా, జూలై 1 నుంచి 19 వరకు భారత జట్టు ఇంగ్లండ్‌లో పర్యటనుంది. ఈ పర్యటనలో 5 టీ20లు, 3 వన్డేలు జరుగనున్నాయి. టీ20 సిరీస్ కోసం భారత జట్టును తాజాగా ప్రకటించారు. శ్రేయస్ అ య్యర్ సారథ్యంలో భారత జట్టు ఈ సిరీస్‌కు సిద్ధమవుతోంది. 15 ఏళ్ల సంచలనం వైభవ్ సూర్యవంశీ తొలిసారి సీనియర్ జట్టులో చోటు దక్కించుకోవడంతో ఈ పర్యటనపై మరింత ఆసక్తి నెలకొంది.

## హెచ్‌సిఎ అధ్యక్షుడికి తెలంగాణ హైకోర్టు షాక్

**హైదరాబాద్, జూన్ 8(ప్రభాతవార్త క్రీడా ప్రతినిధి:** హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడి ఎన్నిక చెల్లదని తెలంగాణ హైకోర్టు షాకింగ్ తీర్పు ఇచ్చింది. అతడిని వెంటనే బాధ్యతల నుంచి తొలగించాలని, స్పెషల్ ఏజీఎం నిర్వహించి కొత్త అధ్యక్షుడిని వెంటనే ఎన్నికోవాలని ధర్మాసనం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. 2023 అక్టోబర్ 20న జరిగిన హెచ్‌సీఏ ఎన్నికల్లో అమర్‌నాథ్ ఒకే ఒక్క ఓటు తేడాతో జగన్ మోహన్ రావు చేతిలో ఓడిపోయారు. అయితే, జగన్‌మోహన్.. శ్రీ చక్ర క్లబ్ పేరుతో సమర్పించిన పత్రాలు నకిలీవని బీసీసీఐ అంబుడ్స్‌మన్‌కు అమర్‌నాథ్ ఫిర్యాదు చేశారు. అదేవిధంగా 2018లోనే అంబుడ్స్‌మన్ జస్టిస్ ఎల్.నరసింహా రెడ్డి.. గౌలీపురా పేరును శ్రీ చక్ర సీసీగా మార్చడం చట్టవిరుద్ధమని తీర్పునిచ్చారని కాబట్టి ఆ క్లబ్ ఉనికిలో లేదని అమర్‌నాథ్ వాదించారు. దీంతో హెచ్‌సీఏ కార్యకలాపాలు ఆగిపోకూడదనే ఉద్దేశంతో ఓడిన అమర్‌నాథ్‌ను అధ్యక్షుడిగా ప్రకటిస్తూ జస్టిస్ కైత్ ప్రకటించారు. అయితే, తాజాగా అమర్‌నాథ్ ఎన్నిక చెల్లదంటూ కొందరు హైకోర్టును ఆశ్రయించగా.. కేసులో ఇరు పక్షాల వాదనలను విన్న ధర్మాసనం ఆయన ఎన్నిక చెల్లదని తీర్పును వెలువరించింది.



## ఎర్రమట్టి చాంపియన్‌గా జ్వెరెవ్
## తొలి జర్మనీ ప్లేయర్‌గా ఘనత

**పారిస్:** ఎర్రమట్టి కోర్టులో కొత్త ఛాంపియన్ వచ్చాడు. రొలాండ్ గారోస్‌లో జరిగిన ఫ్రెంచ్ ఓపెన్ ఫైనల్‌లో ఇటలీ ఆటగాడు ఫ్లావియో కొబోలీతో హోరాహోరీగా అయిదు సెట్లపోరులో మూడో సీడ్ అలెగ్జాండర్ జ్వెరెవ్6-1, 4-6, 6-4, 6-7, 6-1 తేడాతో నెగ్గి పురుషుల సింగిల్స్ టైటిల్ అందుకున్నాడు. ఈ మ్యాచ్ 4 గంటల 16 నిమిషాలపాటు సాగింది. కొబోలి గట్టిపోటీనివ్వడంతో జ్వెరెవ్ గెలుపు కోసం చెమటోడ్చాడు. నాలుగుసార్లు ఫైనల్‌కు దూసుకొచ్చిన జ్వెరెవ్‌కు ఇదే తొలిగ్రాండ్‌స్లామ్ పురుషుల సింగిల్స్ టైటిల్. చివరి సెట్‌లో పాయింట్ సాధించి గెలుపొందడంతో జ్వెరెవ్.. రొలాండ్ గారోస్‌లో ఒక్కసారిగా తీవ్ర భావోద్వేగానికి గురయ్యాడు. మట్టి నేలపై పడుకొని ఇన్నాళ్లు పడిన కష్టానికి కన్నీళ్లు కార్చాడు.

ఈ భావోద్వేగం వెనకాల చాలా కథే ఉంది. సుదీర్ఘకాలంగా వెంటాడుతున్న అనారోగ్య సమస్యపై 29 ఏళ్ల జ్వెరెవ్ నెగ్గాడు. నాలుగేళ్ల పసిప్రాయంలోనే టైప్ 1 డయాబెటిస్ బారిన పడిన జ్వెరెవ్.. 25 ఏళ్లుగా ఎన్నో కఠిన సవాళ్లు ఎదుర్కొన్నాడు. ఎంతోమంది నిరుత్సాహపరిచినా వెరవకుండా తల్లి దండ్రుల సాయంతో కఠోర పరిశ్రమ చేశాడు. అతడు ఎప్పుడు కోర్టులో అడుగుపెట్టినా.. ఇద్దరితో పోరాటం చేయాల్సి వచ్చేది. ఒకటి ప్రత్యర్థి కాగా, మరొకటి తన శరీరంతో. ఎందుకంటే గంటల తరబడి సాగే సుదీర్ఘ ర్యాలీల్లో ఆటగాళ్లు తీవ్రంగా అలసిపోవడం సహజం. అలాంటిది తను మధుమేహ బాధితుడు. ఆట మధ్యలో షుగర్ లెవెల్స్ పడిపోకుండా జాగ్రత్త వహించాలి. లేదంటే ఆరోగ్యం సహకరించక మ్యాచ్ మధ్యలోనే ఇంటికి వెళ్లే పరిస్థితి. ఇలాంటి పరిస్థితుల్లో ఏ ఆటగాడైనా అంతర్జాతీయ స్థాయిలో టెన్నిస్‌లో రాణించాలంటే అంత సులువు కాదు. అయినా ఏనాడు వెనక్కితగ్గని జ్వెరెవ్.. తన అత్యున్నత ఆటతో అదరగొట్టాడు. తన సమస్యను సమాజంతో పంచుకుంటే ఎవరేమనుకుంటారో అని తొలుత భావించిన జ్వెరెవ్.. చాన్నాళ్లపాటు ఈ విషయాన్ని గోప్యంగానే ఉంచాడు. అయితే తనలాంటి వాళ్లు చాలామంది ఉన్నారనే విషయం తెలుసుకున్న అతడు.. టైప్ 1 మధుమేహంతో బాధపడుతున్న చిన్నారులకు అవగాహన కల్పించడానికి హెల్త్‌కేర్ టెక్నాలజీలో గుర్తింపు పొందిన మెడ్‌ట్రోనిక్‌తో జట్టు కట్టాడు. ఈ సమస్యతో నిరాశలో కూరుకుపోయిన వారికి ఓ దిక్సూచిగా నిలిచేందుకు, వారిలో సంకల్ప బలం పెంచేందుకు ముందుకువచ్చాడు. తన సోదరుడితో కలిసి 2022లో అలెగ్జాండర్ జ్వెరెవ్ ఫౌండేషన్‌ను సైతం స్థాపించాడు. టైప్ 1 డయాబెటిస్‌తో బాధపడుతున్న చిన్నారులకు ఇన్సులిన్ ఇంజక్షన్లు, ఇతర మందులు అందిస్తున్నాడు.

ఇక ఫ్రెంచ్ ఓపెన్‌లోనూ మ్యాచ్ మధ్యలో జ్వెరెవ్ విరామం తీసుకుని ఇన్సులిన్ ఇంజెక్షన్ తీసుకున్న వీడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమంలో చక్కర్లు కొడుతోంది. టెన్నిస్‌లో తీవ్రపోటీ ఉన్నప్పటికీ ఏనాడు తన సమస్యను సాకుగా చూపి వెనక్కితగ్గని జ్వెరెవ్ ఎందరికో ఆదర్శంగా నిలిచాడు.




## ఎఐ రంగంలోకి రిలయన్స్ ఇన్‌ఫ్రా

**ముంబయి, జూన్ 8:** పారిశ్రామికవేత్త అనిల్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ (ఆర్‌ఇన్ఫ్రా) ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), ఇతర కొత్త టెక్నాలజీల రంగంలోకి ప్రవేశిస్తున్నట్లు ప్రకటించింది. తన వ్యాపార కార్యకలాపాల్లో టెక్నాలజీ ఆధారిత సేవలను భాగం చేసే వ్యూహంలో భాగంగా ఈ అడుగు వేస్తున్నట్లు కంపెనీ తెలిపింది. ఈ మేరకు తమ అనుబంధ సంస్థల ద్వారా ఈ కొత్త వ్యాపారంలోకి ప్రవేశిస్తున్నట్లు స్టాక్ ఎక్స్ఛేంజీలకు సమర్పించిన ఫైలింగ్‌లో రిలయన్స్ ఇన్ఫ్రా పేర్కొంది. వేగంగా అభివృద్ధి చెందుతున్న ఏఐ, సంబంధిత టెక్నాలజీ విభాగాల్లో పాలుపంచుకోవడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించింది. రిలయన్స్ ఏఐ వరల్డ్ ప్రైవేట్ లిమిటెడ్, రిలయన్స్ ఏఐ అపెక్స్ ప్రైవేట్ లిమిటెడ్, రిలయన్స్ ఏఐ వన్ ప్రైవేట్ లిమిటెడ్ అని కొత్త పేర్లతో ఈసంస్థలు వస్తున్నాయి. రిలయన్స్ ఇన్ఫ్రా ఏఐ రంగ ప్రవేశ ప్రకటన మార్కెట్లో తక్షణమే సానుకూల ప్రభావం చూపింది. బీఎస్‌ఈలో కంపెనీ షేరు 5 శాతం పెరిగి రూ.86.17 వద్ద ఎగువ సర్క్యూట్‌ను తాకింది. గత ఏడాది కాలంలో సుమారు 80 శాతం నష్టపోయినప్పటికీ, గత నెల రోజుల్లో 20 శాతానికి పైగా లాభపడింది. ఆరు నెలల్లో 40 శాతం పతనం కాగా, గత ఐదేళ్లలో మాత్రం 3 శాతానికి పైగా లాభాలను అందించింది. కంపెనీ ఆర్థిక ఫలితాలను పరిశీలిస్తే, 2026 మార్చితో ముగిసిన త్రైమాసికంలో రూ. 918 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. కార్యకలాపాల ద్వారా రూ. 4,001 కోట్ల ఆదాయం వచ్చినట్లు తెలిపింది. 2025-26 పూర్తి ఆర్థిక సంవత్సరానికి గాను కంపెనీ రూ. 2,900 కోట్ల లాభాన్ని, రూ. 20,440 కోట్ల రాబడులను నమోదు చేసింది.

## గ్లోబల్ తొలి ట్రిలియనీర్‌గా ఎలాన్ మస్క్



**న్యూయార్క్, జూన్ 8:** టెస్లా, స్పేస్ఎక్స్ అధినేత ఎలాన్ మస్క్ ప్రపంచంలోనే తొలి ట్రిలియనీర్‌గా నిలిచే అవకాశం ఉంది. ఒక ట్రిలియన్ డాలర్ల సంపదను కలిగిన మొట్టమొదటి వ్యక్తిగా మస్క్ రికార్డు సృష్టించబోతున్నారు. ప్రస్తుతం ప్రపంచంలోనే అత్యంత ధనవంతుడిగా ఉన్న మస్క్ సంపదలో అధిక భాగం టెస్లా కంపెనీ షేర్ల రూపంలో ఉంది. దీని విలువ సుమారు 273 బిలియన్ డాలర్లు. మరో సంస్థ స్పేస్ఎక్స్ త్వరలో స్టాక్ మార్కెట్‌లో అడుగుపెడితే (ఐపీఓ), ఆయన సంపదకు అదనంగా మరో 841 బిలియన్ డాలర్లు జతయ్యే అవకాశం ఉంది. అప్పుడు ఆయన నికర సంపద 1 ట్రిలియన్ డాలర్ల మార్కును సులభంగా దాటుతుంది. ఒక ట్రిలియన్ డాలర్లంటే భారత కరెన్సీలో సుమారు 95 లక్షల కోట్ల రూపాయలు. ఈ సంపద విలువ ప్రపంచంలోని చాలా దేశాల వార్షిక ఆర్థిక వ్యవస్థల (జీడీపీ) కంటే ఎక్కువ కావడం గమనార్హం. తైవాన్ ( 977 బిలియన్లు), ఐర్లాండ్ ( 779 బిలియన్లు), స్వీడన్ ( 760 బిలియన్లు), సింగపూర్ (660 బిలియన్లు) వంటి అభివృద్ధి చెందిన దేశాల జీడీపీ కంటే కూడా మస్క్ సంపదే ఎక్కువగా ఉంటుంది. ప్రపంచ ఆర్థిక కేంద్రమైన మాన్‌హట్టన్ వార్షిక ఆర్థిక ఉత్పత్తి (1 ట్రిలియన్)తో ఇది సమానంగా ఉంది. మస్క్ తోటి టెక్ బిలియనీర్లతో పోల్చినప్పుడు ఈ సంపద స్థాయి తెలుస్తోంది. అమెజాన్ వ్యవస్థాపకుడు జెఫ్ బెజోస్, ఒరాకిల్ వ్యవస్థాపకుడు లారీ ఎల్లిసన్, గూగుల్ సహ వ్యవస్థాపకులు లారీ పేజ్, సెర్గీ బ్రిన్ వంటి పలువురు అగ్రశ్రేణి కుబేరులందరి మొత్తం సంపద కలిపితే సుమారు1.09 ట్రిలియన్లు ఉంటుంది. వీరందరి సంపద కేవలం మస్క్ ఒక్కడి సంపద కంటే కొంచెమే ఎక్కువ. అమెరికాలోని ప్రధాన నగరమైన హ్యూస్టన్‌లోని నివాస, వాణిజ్య ఆస్తులన్నింటి మొత్తం విలువ (879 బిలియన్లు) కంటే కూడా మస్క్ సంపద ఎక్కువ.

### పశ్చిమాసియా వార్ ఉద్రిక్తతలతో..
## ఈక్విటీ సూచీలకు నష్టాలు



**ముంబయి, జూన్ 8:** దేశీయ ఈక్విటీసూచీలు వారం ప్రారంభంలో నష్టాలు చవిచూసాయి. ఆసియా మార్కెట్లలో భారీ ఎత్తున అమ్మకాలు కొనసాగడం, ముడిచమురు దరలు పెరుగుతుండటం, పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్తతలు చోటు చేసుకోవడంతో మార్కెట్ల సూచీలు దెబ్బతిన్నాయి. అలాగే ఫెడ్‌రిజర్వు వడ్డీరేట్లు పెంచుతుందన్న వార్తలు ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను మార్చింది. మెటల్, ఆటోమొబైల్ స్టాక్స్ ఎక్కువ దెబ్బతీసాయి. హెల్త్‌కేర్‌స్టాక్స్‌లో కూడా భారీ అమ్మకాలు కొనసాగాయి. బిఎస్‌ఇ సెన్సెక్స్ 719.08 పాయింట్లు క్షీణించి 73,524.26 పాయింట్ల వద్ద ట్రేడింగ్ నిలిపివేస్తే నిఫ్టీ 50 సూచీ 243.70 పాయింట్లు క్షీణించి 23,123 పాయింట్ల వద్ద ముగించింది. వరుసగా రెండు సెషన్లలోను సెన్సెక్స్ 1.13శాతం, నిఫ్టీ 1.38శాతం చొప్పున క్షీణించాయి. రిలయన్స్ 2.18శాతం, ఎల్‌అండ్‌టి 2.09 శాతం, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు 1.21శాతం చొప్పున నిఫ్టీలో ఎక్కువ నష్టం చవిచూసాయి. బిఎస్‌ఇలో మిడ్‌క్యాప్ సూచీ 1.70శాతం, స్మాల్‌క్యాప్ సూచీ 1.88శాతం చొప్పున దిగజారాయి.

మార్కెట్ల పరంగా 1181 షేర్లు పెరిగితే 3192 షేర్లు క్షీణించాయి. 180 కంపెనీల షేర్లు స్థిరంగా కొనసాగాయి. ఇక విదేశీ కరెన్సీ మార్కెట్‌లో భారత్ రూపాయి 95.74గా కొనసాగింది. అంతకుముందురోజు 95.18కంటే స్వల్పంగా క్షీణించింది. ఎంసిఎక్స్‌లో పసిడి ఫ్యూచర్ ధరలు ఆగస్టు 6వ తేదీనాటి సెటిల్‌మెంట్లు 1.33శాతం క్షీణించి రూ.1,53,529కి చేరాయి. కమోడిటీ మార్కెట్లలో బ్రెంట్ ముడిచమురు ఆగస్టు సెటిల్‌మెంట్ ధరలు3.92డాలర్లు పెరిగి 97.01కి చేరాయి. యూరోప్, ఆసియా షేర్లు కూడా దిగువ స్థాయిలో ట్రేడింగ్‌జరడంతో ఈ ప్రభావం భారత్ మార్కెట్లపై చూపించింది. వివిధ కంపెనీల పరంగా చూస్తే ఇఎంఎస్ 10.35శాతం పెరిగింది. హెచ్‌జి ఇన్‌ఫ్రా ఇంజినీరింగ్ 2.84శాతం, జీ ఎంటర్‌టైన్‌మెంట్ 1.05శాతం డౌన్ అయ్యాయి. క్యాపిట్ బ్రూవ రీస్ డిస్టిలరీస్ 4.96శాతం, లీ ట్రావెన్యూస్ టెక్నాలజీ ఇక్సిగో 2.49శాతం క్షీణించాయి.

సిగ్మా అడ్వాన్సుడ్ సిస్టమ్స్ 4.39శాతం, ఆదాని పోర్టులు సెజ్ 1.05శాతం, వారి రెన్యువబుల్ టెక్నాలజీస్ 2.36శాతం, లూపిన్ 0.58శాతంచొప్పున క్షీణించాయి.




### భారత్ డీమ్యాట్ రంగంలో 77శాతం ఖాతాలు నిర్వీర్యం
## అసలు ఖాతాలు ఐదు కోట్లే

**న్యూఢిల్లీ:** భారతదేశంలో రిటైల్ ఇన్వెస్టింగ్ విప్లవం భారీగా విస్తరించినట్లు కనిపిస్తున్నప్పటికీ, డీమ్యాట్ ఖాతాల వాస్తవ వినియోగం తక్కువగానే ఉంది. గత ఏడాది డిసెంబర్ నాటికి దేశంలో డీమ్యాట్ ఖాతాల సంఖ్య 21.6 కోట్లకు చేరగా, వాటిలో కేవలం 5 కోట్ల ఖాతాలే పనిచేస్తున్నట్లు తేలింది. మిగిలిన 16.6 కోట్ల ఖాతాలు నిర్వీర్యంగా లేదా క్రియాశీలత లేకుండా ఉన్నట్లు తెలుస్తోంది. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ విడుదల చేసిన గణాంకాల ప్రకారం, 2026 ఆర్థిక సంవత్సరంలో యాక్టివ్ ఇన్వెస్టర్ల సంఖ్య 7శాతం తగ్గి 4.58 కోట్లకు చేరింది. 2025లో ఈ సంఖ్య 4.92 కోట్లుగా ఉండగా, ఏడాదిలోనే దాదాపు 35 లక్షల యాక్టివ్ ఖాతాలు తగ్గిపోయాయి. ఈ తగ్గుదలలో 70 శాతం కంటే ఎక్కువ భాగం జీరోధా, ఏంజెల్ వన్, అప్స్టాక్స్ వంటి ప్రముఖ డిస్కౌంట్ బ్రోకర్ల ఖాతాదారుల నుంచే నమోదైంది. మార్కెట్ నిపుణులు దీనికి మూడు ప్రధాన కారణాలను గుర్తిస్తున్నారు. బుల్ మార్కెట్ సమయంలో అనేక మంది పెట్టుబడిదారులు కేవలం ఐపీఓలలో పాల్గొనడానికి మాత్రమే డీమ్యాట్ ఖాతాలు తెరిచారు. షేర్ల కేటాయింపు రాకపోవడం లేదా లిస్టింగ్ అనంతరం వెంటనే విక్రయించడం వల్ల ఆ ఖాతాలను తరువాత ఉపయోగించలేదు.

డిజిటల్ బ్రోకరేజ్ సేవలు, పేపర్‌లెస్ ప్రక్రియల కారణంగా ఒకే వ్యక్తి అనేక బ్రోకర్ల వద్ద డీమ్యాట్ ఖాతాలు తెరవడం సులభమైంది. వాటిలో ఒక ఖాతాను మాత్రమే వినియోగిస్తూ మిగిలిన ఖాతాలను నిర్వీర్యంగా వదిలేస్తున్నారు. ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ ఎఫ్‌అండ్‌వో విభాగంలో ఎక్కువ మంది రిటైల్ ట్రేడర్లు నష్టాలను ఎదుర్కొంటున్నట్లు నియంత్రణ సంస్థల అధ్యయనాలు వెల్లడించాయి. నప్రైవేట్ వెల్త్ వ్యవస్థాపకుడు హిమాన్షు పాండ్యా మాట్లాడుతూ, ఖాతాల సంఖ్య పెరగడం మాత్రమే నిజమైన మార్కెట్ భాగస్వామ్యానికి సూచిక కాదన్నారు.


దూకుడుగా ఖాతాలు తెరవడం ద్వారా మార్కెట్లో స్థిరమైన పెట్టుబడిదారులు పెరగరని ఆయన అభిప్రాయపడ్డారు. మనీలాండరింగ్, మోసపూరిత లావాదేవీలకు ఇటువంటి ఖాతాలు ఉపయోగపడే అవకాశం ఉందని హెచ్చరించారు. 21.6 కోట్ల డీమ్యాట్ ఖాతాల సంఖ్య కనిపిస్తున్నప్పటికీ, బహుళ ఖాతాల కారణంగా దేశంలో నిజమైన ప్రత్యేక పెట్టుబడిదారుల సంఖ్య 12 నుంచి 13 కోట్ల మధ్య మాత్రమే ఉండొచ్చనిఅంచనా. రిటైల్ పెట్టుబడిదారుల భాగస్వామ్యం పెరుగుతున్నట్లు కనిపిస్తున్నప్పటికీ, యాక్టివ్ ఖాతాల తగ్గుదల భారత పెట్టుబడి సంస్కృతిలో ఉన్న వాస్తవ పరిస్థితిని బయటపెడుతోందని నిపుణులు పేర్కొంటున్నారు.

## వాటాల విక్రయానికి ఎన్‌ఎల్‌సీ ఓఎఫ్‌ఎస్?




**న్యూఢిల్లీ, జూన్ 8:** ప్రభుత్వరంగంలోని నైవేలి లిగ్నయిట్ కార్పొరేషన్ ఆఫర్‌ఫర్‌సేల్ ప్రకటించింది. మూడుశాతం ఈక్విటీ వాటాలను విక్రయించనున్నట్లు తెలిపింది. ఇన్వెస్టర్లు ప్రభుత్వరంగంలోని ఒక నవరత్న కంపెనీ షేర్లు కొనుగోలుకు ఇపుడు మంచి తరుణం వచ్చింది. ప్రభుత్వ పరిధిలోని పెట్టుబడుల ఉపసంహరణ పథకం పరిధిలో ఈ ఓఎఫ్ఎస్ ఉంటుందని కంపెనీ ప్రకటించింది. ఓఎఫ్ఎస్ ఇష్యూధర రూ.303గా ప్రకటించింది. నాన్ రిటైల్ ఇన్వెస్టర్లకు మంగళవారంనుంచే ప్రారంభిస్తారు. రిటైల్ ఇన్వెస్టర్లకు ఈనెల పదోతేదీనుంచి బిడ్లు తెరుస్తారు. ఇష్యూధర ప్రస్తుత మార్కెట్‌ధరకంటే 10శాతం డిస్కౌంట్‌కు లభిస్తున్నది. రెండుశాతం అధీకృత మూలధనంలో వాటాగా ఈ షేర్‌సేల్ ఉంటుంది. అదనంగా ఒకటిశాతం వాటా గ్రీన్‌షూ ఆప్షన్‌కింద అందుబాటులో ఉంచుతుంది. పవర్‌బిజినెస్‌లను పెంచుకోడం, సామర్థ్యం విస్తరణ వంటివదటికి ఈనిధులు వినియోగిస్తారు. ఇటీవలికాలంలో ఎన్ఎల్‌సీ మంచి పనితీరుచూపించింది. స్థిరంగా రిటర్నులు వస్తున్నాయి. వాటాదారులకు క్రమం తప్పకుండా డివిడెండ్లు ప్రకటిస్తోంది. ఇన్వెస్టర్ల స్పందనను ట్రేడర్లు నిశితంగా గమనిస్తున్నారు.

## రెండునెలల్లో 15% పెరిగిన ఎగుమతులు



**ముంబయి, జూన్ 8:** భారత వాణిజ్య ఎగుమతులు ఏప్రిల్ మేనెలల్లో 15శాతం పెరిగినట్లు కేంద్ర వాణిజ్య శాఖ ప్రకటించింది. అదనంగా పెట్రోలియమేతర ఉత్పత్తుల ఎగుమతులు పటిష్టమైన వృద్ధిని నమోదుచేసాయి. 10నుంచి 11శాతం ఎగుమతులు పెరిగినట్లు కేంద్రం వెల్లడించింది. పశ్చిమాసియా సంక్షోభం పెరుగుతున్నప్పటికీ వివిధ దేశాల ఆర్థిక వ్యవస్థలు దెబ్బతింటున్నప్పటికీ భారత్‌నుంచి ఎగుమతులు మాత్రం పటిష్టంగా ఉన్నట్లు కేంద్రం ప్రకటించింది. 2027 ఆర్థికసంవత్సరం ప్రారంభంనుంచే పటిష్టంగా ఉన్నాయి. ఏటికేడాది 13.6శాతం వృద్ధినినమోదుచేస్తూ ఏప్రిల్ 2026లో 80.8 బిలియన్ డాలర్లు విలువైన ఎగుమతులు జరిగాయి. వాణిజ్యశాఖ కార్యదర్శి రాజేష్ అగర్వాల్‌మాట్లాడుతూ ప్రాంతీయ సవాళ్లు ఎన్ని ఎదురయినా ఎగుమతులకు విఘాతం కలగలేదని, విభిన్న మార్కెట్లకు ఎగుమతులుచేయడంవల్ల పటిష్టమైన వృద్ధిని సాధించామన్నారు. ఉత్పత్తుల ఎగుమతులు ఏప్రిల్‌లో 43.56 బిలియన్ డాలర్లకు చేరాయి. గత ఏడాది ఇదేనెలలో 38.28 బిలియన్ డాలర్లవరకూ మాత్రమే ఉన్నాయి. సేవలరంగ ఎగుమతులు 32.8 బిలియన్ డాలర్లనుంచి 37.2 బిలియన్ డాలర్లకు పెరిగాయి. దిగుమతులు కూడా పెరిగాయి.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at Flat.No. 22, G Block ,Industrial park Auto Nagar , Gajuwaka, Visakhapatnam-530 012, Phones:2706784,2706785,2706786,2706787,2706622, Fax: 2706522, RNI No.64864/96, Editor : *Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act. Regd.No. H/SD/337/12-14.